ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**
**LEGISLATIVE COUNCIL DEBATES**

అధికార నివేదిక

# OFFICIAL REPORT

మంగళవారం, ఆగస్ట్ 26, 2014,
ఇరవై ఒకటవ సమావేశము, సంపుటము–2, నంబరు–7,
జయనామ సంవత్సరం, భాద్రపదం–4.

**TUESDAY, THE 26th DAY OF AUGUST, 2014,**

**TWENTY FIRST SESSION, VOLUME - 2, NO.7,**

**4TH BHADRAPADAM, 1936 S.E.**

*****

శాసన పరిషత్తు సచివాలయము,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్ – 500 004.

**LEGISLATURE SECRETARIAT,**
**PUBLIC GARDENS,**
**HYDERABAD - 500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **ఛైర్మన్** | : | డా. ఎ. చక్రపాణి |
| **కార్యదర్శి (ఇన్‌ఛార్జ్)** | : | శ్రీ కె. సత్యనారాయణరావు |
| **ఉప కార్యదర్శులు** | : | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎమ్. విజయరాజు |
| **సహాయ కార్యదర్శులు** | : | శ్రీ పి.వి. సుబ్బారెడ్డి<br>శ్రీ కె. రాజ్‌కుమార్<br>శ్రీమతి ఆర్. వనితారాణి<br>శ్రీ పి. నరసింహ<br>శ్రీ బి. కమలాకర్<br>డా. వై. కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె. వెంకటేశ్వరరావు<br>శ్రీ డి. జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి. ప్రభాకర్‌రావు |
| **చీఫ్ రిపోర్టర్** | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

**ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు**

**మంగళవారం, ఆగస్ట్ 26, 2014.**

# అధికార నివేదిక

---

విషయ సూచిక

---

(1) సభా కార్యక్రమం – వాయిదా తీర్మానం.

(2) నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానాలు.

(3) 2014-15 బడ్జెట్‌పై నాల్గవ రోజు సాధారణ చర్చ.

---

**ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL**
**TUESDAY, THE 26TH DAY OF AUGUST, 2014**

(THE HOUSE ASSEMBLED AT 10.00 A.M.)
(THE HON'BLE CHAIRMAN IN THE CHAIR)

-----

## సభా కార్యక్రమం – వాయిదా తీర్మానం

MR. CHAIRMAN: Now, Question Hour. Today, I have received one Adjournment Motion notice given by Dr. M. Geyanand.

డా. ఎమ్. గేయానంద్ (పట్టభద్రుల నియోజకవర్గం, కడప, అనంతపురం మరియు కర్నూలు) : అధ్యక్షా, విశాఖపట్టణం జిల్లాలో తుంబ్రీగూడ అనే గిరిజన మండలంలో 6వ తరగతి చదువుతున్న ఒక విద్యార్థి మొన్న ఆదివారంనాడు ఆత్మహత్య చేసుకున్నాడు. వాళ్ల స్కూల్లో సేకరిస్తున్న సమాచారం కోసం ఆధార్ కార్డు కావాలని లింక్ పెట్టారు. ఆ అబ్బాయి మండల కార్యాలయాల చుట్టూ తిరిగినా ఆధార్ కార్డు లభ్యపడలేదు. ఆ పిల్లవాడి చేతికి ఉన్న రెండు వేళ్లు అతుక్కుని ఉండడం వల్ల, అందుకు తగిన ప్రత్యేక ఏర్పాటు లేనందువల్ల అతనికి ఆధార్‌కార్డు వివరాలు నమోదు చేసుకునేందుకు తిరస్కరించారు. ఆ మానసిక క్షోభతో అతను ఆత్మహత్య చేసుకున్నాడు. సుమారు 15 నుండి 20 శాతం వరకూ పిల్లలకు ఆధార్‌కార్డు లేదని ఒక అంచనా. కాబట్టి ఇంతమంది పిల్లలకు ఆధార్ కార్డు లేనప్పుడు వారిని ఆధార్ కార్డు తీసుకురండి అని ఇన్‌సిస్ట్ చేయడం వల్ల మానసిక క్షోభతో ఇటువంటి చర్యలకు ఒడిగడుతున్నారు. ఇది చాలా ప్రత్యేకమైన అంశం కాబట్టి దీనిపై చర్చించాలని కోరుతున్నాను. ఈ వార్త హిందూ పేపర్లో కూడా ప్రచురించబడింది. ఆధార్ కార్డును అన్ని సంక్షేమ కార్యక్రమాలకు లింకప్ చేయడం ద్వారా పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. ఇటువంటి ప్రత్యేక పరిస్థితులలో, ప్రత్యేక అవసరాలున్నవారికి ఆధార్ కార్డును ఇవ్వడానికి ప్రభుత్వమే బాధ్యతను తీసుకోవాలి.

శ్రీ బి. చెంగల్ రాయుడు (శాసనసభ నియోజకవర్గం): వెల్ఫేర్ మెజర్స్‌కు ఆధార్ కార్డుకు లింక్ పెట్టకూడదని సుప్రీంకోర్టు జడ్జిమెంట్ కూడా ఉన్నది.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, దీనిమీద మాట్లాడేందుకు ఒక్కనిముషం అవకాశం ఇవ్వండి.

## నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానాలు.

MR. CHAIRMAN : Smt. Raja Kumai, you come in a correct form, then I will allow you. Let, the Government commit. Dr. Geyanand you send it to the concerned department. The Minister concerned will make a statement on it. I will also direct the concerned Minister. మినిస్టరు గారు స్టేట్‌మెంట్ ఇచ్చినతరువాత వివరంగా మాట్లాడవచ్చు. Question Nos. 7449(61), 7531(62), and 7307(63) are postponed at the request of the Members.

### ఉద్యోగులకు హెల్త్ కార్డులు

ప్రశ్న నెం.7402 (64)
శ్రీ పి.జె. చంద్రశేఖర రావు, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా ః

అ) రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆరోగ్య కార్డులను ఎప్పటిలోగా సమకూర్చడమవుతుంది;
ఆ) ఆరోగ్య కార్డుల జారీలో ఆలస్యానికి గల కారణాలు;
ఇ) ఖర్చు పరిమితిని పెంచడానికి, ఉచితంగా చికిత్సను సమకూర్చే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నదా;
ఈ)అయితే, ఆ వివరాలు ఏమిటి?

గౌరవనీయులైన ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి (డా. కామినేని శ్రీనివాస్)

అ) ఇప్పటివరకు 3,02,451 మంది ఉద్యోగస్తులు నమోదు చేయించుకున్నారు. 10,53,529 కార్డులు (ఆధారపడిన వారితో సహా) జారీ చేయబడినవి. 1,84,981 పింఛనుదారులు నమోదు చేయించుకున్నారు. మొత్తం 3,22,082 (ఆధారపడిన వారితో సహా) కార్డులు జారీ చేయబడినవి. మిగిలిన కార్డులు త్వరలోనే జారీ చేయడమవుతుంది.
ఆ) లేదండీ.
ఇ) లేదండీ.
ఈ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు (శాసనసభ నియోజకవర్గం)ః హెల్త్ కార్డులకు సంబంధించి గత ప్రభుత్వ కాలం నుండి కూడా ప్రభుత్వ ఉద్యోగులతో చెలగాటమాడే పరిస్థితులు కొనసాగుతున్నది. హెల్త్‌కార్డులు జారీ చేయడానికి జరుగుతున్న జాప్యానికి గల కారణమేమిటి? ఆ లోపాలను ఎప్పటిలోగా తొలగిస్తారు? నూటికి నూరు శాతం ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఎప్పటిలోగా ఇస్తారు? పరిమితులు పెంచడానికి ఏమైనా ఆలోచన ఉందా? ఉంటే దానిని ఏ మేరకు పెంచుతున్నారో తెలియచేయవలసిందిగా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కె.ఎస్. లక్ష్మణరావు (ఉపాధ్యాయుల నియోజకవర్గం, కృష్ణా మరియు గుంటూరు) : అధ్యక్షా, ప్రభుత్వోద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది చాలా సంతోషం సార్. అయితే, ఎయిడెడ్ పాఠశాలల్లో, కళాశాలల్లో పనిచేసే ఉద్యోగులు, యూనివర్శిటీలలో పనిచేసేవారు 010హెడ్ కింద వేతనాలు పొందడంలేదని వారికి హెల్త్ కార్డులు ఇవ్వడం లేదు. జెఎసి సమావేశంలో వారికి కూడా ఇస్తామని అంగీకరించారు. వాళ్లకు కూడా ఇచ్చే ఆలోచన ఉందా అని మంత్రిగారిని తమద్వారా కోరుతున్నాను.

శ్రీమతి పమిడి శమంతకమణి (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, మాజీ ప్రజాప్రతినిధులకు కూడా హెల్త్‌కార్డులు ఇచ్చే ఉద్దేశ్యం ఉందా అని మంత్రిగారిని అడుగుతున్నాను. ఇప్పటికే రూ.2, 3 లక్షలు ఇస్తారని అంటున్నారు గానీ, మొన్న మా సోదరుడు శ్రీ బి. చెంగల్‌రాయుడు అన్నట్లు  డాక్టరు దగ్గరకు వెళ్లి కేవలం ఒక పన్ను తీయించుకుంటే ఏడువేల రూపాయల బిల్లు వేశారు. అది కూడా ఇన్‌పేషెంట్‌గా జాయిన్ అయితేనే రీయింబర్సు చేస్తామని అన్నారట. అటువంటి సమస్యలు చాలా ఉన్నాయి. ముందుగా హాస్పిటల్‌లో జాయిన్ అయితేనే గానీ చేసిన ట్రీట్‌మెంట్‌కు రీయింబర్సుమెంట్ ఇవ్వడం లేదు. హెల్త్ కార్డు ఉంటే కంప్లీట్ మెడికల్ చెకప్ ప్యాకేజీ ప్రకారం చేయించుకోవడానికి అవకాశం ఉంటుంది.

ఉ.10.10

హడావిడిగా  బిల్లు చేతికిచ్చి,  డబ్బు వసూలు చేసుకుని సాయంత్రానికే  పొమ్మంటారు అధ్యక్షా.  2 రోజులు ఆసుపత్రిలో ఉంటేనే తప్ప బిల్లు రీఇంబర్స్‌మెంట్ చేయడానికి వీలులేదు. మాజీ ప్రజాప్రతినిధులు చాలా కష్టాల్లో ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ. 2 లక్షలు మేజర్ ఆపరేషన్లకేగానీ చిన్న చిన్న జబ్బులకు కాదు. దయచేసి, మాజీ  ప్రజాప్రతినిధులకు కూడా ఈ మెడికల్ రీఇంబర్స్‌మెంట్  సౌకర్యాన్ని కల్పించవలసిందిగా తమరిద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ బి. చంగల్ రాయుడు:  అధ్యక్షా, నాకు తెలిసిన సమాచారం మేరకు  సచివాలయం ఉద్యోగులకు  కూడా  ఇటువంటి సౌకర్యం ఇంతవరకూ కల్పించలేదు.  దాని గురించి సభ దృష్టికి తీసుకురావలసిందిగా మంత్రిగారిని తమరిద్వారా కోరుతున్నాను.  ఇంతవరకూ ఉపయోగించుకోని హెల్త్ కార్డును  సంవత్సరానికి ఒకసారి  మాస్టర్ హెల్త్ చెకప్ కోసం ఉపయోగించుకోవడానికి  ఒక ప్రొవిజన్‌ను పెట్టవలసిందిగా నేను కోరుతున్నాను.  సంవత్సరంలో ఎటువంటి వైద్యం తీసుకోని వారికి మాస్టర్ హెల్త్ చెకప్ చేసుకునే  సౌకర్యాన్ని కల్పించగలిగితే బాగుంటుంది.  Prevention is better than cure అనే విధంగా వారు జాగ్రత్తపడడానికి అవకాశముంటుంది.

మరో విషయం, వైద్యం చేయించుకున్నప్పుడు కొంత పరిమితిని విధించారు. ఆ విధంగా కాకుండా జబ్బు పూర్తిగా నయం అయ్యేవరకూ ఖర్చును భరించే ఆలోచన ప్రభుత్వం దృష్టిలో ఏదైనా ఉన్నదా?

డా. కామినేని శ్రీనివాస్:  అధ్యక్షా, ప్రభుత్వం ఉద్యోగులతో చర్చించిన తరువాత  వారి డిమాండ్లన్నింటినీ సంతృప్తికరంగా ఒప్పుకున్న తర్వాతనే  చేయడం జరిగింది.  వైద్య ఖర్చును 60

శాతం ప్రభుత్వం, 40 శాతం ఉద్యోగులు భరించే విధంగా చేయడం జరిగింది. ఉద్యోగులు చెల్లించే ప్రీమియం నెలకు రూ. 90 లు మరియు జీతాలు ఎక్కువగా ఉన్నవారి నుంచి రూ. 120 లుగా నిర్ణయించడం జరిగింది. సర్వీస్ ప్రొవైడర్‌గా 'ఆరోగ్యశ్రీ' ని నియమించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఛైర్మన్‌గా, ఇతర సభ్యులను 60:40 శాతంగా పెట్టడం జరిగింది. మొత్తం 3.91 లక్షలకు గాను సుమారు 3 లక్షల హెల్త్ కార్డులను జారీ చేయడం జరిగింది. మరో 70 వేల కార్డులను కొత్తగా డేటా ఎంట్రీ చేయడం జరిగింది. మిగిలిన కార్డులను కూడా అతి త్వరలోనే పూర్తి చేయడం జరుగుతుంది. ప్రతి ఎపిసోడ్‌కు రూ. 2 లక్షలు పెట్టి ఎన్ని సార్లయినా ఒక సంవత్సరంలో వారు వైద్యం చేయించుకోవచ్చు. రూ. 2 లక్షల ఖర్చు దాటినప్పటికీ ఆసుపత్రిలో రోగికి వైద్యాన్ని అందించడం నిలిపివేయడానికి వీలు లేదు. వైద్యం కంటిన్యూ చేయాలి. దీనిలో ఎటువంటి మిస్యూజ్ జరగకుండా, డి.ఎం.ఈ, ఎ.బి.వి.వి.పి., ఆరోగ్యశ్రీ సి.ఈ.ఓ.తో కలిపి ఒక కమిటీని నియమించడం జరిగింది. పెన్షనర్లు దాదాపు 3.50 లక్షలమంది ఉన్నారు. క్రానిక్ ఓ.పి.ని కూడా చేపట్టడం జరుగుతుంది. కాకపోతే, క్రానిక్ ఓ.పి.తో ఎంత బడ్జెట్ వస్తుందనేది తెలియదు కాబట్టి ఆరు నెలలపాటు చూసి ఉద్యోగులు ఒప్పుకున్న తర్వాత ఈ పథకంలో ఎటువంటి మార్పులు తేవాలనేది తీసుకురావడం జరుగుతుంది.

గతంలో వార్షిక హెల్త్ చెకప్‌ను ఉద్యోగి తన సర్వీసు మొత్తంలో కేవలం మూడుసార్లు మాత్రమే చేసుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం ప్రతి సంవత్సరం వారు వార్షిక హెల్త్ చెకప్ చేసుకోవడానికి కూడా ఒక ప్రొవిజన్‌ను పెట్టడం జరిగింది. మన రాష్ట్రంలోనే కాక సరిహద్దు ప్రాంతంలో ఉన్న బెంగుళూరు, మద్రాసులలో ఉన్న ఆసుపత్రులతో కలిపి మొత్తం 458 ఆసుపత్రులను empanel చేయడం జరిగింది. మొత్తం 1885 ప్రొసీజర్స్‌ను దానిలో ఇన్‌క్లూడ్ చేశాము. 6 నెలల తర్వాత ఎయిడెడ్ సిబ్బందిని కూడా కన్సిడర్ చేస్తాము.

శ్రీ కె.యస్. లక్ష్మణరావు: (మైకు లేకుండా) ఎయిడెడ్ సిబ్బందికి జీతాలను కూడా ప్రభుత్వమే చెల్లిస్తోంది సర్.

డా. బచల పుల్లయ్య : (ఉపాధ్యాయుల నియోజకవర్గం, కడప, అనంతపురం, కర్నూలు) (మైకు లేకుండా) ఎయిడెడ్ ఉద్యోగులకు కూడా హెల్త్ కార్డులు ఇస్తామని గతంలో సభలో కూడా చెప్పడం జరిగింది సర్.

డా. కామినేని శ్రీనివాస్: పాత ప్రభుత్వం చెప్పి ఉండవచ్చు. ప్రభుత్వానికి నిజంగానే నేడు చాలా కమిట్‌మెంట్స్ ఉన్నాయి. ఇది కొత్తగా ప్రవేశపెట్టిన పథకం. దీనికోసం ఇప్పటికే రూ. 220 కోట్లు ప్రొవిజన్ పెట్టారు. ఉద్యోగులు మంచి మనసుతో 40 శాతమే కాక 50 శాతం ఖర్చును భరించడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. అందువల్ల 6 నెలలపాటు ఈ పథకం అమలు చేసిన తర్వాత తప్పకుండా ఎయిడెడ్ ఉద్యోగులకు కూడా ఆలోచించి చేద్దామని తమరిద్వారా సభ్యులకు మనవిచేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్ : మాజీ సభ్యులకు కూడా అమలుచేస్తున్నారా?

డా. కామినేని శ్రీనివాస్: అధ్యక్షా, అది వేరే ప్రశ్నకు సంబంధించిన జవాబు. ఇప్పటికే ఒక పథకం ఉంది. దానిని తప్పకుండా గౌరవసభ్యులకు తెలియజేస్తాను.

మిస్టర్ ఛైర్మన్: ఆసుపత్రిలో అడ్మిషన్ ఉంటేనే తప్ప రీఇంబర్స్‌మెంట్ ఇవ్వడం లేదని సభ్యురాలు చెప్పారు.

డా. కామినేని శ్రీనివాస్: అధ్యక్షా, గౌరవసభ్యురాలుకు నేను తమరిద్వారా చెప్పేదేమంటే, ఒక పథకం పెట్టిన తర్వాత దానిలో checks and balances కూడా ఉండాలి. తప్పకుండా మీరు చెప్పిన విషయంలో సభ్యులకు అసౌకర్యం లేకుండా రెవ్యూ చేస్తాము.

## ఆరోగ్యశ్రీ నుంచి వ్యాధుల తొలగింపు

ప్రశ్న నెం.7277(65)
శ్రీ బి. చెంగల్ రాయుడు, ఎం.ఎల్.సి.

గౌరవనీయులైన ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) ఆరోగ్యశ్రీ క్రింద వర్తింపు చేసిన వ్యాధుల జాబితా నుండి కొన్ని వ్యాధులను తొలగించిన విషయం వాస్తవమేనా ;
ఆ) అయితే, అట్టి వ్యాధుల వివరాలేమిటి, అందుకు గల కారణాలు ఏమిటి;

గౌరవనీయులైన ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి (డా. కామినేని శ్రీనివాస్):

అ) అవునండీ.
ఆ) ఆరోగ్యశ్రీ పథకం క్రింద 942 ప్రొసీజర్లకుగాను క్రింది నాలుగు (4) ప్రొసీజర్లను తొలగించడమయింది.

1) ల్యాప్రోస్కోపిక్ ఓవరియన్ డ్రిల్లింగ్ (ఎస్4.2.4)
2) వాజినల్ హిస్టరెక్టమీ విత్ మెష్ రిపేరు (ఎస్4.2.11)
3) పెల్విక్ ఫ్లోర్ రీకన్‌స్ట్రక్షన్ విత్ మెష్ (ఎస్4.2.13
4) ప్రొలాప్స్ కోసం స్లింగ్స్ విత్ మెష్ రిపేరు (ఎస్4.2.15)

ట్రస్టీల మండలి ఆమోదించిన 2000లోని తీర్మానం నెం.191 ప్రకారం 21-05-2010 నుండి పై ప్రొసీజర్లను తొలగించడమయింది. నిపుణుల కమిటీ సిఫారసు చేసిన విధంగా అవి దుర్వినియోగానికి గురి కావడమే పై నాలుగు ప్రొసీజర్ల తొలగింపునకు కారణంగా ఉంది.

శ్రీ బి. చంగల్ రాయుడు: అధ్యక్షా, ప్రయివేటు ఆసుపత్రుల్లో 134 జబ్బులను తొలగించడం జరిగింది. వాటిలో ముఖ్యంగా, 24 గంటల కడుపు నొప్పి అని 'అపెండిసైటిస్' అనే ఒక జబ్బు కూడా ఉంది. 108 సర్వీసు వాహనం ద్వారా రోగులను నేరుగా ప్రయివేటు ఆసుపత్రుల్లో దించేస్తున్నారు. Because, there is an understanding between 108 Services and the Private Hospitals. 108 సర్వీసు వాహనాలు ప్రభుత్వ ఆసుపత్రులకు

వెళ్లడంలేదు. అక్కడ హడావిడిగా ఆపరేషన్ చేసిన తర్వాత సుమారు రూ. 35 వేల వరకూ రోగులనుంచి వసూలుచేస్తున్నారు. మా డ్రయివర్ భార్యను ఆసుపత్రిలో చేర్పిస్తే, అపెండిసైటిస్ ఆపరేషన్ చేసి రూ. 30 వేలు వసూలు చేశారు. హెర్నియా వల్ల కడుపునొప్పితో మగవారు బాధపడి ఫోన్ చేస్తే 108 సర్వీసు వారు ప్రయివేటు ఆసుపత్రిలో వారిని జాయిన్ చేస్తున్నారు.

మీరు తొలగించిన 134 జబ్బులకు వైద్యం కోసం 108 సర్వీసు వాహనాలు నేరుగా ప్రభుత్వ ఆసుపత్రులకు రోగులను తీసుకెళ్లే విధంగా ఒక ప్రొవిజన్‌ను పెట్టాలి. లేదా ప్రయివేటు ఆసుపత్రులకైనా రీఇంబర్స్‌మెంట్ సౌకర్యాన్ని కలిగించాలి. మీరు ఇంతకుముందు చెప్పిన checks and balances అమలు చేయకపోతే రోగులకు చాలా నష్టం జరుగుతుంది.

ఉ.10.20

134 ను రెస్టోర్ చేయండి, లేదంటే గవర్నమెంట్ హాస్పిటల్‌లో పెట్టే విధంగానైనా చేయండి. Otherwise, kindly direct the 108 people to take the patient directly to the Government Hospitals. దీనికి కావలసిన ఎక్విప్‌మెంట్ ప్రభుత్వ ఆసుపత్రులలో చాలా తక్కువగా ఉన్నాయి. వాటిని కూడా ప్రొక్యూర్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మీ ద్వారా సభ దృష్టికి తీసుకొస్తున్నాను.

శ్రీ రుద్రరాజు పద్మరాజు (శాసనసభ నియోజకవర్గం)ః అధ్యక్షా, గత ప్రభుత్వంలో 942 ప్రొసీజర్లను పొందుపర్చడం జరిగింది. అందులో సుమారు 134 ప్రొసీజర్లను ప్రభుత్వ ఆసుపత్రులకు బదిలీ చేయడం జరిగింది. ఎందుకంటే జిల్లా స్థాయిలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఉండవు కాబట్టి చిన్న చిన్న రోగాలకు సంబంధించి సదుద్దేశ్యంతో వీటిని ప్రభుత్వాసుపత్రులకు బదిలీ చేసినట్లుగా కనిపిస్తున్నది. 134 ప్రొసీజర్లను అక్కడికి బదలాయించిన తరువాత ప్రభుత్వాసుపత్రులలో ఎంత శాతం సి.ఎం. రిలీఫ్ ఫండ్ ద్వారా పెరిగింది, మీరు దానిని ఏ విధంగా సద్వినియోగం చేస్తారని మీ ద్వారా గౌరవ మంత్రి గారిని అడుగుతున్నాను.

డా. గేయానంద్ః ఆరోగ్యశ్రీని వైద్యవిధాన పరిషత్‌లలో కూడా అమలు చేయాలనే నిబంధనలున్నాయి. వైద్యవిధాన పరిషత్తు ఆసుపత్రులలో చాలా వరకు గుర్తింపు పొందిన ఆసుపత్రులన్నాయి. వైద్యవిధాన పరిషత్తు ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీకి సంబంధించి ఏయే ప్రొసీజర్లు జరుగుతున్నాయి? వాటిని బలోపేతం చేయడం కోసం అక్కడ ప్రొసీజర్లు సక్రమంగా జరగడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి? రెండవది సీరియస్ మెడికల్ కేసులు అంటే వెంటిలేటర్లపై ఉన్న కేసుల వంటివి ఆరోగ్యశ్రీ క్రింద చేయాలని ఉంది. అలా నిబంధన ఉన్నప్పటికీ ఇటువంటి కేసులను ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు ఆరోగ్యశ్రీ కింద టేకప్ చేయకుండా రిజెక్టు చేస్తున్నారు. అటువంటి హాస్పటళ్ల మీద ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటున్నది? అట్లాగే కార్పోరేట్ హాస్పటళ్లలో వారు డబ్బులు చెల్లించినప్పుడు ఏ విధమైన వైద్యం చేస్తారో అటువంటి వైద్యాలన్నీ ఆరోగ్యశ్రీలో కూడా చేయాలని ఉన్నదా లేదా చెప్పండి. ఒకవేళ ఉంటే వాటిని అమలుచేయడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి?

శ్రీమతి అంగూరి లక్ష్మీ శివ కుమారి (శాసనసభ నియోజకవర్గం)ః ఆరోగ్యశ్రీ పథకం క్రింద ఎవరైనా పేదవారు వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లినప్పుడు ఆరోగ్యశ్రీ కార్డు వెంట తీసుకెళ్లకపోతే ఆరోగ్యశ్రీ కార్డు తీసుకొస్తే గానీ వైద్యం చేయమని చెబుతున్నారు. ఈ ఆరోగ్యశ్రీ కార్డు తహశీల్దారు ఆఫీసులో తీసుకోవలసి వస్తున్నది. తహశీల్దారు ఆఫీసులో ఆరోగ్యశ్రీ కార్డు ఇవ్వాలంటే పేషెంట్లతో సహా కుటుంబీకులందరితో కలిసి ఫోటో తీసుకుంటేనే గానీ ఆరోగ్యశ్రీ కార్డు ఇవ్వమని తహశీల్దారు ఆఫీసులో చెబుతున్నారు. ఆసుపత్రిలో ఉన్న పేషెంటు కుటుంబీకులతో కలిసి తహశీల్దారు ఆఫీసుకెళ్లి ఫోటో దిగి ఆరోగ్యశ్రీ కార్డు తెచ్చుకోవాలంటే చాలా కష్టంగా ఉన్నది, ఇది అసాధ్యమైన పని కాబట్టి ఇటువంటి నిబంధనలు తీసేసి వారిని ఇబ్బందులకు గురిచేయకుండా తగు చర్యలు తీసుకోవాలని మంత్రిగారిని మీ ద్వారా కోరుతున్నాను.

డా.కామినేని శ్రీనివాస్ ః అధ్యక్షా, 938 ప్రొసీజర్లలో 133 ప్రొసీజర్లకు సంబంధించి ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలనే నిబంధన పెట్టడానికి కారణం చిన్న చిన్న జబ్బుల గురించి ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే కార్డు మిస్‌యూజ్ చేస్తారనే ఉద్దేశంతో పెట్టడం జరిగింది. అంతే కాకుండా చిన్న చిన్న జబ్బుల గురించి ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే ఆరోగ్యశ్రీ కార్డు కింద ప్రభుత్వం చెల్లించే డబ్బు ప్రైవేటు ఆసుపత్రులకు వెళుతుందనే ఉద్దేశంతో చిన్న చిన్న జబ్బులైన 133 ప్రొసీజర్లకు సంబంధించి ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి ట్రీట్‌మెంట్ చేయించుకుంటే ఆ డబ్బు ప్రభుత్వ డాక్టర్లకే చెందుతుంది కాబట్టి ప్రభుత్వానికొచ్చే ఆదాయం 13 శాతం నుంచి 30శాతానికి చేరింది. అందులో కూడా ఆరోగ్యశ్రీ ద్వారా వచ్చిన డబ్బును 20 శాతం రివాల్వింగ్ ఫండ్‌గా చేరడంతో ఆరోగ్యశ్రీ ఫండ్‌లో రూ.70కోట్లు ఉన్నాయి. మిగిలిన 80 శాతంలో 45 శాతం హాస్పటల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద ఖర్చు చేస్తున్నందున పెద్ద ఆసుపత్రులలో శానిటేషన్ తదితర ఎమర్జెన్సీ పనులు చేయడానికి వీలుంటుంది. మిగిలిన 35 శాతం డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది, జీతభత్యాలకు, క్లాస్-4 జీతభత్యాలకు వెళుతుంది. ఈ ప్రొసీజర్ పెట్టడానికి కారణం ప్రభుత్వ ఆసుపత్రులు కూడా మెరుగుపడాలనే ఉద్దేశంతో పెట్టాం. 133 ప్రొసీజర్ల స్కీములో ఉన్న జబ్బుకు సంబంధించి ఒకవేళ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లినా తిరిగి ప్రభుత్వ ఆసుపత్రికి పంపించమని మేం ఇన్‌స్ట్రక్షన్స్ ఇవ్వడం జరిగింది. గౌరవ సభ్యురాలు చెప్పినట్లుగా జబ్బు వచ్చినప్పుడు ఆరోగ్యశ్రీ కార్డు కోసం తహశీల్దారు ఆఫీసుకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుందని చెప్పారు. డబ్బులు ఉన్న వాళ్లు తాహశీల్దారు కార్యాలయానికి వెళ్లి వారిని ఇబ్బంది పెట్టనప్పుడు సదరు సిబ్బం కార్డులను మంజూరు చేయడంలేదే తప్ప, పేదవారికి జబ్బు చేసినప్పుడు ఆరోగ్యశ్రీ కార్డు కోసం వెళ్లాల్సిన పని లేకుండా తెల్ల రేషన్ కార్డు తీసుకెళ్లినా ఆసుపత్రిలో చేర్చుకొని వైద్యం అందిస్తారు.

డా. గేయానంద్ ః వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రులను పటిష్టం చేయకుండా ఆరోగ్యశ్రీకి గుర్తింపునిచ్చి ఏం ఉపయోగముంటుంది? వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రులంటే మిడిల్ లెవల్ ఆసుపత్రులలో అన్ని రకాల స్పెషలిస్టులను, అన్ని రకాలైన పరికరాలను మీరు కేటాయిస్తే బాగుంటుంది. అలాగే సీరియస్ మెడికల్ కేసులను కార్పోరేట్ ఆసుపత్రులు రిజెక్ట్ చేస్తున్నాయి. దానిపై కూడా మీరు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు.

డా.కామినేని శ్రీనివాస్ః ఆసుపత్రులలో స్పెషలిస్టు డాక్టర్ల కొరత ఉన్నది. వాటిని అతి త్వరలో భర్తీ చేస్తాం. ఏరియా ఆసుపత్రిలో మినిమం ఒక గైనకాలజిస్టు, ఒక పీడియాట్రీషియన్, ఒక ఎనస్తటిస్టు ఉండే విధంగా ఏర్పాటుచేయాలనే ప్రణాళిక ప్రభుత్వం ఉంది. మీరు చెప్పిన విధంగా ప్రైవేటు ఆసుపత్రుల గురించి రెవ్యూ చేసి డిపార్టుమెంటు తరవున వారికి ఆదేశాలివ్వడం జరుగుతుంది.

డా. గేయానంద్ ః ఒకవేళ స్పెషలిస్టులు దొరకని పక్షంలో ఉన్న సిబ్బందికే ఆరు మాసాల స్పెషలైజేషన్ ట్రైనింగ్‌నిచ్చి వారినే స్పెషలిస్టులుగా నియమించవచ్చు కదా? గతంలో ఇటువంటి ఆనవాయితీ ఉండేది, దాని ప్రకారం మీరూ చేయచ్చు కదా?

డా. కామినేని శ్రీనివాస్ ః అధ్యక్షా, స్పెషలిస్టుకు కావలసిన ఎడ్యుకేషనల్ క్వాలిఫికేషన్ లేకుండా ట్రైనింగ్ ఇవ్వలేం. గవర్నమెంట్ ఇచ్చే జీతాలకు కొన్ని సెక్షన్‌లకు (కార్డియాలజీ, సర్జరీ) స్పెషలిస్టులు వస్తున్నారు కానీ కొన్ని సెక్షన్‌లకు స్పెషలిస్టులు రావడం లేదు. స్పెషలిస్టుగా అప్రూవ్ అయిన వారినే స్పెషలిస్టుగా అపాయింట్ చేస్తాం. అలా కాని పక్షంలో అర్హత లేను డాక్టర్లను ఎందుకు నియమించారని మనమే ప్రశ్నిస్తాం.

శ్రీ జూపూడి ప్రభాకరరావు (నామినేటెడ్)ః అధ్యక్షా, ప్రభుత్వాసుపత్రులలో నిపుణుల లభ్యత ఉన్నా, వైద్య పరికరాల కొరత ఎక్కువగా కొరత కూడా ఉన్నది. సభ్యులకేమైనా వైద్య అవసరాలుంటే, ప్రైవే టు ఆసుపత్రులకు వెళ్లే అవకాశం ఇచ్చారు. దాన్ని నేను అభినందిస్తున్నాను. I welcome it, but, at the same time, we are collapsing the Government Hospitals like, Osmania, Gandhi, NIMS, Guntur General Hospital, Visakhapatnam General Hospital, etc. ప్రభుత్వాసుపత్రులలో లేటెస్ట్ ఎక్విప్‌మెంట్ల లేకపోవడం వల్ల డాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రోగి డాక్టరు వద్దకు వెళితే నాడి పట్టుకునో, గోళ్లు చూసో, కళ్లు చూసో రోగుం గుణాన్ని బట్టి మందులు రాసేవారు. That era has gone. ప్రస్తుతం పేషెంటు ఏ రకమైన ఆరోగ్య సమస్యలొచ్చి డాక్టరును సంప్రదించినా ప్రతి దానికి ముందుగా సంబంధిత టెస్టులు చేయించుకోమని రాస్తారు. టెస్టులు చేయించుకోవాలంటే వేల రూపాయలు ఖర్చు అవుతాయి కాబట్టి పేద ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎలాంటి పరికరాలు లేకుండా, వాటిని ప్రభుత్వం అందించి సహకారం అందించకుండా, how you are going to develop the public organisations? ఆసుపత్రులలో డాక్టర్లు ఉన్నారు, కానీ పరికరాలు లేవు. కనుక ఈ డాక్టర్లే సాయంత్రం వెళ్లి ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎంతో ప్రాముఖ్య కలిగిన డాక్టర్లుగా పని చేస్తున్నారు. A famous Radiologist is working in a Guntur Hospital, is earning lakhs of rupees in Private Hospitals. కాబట్టి ప్రభుత్వ ఆసుపత్రులలో పరికరాలు అందించగలుగుతే అవి అద్భుతంగా పని చేస్తాయి. గౌరవ మంత్రి గారికి అన్నీ తెలుసు వారికి పెద్దగా చెప్పక్కర్లేదు. He knows every thing. కనుక ప్రభుత్వ ఆసుపత్రులలో పరికరాలు అందించాలని మీ ద్వారా వారిని కోరుతున్నాను.

ఉ 10.30

శ్రీ వెంకట సతీష్‌కుమార్ రెడ్డి సింగారెడ్డి (శాసనసభ నియోజకవర్గం)ః ఆసుపత్రి పరికరాల గురించి ఇందాక ప్రభాకర్‌రావుగారు చెప్పారు. రిమ్స్‌లో విపరీతమైన పరికరాలున్నాయి. అయితే, ఇంతవరకూ సీల్‌కూడా తీయలేదు. కొన్ని వందల మిషన్లు అలాగే పడి ఉన్నాయి. దానిమీద ఏమైనా చర్య తీసుకుంటారా? ఎందుకన్ని పరికరాలు తీసుకున్నారు? అన్ని పరికరాలు తెచ్చినప్పుడు దానికి దానికి కావలసినటువంటి డాక్టర్లు లేరనే విషయాలను కూడా ఒకసారి మంత్రిగారు తెలియజేయగలరు.

మిస్టర్ ఛైర్మన్ : ఇక్కడ సభ్యులు చాలా స్టడీ చేసి వస్తారు. కాబట్టి అప్పుడప్పుడు సమీక్షా సమావేశాలు కూడా నిర్వహించాలి. You conduct review meetings with the Legislators. కనీసం మూడు నెలలకు ఒకసారైనా సమావేశాలు నిర్వహించాలి.

డాక్టర్ కామినేని శ్రీనివాస్ : అధ్యక్షా, ఇప్పటికే తొమ్మిది జిల్లాలలో గౌరవ శాసన సభ్యులు, శాసన పరిషత్తు సభ్యులతో కలిసి డాక్టర్లందరితో సమీక్షా సమావేశాలు నిర్వహించాము. ఇంకా నాలుగు జిల్లాలలో మాత్రమే నిర్వహించాలి.

శ్రీ సి.రామచంద్రయ్య (శాసనసభ నియోజకవర్గం): మా జిల్లాలో కూడా సమావేశాలు నిర్వహించండి.

డాక్టర్ కామినేని శ్రీనివాస్ : తప్పకుండా కడప జిల్లాకు వస్తాము.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : ఇక్కడ కూడా అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయండి.

శ్రీ కె.ఎస్.లక్ష్మణరావు : అధ్యక్షా, మంత్రిగారు గుంటూరులో సమీక్షా సమావేశాన్ని బాగా నిర్వహించారు. గుంటూరులో కొత్తగా రు.20 కోట్లతో ట్రామా సెంటర్‌ను పెట్టారు. దానిలో పరికరాలు కొనడానికి రు.20 కోట్లు ఇస్తామని గవర్నర్‌గారు ప్రారంభోత్సవం చేసిన సందర్భంగా ప్రభుత్వం వారు హామీ ఇచ్చారు. ఆ రు.20 కోట్లను ఎప్పుడు విడుదల చేస్తారో తెలియజేయాల్సిందిగా మీ ద్వారా మంత్రిగారిని అడుగుతున్నాను.

డాక్టర్ కామినేని శ్రీనివాస్ : అధ్యక్షా, ఇప్పుడు డయాగ్నస్టిక్స్ అన్నిటినీ పి.పి.పి మోడల్‌లో త్వరలోనే నిర్ణయం తీసుకుని చేద్దాము. గతంలో ఈ పరికరాలేవీ లేనప్పుడు పేషెంట్‌ను పరీక్ష చేసి దానిలో ఉన్న క్లినికల్ ఎగ్జామ్‌ను కనుగొనేవారు. ఇవాళ డాక్టర్లు కూడా క్లినికల్ ఎగ్జామినేషన్ చేయడం తగ్గిపోయి అంతా డయాగ్నస్టిక్స్ మీద ఆధారపడుతున్నారు. దీనివల్ల ఎవరికి ఏ జబ్బుందో తెలియక అందరికీ అన్ని టెస్టులు చేయాల్సి వస్తోంది. ట్రీట్‌మెంట్ అనేది చాలా ఖర్చుతో కూడుకున్నదై ఉంటోంది. పూర్వం డాక్టర్లందరూ ఫిజికల్ ఎగ్జామ్‌తోటే వ్యాధిని కనిపెట్టేవారు. ఇవాళ ఆ విధంగా లేదు. ఇవాళ పేషెంట్ రాగానే బ్లడ్ టెస్టు, ఎక్స్‌రే, ఎం.ఆర్.ఐ, ఇ.సి.జి తీస్తున్నారు. దానినిబట్టి సులువుగా వ్యాధిని కనుగొంటున్నారు. అయితే దానివల్ల ట్రీట్‌మెంట్ చాలా ఖర్చుతో కూడుకున్నదై ఉంటోంది. కొన్నాళ్ళయితే మిషన్లే వ్యాధిని కనిపెట్టే పరిస్థితి వస్తుందేమో? ప్రస్తుతం ముందుగా జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ సెంటర్స్ ఇలా వరుసగా అన్నింటినీ పైనుంచి కింది వరకూ అభివృద్ధి చేయాలనుకుంటున్నాము. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్ళడానికి కొంత సమయం పట్టినా, కనీసం గర్భిణీ స్త్రీలనైనా ఏరియా ఆసుపత్రులకు తీసుకువస్తే సకాలంలో వైద్యమందించడానికి అవకాశముంటుంది. కనుక తప్పకుండా వాటిని అభివృద్ధిపరుస్తాము. సెప్టెంబర్ రెండవవారంలో కడపలోని రిమ్స్ ఆసుపత్రిని సందర్శించి తనిఖీ చేసి అక్కడున్న పరిస్థితిని చక్కదిద్దడం జరుగుతుంది. గుంటూరులోని పొదిలి ప్రసాద్‌గారు ఈ దేశంలోనే ఎక్కడాలేని విధంగా వారి పొదిలి ఆసుపత్రిలో రు.5 కోట్లతో లైబ్రరీ నిర్మించారు. మళ్ళీ వారు ఒక రు.10 కోట్లు, ప్రభుత్వం మరొక రు.10 కోట్లను మ్యాచింగ్ గ్రాంట్‌గా అందజేయగా మొత్తం రు.20 కోట్లతో ట్రామా సెంటర్ భవనాలను నిర్మించారు. సభ్యులు లక్ష్మణరావుగారు అడిగినట్లు అక్కడ ఏ రకంగా చేయాలో ఆ విధంగా చేయడానికి తప్పకుండా చర్యలు తీసుకుంటాము.

మిస్టర్ ఛైర్మన్ : సీనియర్ డాక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రులలో పరికరాలు లేవని అంటున్నారని ఇందాక ప్రభాకర్‌రావుగారు అన్నారు కదా దాని గురించి చెప్పండి.

డాక్టర్ కామినేని శ్రీనివాస్ : ప్రభుత్వ ఆసుపత్రులలో పరికరాలు లేవని కాదు. ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో డాక్టర్లందరికీ ఒక్కటే చెప్పాము. సమాజంలో డాక్టర్లంటే చాలా మేధావులుగా పరిగణిస్తారు. ప్రస్తుతం కూడా మోస్ట్ కాంపిటెంట్ బెస్ట్ స్టూడెంట్ డాక్టర్ కెరీర్‌నే ఎంచుకుంటారు. వాళ్ళు అనుకుంటే చేయగలరు. కాకపోతే మొన్న పర్సనల్‌గా చాలా పొలైట్‌గా అందర్నీ రిక్వస్ట్ చేశాము. మేము కొత్తగా వచ్చాము. ఇవాళ మీరు ఒక నాలుగు కార్యక్రమాలు చేయమని డాక్టర్లనందర్నీ కోరాము. అందులో మొదటిది పారిశుద్ధ్యం మరియు భద్రతా పరమైన చర్యలు. Please don't compromise on sanitation. రెండవది వచ్చిన పేషెంట్‌ను ఆప్యాయంగాను, సున్నితంగాను పలకరించమన్నాము. మూడవది ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు వారిని ఆసుపత్రిలోనే ఉండాలనీ, ఆ విధంగా ఉండకపోతే బయోమెట్రిక్ పెట్టడం కానీ, లేకపోతే ఇంక వేరే పద్ధతులనైనా పెట్టడం కానీ చేస్తామని తెలియజేశాము. కాకపోతే డాక్టర్లకు ఆ విధంగా చేస్తే బాగుండదనీ కాబట్టి ఆ సమయంలో మీరుండాలని చెప్పాము. అలాగే నిజాయితీ విషయంలో మేము ఏ విధంగానూ కాంప్రమైజ్ కామని చెప్పాము. ఇక్కడ చూసిన తరువాత మళ్ళీ బయట ఆసుపత్రులలో చూడడం చేయకూడదనీ, అటువంటి ఏ కేసులు వచ్చినా కూడా ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంటుందని చెప్పాము. తప్పకుండా డాక్టర్లు ఆసుపత్రులలో ఉండే విధంగా ప్రయత్నాలు చేస్తున్నాము.

MR. CHAIRMAN: Doctors in service, senior doctors, experts, they prefer part time jobs. So, they go there. What about that?

డాక్టర్ కామినేని శ్రీనివాస్ : ప్రభుత్వ డాక్టర్లు ఆసుపత్రిలో డ్యూటీ అయిపోయిన తరువాత బయట అవుట్ పేషెంట్స్‌ను చూడవచ్చు కానీ వేరే ఆసుపత్రులకు, నర్సింగ్‌హోమ్‌లకు వెళ్ళకూడదు. అది తప్పకుండా స్ట్రిక్ట్‌గానే అమలు చేద్దామనుకుంటున్నాము.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : అధ్యక్షా, "ప్రైవేటు ఆసుపత్రులు విరాజిల్లుతున్నాయి, ప్రభుత్వాసుపత్రులు కునారిల్లుతున్నాయనేది" అప్పటి నుంచి ఇప్పటికి జరుగుతున్న విషయమే. అయితే శ్రీనివాస్‌గారు చెప్పినట్లుగా ప్రసాద్‌గారి లాంటి వాళ్ళు భవనాలను కడుతున్నారు. అలాగే కేన్సర్ ఆసుపత్రులు లాంటి వాటిని చాలామంది కడుతున్నారు. అయితే దానిలోకి కావలసిన పరికరాలను ప్రభుత్వం సమకూర్చకపోతే భవనాలను కట్టి ప్రయోజనమేమిటి? ఇవాళ ఏ ఆసుపత్రిలోచూసినా, ఎంత పెద్ద భవనాలు నిర్మించినా కానీ లిఫ్ట్‌లు పనిచేయడంలేదు, పరికరాలు ఉండడం లేదు. టెస్టులేమైనా చేయించుకోవాలంటే బయటికి వెళ్ళి వేలకు వేల రూపాయలు ఖర్చుచేసి చేయించుకోవాల్సిన పరిస్థితి. అందుకని ప్రభుత్వ ఆసుపత్రులలో స్కాన్స్, సి.టి స్కాన్స్ మిషన్లు, లిఫ్ట్‌లు, అత్యవసర విభాగాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నాము.

డాక్టర్ కామినేని శ్రీనివాస్ : వ్యాధుల చికిత్స కొరకు ఉస్మానియా, గాంధీ, నిజామ్స్, మెటర్నిటీ, యంజియం కేన్సర్ ఆసుపత్రి లాంటి ఆసుపత్రులలో మొత్తం 6000 బెడ్స్ ఉన్నాయి. అవన్నీ తెలంగాణ రాష్ట్రానికి వచ్చేశాయి. ఇది మనకు చాలా దురదృష్టకరమైన విషయం. అంతేగాకుండా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు కూడా తెలంగాణ ప్రాంతంలోనే ఉన్నాయి. నిజంగానే కొత్తగా ఏర్పడిన రాష్ట్రం ఆరోగ్య చికిత్స విషయంలో పూర్తిగా వెనుకబడి ఉంది. వీటిని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం తరఫున తప్పకుండా ప్రయత్నం చేస్తాము.

## కౌలు రైతుల సంక్షేమం

ప్రశ్న నెం. 7309 (66)

శ్రీ పి.జె.చంద్రశేఖర రావు, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన వ్యవసాయ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలో కౌలు రైతుల మొత్తం సంఖ్య ఎంత?

ఆ) రుణ మాఫీ పథకం క్రింద కౌలు రైతులకు సమకూరనున్న ప్రయోజనం ఎంత?

ఇ) కౌలు రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

గౌరవనీయులైన వ్యవసాయ, అగ్రిప్రాసెసింగ్, మార్కెటింగ్, గిడ్డంగులు, పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య పరిశ్రమ శాఖ మంత్రి (శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు):

అ) అధికారిక సంఖ్యలేదు. రాష్ట్రంలో దాదాపు 16.00 లక్షల కౌలు రైతులు ఉంటారని (వ్యయసాయదారులలో 22 శాతం మంది కౌలు రైతులుగా ఉన్నారు) అంచనా. కౌలు రైతులు ఎక్కువగా "మౌఖిక కౌలు ప్రాతిపదిక " పై భూముల సేద్యం చేస్తున్నారు.

ఆ) 14-08-2014 తేదీ గల జి.ఓ.ఎం.ఎస్.నెం.174 ప్రకారం, రుణమాఫీకి అర్హులైన రుణ గ్రహీతల కేటగిరి ప్రకారం, ఒక సర్వే నెంబరుపై స్వల్పకాలిక పంట రుణాలను వినియోగించుకున్న పట్టాదారు. అంతేగాక ఎల్ఇసి హక్కుదారు/మౌఖిక కౌలుదారు ఇద్దరు అయిన సందర్భంలో, ప్రయోజనాన్ని ఎల్ఇసి హక్కుదారు/కౌలు సాగుదారుకు మాత్రమే అందించడమవుతుందని నిర్దేశంచడమయింది.

ఇ) సంస్థాగత రుణం, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల భీమా మొదలైనటువంటి ఇతర ప్రయోజనాలను అందించడానికి, భూమి లైసెన్సు సాగుదారులకు (కౌలు రైతులు) రుణం అర్హత కార్డులు (ఎల్ ఇసి) జారీపై ఆంధ్రప్రదేశ్ కౌలు సాగుదారుల చట్టం (2011 లోని 18వ చట్టం, తేది : 23-12-2011) అని పిలిచే చట్టాన్ని చేసిన మొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్.

**జారీ చేసిన ఎల్.ఇ.సిలు, ఎల్.ఇ.సి దారులకు అందించిన రుణాల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నవి**

| సంవత్సరం | జారీచేసిన ఎల్.ఇ.సి కార్డులు | రుణాలు జారీ చేసిన ఎల్.ఇ.సి దారుల సంఖ్య | మంజూరు చేసిన మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| 2011-12 | 4,13,797 | 1,64,125 | 322.20 |
| 2012-13 | 3,25,077 | 1,17,261 | 274.49 |
| 2013-14 | 3,84,621 | 1,56,375 | 318.13 |
| 2014-15 (31-7-14 నాటికి) | 96,884 | రుణం ప్రక్రియలో ఉన్నది | |

ఉ.10.40

శ్రీ పి.జె. చంద్రశేఖరరావుః  అధ్యక్షా, కౌలుదారుల యొక్క సంఖ్యని ఖచ్చితంగా నిర్ధారించలేకపోవడంలో చట్టపరమైన మరియు సాంఘిక పరమైనటువంటి అవరోధాలు ఏమిటి? రెండవది మూడు సంవత్సరాలకు సంబంధించి గౌరవమంత్రి గారు ఇచ్చినటువంటి లెక్కలలో ఉన్నటువంటి కౌలుదారులు, ఋణాలు మంజూరు చేసినది కేవలం మూడవ వంతు మాత్రమే.  గత ఏడాది సుమారుగా ముప్పై వేల కోట్ల రూపాయలు మంజూరు చేస్తే, కౌలుదారులకు అందింది కేవలం రూ. 318 కోట్లు మాత్రమే.  అలాగే 2014-15 సంవత్సరానికి ఎల్.ఇ.సి కార్డుల సంఖ్య నాలుగవ వంతుకు పడిపోయాయి. గత ఏడాది 3,84,681 మంది వుంటే ఈ ఏడాదికి ఇప్పటివరకు 96,884 మంది ఉన్నారు.  ఆ తరువాత ఋణాలు ఎంత మందికి ఇచ్చారనే దాని గురించిన ఖచ్చితమైన సమాచారం ప్రభుత్వం వద్ద కూడా ఇప్పటి వరకు లేదని తెలుస్తోంది.  వారికి ఈ వ్యవసాయంలో 22 శాతం అనేటువంటిది కూడా ఖచ్చితమైన లెక్క కాదు. ప్రయివేటు రైతు సంఘాలతో మేము ఒక సర్వే చేయించాము.  గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలలో సర్వే చేయిస్తే వ్యవసాయంలో సుమారు అరవై శాతం కౌలుదారులు వున్నారు.  మొత్తం ఇరవై రెండు శాతం అనేది మొత్తం రాష్ట్రాన్ని లెక్క కట్టి చెప్పినదేమో కాని, అది కూడా ఖచ్చితమైనది కాదని నేను మనవి చేస్తున్నాను.  వీటన్నిటి మీద క్లారిఫికేషన్ ఇవ్వవలసిందిగా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కె.ఎస్. లక్ష్మణరావు : అధ్యక్షా, కౌలు రైతులు మన ఈ పదమూడు జిల్లాల్లో ముఖ్యంగా ఈ కృష్ణా, గుంటూరు, తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాలలో మొత్తం 65 శాతం మంది వున్నారు. నేను మీద్వారా మంత్రి గారిని అడగదలచుకుంది ఏమిటంటే పాసు పుస్తకం వున్న రైతుకు బ్యాంకు ఋణం ఇస్తుంది.  కౌలు రైతుకి పాసు పుస్తకం వుండదు.  కౌలు రైతుకు మాటల ద్వారా ఒప్పందం కుదురుతుంది.  కాబట్టి కౌలు రైతుకి పంటమీద ఋణం ఇచ్చే విధానం, దీని గురించి గతంలో కూడా చర్చ జరిగింది, చట్టం చేసినా అది అమలు జరగడం లేదు.  పంట మీద ఋణం ఇచ్చే అవకాశం ఏమైనా వుందా అని మీ ద్వారా మంత్రి గారిని అడుగుతున్నాను.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావుః  అధ్యక్షా, కౌలు రైతుల సంఖ్య అధికారికంగా లేకపోవడానికి గల కారణమేమిటంటే ప్రతీ సంవత్సరం మారుతూ ఉండడం ఒకటి, ల్యాండ్ లార్డు అధికారికంగా ఆన్ పేపర్ ఇవ్వకపోడం గానీ, అనధికారికంగా కూడా ఈ టెనెంట్ యాక్ట్ ఎక్కడ వర్తిస్తుందో అని ల్యాండ్ లార్డు ముందుకు రావడం లేదు. ఎందుకంటే ప్రతీ సంవత్సరం మారుతూ వున్నారు.  అ మారిన దానిలో కూడా లీజుకు తీసుకున్న వాళ్లు అనధికారికంగానే ఇస్తున్నారు.  వారు ఎక్కడా కూడా లోన్లు తీసుకోవడానికి గాని, ఆన్ పేపర్ ఇవ్వడానికి గాని, గ్రామ సభలలో ఒప్పుకోవాడానికి ఇష్టపడని రైతాంగం కూడా ఉన్నారు.  దానికి తీసుకునే వారు ఇష్టపడే తీసుకుంటున్నారు.  ఆ నిబంధనలకు అంగీకరించిన వారికే పొలాలు ఇవ్వడం జరుగుతోంది. బ్యాంకులు కౌలు రైతులకు ఋణాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రతిపక్షంలో వున్నప్పుడు మేము కూడా పోరాటం చేశాం.  ప్రధానంగా ఏమిటంటే ల్యాండ్ లార్డ్ ఋణం తీసుకుని ఉండి ఉండడం, లేదా కౌలు రైతు ఋణం తీసుకోవడానికి ల్యాండ్ లార్డ్ ఒప్పుకోకపోవడం.  ఈ రెండు కారణాల వల్ల బ్యాంకులు ఋణాలు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు.  బ్యాంకుల నిర్లిప్తత కూడా వుంది.  ఉదాహరణకు జిల్లాలో జిల్లా కలెక్టర్ చెప్పినా కూడా ఋణాలు ఇవ్వని పరిస్థితి వుంది.  లీడ్ బ్యాంకు మేనేజరుని అనేక సార్లు మీటింగులకు పిలిచాము కానీ ఎక్కడా కూడా స్పందించినది లేదు.  దీని వలన కొన్ని జిల్లాలలో

జారీ చేసిన దానిలో 20 నుండి 30 శాతం మాత్రమే ఎల్.ఇ.సిలు ఋణం పొందడం జరిగింది. అదే విధంగా 60 శాతం వరకు ఉందని మన గౌరవసభ్యులు శ్రీ చంద్రశేఖర రావు గారు చెప్పారు. కొన్ని జిల్లాలలో నెంబర్ ఎక్కువగా వుంది. జిల్లాల వారీగా కావాలంటే ఈ16లక్షలలోకూడా, కొన్ని జిల్లాలలో ఎక్కువగా వుంది, కొన్ని జిల్లాలలో తక్కువగా వుంది, అనధికారికంగా వున్న వాళ్లు కూడా వున్నారు. శ్రీకాకుళం 65,199 విజయనగరం 65,343 విశాఖపట్టణం 31,208 తూర్పు గోదావరి 2,43,742 పశ్చిమ గోదావరి 3,55,716 కృష్ణా1,96,372 గుంటూరు 1,61,338 ప్రకాశం1,20,146 నెల్లూరు 1,9,643 కర్నూలు 43,022 అనంతపూర్ 54,941 కడప 17,348 చిత్తూరు 1,37,761 మొత్తం 76,21,118 మంది రైతులు వుంటే అధికారికంగా ఉన్నది మాత్రం 16 లక్షలు మాత్రమే. అంటే ఎల్.ఇ.సి ఇచ్చిన వాళ్లు, టెనెంట్ ఫార్మర్స్ మన లెక్కల ప్రకారం, ఎల్.ఇ.సి తీసుకున్న వాళ్ల, కౌలుదారులుగా గ్రామసభలలో గుర్తింపు పొందిన వారు. గౌరవసభ్యులు చెప్పినట్లు ఇంకా అనధికారికంగా ఉండే అవకాశం ఉంది. దానికి మన దగ్గర ఆధారాలు లేవు.

మిస్టర్ ఛైర్మన్: పట్టాదారు పాసు పుస్తకం ల్యాండ్ లార్డ్ పేరు మీద ఉంటుంది. కౌలుదారుడి పేరు మీద ఎందుకు వుంటుంది. దాని ప్రకారమే పోతారు.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు: ల్యాండ్‌లార్డు విల్లింగ్ ఇవ్వకపోయినా, గ్రామసభ ఒప్పుకోకపోయినా, ఎల్.ఇ.సి గా గుర్తింపు పొందే అవకాశం లేదు.

శ్రీ పి.జె. చంద్రశేఖరరావు: అధ్యక్షా, గౌరవమంత్రిగారు ఆమోదించినట్లుగానే ప్రధానమైనటువంటి వ్యవసాయక జిల్లాలలో అత్యధిక సంఖ్యలో కౌలుదారులు ఉన్నారు. అయితే మౌఖికమైనటువంటి అంగీకారంతోనే నూటికి తొంభై శాతం మంది ఉన్నారన్నది వాస్తవమైనప్పుడు ప్రభుత్వ లెక్కల ప్రకారంగా వారితో అంగీకార ఒప్పందం చేసుకుని, టెనెంట్ చేసుకున్నవాళ్ల, పట్టాదారు పాసుపుస్తకం లేకుండా కౌలు కాగితాలు పెట్టి బ్యాంకు లోన్లు పొందిన వారు 16 లక్షలమంది మాత్రమే ఉన్నారు. ఈ 16 లక్షల మంది పదిశాతం అనుకుంటే, మిగిలిన వాళ్లు మౌఖిక కౌలుదారులు అనుకుంటే ఇప్పుడు ఋణమాఫీ పథకం అమలు చేస్తున్న పరిస్థితుల్లో నిజంగా భూమిని దున్ని, అప్పు చేసి ఆ అప్పులు బ్యాంకులలో కాకుండా ఇతర ప్రైవేలు సంస్థలలో చేస్తున్నటువంటి వ్యక్తికి నిజంగా ఋణమాఫీ వర్తించడం లేదు. నిజమైన వ్యవసాయదారుడికి, నిజంగా భూమిని దున్నే వ్యక్తికి ప్రయోజనం కలిగించే విధంగా ప్రభుత్వం శాస్త్రీయంగా పరిశీలన చేసి విధివిధానాలను రూపొందించేందుకు పూనుకుంటుందా అని మీద్వారా అడుగుతున్నాను.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు: అధ్యక్షా, ఈ ఋణమాఫీ కూడా ఎవరైతే కౌలుదారులు వున్నారో వారికి తప్పకుండా వర్తించే విధంగా నిర్ణయం తీసుకోవడం జరిగింది. కౌలుదారులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. ఎవరైతే బ్యాంకులో ఋణం పొంది ఉన్నారో తప్పకుండా వారికి ఋణమాఫీ పథకం వర్తిస్తుంది. రెండవ ప్రాధాన్యత ల్యాండ్‌లార్డ్‌కి ఇవ్వడం జరుగుతుంది. ఈ 16 లక్షలలో ఎంతమంది ఋణం పొంది ఉన్నారో వారికి నూటికి నూరు శాతం ఋణమాఫీ జరుగుతుంది. జీ.వో లో కూడా అదే చెప్పడం జరిగింది. మౌఖిక కౌలుదారులైనా ఋణం పొంది ఉంటే వారికి వర్తిస్తుంది.

ఉ.10.50

## శెనగల కొనుగోలు

ప్రశ్న నెం.7372 (67)

శ్రీ జూపూడి ప్రభాకర రావు, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన వ్యవసాయ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రైతుల నుండి శనగలను కొనుగోలు చేయడానికి ప్రబుత్వం హామీ ఇచ్చిందా?

ఆ) అయితే, రాష్ట్రంలో శనగ నిల్వల లభ్యత పరిమాణం చాలినంత ఉన్నప్పుడు ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకోవడానికి గల కారణం ఏమిటి?

గౌరవనీయులైన వ్యవసాయ శాఖ మంత్రివర్యులు (శ్రీ పత్తిపాటి పుల్లారావు) ః

అ) అవునండీ.31-01-2014 తేదీ గల వ్యవసాయం, సహకార (ఎఎం.IV) శాఖ, జి.ఓ.ఆర్.టి.నెం.79 ద్వారా ప్రకాశం, కర్నూలు జిల్లాలలో మార్క్‌ఫెడ్ & హెచ్‌ఎసిఎల ద్వారా 2012-2013 రబీలో శనగ నిల్వలను సేకరించడానికి ప్రభుత్వం మార్కెట్ ప్రమేయ పథకాన్ని ఆమోదించింది.

ఆ) ఇది కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన విషయం.

శ్రీ జూపూడి ప్రభాకరరావుః అధ్యక్షా, గౌరవ మంత్రివర్యులు చెప్పినటువంటి రెండవ సమాధానం చూస్తే, సెంట్రల్ గవర్నమెంట్ ఇచ్చిన దాంట్లో, what is the role of the State Government? మీరు చెప్పినట్టుగా మొదటి ప్రశ్నకు అవునండీ, కర్నూలు, ప్రకాశం జిల్లాల నుండి అన్నారు. When I am putting this question, నా మనసంతా కూడా ప్రకాశం జిల్లా రైతుల గురించే ఆలోచించే ఈ ప్రశ్న వేయడం జరిగింది. మీరన్నట్టుగా మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల దగ్గర మీరు శనగలను కొంటున్నట్లయితే, ఇవి సఫిషియెంట్‌గా మన దగ్గర ఉన్నప్పుడు, మీరు ఇతర రాష్ట్రాల నుండి కూడా కాకుండా ఇతర దేశాల నుండి కొనాల్సిన అవసరమేంది. మంత్రి గారూ.. మీ సమాధానం మా టేబుల్ ముందుకు రాలేదు. So, some more information is required in this matter. సార్, మా జిల్లాలో పొగాకు సీజన్ అయిపోయిన తరువాత, రైతులు వెంటనే శనగ పంట వేసుకుంటారు. ఈ శనగ పంట కరెక్టుగా కాపుకు వచ్చే సమయంలోనే దురదృష్టవశాత్తూ సైక్లోన్ రూపంలో తుఫాన్ వచ్చేస్తుంది. ఈ పంట ఒక అడుగు ఎత్తు కూడా ఉండదు. కొద్ది నీళ్లొచ్చినా పంట మునిగిపోతుంది. రైతులు విలవిలలాడిపోతారు..

మిస్టర్ ఛైర్మన్ః ప్రభాకర్ రావు గారూ.. సమయం 11 కావొస్తోంది. Please put your supplementary.

శ్రీ జూపూడి ప్రభాకరరావుః సార్, ఈ అంశానికి సంబంధించి కొంచెం బ్యాక్‌గ్రౌండ్ కూడా చెప్పాలి. మీకందుకే చెప్పాను. కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో రైతుల పరిస్థితి చాలా దయనీయంగా ఉంది.

శ్రీ వెంకట సతీష్‌కుమార్ రెడ్డి సింగారెడ్డిః కడప జిల్లాలో కూడా..

SRI JUPUDI PRABHAKARA RAO: Now, you can add all the Districts. It is up to you. సభ్యులందరూ వాళ్ల వాళ్ల జిల్లాల గురించి కూడా ప్రస్తావించొచ్చు. అయితే, ఇక్కడ మీ ద్వారా నేను మంత్రి గారిని అడిగేదేమంటే – రైతులకు భరోసా ఇచ్చి ప్రభుత్వమే శనగలను కొంటుంటే బాగుంటుంది. ఇక్కడేమౌతోందంటే, ప్రభుత్వమిచ్చే భరోసా తగ్గిపోయి, సైక్లోన్ దెబ్బకి పంట నష్టపోయి రైతులు ఒకపక్క, ప్రభుత్వం ఒకపక్క ఇబ్బందులుపడుతున్న నేపథ్యంలో వీళ్ల దగ్గర సఫిషియెంట్‌గా శనగ నిల్వలున్నాయని చెబుతున్నా, బయట దేశాల నుండి మార్క్‌ఫెడ్ ద్వారా కొంటున్నారు.

అలాగే, ఇక్కడ దళారీ వ్యవస్థ ఒకటి వచ్చేసింది. మంత్రిగారు మరి ఒప్పుకుంటారో, లేదో నాకు తెలియదు గానీ.. He knows this issue pretty well. How to control the mediators అన్న విషయంలో, బ్రోకర్లను మనం కంట్రోల్ చేయగలిగితే, రైతు కూడా ఆనందంగా ఉండగలుగుతాడు. As far as this Bengal gram is concerned, దీని మీద మీ సమాధానం కావాలని కోరుతున్నాను.

శ్రీ బి. చెంగల్ రాయుడుః అధ్యక్షా, ఈ శనగ పంట మా కడప జిల్లా పశ్చిమ తాలూకాలో బాగా పండిస్తారు. కమలాపురం, ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు అంతా కూడా ఈ పంట పండుతుంది. ఇది వర్షాధారిత పంటేం కాదు, ఒక్క వర్షం కురిస్తే పండుతుంది. గత మూడేళ్ల నుండీ రైతుల దగ్గరే ఈ పంట నిలబడి పోయింది. అది పురుగు కూడా పడుతోంది. ఏదో మంచి రేటొస్తుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఒక్కోసారి రూ.2,500 రేటు కూడా వస్తుంది. ప్రభుత్వం ఇమ్మీడియట్‌గా వీటి కొనుగోలు విషయంలో చొరవ తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వంతో అన్ని విషయాల్లోనూ చర్చిస్తోంది. అలాగే, మంత్రివర్యులు పుల్లారావు గారు కూడా రైతు కుటుంబం నుండే వచ్చారు కాబట్టి ముఖ్యమంత్రి గారు కేంద్రం వద్ద ఈ పాయింట్ కూడా రెయిజ్ చేస్తే సమస్య సులభంగా పరిష్కారమయ్యుండేదేమో! విదేశాల నుండి కొనుగోళ్లు బ్యాన్ చేసి, ఇక్కడ కొంటే సరిపోతుంది సార్. అక్కడ నుండి తెచ్చుకునే దానికి బదులు, మన గోడౌన్లలో ఉన్న సరుకును బయటకు పంపించగలిగితే, రైతులు బాగుపడతారు. తప్పనిసరిగా ఆ దిశగా చర్యలు చేపడతారన్న విషయంలో వ్యవసాయ శాఖా మంత్రి గారి మీద నాకు పూర్తి నమ్మకమున్నది అధ్యక్షా.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యంః అధ్యక్షా, గతంలో కూడా దీని మీద చర్చ జరిగినప్పుడు ఆ సమీక్షలో నేను కూడా పాల్గొన్నాను. ప్రకాశం జిల్లాలో పెద్ద ఎత్తున ఉన్న నమ్మకమేమంటే, ఈ శనగ రైతుల్ని ముంచేందుకు పెద్ద ఎత్తున విదేశాల నుండి శనగను దిగుమతి చేసుకుని, వీళ్లకి అన్యాయం చేశారు. ఈ శనగ పంట విషయంలో ఘోరమైనటువంటి అన్యాయం, దుర్మార్గం జరిగిందనేది అక్కడి రైతులకున్న నమ్మకం. కేంద్రం అనవసరంగా పెద్ద ఎత్తున ఇతర దేశాల నుండి శనగను దిగుమతి చేసుకుని, ఇక్కడి రైతులను దివాళా తీయించింది. దీని వెనుక పెద్ద కథ ఉందనేది ప్రకాశం జిల్లా రైతాంగానికి ఉన్నటువంటి ఒక నమ్మకమో, అపనమ్మకమో తెలియదు గానీ, మీరు దయచేసి దీని విషయంలో లోతుగా పరిశీలన చేసి, సమస్యను సరిదిద్ద గలిగినట్లయితే, ఆ రైతులు బాగుపడతారు సార్.

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి (పట్టభద్రుల నియోజకవర్గం, ప్రకాశం, నెల్లూరు మరియు చిత్తూరు)ః అధ్యక్షా, ప్రకాశం జిల్లాలో కోల్డ్ స్టోరేజీల్లో ఈ శనగ నిల్వలున్నాయి. ఆ శనగ నిల్వలు కోల్డ్ స్టోరీజీల చార్జీలకు సరిపడా కూడా లేవు. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ శనగ పంటను ప్రోత్సహించడానికి గిట్టుబాటు ధరల్లో కొంటామని చెప్పి ఒక జీఓ కూడా ఇచ్చారు. అటు కనీసం ప్రభుత్వం కొనకపోగా, కోల్డ్ స్టోరేజీల్లో మగ్గుతున్న ఆ నిల్వలకు చార్జీలను ప్రత్యేకంగా కట్టుకోలేని పరిస్థితుల్లో కౌలు రైతులుంటే, ఈ రోజు ఈ శనగల్ని విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నాము. శనగల కొనుగోళ్లు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని విషయమని చెప్పి వదిలివేయడం ఏ మాత్రం మంచిది కాదు. మీ ద్వారా మంత్రి గారిని కోరేదేమంటే శనగను పండించే రైతులను ఖచ్చితంగా ప్రభుత్వం ఆదుకోవాలి, రైతులకు నష్టపరిహారాన్ని కూడా కట్టించాలి.

శ్రీ వెంకట సతీష్ కుమార్ రెడ్డి సింగారెడ్డిః అధ్యక్షా, మీ ద్వారా మంత్రి గారికి చెప్పడమేమంటే – కడప జిల్లాలో ఇటీవల కాలంలో వేరు శెనగ గాని, ప్రత్తి గాని విత్తనం పడడం లేదు. ప్రధానంగా మృగశిర కార్తెకి బెంగాల్ గ్రామ్ మీదనే రైతులందరూ ఆధారపడి ఉంటారు. ఇందాకే చెంగల్ రాయుడు గారు చెప్పినట్టు మూడు సంవత్సరాల నుండి విపరీతమైన స్టాక్ అక్యుములేట్ అయిపోయింది. గతంలో రూ.4,500 ఉన్న రేటు, ఈ రోజు రూ.2,500కు వచ్చింది. కాబట్టి, ఈ రేటుని ఏమైనా పెంచేందుకు అవకాశముందా? రైతుల దగ్గరున్న ఉత్పత్తిని సేకరించేందుకు ఏమన్నా ప్రయత్నాలు జరుగుతున్నాయా? అని మీ ద్వారా మంత్రి గారిని అడగదల్చుకున్నాను.

శ్రీ పత్తిపాటి పుల్లారావుః అధ్యక్షా, గౌరవ సభ్యులు జూపూడి ప్రభాకర్ రావు అడిగిన ప్రశ్న రాష్ట్రానికి, రైతులకు సంబంధించి చాలా ముఖ్యమైనది. కనుక, మన గౌరవ సభ్యులు ప్రభాకర్ రావు గారడిగిన ప్రశ్నలో వాస్తవముంది. గతంలో యూపీఏ ప్రభుత్వం తీసుకున్న అనాలోచితమైన నిర్ణయం వల్ల 2012–2013లో 6,97,000 క్వింటాళ్ల శనగను ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకున్నారు. అదే విధంగా ఆ తరువాత సంవత్సరం నుండి ఎగుమతి బ్యాన్ చేశారు. ఏవిధమైన ఒత్తిడులు వచ్చాయో తెలియదు, ఎందువల్ల ఎగుమతులు బ్యాన్ చేశారో తెలియదు గానీ, ఈ రెండు కారణాల వల్ల 2011, 2012, 2013, 2014 సంవత్సరాల్లో శనగ నిల్వలు ఉండిపోయాయి. అందుకు ప్రధాన కారణం ఒకటి శనగలు ఇతర దేశాల నుండి దిగుమతి కావడం. రెండవది ఎగుమతిపై బ్యాన్ ఉండటం. తరువాత గౌరవ సభ్యులు అడిగినట్టుగా కేంద్ర ప్రభుత్వం పప్పు ధాన్యాల ఎగుమతిపై బ్యాన్ పెట్టింది. ఈ మూడు కారణాల వల్ల ఈ రోజుక్కూడా శెనగ పండించిన రైతులు చాలా ఇబ్బందుల్లో ఉన్నారు. చాలా ఇంపార్టెంటు ఇష్యూ. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి గారి దృష్టికి కూడా తీసుకువెళ్లాము. దీని మీద ఏదో ఒక డెసిషన్ తీసుకుని, శనగ రైతుల సమస్యల్ని పరిష్కారం చేయాలనే ఆలోచన కూడా చేస్తున్నాము.

ఇక మన ప్రభాకర్ రావు గారు అడిగినట్లు, శనగ పంటకు సంబంధించి ప్రకాశం జిల్లాలోనే ఎక్కువ స్టాకుంది. అక్కడ 2011–2012 సంవత్సరానికి గాను, సుమారు 6,42,911 హెక్టార్లలో శెనగ పంట వేయడం జరిగింది. తద్వారా 59,14,030 క్వింటాళ్ల పంట ఉత్పత్తి వచ్చింది. అదేవిధంగా 2012–2013 నాటికి 7,19,824 హెక్టార్లలో పంట వేయడం జరిగింది. 60,91,283 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. 2013–2014 నాటికి 5,56,879 హెక్టార్లలో పంట వేయగా, 47,45,270 క్వింటాళ్ల పంట రావడం జరిగింది. ప్రధానంగా గౌరవ సభ్యులు ప్రభాకర్ రావు గారు

అడిగిన ప్రశ్నకు సంబంధించి ఒక్క ప్రకాశం జిల్లాలోనే 17,23,630 క్వింటాళ్ల పంట ఇప్పటికీ నిల్వ ఉంది. మరి అది రైతులదా, మిల్లర్లదా, ట్రేడర్లదా అనే విషయంలో కలెక్టర్‌ని సమాచారం పంపించమని చెప్పాము. ఆ సమాచారం అందాక ఒక నిర్ణయం కూడా తీసుకోవడం జరుగుతుంది. అదేవిధంగా మన చెంగల్ రాయుడు గారు అడిగారు. బాలసుబ్రహ్మణ్యం గారు, శ్రీనివాసులు రెడ్డి గారు కూడా ప్రకాశం జిల్లాకు సంబంధించి ఇదే విషయంపై అడిగారు. అదే విధంగా మన సతీష్ కుమార్ రెడ్డి గారు కూడా అడిగారు. ఈ రోజు మన దగ్గర లిమిటెడ్ స్టాకుంటే ఏపీ సీడ్స్ వాళ్లు టెండరు వేశారు. మార్కెట్ ఆక్షన్‌లో కిలోకి 27 రూపాయలు వచ్చింది.

ఉ.11.00–11.10

అధ్యక్షా, మన దగ్గర లిమిటెడ్ స్టాక్స్ ఉంటే నిన్న ఏ.పి. సీడ్స్ వాళ్లు ఆక్షన్ వేస్తే గరిష్టంగా రూ. 27 కనిష్టంగా రూ.22లు గా వేస్తూ టెండర్స్‌ను వేశారు. మద్దతు ధర అయితే క్వింటాల్ రూ.3,100లు ఉంది. శనగల రేటు మంచి బూమ్‌లో ఉన్నప్పుడు రైతు మార్కెట్లలో గత మూడు సంవత్సరాలలో ఎంత ఎక్కువ ధరకు పోయిందంటే.. దాదాపు రూ.4700లకు రైతులు గరిష్టంగా అమ్ముకున్నటువంటి దాఖలాలున్నాయి. రూ.4700లకు అమ్ముకున్నప్పుడు బ్యాంకులు కూడా రైతులకు ఎక్కువగా ఋణాలు ఇచ్చారు. గిడ్డంగులలో పెట్టినా, ఇంకా ప్రైవేటు గిడ్డంగులలో నిల్వ పెట్టినా ఎక్కువ ఋణం పొందారు. తీసుకున్న ఋణానికి వడ్డీతో పాటు ఈరోజు కోల్డ్ స్టోరేజ్ అద్దె చెల్లించాలంటే.. ప్రధానంగా మద్దతు ధరకు MSPకు ఇవ్వడానికి రైతులు ముందుకు రావడం లేదు. లేకపోతే మినిమమ్ సపోర్ట్ ప్రైస్‌కు కొనడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కాని, రూ.3,100లకు అమ్మితే బ్యాంకుల తీసుకున్న అప్పు కాని, కోల్డు స్టోరేజ్ అద్దె కాని , వడ్డీ కాని వచ్చే పరిస్థితి లేదు. క్వింటా శనగల ధర రూ.4,700లు మార్కెట్ ధర ఉన్నప్పుడు pledge చేసి అప్పులు తీసుకున్నారు. రైతుల దగ్గర ఎంత సరుకు ఉంది? మిల్లర్స్ దగ్గర ఎంత ఉంది? ట్రేడర్స్ దగ్గర ఎంత ఉందో జిల్లాల వారీగా సమాచారాన్ని పంపించమని ఈరోజు కలెక్టర్లకు కూడా లెటర్లు వ్రాయడం జరిగింది. కర్నూలు జిల్లాలో 12,49,833 క్వింటాళ్లు, అనంతపురం జిల్లాలో 4,44,956 క్వింటాళ్లు , కడప జిల్లాలో 896014 క్వింటాళ్లు, ప్రకాశం జిల్లాలో 1700000 క్వింటాళ్లు, గుంటూరు జిల్లాలో 178126 క్వింటాళ్ల శనగలు నిల్వ ఉన్నాయి. మొత్తం కలుపుకుంటే 44,92,561 క్వింటాళ్ల శనగలు నిల్వ ఉన్నాయి. కలెక్టర్ల నివేదికలు వచ్చిన తరువాత చెంగల్ రాయుడు గారు చెప్పినట్లు ఫ్రెండ్‌షిప్ ప్రభుత్వంలో కేంద్రంలో ఉంది కాబట్టి దీనిని ఏ విధంగా బ్యాన్‌ను లిఫ్ట్ చేయించడమా లేకపోతే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్టాకు ఉన్నంతవరకు ఎగుమతికి అనుమతి పొందడమా అనేది ఆలోచిస్తున్నాం. ఏమి చేయాలన్నా కేంద్ర ప్రభుత్వ సహకారం లేనిదే వాటిని కదిలించడం కష్టం. ఎందుకంటే.. వేసవిలో ఇంత క్వాంటిటీకి మార్కెట్ లేదు. ఆ విధంగా కూడా వెరిఫై చేస్తున్నాం. ఇతర రాష్ట్రాలలో కూడా డిమాండ్ ఉందా లేదా మన రాష్ట్రంలో ఏ విధంగానైనా వినియోగించవచ్చా? లేకపోతే ఎగుమతికి అనుమతి తీసుకోవాలా? ముఖ్యమంత్రి గారు కూడా దీనిపట్ల సీరియస్‌గా ఉన్నారు. దీనిమీద detailed information కలెక్టర్ల నుండి వచ్చిన తరువాత శనగ రైతుల యొక్క సమస్యను తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చేయడం జరుగుతుందని తెలియజేస్తున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : అధ్యక్షా, చిన్న సూచన. అంత నిల్వ ఉందని అంటున్నారు కదా. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కూడా శనగ త్వరగా పుచ్చు పడుతుంది. దానిని ఎలా నివారిస్తున్నారనేది ఒకటి. రెండవది, కిరాణా షాపులో కాని, సూపర్ బజార్‌లో కాని పచ్చి శనగపప్పు

వేయించిన శనగపప్పు, శనగపిండి రేట్లు ఏ మాత్రం తగ్గలేదు. ప్రజానీకానికి శనగపిండి గాని, శనగపప్పు గాని అవసరం ఉంది. అటువంటప్పుడు ఈ విధంగా కొనక పోవడంలో నిల్వ ఉండడం వల్ల పుచ్చిపోతే ఎవరికి నష్టం అని మంత్రి గారిని వివరించవలసిందిగా అడుగుతున్నాను. దాని మీద ఏమి జాగ్రత్తలు, ఏమి చర్యలు తీసుకుంటున్నారని అడుగుతున్నాను.

SRI JUPUDI PRABHAKARA RAO: Sir, I fully satisfied with the answer of the Hon'ble Minister.

అధ్యక్షా, ఇది కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం రెండింటిని కో–ఆర్డినేషన్‌లోకి తీసుకువచ్చే సబ్జెక్ట్ అయినా కూడా మంత్రి గారు స్వతహాగా ఒక రైతు కాబట్టి తనకున్నటువంటి అనుభవాన్ని, హార్డ్‌వర్క్‌ను ఉపయోగించి ఇక్కడ చాలా స్పష్టంగా చెప్పడం జరిగింది. మంత్రి గారు సభలో చదివినటువంటి జిల్లా వారీ స్టాటిస్టిక్స్‌ను సభ్యులందరికి ఇస్తే , లేకపోతే ప్రభుత్వం ఇక్కడ నుండి what type of decision you are going to take, అంటే గతంలో జరిగింది. దానిమీద నెట్టివేసి వదలకుండా రైతులకు ఎలాంటి భరోసాను మనం ఇవ్వబోతున్నాం అనేది స్పష్టంగా మంత్రి గారు చెప్పాలి. ఎందుకంటే.. ముందుగా మంత్రి గారి substance చాలా అద్భుతంగా ఉంది. నా దగ్గర కూడా అంత సమాచారం లేదు. నేను కొంత మీడియా ద్వారా, పేపర్ ద్వారా సేకరించి ప్రిపేర్ అయ్యాను కాని అంత సమాచారం నా దగ్గర లేదు. ప్రత్యక్షంగా చూసిన దాని మీద నేను మాట్లాడాను. కాని, ఆ మెటీరియల్‌ను మాకు కూడా ఇవ్వమని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు : అధ్యక్షా, గౌరవ సభ్యురాలు రాజకుమారి గారు అన్నట్లు ఇప్పుడున్నటువంటి పరిస్థితులలో తప్పకుండా మార్కెట్‌లో శనగలు, శనగపప్పు, శనగపిండి ధరలు తక్కువగా ఉండాలి. ఏపీ సీడ్స్ వాళ్లు వేసిన వేలంలో ఎంత మేరకు కోట్ చేశారనే దాని గురించి కూడా సమాచారాన్ని తెప్పించాను. దాని గురించి ఇంతకు ముందు కూడా చెప్పాను. కనిష్ట ధర రూ.22లు వస్తే గరిష్ట ధర రూ.27.50లు యావరేజ్‌గా వచ్చింది కాబట్టి మార్కెట్‌లో రేటు తక్కువగా ఉండాలి. ఈ స్టాక్‌ను ఏమి చేయాలనే దాని మీద సభ్యులు సూచనలు, సలహాలు ఇచ్చినా ఆ సూచనలు, సలహాల ప్రకారం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడానికి ఎటువంటి ఇబ్బంది లేదు. ఏదేమైనా రైతుల దగ్గర ఉన్న నిల్వలను ముందు ప్రభుత్వం సేకరించాలి. రైతుకున్నటువంటి బరువు, బాధ్యతల నుండి విముక్తి చేయాలి కాబట్టి మీరేమైనా ఉన్న నిల్వలను ఈ విధంగా చేస్తే రైతుకు కూడా ఉపయోగపడుతుందంటే తప్పకుండా సభ్యులు ఇచ్చిన సూచనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం ఆ దిశగా కూడా ఆలోచన చేయడానికి ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరం లేదు.

గౌరవ సభ్యులు ప్రభాకరరావు గారు ఏదైతే సమాచారాన్ని అడిగారో దానిని తప్పకుండా గౌరవ సభ్యులందరికి మొత్తం సమాచారాన్ని on paper పంపించడం జరుగుతుందని తెలియజేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్ : అయన్న పాత్రుడు గారూ... గుంటూరు వాళ్లకు ముఖ్యంగా చిలకలూరిపేట వాళ్లకు రైతు సమస్యలు బాగా తెలుసు.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు ః అధ్యక్షా, నేను రాజకీయాలలోకి రాకముందు 1974 నుండి 1978 వరకు నాలుగు సంవత్సరాలు పూర్తిగా వ్యవసాయం చేశాను. నిక్కర్లు వేసినప్పుడే వ్యవసాయం చేశాను.

మిస్టర్ ఛైర్మన్ ః వ్యవసాయం చేసిన వారికి ప్రజా సమస్యల గురించి క్షుణ్ణంగా తెలుస్తుంది. Next, Question No.7301 (Sl.No.68) is postponed at the request of the Minister. Next question, Dr. Geyanand garu, please put your question.

## వృద్ధులకు బహిరంగ ఆశ్రమాలు

ప్రశ్న నెం.7430(69)

సర్వశ్రీ డా. ఎం. గేయానంద్, విటపు బాలసుబ్రహ్మణ్యం, ఎం.ఎల్.సి.లు.,

గౌరవనీయులైన మహిళాభ్యుదయం, శిశు సంక్షేమం, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) గ్రామీణ ప్రాంతాలలో వృద్ధుల కోసం ఓపెన్ షెల్టర్లను ఏర్పాటు చేసేందుకు ఏదైనా ప్రతిపాదన ఉన్నదా?

ఆ) వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

గౌరవనీయులైన మహిళాభ్యుదయం, శిశు సంక్షేమం, వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి (శ్రీమతి పీతల సుజాత):

అ) లేదండి.

ఆ) **1.** వయోవృద్ధుల కోసం సమీకృత కార్యక్రమం ః ప్రభుత్వేతర సంస్థల ద్వారా వృద్ధుల కోసం ప్రాజెక్టులను నిర్వహించేందుకు ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయడం కోసం 23 తాజా ప్రతిపాదనలు, 101 నవీకరణ ప్రతిపాదనలను 2013-14 సంవత్సరంలో కొత్త ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖకు పంపడమయింది.

**2.** ట్రిబ్యునళ్లు ః 2007, తల్లిదండ్రుల, వయోవృద్ధుల పోషణ, సంక్షేమం చట్టం క్రింద సబ్-డివిజన్లన్నిటిలో ట్రిబ్యునళ్లను ఆర్‌డిఓ పర్యవేక్షణలో ఏర్పాటు చేయడమయింది. జిల్లాలన్నింటిలో అప్పిలేటు ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయడమయింది.

అందిన దరఖాస్తులు – 297

జారీచేసిన పోషణ ఉత్తరువులు – 113

తిరస్కరించిన దరఖాస్తులు – 101

పెండింగులో ఉన్న దరఖాస్తులు – 83

**3.** పింఛనులు ః గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా 20,81,000 వృద్ధాప్య పింఛన్లను జారీ చేయడమయింది.

డా. ఎం. గేయానంద్ ః అధ్యక్షా, ఈ ప్రశ్నను అడిగినప్పుడు నేను ఏమనుకున్నానంటే.. ఈ ప్రతిపాదన ఉంది అని ప్రభుత్వం నుండి సమాధానం వస్తుందని అనుకున్నాను. ఎందుకంటే .. తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేసింది. ఎన్నికల మానిఫెస్టోలో కూడా పెట్టింది. మానిఫెస్టోలో ఉన్న విషయాన్ని ప్రభుత్వం గౌరవవిస్తుందా? లేదా? అమలు పరుస్తుందా? లేదా? జవాబు చెప్పాలి. తెలుగుదేశం ఎన్నికల మానిఫెస్టోలోని 49 వ పేజీలో ఉన్నది ఏమిటంటే.. వృద్ధులకు, అనాధలకు, రోగుల సహాయకులకు నైట్ షెల్టర్లను నిర్మిస్తాము. వృద్ధాశ్రమాల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలలను కేటాయిస్తాము. సీనియర్ సిటిజన్లకు ప్రతి నియోజకవర్గంలో ఒక వృద్ధాశ్రమాన్ని నిర్మిస్తాము. వృద్ధులకు చేయూతనిచ్చి ఆసరా పథకాన్ని రాష్ట్రంలోని అన్ని మున్సిపాల్టీలలో అమలు చేస్తాము. ఇంకా చాలా ఉన్నాయి. ఇవి వాళ్ల ఎన్నికల మానిఫెస్టోలో పెట్టి ప్రామిస్ చేశారు. నేను ఎందుకు ఈ ప్రశ్న వేశానంటే.. నేను అనంతపురం జిల్లాలో తిరుగుతున్నప్పుడు అక్కడ ఉండే ఒంటరి మహిళలు, ముఖ్యంగా దళితులు గ్రామాలలో బహిరంగ ప్రదేశాలు ఎక్కడా గ్రామాల్లో లేవు. ఎప్పుడైనా బయటకు వచ్చి కూర్చోవాలంటే మాకు ఇబ్బందిగా ఉంది. కొద్ది సేపు ఎవరితోనైనా మాట్లాడలన్నా, కొద్ది సేపు విశ్రాంతి తీసుకోలన్నా ఎటువంటి విశ్రాంతి భవనాలు మాకు లేవు కాబట్టి ఇటువంటివైనా కట్టిస్తే బాగుంటుందని వాళ్లు అభిప్రాయం చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వం వాగ్దానం చేసింది కాబట్టి తప్పనిసరిగా ఇటువంటి కార్యక్రమాలను వాళ్లు చేపట్టాల్సిన అవసరం ఉంది. వాళ్లు చేసిన వాగ్దానాన్ని తీర్చుకుంటారా? లేదా అనే విషయం గురించి చెప్పాల్సిందిగా కోరుతున్నాను.

శ్రీమతి పీతల సుజాత ః అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పినట్లు.. రాష్ట్రంలో 175 నియోజకవర్గాలలోనూ ప్రతి నియోజకవర్గానికి ఒకటి చేపడతామని చెప్పడం జరిగింది. దానికి సంబంధించి ప్రతిపాదనలను సిద్ధం చేయమని చెప్పడం జరిగింది. 175 వృద్ధాశ్రమాలను నిర్మించడానికి దాదాపు రూ.44.78కోట్లు అవుతుందని అంచనా వేయడం జరిగింది. త్వరలోనే వాటిని తప్పకుండా నిర్మిస్తామని తెలియజేస్తున్నాను.

## వార్షిక ప్రాతిపదిక కింద రహదారులు

ప్రశ్న నెం.7351(70)
శ్రీ బి. చంగల్ రాయుడు, ఎం.ఎల్.సి,

గౌరవనీయులైన రవాణ, రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలో రోడ్లు, భవనాల శాఖ వార్షిక ప్రాతిపదికపై కొన్ని రోడ్లను చేపట్టిందన్న విషయం వాస్తవమేనా?
ఆ) అయితే, చేపట్టిన పనుల వివరాలు ఏమిటి?

గౌరవనీయులైన రవాణ, రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి గారు (శ్రీ సిద్దా రాఘవరావు) ః

అ) అవునండీ.
ఆ) బిఓటి వార్షిక ప్రాతిపదికపై 9 పనులను చేపట్టమయింది. ఆ వివరాలను అనుబంధంగా సభా సమక్షంలో ఉంచడమయింది.

ప్రశ్న నెం. 7351 లోని (బి) ఖండానికి అనుబంధం

వార్షిక ప్రాతిపదికపై చేపట్టిన పనుల వివరాలు

| వరుస సంఖ్య | ప్రాజెక్టు పేరు | రోడ్డు పొడవు కి.మీ.లలో | ప్రాజెక్టు వ్యయం రూ. కోట్లలో | గుత్తేదారు పేరు |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 1. | బిఓటి వార్షిక ప్రాతిపదికపై కడప జిల్లాలోని పులివెందుల-రామిరెడ్డి పల్లి - పలగిరి మధ్య 2/5 కి.మీ. నుండి 27/6 కి.మీ. వరకు రెండులేన్ల క్యారేజ్‌వే రోడ్డు మెరుగుదల అప్‌గ్రేడింగ్ కోసం డిజైన్, నిర్మాణం, ఆర్థిక సహాయం, అమలు, నిర్వహణ. | 25.1 | 27.5 | మెస్సర్స్ బివిఎస్ఆర్ పిఆర్‌పి రోడ్డు ప్రాజెక్టుల ప్రైవేటు లిమిటెడ్. |
| 2. | బిఓటి వార్షిక ప్రాతిపదికపై కడప జిల్లాలోని రాయలపురం-గండ్లూరు మధ్య 12/0 కి.మీ. ల నుండి 28/0 కి.మీ. వరకు రెండు లేన్ల క్యారేజ్‌వే రోడ్డు మెరుగుదల, అప్‌గ్రేడింగు కోసం డిజైన్, నిర్మాణం, ఆర్థిక సహాయం, అమలు, నిర్వహణ. | 14.0 | 17.7 | మెస్సర్స్ ఎన్ఎస్‌పి వెరిగేట్ ఆర్‌జి రోడ్డు ప్రాజెక్టుల ప్రైవేటు లిమిటెడ్. |
| 3. | బిఓటి వార్షిక ప్రాతిపదికపై కడప జిల్లాలోని పులివెందుల-అల్వాల్ పాడు వెంపల్లి మధ్య 7/0 కి.మీ. ల నుండి 14/440 మరియు 19/786 కి.మీ నుండి 31/6 కి.మీ. వరకు రెండు లేన్ల క్యారేజ్‌వే రోడ్డు మెరుగుదల, అప్‌గ్రేడింగు కోసం డిజైన్, నిర్మాణం, ఆర్థిక సహాయం, అమలు, నిర్వహణ. | 19.60 | 24.5 | మెస్సర్స్ ఎస్ఆర్‌కె ఇన్‌ఫ్రాకాన్ (ఇండియా) ప్రైవేటు లిమిటెడ్. |

...3

| | | | | |
|---|---|---|---|---|
| 4. | బిఓటి వార్షిక ప్రాతిపదికపై కడప జిల్లాలోని పులివెందుల-అంబాక పల్లి- మురారి చింతల మధ్య 5/2 కి.మీ.ల నుండి 16/0 కి.మీ.వరకు రెండు లేన్ల క్యారేజ్‌వే రోడ్డు మెరుగుదల, అప్‌గ్రేడింగు కోసం డిజైన్, నిర్మాణం, ఆర్థిక సహాయం, అమలు, నిర్వహణ. | 16.00 | 19.54 | మెస్సర్స్ బివిఎస్ఆర్ పాం రోడ్డు ప్రాజెక్టుల ప్రైవేటు లిమిటెడ్. |
| 5. | బిఓటి వార్షిక ప్రాతిపదికపై కడప జిల్లాలోని పులివెందుల-పర్నాపల్లి మధ్య 4/0 కి.మీ.ల నుండి 20/0, 27/0 కి.మీ నుండి 31/5 కి.మీ. వరకు రెండు లేన్ల క్యారేజ్‌వే రోడ్డు మెరుగుదల, అప్‌గ్రేడింగు కోసం డిజైన్, నిర్మాణం, ఆర్థిక సహాయం, అమలు, నిర్వహణ. | 20.5 | 23.94 | మెస్సర్స్ ఎన్ఎస్‌పి వెరిగేట్ పి.పి. రోడ్డు ప్రాజెక్టుల ప్రైవేటు లిమిటెడ్. |
| 6. | కడప జిల్లా (కెపి-01) లోని కడప - పులివెందుల మధ్య 1/700 కి.మీ.ల నుండి 15/000 కి.మీ. వరకు 4 లేన్ల రోడ్డు. | 13.30 | 67.05 | మెస్సర్స్ ఎన్ఎస్‌పి కె.పి. రోడ్డు ప్రాజెక్టుల ప్రైవేటు లిమిటెడ్. |
| 7. | కడప జిల్లా లోని (కెపి-02) కడప - పులివెందుల మధ్య 15/000 కి.మీ.ల నుండి 28/000 కి.మీ. వరకు 4 లేన్ల రోడ్డు. | 13.00 | 51.15 | మెస్సర్స్ ఎన్ఎస్‌పిఆర్ కెపిటిడబ్ల్యుఓ ప్రాజెక్టుల ప్రైవేటు లిమిటెడ్. |
| 8. | కడప జిల్లా లోని (కెపి-03) కడప - పులివెందుల మధ్య 28/000 కి.మీ.ల నుండి 46/200 కి.మీ. ల వరకు 4 లేన్ల రోడ్డు. | 18.20 | 91.46 | మెస్సర్స్ బివిఎస్ఆర్ కె.పి. రోడ్డు ప్రాజెక్టుల ప్రైవేటు లిమిటెడ్. హైదరాబాదు. |

...4

-4-

| | | | | |
|---|---|---|---|---|
| 9. | కడప జిల్లా లోని (కెపి-04) కడప - పులివెందుల మధ్య 46/000 కి.మీ.ల నుండి 67/600 కి.మీ. ల వరకు 4 లేన్ల రోడ్డు. | 21.60 | 76.61 | మెస్సర్స్ ఎన్ఎస్‌పి కె.పి. రోడ్డు ప్రాజెక్టుల ప్రైవేటు లిమిటెడ్. హైదరాబాదు. |

శిద్దా రాఘవరావు,
రవాణా, రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి

శ్రీ బి. చంగల్ రాయుడు ః అధ్యక్షా, ఈ సభలో మాజీ ముఖ్యమంత్రి రోశయ్య గారిని గుర్తు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. వారు ఏమన్నారంటే.. జన్మతా నేను ప్రతి పైసాను లెక్కలు వ్రాసుకుంటాను, నాలుగు రాళ్లు కూడవేస్తానని చెప్పారు.

ఇక్కడ జరిగింది ఏమిటంటే.. ఒకటి నుండి ఐదు వరకున్న రోడ్లను గతంలో వేరే గ్రాంట్ల క్రింద, వేరే ఫండ్స్‌తో రోడ్లను వేశారు. వాటిని బిఓటి పద్దతిపై వార్షిక ప్రాతిపదికపై మరల తీసుకున్నారు. తరువాత 6,7,8 మరియు 9 రోడ్లు దాదాపు కడప నుండి పులివెందుల వరకు రూ.5కోట్లు యావరేజ్‌గా తీసుకొని రోడ్లను నిర్మించారు. దీనికి సంవత్సరానికి రూ.120 కోట్లు

చెల్లిస్తున్నారు. అలా 10 సంవత్సరాల పాటు చెల్లించాలి. దీనిపై టోటల్ పెట్టుబడి రూ.400కోట్లు అయితే సంవత్సరానికి రూ.120 కోట్లు చొప్పున 10 సంవత్సరాలకు దాదాపు రూ.1200కోట్లు చెల్లించాలి. ఇది ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 30 శాతం వడ్డీని చెల్లిస్తున్నారు. ఇంత వడ్డీ ఎక్కడా లేదు. ఇక్కడనే వార్షిక ప్రాతిపదికన తీసుకున్నారు. దయ ఉంచి ఈ ఒప్పందాన్ని ప్రభుత్వం సభ దృష్టికి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే.. ఎడిబి బ్యాంకు 6 శాతం వడ్డీకి ఇస్తోంది. నాబార్డు 9 శాతంతో ఇస్తోంది. వరల్డ్ బ్యాంక్ 6 శాతం వడ్డీకి ఇస్తోంది. ఇన్ని బ్యాంకులు అప్పులు ఇస్తూనే ఉన్నాయి. మనం తీసుకుంటూనే ఉన్నాము. అయినా పల్లెలకు సంబంధించిన రోడ్లను వేయడానికి కూడా వార్షిక ప్రాతిపదికన తీసుకున్నారు.

అధ్యక్షా, ఒక రోడ్డును వేసేటప్పుడు అక్కడ ఎంత ట్రాఫిక్ ఉందో చూచుకుంటారు. ఎన్ని వాహనాలు పోతున్నాయని చూస్తున్నారు. పల్లెలలో రోడ్లు వేయడానికి కూడా వార్షిక ప్రాతిపదికన తీసుకొని ఇంత పెద్ద ఎత్తున డబ్బును అనవసరంగా వెచ్చించారు. మీరు అగ్రిమెంట్‌ను తీసుకొని వెంటనే వాటిని రద్దు చేస్తే ప్రభుత్వం ఇప్పటి వరకు ఇచ్చిన డబ్బుతోనే ఆ అప్పు తీరిపోతుంది. దానిలో ఉన్న క్లాజ్ ప్రకారమే ఏదో ఒక బ్యాంకులో 6 శాతం వడ్డీ చొప్పున అప్పు తీసుకొని వాళ్ల అప్పులు తీర్చివేసి ఆ అసెట్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నాము.

అధ్యక్షా, కడప – పులివెందులకు డబుల్ లైనే పెద్దది. ఆ ప్రక్క, ఈ ప్రక్క వేరుశనగక్కాయలు, వరి కుప్పలు కొట్టుకుంటూనే ఉన్నారు. దీని గురించి నాకన్నా సతీష్ రెడ్డి గారికి బాగా తెలుసు. ఈ విధంగా వేసినటువంటి రోడ్లను మరల వేయడం, అవసరం లేకపోయినా నాలుగు లైన్ల రోడ్డును వేయడం, వార్షిక ప్రాతిపదికన తీసుకోవడం వంటి వాటి గురించి మంత్రి గారు క్లియర్‌గా స్టడీ చేయాలని కోరుతున్నాను. వీలుంటే స్వయంగా వెళ్లి చూచిరావాలని కోరుతున్నాను. దీనిలోని కంట్రాక్టర్ల పేర్లు చూస్తే అంతా ఒకళ్లవే. నాలుగు పేర్లు ఒక చోట. ఐదు పేర్లు ఒక చోట. ఆ సొత్తును వారికి అప్పగించేందుకే ఇది జరిగింది. తప్పనిసరిగా దీనిని రెవ్యూ చేయాలని కోరుతున్నాను. రెవ్యూ చేసి ప్రభుత్వ ధనాన్ని కాపాడాలి. ప్రభుత్వ ధనాన్ని ఉత్తరోత్తర అవసరమైన వాటికి ఖర్చు చేసేందుకు వినియోగించాలని కోరుతున్నాను. ప్రభుత్వం సంపాదించిన డబ్బునంతటిని రోడ్లకే ఖర్చు పెట్టారు. మంచి పని జరిగింది. ఆ రూ.200కోట్లు గాని, రూ.300కోట్లు కాని ఈ గ్రాంటులోనే వాళ్లకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ, సభాముఖంగా మీ దృష్టికి తీసుకువస్తున్నాను.

శ్రీ వెంకట సతీష్ కుమార్‌రెడ్డి సింగారెడ్డి ః అధ్యక్షా, గడచిన ప్రభుత్వంలో జరిగినటువంటి స్కాంలో ఇది కూడా ఒకటి అని చెప్పుకోవచ్చు. అంటే కడప నుండి పులివెందులకు వెళ్లే నాలుగు లైన్ల రహదారి. ఆ రోడ్డులో ఎటువంటి నాణ్యతా లేదు. ఈరోజుకు కూడా అక్కడ ట్రాఫిక్ తక్కువగా ఉన్నా రోడ్డు నాణ్యత సరిగా లేదు. ఒక రీచ్ అయితే ఈరోజుకు కూడా పూర్తి కాని పరిస్థితి ఉంది. మీరు ఆ వైపుకు వెళ్లినప్పుడు చూస్తే రోడ్డు మీదనే ఎన్‌క్రోచ్‌మెంట్లున్నాయి. కొన్ని బిల్డింగులు రోడ్డు మీదనే అలాగే ఉన్నాయి. దీనిని ఏ రకంగా చేశారో నాకు తెలియదు కాని నేనైతే ఆ అగ్రిమెంట్లను చూడలేదు. చంగల్‌రాయుడు గారు చెప్పినట్లు.. రూ.400కోట్లు ఖర్చు అయ్యే రోడ్డుకు సంవత్సరానికి రూ.120కోట్ల చొప్పున 10సంవత్సరాల పాటు చెల్లించాలంటే రూ.1200 కోట్లు అయ్యే పరిస్థితి ఉంది. ఇది చాలా దారుణమైన పరిస్థితి. దానిని రెవ్యూ చేసి అవకతవకలు

జరిగినట్లయితే చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. కొన్ని అగ్రిమెంట్లను చూస్తే ఒకసారి అగ్రిమెంటులోకి ఎంటర్ అయిన తరువాత వాటిని రద్దు చేయడం కష్టం. కాని, ప్రభుత్వ నార్మ్స్‌కు వ్యతిరేకంగా దానిని సూపర్‌సీడ్ చేసుకొని విపరీతమైన కుషన్ ఇచ్చినట్లయితే వెంటనే వాటిని తగ్గించుకునే విధంగా చేయవచ్చు కాబట్టి ఆ విధంగా చేయాలని మీ ద్వారా కోరుకుంటున్నాను.

శ్రీ బి. చంగల్ రాయుడు : అధ్యక్షా, ప్రతి అగ్రిమెంట్‌కు సంబంధించి జుట్టు ప్రభుత్వం చేతిలో ఉంటుంది. కాంట్రాక్టర్ల చేతిలో ఉండదు. ఇక్కడ చూస్తుంటే ప్రభుత్వం యొక్క జుట్టును కాంట్రాక్టర్ల చేతిలో పెట్టినట్లున్నది. కాబట్టి దానిని కూడా రెవ్యూ చేయాల్సిన అవసరం ఉంది. తప్పనిసరిగా ప్రభుత్వానికి రూ.800కోట్లు మిగిలించాల్సిన అవసరం ఉంది. ఈ సంవత్సరం ఎం.ఎల్.సీలకు, ఎం.ఎల్.ఏలకు నియోజకవర్గాల అభివృద్ధి నిధి క్రింద ఒక్క రూపాయి కూడా ఇచ్చేటట్లు ఏమీ కనబడడం లేదు. ఇవ్వని దానికి కూడా ఈ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఎందుకంటే ఈ హౌస్‌ను రాజశేఖర రెడ్డి గారు తీసుకువస్తే, రోశయ్య గారు మనకు తలా రూ.1.00 కోటి చొప్పున ఇచ్చారు. ఇప్పుడు పరిస్థితిని చూస్తుంటే సున్నా పెట్టేటట్లున్నది. ఈ రూ.800కోట్లను మిగిల్చి వాటిని సభ్యులకు తలా కోటి రూపాయలు ఇవ్వడానికి వీలవుతుందేమో పరిశీలించాల్సిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : అధ్యక్షా, ఇప్పుడు సతీష్ రెడ్డి గారు చెప్పినట్లుగా గత ప్రభుత్వంలోనే ఇలాంటి అవకతవకలు జరిగాయి. అసలు పెద్ద పొరపాటు ఎక్కడ జరిగిందంటే.. ఏదో అంటారు, నీవు పెట్టకపోయినా కుక్కను కట్టేయమని ఒక సామెత ఉంది. రోడ్లను వేయకపోతే వేయకపోయారు కాని ఉన్న రోడ్లను మరమ్మతులు చేయించమనండి. గత రోడ్ల గురించి కాంట్రాక్టర్లు ఎవరైతే ఉన్నారో వాటి మెయింటెనెన్స్‌ను వారే చేయాలి. వాళ్లు అంతు లేకుండా పోయారు. హౌస్ కమిటీలలో కూడా ఈ చర్చ చాలా సార్లు వచ్చింది. బయట ఇప్పటివరకు కూడా కనీసం రూ.1.00లక్ష ఖర్చు పెట్టి ఆ కాంట్రాక్టరు మెయిన్‌టెయిన్ చేయలేదు. కాని, చంగల్‌రాయుడు గారు అడిగినట్లుగా, రికార్డులను తెప్పించుకొని అదే కాంట్రాక్టర్లను ఎవరైతే నాణ్యత లేకుండా రోడ్లను వేశారో, ఎవరైతే డబ్బును దండుకొని అడ్వాన్సులు తీసుకొని వదలిపెట్టి వెళ్లిపోయారో, ఎవరైతే మెటీరియల్‌ను కూడా ఎత్తుకుపోయారో , ఎవరైతే ఈ రోడ్లను వేసి తరువాత మెయిన్‌టెయిన్ చేయకుండా ఎగనామము పెట్టి అసలు ఎక్కడా కనిపించకుండా పోయారో వాళ్ల మీద చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన రోడ్లే కాకుండా పెద్ద, పెద్ద నగరాలలో కూడా ఆర్ అండ్ బి సంబంధించి లింక్ రోడ్లు చాలా ఉన్నాయి. వీటన్నింటి మీద చర్యలు తీసుకోవాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకోబోతున్నది? వాళ్లను మాత్రం ఎవరైతే తప్పు చేశారో వాళ్లను ఆ కంట్రాక్టర్లను తొలగించమని మీ ద్వారా అడుగుతున్నాము.

శ్రీమతి పి. శమంతకమణి : అధ్యక్షా, ఈ మధ్య కాలంలో బోగ సముద్రం నుండి అనంతపూర్‌కు 4 లైన్ల రోడ్డును వేస్తున్నారు. ఆ రోడ్డు ఏ విధంగా ఉందంటే.. మెయిన్ కాంట్రాక్టరు నుండి ఇప్పటికి నాలుగో సబ్–కాంట్రాక్టరు ఫీల్డ్‌లో ఉన్నారు. ఆ రోడ్డు ఎలాంటి నాణ్యత లేకుండా ఉంది. ఆ రోడ్డును వెడల్పు చేయడానికి అనేకమంది పేదల యొక్క ఇళ్లను పడగొట్టాలనేది ఒక ప్రతిపాదన ఉంది. ఇప్పటి వరకు ఆ పేదలకు ఒక్క రూపాయి నష్టపరిహారం రాలేదు. అందువల్ల చాలా చోట్ల ఇళ్లన్నీ రోడ్లమీదనే ఉన్నాయి. సరైన విధంగా ఆ రోడ్డు రావడం లేదు.

ఉ.11.20

ఆ విద్యుత్తు పోల్స్ ప్రభుత్వానికి సంబంధించినవి. అయినా కాంట్రాక్టర్లు వాటిని అమ్ముకుంటున్నారు. నాణ్యతగల రోడ్లు వేయవలసిందిగా కాంట్రాక్టర్లకు తగు ఆదేశాలు ఇవ్వాలని, ఇళ్లు నష్టపోయిన పేదలకు నష్టపరిహారం ఇవ్వాలని కరెంట్‌పోల్స్‌ను కాపాడవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ సిద్ధారాఘవరావు : గౌరవ సభ్యులు మాట్లాడిన అంశాలపై గత ప్రభుత్వ హయాంలో జరిగిన అన్యాయాలపై ఫైల్స్ తెప్పించుకుని అధ్యయనం చేసి ఏ విధమైన చర్యలు తీసుకోవాలో చూసి ఆ విధంగా తగు చర్యలు తీసుకుంటామని మనవి చేస్తున్నాను. అవసరమైతే ఆ సొమ్ముని రాబట్టి, కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెడతామని తెలియచేస్తున్నాను. సోదరి శ్రీమతి పమిడి శమంతకమణి రోడ్లు బాగాలేదని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో క్వాలిటీ కంట్రోల్ విభాగం సరిగ్గా పనిచేయలేదు. ఇప్పటినుండి ప్రతి రోడ్డును చెక్ చేసి, క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికేట్ ఇస్తేనే అధికారికంగా ముందుకు వెళ్లడం జరుగుతుంది. ఈ విషయమై నేను ఇప్పటికే అధికారులకు ఆదేశమిచ్చాను. నాబార్డు, వరల్డ్ బ్యాంకు నిధులకు సంబంధించి ఏ హెడ్ ఆఫ్ అకౌంట్‌లో ఎంత ఉందనే వివరాలు తెప్పించుకుని ప్రజాసొమ్ముని దుర్వినియోగం కాకుండా కాపాడతామని సభాముఖంగా తెలియచేస్తున్నాను.

శ్రీ కె.వి.వి. సత్యనారాయణరాజు : అధ్యక్షా, రాజమండ్రి దివాన్ చెరువు నుండి కొవ్వూరు మీదుగా నాలుగవ బ్రిడ్జి పనులను గామన్ ఇండియాకు అప్పగించారు. వర్క్ చాలావరకు పూర్తయింది. అందుకు గాను ఒకపక్క ఒకటిన్నర ఎకరం, మరోపక్క ఒకటిన్నర ఎకరాలు పనికోసం దాదాపు రూ.1200కోట్లు ఖర్చయింది. ఈ విషయమై జిల్లా కలెక్టరుగారితో కూడా మాట్లాడడమైనది. రానున్న పుష్కరాలలోపు మిగతా పని కూడా పూర్తిచేసుకుంటే బాగుంటుంది. ఆ బ్రిడ్జి గనక పూర్తయితే రాజమండ్రి నుండి విజయవాడకుగానీ, గుంటూరు గానీ వెళ్లడానికి 65కి.మీ. దూరం తగ్గుతుంది. గౌరవ మంత్రిగారు చొరవతీసుకుని త్వరగా పూర్తిచేయాలని కోరుతున్నాను.

శ్రీ సిద్ధా రాఘవరావు : సుమారు 20 రోజుల క్రితం నేను ఆ బ్రిడ్జిని సందర్శించడం జరిగింది. గామన్ ఇండియాకు సంబంధించిన ఇంజనీర్లతో కూడా మాట్లాడాము. ఎట్టి పరిస్థితులలోనూ వచ్చే సంవత్సరం మార్చినాటికి పూర్తిచేస్తామని వారు హామీ ఇచ్చారు. సంబంధిత ఈఎన్‌సి కూడా స్ట్రిక్ట్‌గా ఈ పనిమీదనే ఉన్నారు. జులై, 2015లో గోదావరి పుష్కరాలు వస్తున్నాయి. ఆ లోగా పూర్తిచేయాలని చెప్పాము. దానిపై స్పెషల్ డ్రైవ్ పెట్టి చిన్న చిన్న సమస్యలను రెక్టిఫై చేసి ఎట్టి పరిస్థితులలోనూ వచ్చే సంవత్సరం మార్చి లేదా ఏప్రియల్ నాటికి ఆ బ్రిడ్జిని ఆవిష్కరిస్తామని గౌరవసభ్యులకు మనవిచేస్తున్నాను.

MR. CHARIAMAN: Now, the House is adjourned for Tea Break for 15 minutes.

(Then, the House, adjourned for Tea Break at 11-24 a.m.)

* * *

ఉ.11.50

**(AFTER TEA BREAK, THE HOUSE RE-ASSEMBLED AT 11-51 A.M.)**
**(HON'BLE CHAIRMAN IN THE CHAIR)**

*** * ***

## 2014-15 బడ్జెట్‌పై నాల్గవ రోజు సాధారణ చర్చ

MR. CHAIRMAN: There is a list of 21 Members to take part on the Budget.

SRI B. CHANGAL RAYUDU: It is very good sign for the democracy. We have to discuss, debate and decide. సభలో ఇంకా ఎంతమంది మాట్లాడితే అంత మంచిది.

శ్రీ ఎం. సుధాకర్‌బాబు (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, ఈ సభలో ఎంత చర్చ జరిగినా, అందరికీ ఉపయోగపడేవిధంగా మాట్లాడి, ప్రభుత్వానికి సూచనలు చేసినా వాటి గురించి ఏ పత్రికలోగానీ, టెలివిజన్ ఛానల్‌లోగానీ రావడం లేదు. ఆ సభలో అరుచుకుంటూ, కొట్లాడుకుంటూ, రౌడీలు, గూండాలు, నరహంతకులు అని అనుకుంటే అవి హెడ్‌లైన్లలో వస్తున్నాయి. మంచిగా మాట్లాడితే పత్రికల్లో ప్రచురించరా సర్?

Mr. CHAIRMAN: Press gallery is full always .

శ్రీ ఎం. సుధాకర్‌బాబు: అధ్యక్షా, ప్రెస్ గ్యాలరీ ఫుల్, రిపోర్టింగ్ నిల్. సభ్యులు శ్రీ పి.జె.చంద్రశేఖరరావుగారు, శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం గారు మరియు ప్రతి ఒక సభ్యుడు ఈ సభలో ఎంతో బాగా మాట్లాడుతున్నారు. ఎంతో మంచిగా సభలో మాట్లాడేవారి పేర్లు కూడా ప్రెస్‌లో రాకపోతే చాలా ఇబ్బందిగా ఉంటుంది సర్. దయచేసి ఈ విషయంలో తమరు చొరవ తీసుకోవాలి.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి: అధ్యక్షా, సభ్యులు శ్రీ సుధాకర్‌బాబు గారు చెప్పిన విషయం ఎంత నిజమంటే, మేము గత నాలుగైదు సంవత్సరాల నుంచి ఈ విషయం గురించి మేము మొత్తుకుంటూనే ఉన్నాము. గ్యాలరీలో చాలా శ్రద్ధగా వారు కూర్చుని, అన్ని విషయాలూ వ్రాసుకుని, వారి యాజమాన్యానికి పంపుతున్నారని నేను భావిస్తున్నాను. పత్రికా ప్రతినిధులు శాసనసభలో కంటే శాసనపరిషత్తు ఆవరణలో మరియు ఈ సభలో కూడా చాలా శ్రద్ధగా కూర్చుంటున్నారు. కానీ ఎందుకో తెలియదు, సభ్యులు ఎంత మంచిగా మాట్లాడినా, ఎంత మంచి ప్రశ్న వేసినా, అనుబంధ ప్రశ్న వేసినా ఎక్కడా కూడా వాటి గురించి ప్రచురించడం లేదు. ఒక పత్రికలో అయితే కనీసం ఒక వాక్యం కూడా ఉండదు. ఇది చాలా అన్యాయం. నిజంగా పెద్దల సభను గౌరవించడం లేదు. ఇక్కడందరూ సీనియర్ సభ్యులు, మహిళలు ఉండి చక్కగా మాట్లాడడం జరుగుతోంది. ఎవరూ పోట్లాడుకోవడం లేదు. ఈ సభలో ఒక పద్ధతిగా మాట్లాడుకోవడం జరుగుతోంది. ఇది ఈనాటిదే కాదు, మొట్టమొదటి నుంచీ ఈవిధంగానే జరుగుతూ ఉంది. ఎందుకిలా జరుగుతుందనేది వారికి తమరిద్వారా నేను విన్నవించుకుంటున్నాను.

మరొక విషయం, గత ప్రభుత్వంలోనూ మంత్రులు సభలో కూర్చోలేదు. ఈ ప్రభుత్వంలోనూ మంత్రులు సభలో కూర్చోవడం లేదు. ఈ సభకు ఏ మంత్రులను అలాట్ చేశారో వారిని కనీసం ఈ సభకు హాజరవమని చెప్పండి. నిన్న సభ్యులు శ్రీ బాలసుబ్రహ్మణ్యంగారు సభలో చాలా చక్కగా మాట్లాడారట. నాకు నిజంగా ఆరోగ్యం బాగాలేక నిన్న సభలో లేనందుకు చాలా బాధపడుతున్నాను.

మిస్టర్ ఛైర్మన్: శ్రీ బాలసుబ్రహ్మణ్యంగారు మాట్లాడింది హిందూ పేపర్‌లో వచ్చింది.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి: అధ్యక్షా, సభలో మాట్లాడింది అన్ని పత్రికలలో రావాలి. ఆ సభలో పోట్లాడింది కూడా రాస్తున్నారు, ఈ సభలో మాట్లాడింది కూడా ప్రచురించకపోవడం నాకు అర్థం కావడంలేదు. ఈ సభకు మంత్రులు కూడా తప్పకుండా హాజరు కావాలి. మాకు ఆరోగ్యం బాగా లేకపోయినప్పటికీ మేము సభకు హాజరవుతున్నాము.

శ్రీ రుద్రరాజు పద్మరాజు: అధ్యక్షా, ప్రెస్ గ్యాలరీలో కూర్చున్నటువంటి పాత్రికేయ సోదరులందరూ సభ్యులు మాట్లాడే తీరు, హాస్యపు జల్లుల వల్ల తన్మయత్వం పొందడంతో సభలో జరిగిన విషయాలను రాయడం మర్చిపోతున్నారని నేను అనుకుంటున్నాను. ఈ సభలో మాట్లాడే ప్రతి సభ్యుడూ చాలా చక్కగా ఎంతో అధ్యయనం చేసి, గణాంకాలను ఇస్తూ, మధ్యమధ్యలో హాస్యోక్తులతో చక్కగా జరుగుతున్న ఈ సభను చూసి వారు కూడా మైమరిచిపోయి రాయడం మర్చిపోతున్నారని నేను భావిస్తున్నాను. నాకు ఇక్కడున్న పాత్రికేయులు చాలా మంది వ్యక్తిగతంగా కూడా తెలుసు. వారు బాగానే రాస్తారు కానీ వారి యాజమాన్యాలు ఈ సభమీద శీతకన్ను వేసినట్లుగా నాకనిపిస్తోంది. సంబంధిత పత్రికా సంపాదకులతో తమరు ఒక సమావేశాన్ని ఏర్పాటుచేసినట్లయితే శాసనపరిషత్తుకు కూడా శాసనసభతో పాటు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని నేను కోరుకుంటున్నాను.

MR. CHAIRMAN: We will meet the press people during working lunch. Before talking to their Managements, let us talk to the journalists here first, because they are always attending here in full. We appreciate their sincerity for being present in the gallery. We will have a working lunch with them. I think that is the solution.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు: అధ్యక్షా, సభ్యులు చెప్పింది వాస్తవమే. శాసనసభ కంటే శాసనపరిషత్తుకు ప్రాధాన్యత తక్కువ ఉన్నమాట నూటికి నూరుశాతం వాస్తవమే. ప్రొటోకాల్ ప్రకారం కూడా ప్రాధాన్యత కలిగిన సభ ఇది. కనుక తప్పకుండా మీడియాలో కూడా ఈ సభ గురించి ఫోకస్ రావడం కూడా అవసరం. సభ్యులు ప్రజా సమస్యలపై సభలో మాట్లాడినట్లు, వాటిపై ప్రభుత్వం యొక్క స్పందన కూడా వారు ప్రాతినిధ్యం వహించే ఆ ప్రాంతాలకు వెళ్లవలసిన అవసరముంది. ఈ సభకు ప్రాముఖ్యత ఇవ్వవలసిన బాధ్యత కూడా అధ్యక్షులవారిపై ఉంది.

శ్రీ సి.హెచ్. అయ్యన్నపాత్రుడు: అధ్యక్షా, స్వర్గీయ శ్రీ ఎన్.టి.రామారావు గారి మంత్రిమండలిలో నేను పనిచేయడం జరిగింది. నాకు శాసనపరిషత్తుకు వచ్చి సమాధానం చెప్పే అవకాశం గతంలో రాలేదు. నాకు ఈ సారి ఆ అవకాశం వచ్చింది. నేను గత మూడు రోజులుగా ఈ సభలో చూస్తూనే ఉన్నాను. ఈ సభలో సభ్యులంతా మంచి సలహాలు, సూచనలు, సద్విమర్శలతో చాలా చక్కగా మాట్లాడుతున్నారు. ఒక అర్థవంతమైన చర్చ ఈ సభలో జరుగుతోంది. ఆ సభకు, ఈ సభకు చాలా తేడా ఉంది. ఆ సభలో విమర్శలే తప్ప సలహాలు లేవు.

(సభలో హర్షధ్వానాలు)

ఈ సభకు హాజరవుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. మంత్రిగా ఏరకంగా చేయాలనేది మాకు కూడా కొన్ని కొత్తకొత్త విషయాలు, సలహాలు, పరిష్కారాలను ఈ సభలో సభ్యులు ఇవ్వడం జరుగుతోంది. సభ్యులు ఇచ్చే సలహాలు కూడా ప్రజల్లో చర్చకు రావాలంటే మీడియా సహకారం కూడా కావాలి. మీడియా సోదరులు కూడా సహకరించవలసిన అవసరముంది. వారితో భోజన విరామ సమయంలో ఒక సమావేశాన్ని ఏర్పాటుచేసి ఈ సభయొక్క ప్రాముఖ్యతను వారికి చెప్పినట్లయితే తప్పకుండా వారు కూడా సహకరిస్తారని నేను అనుకుంటున్నాను.

మ.12.00

శ్రీ రుద్రరాజు పద్మరాజు : అధ్యక్షా ఆర్థిక శాఖ మంత్రి శ్రీ యనమల రామకృష్ణుడు ప్రవేశపెట్టినటువంటి బడ్జెట్‌కు నూతన రాష్ట్ర ఆవిర్భావం తరువాత ఒక ప్రత్యేకమైనటువంటి గౌరవము, ప్రతిపత్తి కలిగిందని నేను భావిస్తున్నాను. ప్రప్రథమంగా ఈ బడ్జెట్ ప్రవేశ పెట్టినటువంటి ఆర్థిక శాఖ మంత్రి గారికి నా హృదయ పూర్వక అభినందనలు తెలియజేసుకుంటున్నాను. ఎందు చేతనంటే, నూతన రాష్ట్రం ఏర్పడిన తరువాత దానికి ఉన్నటువంటి ఇబ్బందులు గాని, సమస్యలు గాని వీటన్నింటి క్రోఢీకరించి బడ్జెట్ లో కేటాయింపులు చేయడం అనేటువంటిది కత్తి మీద సాములాంటిది అని మీ దృష్టికి తీసుకువస్తున్నాను. నాడు మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్ర రాష్ట్రం విడి పోయినప్పుడు ప్రప్రథమంగా తెన్నేటి విశ్వనాథం గారు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అదే విధంగా 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పుడు బెజవాడ గోపాల రెడ్డి గారు బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. ఏది ఏమైనప్పటికీ కొత్త రాష్ట్రం ఏర్పడిన తరువాత శ్రీ యనమల రామకృష్ణుడు గారికి ఆ ప్రత్యేమైన గౌరవం దక్కింది. శ్రీ యనమల రామకృష్ణుడు గారు ప్రవేశపెట్టినటువంటి ఈ బడ్జెట్ చాలా భారీ బడ్జెట్. దాని పరిమాణం చూసినట్లయితే రూ.1,11,824 కోట్లతో ప్రవేశ పెట్టరు. కాని వాస్తవంగా చూసినట్లయితే ఏప్రిల్, మే మాసాలకు కూడా ఇందులో పొందు పరచినట్లుగా కనిపిస్తుంది. నాడు సమైక్య రాష్ట్రంలో ఉన్నాం కాబట్టి మనం దాని మొత్తం ఇక్కడ పొందు పరచవలసిన ఆవశ్యకత లేదు. అది కూడా మనము లెక్క వేసుకున్నట్లు అయితే రూ.98127 కోట్లు మాత్రమే ఉంటుందని చెప్పి సభ దృష్టికి తీసుకొని వస్తున్నాను. ఇందులో రూ.30,000 కోట్లు తీసేసినట్లయితే, అది సుమారు రూ.80,000 కోట్లు మాత్రమే అని సభ దృష్టికి తీసుకు వస్తున్నాను. ఆర్థిక శాఖ మంత్రి ప్రవేశపెట్టినటువంటి ఈ బడ్జట్ 54 పేజీల సుదీర్ఘ బడ్జెట్. ఈ బడ్జెట్‌ను ఆసాంతం, అమూలాగ్రం నేను అధ్యయనం చేశాను. దీన్ని పరిశీలించి చూస్తే ఇందులో “అంకెల గారడీ” ఒక ప్రక్క “అరచేతిలో స్వర్గం” చూపినట్లుగా మరొక ప్రక్క కనిపించింది గాని ఇది వాస్తవానికి ఆచరణ సాధ్యం కాదేమోనని ఒక శంక నా మదిలో మెదిలింది.

బడ్జెట్‌లో ప్రణాళికేతర వ్యయం రూ.85,151 కోట్లు గానూ, ప్రణాళికా వ్యయం క్రింద రూ.26,673 కోట్లుగానూ పొందుపరిచారు. ప్రణాళికా వ్యయం యొక్క శాతాన్ని చూసినట్లయితే చాలా కుంచించుకుపోయినట్లుగా అనిపిస్తుంది. ప్రణాళికేతర వ్యయం ఒక శిఖరం లాగా ఉంది. గడచిన పది సంవత్సరాల్లో ప్రణాళికా వ్యయం సరాసరి 36 శాతం కాగా ప్రత్తం అది 26 శాతానికి కుంచించుకు పోయింది. 54 పేజీల బడ్జెట్‌లో మొదటి 10 పేజిలలో గడచిన 10 సంవత్సరాలలో గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల ఆర్థిక పరిస్థితి ఛిన్నాభిన్నం అయిందని వివరించారు. ఇది చాలా దురదృష్టకరం. ఈ రోజు రాష్ట్రం చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఆర్థిక వ్యవస్థలో రెవెన్యూ

లోటు ఉన్న పరిస్థితుల్లో ఏ విధంగా ముందు వెళ్లాలనే ఆవేదన, ఆత్రుత మీకే కాదు మాకు కూడా ఉంది. కానీ 1994 నుంచి 2004 వరకు ఆర్థిక వ్యవస్థ ఏవిధంగా ఉందనే విషయాన్ని గమనించినట్లయితే ఆరేడు సంవత్సరాలు కరువు కాటకాలను ఎదుర్కొన్న రాష్ట్రం ఎన్ని ఇబ్బందులు పడిందో నాకూ తెలుసు దాని గురించి మిమ్మల్ని ప్రత్యేకంగా ఎటువంటి వ్యాఖ్యలు చేయడం లేదు. కానీ ఆ రోజుల్లో మేము ప్రభుత్వంలోకి వచ్చిన తరువాత పట్టాలు తప్పిన ఆర్థిక వ్యవస్థను మరలా సజావుగా గాడిలో పెట్టడానికి మేము చేసిన కృషిని మీరు అభినందించి ఉంటే నేను కూడా సంతోషపడే వాడిని. ఆ రోజుల్లో సాలీనా 320 రోజులు ఓవర్ డ్రాఫ్ట్ కానీ, వేస్ అండ్ మీన్స్ కానీ వాడుకున్న మీ ప్రభుత్వం దాన్ని మరచిపోవడం, ఆర్థిక వ్యవస్థ అంతా మా హాయాంలోనే చిన్నాభిన్నమైందని చెప్పడం అత్యంత శోచనీయం, గర్హనీయం అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఆ విషయం ప్రక్కన పెడితే, ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు చాలా అపారమైన అనుభవం కలిగిన వారు తొమ్మిది సంవత్సరాలు రాష్ట్ర ముఖ్యమంత్రిగా, పది సంవత్సరాలు ప్రతిపక్ష నాయకుడుగా ఆపారమైన అనుభాన్ని సంపాదించారు. అందుకే ఈ రాష్ట్ర ప్రజలు మీకు అధికారం ఇవ్వడం జరిగింది. దాన్ని సద్వినియోగం చేసుకోవలసిన అవసరం ఉందని తెలియజేస్తున్నాను. మీరు చేసిన 3000 కిలో మీటర్ల పాద యాత్రలో ఆయా జిల్లాలోని రైతుల ఆవేదను చూచి రైతాంగానికి చేసిన హామీలను గుర్తుచేసుకోవలసిందిగా మిమ్ములను కోరుతున్నాను. 2012 -13లో వచ్చిన నీలం, ఫైలిన్, లెహర్ వంటి తుఫానుల పరంపరతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో, అగమ్యగోచర పరిస్థితుల్లో, మీరు వారిని ఆదుకునే విధంగా ఒక వాగ్దానం చేశారు. నేను వచ్చి మీ రుణాలను మాఫీ చేస్తాను, మీరు తీసుకున్న రుణాలు చెల్లించద్దని వారికి విశ్వాసాన్నిచ్చారు. కనుక ఆ ప్రజలే మీకు అవకాశం ఇచ్చారు. ప్రస్తుతం 4.94 కోట్ల మంది రైతాంగం మీ వైపు ఆశతో ఎదురు చూస్తున్నారు. వారి “ఆశలను అడియాశలు” చేస్తారా? లేదా సఫలీకృతం చేస్తారా అనే విషయమై, ఏ విధమైన పరిష్కారాన్ని మీరు చూపుతారా అని ఆత్రంగా ఎదురు చూసే వ్యక్తుల్లో నేనూ ఒకడిని. దానిపై మీరు ఆత్మ విమర్శ చేసుకోవలసిన అవసరం ఉంది. నాడు మీరు చేసిన వాగ్దానం ప్రకారం రుణ మాఫీ లక్షా రెండు కోట్లు. అయితే, అది రైతులకు, డ్వాక్రా గ్రూపు మహిళలకు, చేనేత కార్మికులకు కలిసి కావచ్చు. అందరికీ మీరు పూర్తి రుణ మాఫీ చేస్తామని వాగ్దానం చెప్పినప్పటికీ, ఇప్పుడున్న పరిస్థితుల్లో మీరు చేస్తున్న అది సాధ్యం కాని పరిస్థితుల్లో రుణ మాఫీనా అర్థ రుణ మాఫీనా, లేక పావు రుణ మాఫీనా అనేది కూడా మీరు చెప్పాలి.

మ 12.10

ఏది ఏమైనప్పటికీ కూడా ఒకసారి గుర్తు చేయడానికి మాట్లాడుతున్నానే తప్ప విమర్శ చేయడానికి మాట్లాడడంలేదు. అతిశయోక్తో, అక్కసుతోనో, అధికారంలో లేమనే ఉద్దేశంతోనో మాట్లాడడంలేదని దయచేసి అందరూ గమనించాల్సిందిగా కోరుతున్నాను. ఈరోజు ఖరీఫ్ ప్రారంభమై నాట్లు వేసుకునే పరిస్థితి ఉన్నప్పటికీ బ్యాంకులకు వెళితే కనీసం రుణ సౌకర్యం కూడా కల్పించలేని దయనీయమైన దుస్థితిలో ఉన్నాము. ఇంక రైతాంగాన్ని అదుకోవడానికి ఇంకా మీనమేషాలు లెక్కిస్తూ రేపు చేస్తాం, ఎల్లుండి చేస్తాం అని చెప్తోంటే ఈ రైతాంగం యొక్క గోడు వినే వారు ఎవరు అని అడుగుతున్నాను. అదే విధంగా డ్వాక్రా గ్రూపుల రుణమాఫీలను లక్ష రూపాయలకే మీరు పరిమితం చేశారు. మరి దానిని త్వరలో చేయండని చెప్పి ఈ సందర్భంగా మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఇకపోతే ఇన్సూరెన్స్ విషయంలో సాధారణంగా “ఇన్‌పుట్ సబ్సిడీ కానీ, ఇన్సూరెన్స్ కానీ” రైతులకే గతంలో ఇవ్వడం జరుగుతూ ఉండేది. కానీ ఈ ప్రభుత్వంలో ఇన్‌పుట్ సబ్సిడీ కానీ, ఇన్సూరెన్స్ కానీ ప్రభుత్వానికి జమ చేయడంలో ఆంతర్యమేమిటో అక్కడున్నటువంటి వ్యవసాయశాఖామంత్రిగారికి తెలుసని నేననుకుంటున్నాను. వారు సమాధానంలో చెప్తారని నేను భావిస్తున్నాను. వ్యవసాయ ఆధారమైనటువంటి మన రాష్ట్రంలో ఈనాడు 70 శాతం మంది రైతాంగం ఉన్నారు. వారికోసం మీరు పట్టించుకోవాలని ఈ సందర్భంగా నేను తెలియజేస్తున్నాను. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షంలో ఉన్న మీరు రెండు నాల్కల ధోరణితో మీరు మాట్లాడడం జరిగింది. ఈ రాష్ట్రంలోని కృష్ణా, గోదావరి, పెన్నాలాంటి జీవనదుల ద్వారా 1,01,60,000 ఎకరాలకి నీరు అందడంవల్ల ఈరోజు రాష్ట్రంలో ఉన్న ప్రజానీకానికి రెండుపూటలా తిండి తినడానికి అవకాశం కల్పించింది. ఆ జీవనదులు ఈ రాష్ట్రానికి వరదాయని అని చెప్పవచ్చు. కోట్లాది రూపాయలు వెచ్చించి చేసిన జలయజ్ఞాన్ని ధనయజ్ఞం అంటూ, ఇన్ని వేల కోట్ల రూపాయలను మీరేమి చేశారని మామీద అభాండాలు కూడా వేశారు. కానీ ఈ బడ్జెట్‌లోని గణాంకాలు చూడండని ఒక్కసారి గుర్తుచేస్తున్నాను.

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి రు.80,300 కోట్ల రూపాయలతో ప్రారంభించినటువంటి 54 భారీ, మధ్య తరహా, చిన్న తరహా ప్రాజెక్టులలో ఇప్పటికే 13 ప్రాజెక్టులు పూర్తి కాగా, 14 ప్రాజెక్టులు పాక్షికంగా నీటిని కూడా అందిస్తున్నాయి. 2014-15 సంవత్సరానికి మరొక 11 ప్రాజెక్టులు 2.42 లక్షల ఎకరాలకు అదనపు ఆయకట్టు కానీ, స్థిరీకరణ కానీ కల్పించే అవకాశముంది. అదే విధంగా పూర్తయిన ఆ 13 ప్రాజెక్టులతో 11.88 లక్షల ఎకరాలకు అదనపు నీటిపారుదల ఆయకట్టు కలుగుతోందనేది వాస్తవం కాదా అని అడుగుతున్నాను. అదే విధంగా 3.00 లక్షల ఎకరాలకు స్థిరీకరణ అంటే 15 లక్షల ఎకరాలు ఆయకట్టుగా వస్తున్నటువంటి పరిస్థితి. ఈ సంవత్సరాంతానికి 2.3 లక్షల ఎకరాలు అదనపు ఆయకట్టుకు, అదే విధంగా 39,500 ఎకరాలకు స్థిరీకరణ కూడా జరుగుతుందనేది వాస్తవమని మీ దృష్టికి తీసుకువస్తున్నాను.

ఈ రాష్ట్రంలో సంక్షేమానికి సంబంధించి మరీ ముఖ్యంగా దళితులకు, గిరిజనులకు ఒక ప్రత్యేకమైన చట్టం కల్పించాలనే ఉద్దేశంతో నాడు యావత్ భారతదేశంలో ఎక్కడా లేని విధంగా షెడ్యూల్ కులాలు, తెగలకు సంబంధించి ఒక ప్రత్యేకమైనటువంటి చట్టాన్ని ఏర్పాటు చేసి జనాభా దామాషా ప్రకారం వారికి కేటాయింపులు చేసి వారు విద్య, వైద్య సామాజికంగా అగ్రవర్ణాలతో సమానంగా ముందుకు తీసుకువెళ్ళాలనే ఆకాంక్షతో ఎస్.సి, ఎస్.టి ఉప ప్రణాళికను పెట్టడమనేది మీకందరికీ తెలిసిందే. ఈ రాష్ట్రంలో షెడ్యూల్ కులాల వారు 84.45 లక్షలు, అంటే జనాభాలో వారు 17.1 శాతమున్నారు. అలాగే షెడ్యూల్ తెగలకు సంబంధించి 26.31 లక్షలు అంటే జనాభాలో 5.33 శాతం ఉన్నారు. కానీ బడ్జెట్‌లో ఎస్.సిలకు రు.2,657 కోట్లు, ఎస్.టిలకు రు.1,150 కోట్లు మాత్రమే కేటాయింపులు చేశారు. జనాభా దామాషా ప్రకారం వారికి కేటాయింపులు జరగలేదని ఈ సందర్భంగా నేను గుర్తుచేస్తున్నాను. నేనేదైనా తప్పు చెప్పినట్లయితే సరిచేసుకుంటాను. దానిలో ఏ విధమైన అనుమానంలేదు. ఇక మరీ ముఖ్యంగా చూసినట్లయితే ఏ దళితులకోసం, ఏ అభాగ్యులైన బలహీన వర్గాల కోసం ఈ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందో వారి అభ్యున్నతికి జనాభా దామాషా ప్రకారం కచ్చితంగా కేటాయింపులు చేసి ఉండాలి. కానీ ఆ విధంగా జరగలేదు.

ఇకపోతే నిత్యావసర వస్తువుల ధరలు అదుపులో లేవు. రాష్ట్రంలో అవి ఆకాశాన్నంటుతున్నాయి. వాటిని అదుపు చేస్తామని వాగ్దాన పత్రంలో చెప్పారు. వాస్తవానికి బడ్జెట్‌లో మార్కెట్ ఇంటర్వెన్షన్‌కెంత కేటాయించారో లేకపోవడమనేది ప్రభుత్వానికెంత చిత్తశుద్ధి ఉందో తెలుస్తోంది. ఈ నిత్యావసర వస్తువుల్ని గోడౌన్లలో దాచి సామాన్యుడికి అందుబాటులో లేకుండా చేయడంద్వారా కనీసం రెండు పూటలా కూడా తినే అవకాశం కూడా కల్పించలేని ఈ దొంగలందర్నీ కూడా పారద్రోలాలని కూడా మీకు తెలియజేస్తున్నాను. మార్కెట్ ఇంటర్వెన్షన్‌కు నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

ఇక మరీ ముఖ్యంగా పేదలకు సంబంధించిన గృహనిర్మాణానికి రు.808 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. అభినందనీయమే. రాష్ట్రంలో ఇప్పటికే 65 లక్షల ఇళ్ళ నిర్మాణం జరిగింది. మరొక 5 లక్షలు వివిధ స్థాయిలలోనూ, ఇంకొక 7 లక్షలు ఇంకా ప్రారంభించాల్సిన దశలోనూ ఉన్నాయి. వీటికి రు.808 కోట్లు కేటాయించడం ఎంతవరకు సరిపోతుందని అడుగుతున్నాను. 2014 ఎన్నికల ముందు ఈ రాష్ట్రంలో ఉన్న సిమెంట్ ధరల పరిస్థితి ఏమిటనేది ఒక్కసారి గుర్తుకుతెచ్చుకోండి. రు.200 ఉన్నటువంటి సిమెంటు బస్తా ఈరోజు రు.330 ఉంటే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటి? ఈ విధంగా ధరలు ఆకాశాన్నంటినట్లయితే మీరు రు.1.50 లక్షలతో ఎస్.సి, ఎస్.టి చెప్పిన ఈ గృహనిర్మాణానికి ఎన్ని ఇళ్లు కడతారని అడుగుతున్నాను. నేను ఇదే విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రిగారిని కూడా బి.ఏ.సిలో అడగడం జరిగింది. వారేదో కమిటీ వేస్తామని చెప్పారు మంచిదే. కానీ దానిని త్వరితగతిన చెయ్యకపోతే అపవాదు వస్తుంది. అలా చేయవద్దని ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఈ రాష్ట్రంలో 6.56 లక్షల స్వయం సహాయక సంఘాలున్నాయి. దానిలో 70 లక్షల మంది సభ్యులున్నారు. వారు ఒక లక్ష రూపాయలలోపు తీసుకున్న రుణాలన్నింటినీ కూడా మాఫీ చేస్తామని చెప్పారు. దానికి కూడా ఇంతవరకూ ఏ విధమైన సమాధానం లేనటువంటి పరిస్థితి. అదే విధంగా ఈ రాష్ట్రంలో 75 లక్షల మందికి పెన్షన్లు ఇస్తామని చెప్పారు. గడిచిన ప్రభుత్వ హయాములో వృద్ధాప్య, వితంతు, వికలాంగులకు ఇచ్చేటటువంటి పెన్షన్‌ను రు.200 నుంచి రు.1000 పెంచుతున్నట్లుగా బడ్జెట్‌లో చూపించారు. అయితే 40 నుండి 80 శాతం అంగ వైకల్యమున్నటువంటి వారికి రు.1000, 80 శాతం దాటినట్లయితే రు.1500 అని చెప్పారు. కనీసం 50 నుండి 60 శాతం అంగవైకల్యం కలిగిన వారికి రు.1500 ఇవ్వాల్సినటువంటి అవసరముందని కూడా ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అదే విధంగా ప్రాథమిక విద్యకి మంచి కేటాయింపులు చేసినందుకు అభినందిస్తున్నాను. సుమారుగా రు.12925 కోట్లు ప్రాథమిక విద్యకి మీరు కేటాయించడం అభినందనీయమే. ఏ విద్యకైనా ప్రాథమిక విద్య పునాదులు బలంగా ఉంటేనే భవిష్యత్తులో ఆ విద్యార్థి యొక్క అభివృద్ధి కూడా బాగా ఉంటుంది. విద్య మనిషి సాధికారతకు ఏ విధంగా ఉపయోగపడుతుందో నేను చెప్పాల్సినటువంటి అవసరంలేదు. అదే విధంగా ప్రాథమిక విద్య కానీ, మాధ్యమిక విద్య కానీ, కళాశాల విద్య కానీ, ఈ మూడింటికి కేటాయింపులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. అదేవిధంగా ఉన్నత విద్యలో జాతీయ యావరేజ్ 18.8 శాతం ఉండగా, మన రాష్ట్రంలో 21.6 శాతంగా ఉంది.

మ.12.20

మరీ ముఖ్యంగా చూసినట్లయితే ప్రాథమిక పాఠశాల అవరణలో క్రీడా స్థలాలు లేవు, ప్రహరీ గోడలు లేవు, మరుగుదొడ్లు కూడా ఇప్పటివరకు కల్పించలేని పరిస్థితిలో మనం ఉన్నాం. ఈ సౌకర్యాలన్నీ కూడా వారికి కల్పించాలి, అక్కడ కనీసం ఒక వాచ్ మెన్ కూడా లేక, అక్కడి ఆస్తులను దొంగిలించే పరిస్థితి ఉంది. కాబట్టి ప్రతీ పాఠశాలకు తప్పనిసరిగా ఒక వాచ్‌మెన్‌ని నియమించాలి. ఈ సౌకర్యాలన్నింటినీ తప్పని సరిగా కల్పించాలని మనవి చేస్తున్నాను. మరీ ముఖ్యంగా వైద్య రంగానికి సంబంధించి, రూ. 4,380 కోట్లు మంజరు చేసింది. ఇది మంచిదే. మరీ ముఖ్యంగా చూసిన ట్లయితే ప్రైమరీ హెల్త్ సెంటర్స్‌లో ఈనాడు వైద్యులు లేరు. అదే విధంగా ఏరియా హాస్పిటల్స్‌లో గాని, కమ్యునిటీ హెల్త్ సెంటర్స్‌లో కాని నిపుణులైనటువంటి వైద్యులు లేరు. వారిని కల్పించవలసిన ఆవశ్యకత వుంది. బిపిఎల్ కింద వున్న వారికి జెనరిక్ మెడిసిన్స్‌ని అందించవలసిన అవసరం ఉంది. అదే విధంగా మరీ ముఖ్యంగా సివిల్ సప్లైస్ కి సంబందించి అన్నా క్యాంటిన్స్‌ని స్థాపిస్తామన్నారు. అది హర్షించే విషయమే. మన ప్రక్క రాష్ట్రం తమిళనాడులో ఆమ్మా క్యాంటిన్స్‌ని పెట్టి చాలా చక్కగా వాటిని నిర్వహిస్తున్నారు. మీరు చేసే ప్రతీ కార్యక్రమం కూడా అభివృద్ధికి దోహదం కావాలి. మీరు అందించే ఆహారం కూడా చాలా నాణ్యామైనటువంటిది కావాలి. మీ మీద ఈ రాష్ట్రంలోని ప్రజలకు, మాకు గౌరవం ఉంది. మీరు బాగా చేయగలరని అనే భావన కలిగించే విధంగా పని చేయవలసి వుంటుందని కోరుకుంటున్నాను.

ఇక ఈ రాష్ట్రం కొత్తగా ఏర్పడింది, రాజధాని ఎక్కడో తెలియడం లేదు, మరో ప్రక్క చూస్తే పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం సహాయం చేస్తుందన్నారు, కానీ ఇప్పటివరకు ఎటువంటి సహాయం అందలేదు. రాజధానికి సంబందించి వివిధ జిల్లాల వారు వారి వారి ఆలోచనలు వ్యక్తం చేస్తున్నారు, దయచేసి మీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒకటి అడుగుతున్నాను. మీరు రాజధాని నిర్ణయం తీసుకునేటప్పుడు అఖిల పక్షాన్ని కూడా పిలిచి, వారి సూచనలు, సలహాలను తప్పకుండా తీసుకోవాలని మనవి చేస్తున్నాను. ఇప్పటికే కొంత మంది మంత్రులు సమన్యాయం సమదూరం అంటున్నారు, దాని ఆంతర్యమేమిటో కూడా మాకు అర్థమయ్యింది. దయచేసి అఖిల పక్షాన్ని పిలిచి, వారి సలహాలను కూడా తీసుకోవడం న్యాయమైన పరిస్థితిగా ఉంటుందని మనవి చేస్తున్నాను. రాబోయే తరాలు కూడా మనల్ని వేలెత్తి చూపకుండా వుండేందుకు అది దోహదపడుతుందని నేను విశ్వసిస్తునాను. కేంద్రం ఇచ్చే నిధులు విషయం కూడా అగమ్య గోచరంగా ఉంది. కానీ ఈ బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం ఇరవై తొమ్మిది కోట్లు ఇస్తారని ఊహించుకుని దానిలో పెట్టారు. ఇది అత్యంత శోచనీయం. రాజధాని గురించిగాని పోలవరం గురించి గాని ఇస్తామని ప్రామిస్ చేశారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచిన విధంగా అనేకమైనటువంటి విద్యా సంస్థలుగాని, వైద్య సంస్థలుగాని, అదే విధంగా మనకున్నటువంటి అత్యంత పొడవైనటువంటి 975 కిలో మీటర్ల తీరప్రాంతం ఉంది. పరిశ్రమల స్థాపన వల్లే ఈ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాము తప్ప, లేకపోతే ఏమీ ఉండదు. ఈనాడు చూస్తే సమైక్య రాష్ట్రంలో హైదరాబాదు చుట్టు ప్రక్కల మాత్రమే ఈ పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలు అన్నీ కూడా వుండడం వల్ల మనం ఎంత నష్టపోయామో మనకు తెలుసు. దానికి మేము కూడా విచారిస్తున్నాము. ఇక ఐటీ విషయంలో ఉత్పత్తులు, ఎగుమతులుకు సంబంధించి ఇప్పటి వరకు రూ 1,622 కోట్లు మాత్రమే చేస్తున్నాము. ఇది కనీసం రెండు శాతం కూడా వుండదు. ఇది కేవలం ఉపాధిలొ 1.85 శాతమే అని మనవి చేస్తున్నాను. ఇక రాబోయే రోజులలో బయట నుండి

సుమారు రెండు బిలియన్ యు.యస్ డాలర్లుని మన ఇన్వెస్ట్‌మెంట్స్ తీసుకురావాలని ఆరాటపడుతున్నందుకు అభినందిస్తున్నాను. రాబోయే రోజులలో మన ప్రజానీకానికి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి అవకాశం కలుగుతుంది. ఎగుమతుల విలువను నలభై మూడు వేల కోట్లకు పెంచడానికి ప్రయత్నించడం కూడా సబబే అని ఈ సభ ద్వారా మనవి చేస్తున్నాను. పాలక పక్షం వారు చేసే ఏ మంచి పనికైనా ప్రతిపక్షంలో ఉన్న మేము నిర్మాణాత్మకమైనటువంటి సహకారాన్ని అందిస్తామని తెలియజేస్తున్నాను. ఏదో గుడ్డిగా, అక్కసుతో చేసే వ్యవహారం కాదు. కానీ మీరు బడ్జెట్‌లో మీరు ప్రస్తుతించిన ఆ పది పేజీలను చూసినట్లయితే "ఆత్మస్తుతి– పరనింద"లాగ కనిపిస్తుందే తప్ప, దానిలో నిజాయితీ లేదనే అనుమానం నాలో కలిగింది. ఈ రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి, నూతనంగా ఏర్పడినటువంటి ఆంధ్రప్రదేశ్‌కు పార్టీలకు అతీతంగా కృషిచేస్తామని మనవి చేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ ఛైర్మన్: శ్రీమతి నన్నపనేని రాజకుమారి గారు మాట్లాడండి.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి: అధ్యక్షా, ఈ బడ్జెట్ పైన మాట్లాడేందుకు అవకాశం కల్పించినందుకు మీకు ధన్యవాదాలు. రాష్ట్ర పరిస్థితి, రాష్ట్ర బడ్జెట్ గురించి చాలా మంది పెద్దలు మాట్లాడారు. మా తెలుగుదేశం ప్రభుత్వం శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి నాయకత్వంలో వచ్చే ముందు ఉన్న పరిస్థితి, ఇప్పుడు ఉన్న పరిస్థితి అందరూ అర్థం చేసుకున్నారు. మేము ఇక్కడకు వచ్చింది అధికారం చేజిక్కించుకోవడానికో, పదవులకోసమో కాదు. 1982లో పార్టీ పెట్టి, తొమ్మిదినెలల్లోనే అంటే 1983లో అధికారంలోకి వచ్చిన శ్రీ నందమూరి తారక రామారావు గారి స్ఫూర్తితో, వారిని దృష్టిలో పెట్టుకుని, ఆ పార్టీ జెండా క్రింద పడవేయకుండా, అధికారంలో ఉన్నా లేకపోయిన, ప్రజలకు అండగా వుండి, మీ కోసం యాత్రలోగాని, పాదయాత్రలో గాని, చంద్రబాబు గారు చేసిన కృషిని పదే పదే గుర్తు చేస్తూనే వున్నారు. కొంత మంది ఎగతాళిగా చేసినా, మరికొంత మంది మనస్ఫూర్తిగా అభినందించినా, ఏది ఏమైనా ఆ పాద యాత్ర ద్వారా ప్రజల యొక్క కష్టసుఖాలు తెలుసుకొని ఆ కష్టాలు తీర్చడానికి ఖచ్చితముగా అధికారములోకి రావాలని పట్టుదలతో ప్రాణాలకు తెగించి పోరాటం చేసి ఒక ప్రక్కన ఉద్యమాలు చేస్తూ ఆ నాటి ప్రభుత్వం చేసినటువంటి ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు అడుగడుగునా కూడా ఢిల్లీ ఏంటి, బాబ్లి ఏంటి శ్రీరాం సాగర్ ప్రాజెక్టు దగ్గర ఏంటి తెలంగాణా, రాయలసీమ మరియు ఆంధ్రప్రదేశ్ సమస్యల మీద పోరాటం చేసిన చంద్రబాబు గారి కృషిని ఎవరూ మర్చిపోలేరు. ఆనాడు నందమూరి తారక రామారావు గారు గద్దెదిగిన తరువాత చంద్రబాబు నాయుడు గారు అధికారంలోకి వచ్చి, మళ్లీ అధికారంలోకి ఎన్నికలో మా సొంత ంగా రావడం జరిగింది అనే సంగతి కూడా మనం మర్చిపోకూడదు. ఆనాడు అభివృద్ధి చేశారు. ఎంత అభివృద్ధి చేశారో అందరికీ తెలుసు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ గాని బయోటెక్నాలజీ గాని లేకపోతే ఈ సేవా కేంద్రాలు గాని, జన్మభూమి గాని, శ్రమదానం అని గాని, డ్వాక్రా మహిళలకు చేసిన సహాయం గాని, ఆనాడు వర్షాలు లేకపోయినా కూడా 9 గంటలు కరెంటు ఇచ్చినటువం టి విషయంగాని అనేక విషయాలలో చంద్రబాబు నాయుడు గారు మంచి పేరు తెచ్చుకున్నారు అనే సంగతి కూడా గుర్తు తెచ్చుకోవాలి. అయితే ఆ 9 సంవత్సరాలలో చేసిన అభివృద్ధి తెలుగుదేశం ప్రభుత్వం చేస్తే అనుభవించినది ఎవరు అంటే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆనాటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి గారు అధికారంలోనికి రావడం ఆ తరువాత రోశయ్య గారు గాని, కిరణ్‌కుమార్‌రెడ్డి గారు గాని వీరంతా కూడా ముఖ్యమంత్రులుగా చేయడం మనకందరకూ తెలిసినదే. అంటే ఇక్కడ ఏమి జరిగింది. అప్పుడు

అభివృద్ధి చంద్రబాబునాయుడు గారిది అధికారం కాంగ్రెస్ పార్టీది జరిగింది. అయితే ఆ ఫలాలు అన్ని కూడా వారు అందిపుచ్చుకున్నారు. బడ్జెట్, రాబడి, ఫండ్ ఏదయితే ఉందో కేంద్ర ప్రభుత్వం గాని, రాష్ట్ర ప్రభుత్వం గాని రెండు చోట్ల అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ రాష్ట్రాన్ని ఏం చేసిందో మరచిపోయి, ఇందాక గౌరవ సభ్యులు ముఖ్యంగా పద్మరాజు గారు ఇంతకు ముందే మాట్లాడుతూ, వారి ప్రభుత్వంలో జరిగిన అవకతవకల్ని చెప్పకుండా, ఈ ప్రభుత్వంలో ఇక్కడ టీచర్లు లేరు, ఇక్కడ డాక్టర్లు లేరు, ఇక్కడ స్కూల్స్ లేవు అంటే తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు కూడా కాలేదు. ఎన్నికలు జరిని మూడు నెలలు అయింది, ప్రమాణ స్వీకారం చేసి రెండు మాసాలే అవుతుంది. ఇంకా సచివాలయంలో ముఖ్యమంత్రి గారు కూర్చోడానికి సీటు కూడా చూపించలేదు, సరే ఏదిఏమైనా ఇవాళ చంద్రబాబు నాయుడు గారు అధికారంలోకి వచ్చారు.

ఉ.12.30

ఇంకా సెక్రటేరియట్‌లో ఆయన చాంబరు ఏర్పాటే పూర్తి కాలేదు. కూర్చోవడానికి సీటు కూడా చూపించలేదు. సరే, ఏది ఏమైనా, ఇవాళ చంద్రబాబు నాయుడు గారు అధికారంలోకి వచ్చారు. 9 సంవత్సరాలు పైగా అధికారంలో ఉండి.....

శ్రీ రుద్రరాజు పద్మరాజు: అధ్యక్షా, ఒక్క నిమిషం..

శ్రీమతి నన్నపనేని రాజకుమారి: మీరు మాట్లాడేటప్పుడు నేను అడ్డం రాలేదు.

శ్రీ రుద్రరాజు పద్మరాజు: నేను ముందే చెప్పాను. మా హయాంలో ఏం జరిగిందనేది మీకు తెలుసు, మాకు తెలుసు. ఇవన్నీ ఎందుకు గుర్తు చేశామంటే, రాబోయే రోజుల్లో నూతన ఆంధ్రప్రదేశ్‌కు ఇవన్నీ చేసుకోవాల్సినటువంటి ఆవశ్యకత ఉంది, ఇవన్నీ మీరు చేయండని చెప్పామే తప్ప, మేం చేసేశాము, మీరు చేయలేదనేది కాదు. మూడు నెలల వ్యవధిలో మీరు ఎంత చేయగలరనేది మాక్కూడా తెలుసు. దాని గురించి...

శ్రీమతి నన్నపనేని రాజకుమారి: 9 సంవత్సరాల్లో కట్టని పాఠశాలల్ని ఇప్పుడు కట్టమంటారు.

MR.CHAIRMAN: You are a Senior Member. మీరు అన్ని ప్రభుత్వాల్లో పని చేశారు. కాంగ్రెస్ గవర్నమెంట్లో పని చేశారు, ఈ గవర్నమెంట్లో పని చేశారు. మీకన్నీ క్షుణ్ణంగా తెలుసు. అందువల్ల, నేను చెప్పేదేమంటే, మన ముందు బడ్జెట్‌పైన చర్చ ఉంది. ఈ బడ్జెట్‌లో ప్రజలకు కావాల్సిందేమిటి? ఏం తక్కువగా ఉంది? ఏ రంగంలో ప్రజలకు కావాల్సింది..

శ్రీమతి నన్నపనేని రాజకుమారి: అవన్నీ చెప్పబోతున్నాను అధ్యక్షా..

మిస్టర్ ఛైర్మన్: మీ ద్వారా అందరికీ చెబుతున్నాను. ఫలానాది చేస్తే, మనం సులభంగా బయటపడగలుగుతాము. బడ్జెట్‌లో ఫలానాది కావాలి, ఫలానాది కావాలి అని అడగండి. అప్పుడు తక్కువ, ఇప్పుడు ఎక్కువ అన్నది ప్రశ్న కాదు. ఇప్పుడే అధికారంలోకి కొత్తగా వచ్చారు కదా. వాళ్లు కూడా అదే చెబుతున్నారు. ఇంకా టైం తీసుకోమని కూడా కొంతమంది చెబుతున్నారు.

శ్రీమతి నన్నపనేని రాజకుమారిః అధ్యక్షా, సమయం మించిపోతోంది. అధికారం అంటే అధికారం అనుభవించడమే కాదు. వాళ్లు తీసిన గోతులన్నీ పూడ్చుకుంటూ రావాలి కదా? వాళ్లు చేసిన లోటు బడ్జెట్ అంతా పూడ్చుకుంటూ రావాలా, వారు చేసిన నిర్వాకమంతా సరిదిద్దుకుంటూ రావాలా, ఇవాళ ఈ రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేసిందెవరు, ఈ రాష్ట్రాన్ని విభజించింది ఎవరు?...

శ్రీ రుద్రరాజు పద్మరాజుః అధ్యక్షా, ఈ రెవిన్యూ లోటన్నది కాంగ్రెస్ పార్టీ చేసింది కాదు. రాష్ట్ర విభజన జరగడం వల్ల, తెలంగాణాకు మనకు వచ్చిన డిఫరెన్స్‌లో వచ్చిన లోటనే విషయాన్ని దయచేసి గమనించాలని గౌరవ సభ్యులకు మనవిచేస్తున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారిః ఇలా అడుగడుగునా వారు అడ్డం రావడమేమిటి అధ్యక్షా? నోటీస్ కూడా లేదు. అధ్యక్షా, వారు చెప్పింది మేం పూర్తిగా విన్నాం. వారు మాట్లాడుతున్నప్పుడు చాలా ఓపిగ్గా విన్నాం. విభజన చేసిన తీరు ఎటువంటిది, మీరు పంపకాలు చేసిన విధానం ఎటువంటిది, ఈ రోజు ఆంధ్ర రాష్ట్రాన్ని దిక్కులేని రాష్ట్రంగా చేసిందెవరు, ఇవాళ ఢిల్లీ చుట్టు ఏవిధంగా చంద్రబాబు నాయుడు గారు తిరగాల్సి వచ్చింది. ఫండ్స్ కావాల్సి వచ్చింది. తుఫాన్లు ఎప్పుడు వచ్చాయి. ఆ తుఫాన్లలో మీరు చేసిన నిర్వాకమేంటి, ఆ తుఫాన్లు వచ్చిన నాడు మంత్రుల బృందం ఏమన్నా పరిశీలన చేసిందా, కేంద్రం ఏమన్నా నిధులిచ్చిందా, నష్టపరిహారమిచ్చిందా అన్నది చెప్పండి. ఆ రోజున 9 సంవత్సరాల్లో ఎన్ని తుఫాన్లు వచ్చినా, ఎంత కరువొచ్చినా, ఎంత కరెంటు కోత వచ్చినా ఇవన్నీ చేయకుండా అడుగడుగునా అడ్డం రావడమేమిటి?

మిస్టర్ ఛైర్మన్ః మరి ఏం చేయాలో చెప్పండి.

శ్రీమతి నన్నపనేని రాజకుమారిః  ఏం చేయాలో చెప్పడానికే చెబుతున్నాను. నేను మాట్లాడటానికి గాని, చెప్పడానికి గాని, హామీ ఇవ్వడానికి గాని ఎన్ని సమస్యలున్నాయో అర్థం చేసుకోవాలి కదా. ఎంత బడ్జెట్ ఉందో అర్థం చేసుకోవాలి కదా. ఒకపక్కన వడ్డించిన విస్తరిలాంటి హైదరాబాదును రాజధానిగా డెవలప్ చేసుకున్నప్పుడు, ఫండ్స్ అంతా తీసుకొచ్చి ఇక్కడ పెట్టినప్పుడు, ఇన్‌కం ట్యాక్స్ అని, సేల్ ట్యాక్స్ అని, కమర్షియల్ ట్యాక్స్ అని ఇక్కడ పెట్టినప్పుడు మనం కట్టిన పన్నుల రూపంలో, శిస్తుల రూపంలో యాభై సంవత్సరాల పాటు సీమాంధ్రులు గాని, ఇక్కడ నివాసం ఉన్న ప్రతి ఒక్కళ్ల రక్తం, చెమట అంతా కూడా ధారపోసి, 5 జిల్లాలతో కలిపి గ్రేటర్ హైదరాబాదుగా ఏర్పాటు చేసుకుని ఈ రోజున అంతా వాళ్లకిచ్చేశాము. ఈ సందర్భంలో మీ రాజధాని ఎక్కడో తెలియదు, ఎలక్షన్ల ముందు మేం పెట్టేస్తాం, ఎలక్షన్ల ముందు మీరు చావండి, తాంబూలాలిచ్చాము తన్నుకు చావండని చెప్పిందెవరు? అధికారంలోకి వచ్చిన వాళ్లని వెంటనే అన్నీ వడ్డించమని అడుగుతున్నారే! రెండు నెలల్లోనే వడ్డించండి, ఆరగిస్తామంటున్నారే! మరి వడ్డించిన విస్తరిలా హైదరాబాదును వాళ్లకిచ్చేసి, ఒట్టి విస్తరి కూడా ఇక్కడ లేకుండా చేశారు కదా? జంపఖానా లేదు, కుర్చీ లేదు, షామియానా లేదు..

వారు మాట్లాడేటప్పుడు ఎక్కడ రాజధాని అన్నారు. రాజధానిని ఎక్కడ నిర్ణయిస్తారో, మీరేమన్నా సలహా ఇవ్వగలరా, చెప్పగలరా? కేంద్ర ప్రభుత్వం గానీ, పోయిన రాష్ట్ర ప్రభుత్వం గానీ చెప్పిందా? అవన్నీ చూడకుండా, ఏమీ లేకుండా ఇష్టమొచ్చినట్టు పంపకాలు చేసి, అన్యాయం చేసేసింది కేంద్రం. ఈ రోజున ఆంధ్రులంతా కూడా ఏమౌతుందోనన్న ఆతృతతో ఎదురు

చూస్తున్నప్పుడు, ఎంతోమంది హృదయాలు ఆవేదనతో నిండినప్పుడు ఇవాళ ఎలా దీన్నుంచి బయటపడాలో ఒక్కసారి ఆలోచించండి. అంతే గాకుండా అధ్యక్షా.. అప్పులు చేసిందెవరు, తిప్పలు పడేదెవరు? ఆ రోజున చేసినటువంటివన్నీ అసలు ఒక రాజధాని ఏర్పాటు చేసుకోవడానికి కావాల్సిన సదుపాయాలు కానే కావు. చాలా మంది రాష్ట్ర పునర్నిర్మాణం అంటున్నారు. రాష్ట్రం విషయంలో ఇది సరైన పదం కాదు. పునర్నిర్మాణమంటే అక్కడ ఉన్న దాన్ని పడగొట్టో, రిపేర్లు చేస్తుంటేనో పునర్నిర్మాణం అనాలి. కానీ, ఇక్కడ నవ నిర్మాణం చేయాల్సి ఉంది. ఈ విషయాన్ని అందరూ గమనించాలి. పునాదులతో సహా రాజధానిని నిర్మించాలి. అక్కడ స్థలముండాలి, పునాదులుండాలి, గోడలు కట్టాలి, కావాల్సిన సౌకర్యాలన్నీ ఉండాలి. మనం అడుగులు వేయబోయేది రాజభవనంలోకి కాదు. కేవలం అసెంబ్లీ భవనాలో, పరిపాలనా భవనాలో కాదు. అభివృద్ధి చెందిన ఆసుపత్రులన్నీ ఇక్కడే ఉన్నాయి. అభివృద్ధి చెందిన విద్యాలయాలు, యూనివర్సిటీలన్నీ ఇక్కడే ఉన్నాయి. అభివృద్ధి చెందిన పరిపాలనా భవనాలన్నీ ఇక్కడే ఉన్నాయి. ఇవాళ మనం ఈ బిల్డింగులో కూర్చుని ఉన్నాము. మా దయాదాక్షిణ్యాలతో ఉండండని అంటే శాసన మండలి భవనం పెట్టుకున్నాము. ఈ శాసన మండలి భవనంలో సమావేశాలు మనం జరుపుకోవాల్సినన్ని రోజులు జరుపుకోవడం లేదు. 45 రోజులు శాసన పరిషత్తు, 60 రోజులు శాసన సభ సమావేశాలు జరగాల్సింది. 18 రోజులకు మనం సమావేశాలను కుదించుకోవాల్సి వచ్చింది. దేనికని? వాళ్లు కూడా సమావేశాలు పెట్టుకోవాలి కాబట్టి మనం కుదించుకున్నాము. వాళ్లు ఎనిమిదవ తేదీనో, తొమ్మిదవ తేదీనో సమావేశాలు పెట్టుకుంటామంటే, మనం ముగించేసుకుంటున్నాం.

అధ్యక్షా, మీరు కూడా తొందరపెడుతున్నారు. ఇరవై మంది కాదు, ఇంకా నలభై మంది మాట్లాడాలి. ఈ నలభై మంది మాట్లాడాలంటే మరో పది రోజుల పాటు సమావేశాలను పొడిగించాలి. పొడిగించడానికి మనకి అనుమతి లేదు. ఇది మన బిల్డింగే అయినా, పదేళ్ల పాటు ఉండటానికి అధికారమిచ్చినా, ఉమ్మడి రాజధాని అయినా, పదేళ్లలో ఇక్కడి భవనాలు, వసతులు ఉపయోగించుకోవచ్చనే సూచన కేంద్రం చేసినా, వీటిపైన ఇవాళ మనకు హక్కు లేదు. మన ఇష్టం వచ్చినన్ని రోజులు సభను నడుపుకునే హక్కు లేదు. కాబట్టి, త్వరత్వరగా ముగించుకుని వెళ్లిపోవాలి. ఏదో కళ్యాణమండపం వాళ్లు – ఇవాళ పెళ్లి అయిపోయింది, మేం డెకరేట్ చేసుకోవాలి, మీరు ముందే వెళ్లిపోండి, పిల్లా, పిల్లాడిని త్వరగా తీసుకెళ్లండి, మీ సామాను, తట్టాబుట్టా సర్దుకోండి అన్నట్టుగా ఉంది వ్యవహారమంతా. ఇది బాధాకరం కాదా? అటువంటిది ఒక ప్రభుత్వం, ఒక రాష్ట్రం విడిపడ్డ తరువాత ఆ రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు గానీ, పరిపాలనా భవనాలు గానీ, అసెంబ్లీ, సెక్రటేరియట్, పాలసీ కంపెనీలు, పరిశ్రమలు ఏమీ లేకుండా, అసలు రెవిన్యూ అనేదే లేకుండా, అసలిక్కడ రెవిన్యూ ఎవరికి చెందుతుంది, ఏమౌతుందనే న్యాయంగానీ, ధర్మం గానీ లేకుండా అన్యాయంగా పంపకాలు జరిగినప్పుడు ఆ పంపకాల పాపం మీదైనప్పుడు, ఇవాళ వేలెత్తి చూపించే హక్కు మీకెక్కడిది? మీరంటున్నారు. నిజమే ఒకళ్లని ఒకళ్లు వేలెత్తి చూపించుకోకూడదు, ఎత్తిపొడుచుకోకూడదు. కానీ కలిసి అభివృద్ధి చేసుకోవాలి. ఈ అభివృద్ధి చేసుకోవడానికి ఎంతకాలం పడుతుంది? చంద్రబాబు నాయుడు గారికి, ఈ ప్రభుత్వానికి ఇంకా ఎంత టైం కావాలి.. కాబట్టి, ఈ ప్రభుత్వంలో ఈ రోజున అక్కడకీ ఆ లేక్ వ్యూ గెస్ట్ హౌస్‌లో కూర్చుని, మన అసెంబ్లీలో, ఇక్కడ బడ్జెట్ ప్రవేశపెట్టుకున్నాము. ఇవన్నీ మనం చేసుకుందాం. తాత్కాలికంగా ఎక్కడుండాలి అన్నటువంటి ఆలోచనతో ఒకపక్క ఆందోళన, ఒకపక్క ఆవేదన, మరోపక్క ఆర్థిక పరమైన ఇబ్బందులు, ఒకపక్క కేంద్ర ప్రభుత్వం ఎంతవరకు సహకరిస్తుందో తెలియని స్థితి ఉంది.

ఇప్పుడు కేంద్రంలో భాగస్వామ్యంలో ఉన్నాం, ఇక్కడ వారు కూడా భాగస్వామ్యంలో ఉన్నారు. ఏదో స్నేహపూర్వకంగా పోతున్నాము. అలాగే, కేసీఆర్ గారు కూడా మొదట్లో ఉన్నట్టుగా కాకుండా, ఏవో సూటిపోటి మాటలు మాట్లాడకుండా తగ్గించుకున్నారు. అందుకు వారికి ధన్యవాదాలు. ఆయన మంచిగా ఆలోచిస్తున్నందుకు ఈ సభ నుండి మీ ద్వారా మనందరి తరఫున వారికి చేతులెత్తి నమస్కరిస్తున్నాను. మనపట్ల సానుభూతి చూపిస్తూ, కలిసి పనిచేసుకుందామనే ఆలోచనతో ముందుకు వచ్చినందుకు వారికి నమస్కరిస్తున్నాను. అలాగే, చంద్రబాబు నాయుడు గారు, కె. చంద్రశేఖర్ రావు గార్లను ఇద్దర్నీ గవర్నర్ గారు కూర్చోబెట్టామన్నారు. ఇవాళ కూడా ఢిల్లీలో చంద్రబాబు నాయుడు గారి స్టేట్‌మెంట్ చూశాను. ప్రధానమంత్రి గారిని కలిసి చెప్పారు. ఏమని – తెలంగాణా ప్రభుత్వం కూడా సహకరిస్తుంది. ఖచ్చితంగా సమస్యల్ని పరిష్కారం చేసుకుంటాము అన్నారు.

మిస్టర్ ఛైర్మన్ః ఇది బాగుంది. ఇంతకుముందు చెప్పినప్పుడు మనల్ని వెళ్లిపొమ్మంటున్నారని అన్నారు. అలాంటిచోట్ల కొద్దిగా రెస్ట్రెయిన్ అయ్యి మాట్లాడాలి.

శ్రీమతి నన్నపనేని రాజకుమారిః అధ్యక్షా, మీరే చెప్పండి. ఎందుకు త్వరత్వరగా సమావేశాలను ముగించుకోవలసి వచ్చింది. ఎందుకు మన సభ్యులంతా మనస్ఫూర్తిగా మాట్లాడుకోలేని పరిస్థితిలో ఉన్నాం.

మిస్టర్ ఛైర్మన్ః వారిద్దరూ మాట్లాడుకున్నారు. అవగాహన కొచ్చారు. సంతోషపడండి. చాలా అప్రిషియేట్ చెయ్యాలి. ఇప్పుడొక అండర్‌స్టాండింగ్‌కు వచ్చారు. దానిపైన స్ట్రెస్ చేయండి. మిగతా పాయింట్లు పట్టుకోవద్దంటాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారిః అధ్యక్షా, మానని గాయాలు చాలా ఉన్నాయి.

మిస్టర్ ఛైర్మన్ః అవునమ్మా.. నువ్వు రెండు చెప్పావు. లెఫ్ట్ చెప్పావు, రైట్ చెప్పావు. రైటే చెప్పు, లెఫ్ట్ ఎందుకు? ఫోకస్ రైట్ మీద ఇవ్వు. తరువాత వారిద్దరూ కలుసుకున్నారు. మాట్లాడారు. సభ సంతోషపూర్వకంగా జరుగుతోంది. Let us hope good things.

శ్రీ సిహెచ్.అయ్యన్నపాత్రుడుః అధ్యక్షా, పాపం రాజకుమారి గారు ఆవేదన చెందుతున్నారు. ఇంత మంచి నగరాన్ని, ఇంత మంచి వాతావరణాన్ని, ఎంతో కష్టపడి నిర్మాణం చేసుకున్న నగరాన్ని వదలివెళ్లాలంటే పాపం ఆవిడకే కాదు, మాక్కూడా బాధగా ఉంది. ఇప్పుడు హైదరాబాదు రావాలంటే ఎక్కడో పై రాష్ట్రానికి వెళ్లినట్టు ఫీలౌతున్నాము. హైదరాబాదు అంటే మా సొంత ప్లేస్‌కు వచ్చినట్టు ఫీలవ్వడం లేదు. అటువంటి పరిస్థితులున్నాయి. అటువంటి పరిస్థితుల గురించి ఆలోచన చేయాలని కోరుతున్నాను.

మ.12.40

బడ్జెట్ ఎంత ఉన్నదో మనకు తెలుసు. పిండి కొద్దీ రొట్టెలాగా ఈ వ్యవహారం ఉంటుంది. ఇంతకుముందు స్వామిగౌడ్ గారు కనిపించారు. పలకరించాను. అంతకుముందు అందరం కలసి ఉండేవాళ్లం. తెలుగువాళ్లమందరం కూడా సామరస్యపూర్వకంగా ఉండాలి. అయితే, ఈ ఆవేదన

ఎలా తగ్గుతుంది? ఉదాహరణకు ఈరోజు రాష్ట్ర ఆర్థికపరిస్థితి ఎలా ఉన్నది? సరే, బడ్జెట్ ప్రవేశపెట్టాము. సంతృప్తికరంగా లేదని ప్రతిపక్షంవారు అంటున్నారు. మాకు ఉన్నదాంట్లో మేము తయారు చేశాము అని ప్రభుత్వంవారు అంటున్నారు. ఉన్న ఇబ్బందులేమిటో చర్చించాలి కదా! ఆ ఇబ్బందులను తీసుకువచ్చింది ఎవరు? వాటికి దారితీసిన పరిస్థితులేమిటి? మొదటిసారిగా ఈ ప్రభుత్వం వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. కౌలు రైతుల గురించి ప్రస్తావన వచ్చింది. తుఫానుల గురించి ప్రస్తావించారు. వ్యవసాయం దెబ్బతినడానికి కారణం ఎవరు? నీటి పారుదల దగ్గరకు వచ్చేసరికి కొన్ని ఇబ్బందులు వచ్చాయి. నీళ్లు వదలలేదు. నారుమళ్లు తడవలేదు. వర్షాలు కురవలేదు. ఈ విధంగా ఇబ్బందులు పడడానికి కారణం ఎవరు?

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు : సార్, వ్యవసాయబడ్జెట్ మీద తరువాత మాట్లాడవచ్చు.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : అప్పుడొకసారి మళ్లీ ఏం మాట్లాడతాము, నేను రెండూ కలిపి ఒకేసారి మాట్లాడతాను. రైతాంగం అంతా ఎంతో ఆందోళనలో ఉన్నారు. తుఫానుల వల్ల గతంలో తీవ్రంగా నష్టపోయారు. కేంద్రమంత్రులు గానీ, ప్రధానమంత్రి గానీ, యుపిఏ ఛైర్‌పర్సన్ గానీ ఎప్పుడైనా వచ్చి పలకరించారా? కేంద్రబృందం రాలేదు, కరవు అంచనా వేయలేదు.

శ్రీ రుద్రరాజు పద్మరాజు : మా ప్రభుత్వం ఉన్నప్పుడు తుఫానులు వచ్చినప్పుడు నష్టపరిహారం ఇచ్చాము అధ్యక్షా.

శ్రీ వెంకట సతీష్ కుమార్ రెడ్డి సింగారెడ్డి : ఈ రాష్ట్రం రూ.83వేల కోట్లు అభ్యర్థించినప్పుడు కేంద్రప్రభుత్వం నుండి మూడువేల కోట్లు వచ్చింది.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : ఇవాళ జాతీయబ్యాంకులు ఇన్సూరెన్స్ చేయడానికి, లోన్లు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. బడా బడా వ్యాపారస్తులకు లోన్లు ఇస్తారు కానీ, చిన్న సన్నకారు రైతులకు లోను కూడా ఇవ్వని పరిస్థితి నెలకొని ఉన్నది. అందుకని సహకార బ్యాంకు, కోఆపరేటివ్ బ్యాంకులను పట్టుకుని వారు లోన్లు తీసుకుంటున్నారు. రైతు సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం చొరవ తీసుకుంటుంది. అందుకనే వ్యవసాయ బడ్జెట్‌ను ప్రత్యేకంగా ప్రవేశపెట్టవలసి వచ్చింది. వ్యవసాయ బడ్జెట్‌తోపాటుగా సాధారణ బడ్జెట్‌లో కూడా మహిళలు, బలహీన వర్గాలు, రైతుల కోసం కొంతవరకూ న్యాయం చేయడం జరిగింది. మాకున్న బాధ ఏమిటంటే – కేంద్రప్రభుత్వం కూడా మాకు సహకరించాలి. రాష్ట్రంలో కూడా ప్రతిపక్షాలు సహకరించాలి. రాజధాని విషయంలో కూడా ప్రాంతాలవారీగా పట్టుపట్టకుండా అందరూ ఏకాభిప్రాయంతో సహకరించాలి. మహిళల భద్రత, వాళ్లకు రుణాలు అందించే విషయంలో, కౌలు రైతులకు సహాయం చేసే విషయంలో ప్రభుత్వం ఇంకా ఎక్కువ సహాయం చేయవలసిన అవసరం ఉన్నది. ఇది నా సూచన. అయితే కొన్ని సమస్యలు కూడా ఉన్నాయి. వాటిని కూడా చెప్పుకోవాలి. ఇక్కడ చెప్పుకోకపోతే ఎక్కడ చెప్పుకుంటాము అధ్యక్షా? సీమాంధ్ర ఉద్యోగస్తులకు, విద్యార్థులకు, రైతులకు సమస్యలున్నాయి. రైతులకు కరెంటు సమస్య, నీటి సమస్య ఉన్నది. రాష్ట్రంలో అన్నీ సమస్యలుగానే ఉన్నాయి. ఇన్ని సమస్యల తోరణాన్ని చంద్రబాబునాయుడుగారి మెడలో వేశారు. నిజంగా చెప్పాలంటే ఇదొక ముళ్లకిరీటం. వారు కూడా ఒక సందర్భంలో అన్నారు. ప్రతిపక్షంవారు కూడా సహకరించి మాతోపాటుగా గొంతు కలపవలసిన అవసరం ఉన్నది. గతంలో కేంద్రం చేసిన పనికి

ఈనాడు ఒక్క సీటు కూడా రాకుండా పోయింది. ఈ సభలో కాంగ్రెస్ పార్టీ ఎమ్ఎల్సీలుగా ఉన్నారు కాబట్టి వారికి మాట్లాడే అవకాశం వచ్చింది. ఆ ఇక్కడ సభ్యులుగా ఉన్నారు కాబట్టి, రాజధాని విషయంలో, రెవెన్యూ, పెట్టుబడుల విషయంలో మనకేమన్నా అన్యాయం జరిగిందనుకుంటే కేంద్రప్రభుత్వంతో మాట్లాడవలసిన అవసరం ఉన్నది. అన్ని పార్టీల వాళ్లు కలిసి ఆంధ్రప్రదేశ్ను పునర్నిర్మాణం చేయడమనేది కాకుండా నవనిర్మాణం చేయడానికి అందరూ సహాయసహకారాలను అందించాలని కోరుతున్నాను.

ఈనాడు ప్రపంచం నలుమూలలా ఉన్న తెలుగువారందరూ కొత్త ఆంధ్రప్రదేశ్ను ఎలా అభివృద్ధి చేస్తారా అని మన రాష్ట్రంవైపు చూస్తున్నారు. ఈ బడ్జెట్లో తక్కువ పెట్టారా, ఎక్కువ పెట్టారా అనేది కాదు ఏవిధంగా పెట్టారు, ఎన్ని ఇబ్బందులను ఎదుర్కొన్నారనేది చూడాలి. ఉన్న ఇబ్బందులను ఏ విధంగా ఎదుర్కోవాలి, కేంద్రప్రభుత్వంనుండి ఏరకంగా సహకారం తీసుకోవాలనే వాటిపై ప్రతిపక్షంవారు కూడా మాతోపాటు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరుతున్నాను. వాస్తవానికి మనం సీమాంధ్ర అనే పదం వాడకూడదు, మనది ఆంధ్రప్రదేశ్. మనమంతా అదే ఐక్యతతో కలసిమెలసి ఉండాలని గొడవలు లేకుండా, సామరస్య ధోరణిలో ఉండాలని కోరుతున్నాను. తెలంగాణా ప్రభుత్వం కొన్ని ఛానెల్స్ను బ్యాన్ చేయడం జరిగింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో అక్షరం యొక్క గొంతు ఎవరూ నొక్కకూడదు. ఎందుకంటే ప్రపంచంలో ఏ పత్రిక ఏం రాసినా అందరం చదువుతాము. తప్పులుంటే సరిచేసుకుంటాము. అంతేకానీ, తెలంగాణా ప్రభుత్వం వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంవాళ్లు అని అనుకోకుండా సామరస్యంగా ఉండాలి. ప్రస్తుతానికి ఉమ్మడి రాజధాని కాబట్టి ఇక్కడ ఛానెల్స్ పెట్టుకున్నారు, రాజధాని కాబట్టే ఫార్మసీ కంపెనీలు, ఫిల్మ్ ఇండస్ట్రీ, పరిశ్రమలు, విశ్వవిద్యాలయాలు, హాస్పిటల్స్ కూడా ఇక్కడకు వచ్చాయి. వాటిని అభివృద్ధి చేసినవారెవరో కూడా అర్థం చేసుకోవాలి. ఏ ప్రాంతం వారు వచ్చి ఇక్కడ డబ్బు పెట్టారు, ఏ ప్రాంతం వారు అక్కడ ఆస్తులు అమ్ముకుని ఇక్కడకు వచ్చి పెట్టుకున్నారనే విషయాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ప్రజల పట్ల వివక్ష చూపకుండా అందరికీ సహకరించే విధంగా ఉండాలని ఈ సభ ద్వారా నేను కోరుతున్నాను. మేము కూడా ఆవేశంగా ఉండేవాళ్లం, ఇప్పుడంత ఆవేశం, కోపం తగ్గిపోయింది, ఎందుకంటే పరిస్థితుల ప్రభావం అలా ఉంది. బాధ, ఆవేదనతో మేము చాలావరకు మా ఆవేశాన్ని అణచుకుంటున్నాము. అధ్యక్షా, గతాన్ని తవ్వుకోవద్దు, చక్కగా మాట్లాడుకుందామని మీరు ఇంతకుముందు చెప్పారు. కానీ, ఈ లోతులు పూడ్చేదెలా? ఈ సమస్యలు తీరేదెలా? లోటు బడ్జెట్ భర్తీ అయ్యేదెలా? రాజధాని నిర్మాణం చేసుకోవడానికి ఏ విధంగా వనరులు సమకూర్చుకోవాలి. విడగొట్టిన వాళ్లు ఇప్పుడు ప్రభుత్వంలో లేరు. వెళ్లిపోయారు. ఇప్పుడు అవన్నీ కాకుండా, మన రాష్ట్ర నవనిర్మాణం కోసం ముఖ్యమంత్రిగారికి సహకరిద్దాము. గవర్నరు వ్యవస్థను, రాష్ట్రపతి వ్యవస్థను మేమెప్పుడూ నిందించలేదు. వారి అధికారాలను తగ్గించమని కోరుకోకూడదు. ప్రతి ఒక్కరు ఆంధ్రప్రదేశ్ అభివృ ద్ధి కోసం పాటుపడాలి. ఈ పది సంవత్సరాలే కాదు ఎప్పుడైనా మనకు ఇక్కడ ఉండే హక్కు ఉన్నది. ఇతర రాష్ట్రాలలో వలే ఇక్కడ కూడా ఉంటాము. ఇది అందరి రాజధాని. ఆంధ్రప్రదేశ్కు గుండెకాయ వంటిది హైదరాబాదు. అందరం కలసిమెలసి ఉంటామని ఆశిస్తూ, నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియచేస్తూ శెలవు తీసుకుంటున్నాను.

మ.12.50

శ్రీ వాకాటి నారాయణరెడ్డి (స్థానిక సంస్థలు, నెల్లూరు): అధ్యక్షా, బడ్జెట్ గురించి సభలో మాట్లాడడానికి నాకు అవకాశం ఇచ్చినందుకు తమరికి నా ప్రత్యేక నమస్కారాలు తెలియజేస్తున్నాను. మా నెల్లూరు జిల్లా వారికి ఒక ప్రత్యేకమైన అవకాశం ఉంది. ఆరోజుల్లో ఉమ్మడి రాజధాని అయిన కర్నూలులో నెల్లూరు జిల్లా వాస్తవ్యులైన స్వర్గీయ శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు 1956వ సంవత్సరంలో ప్రథమ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంతో కలసి ఉన్నప్పుడు ఆఖరి బడ్జెట్‌ను కూడా మా నెల్లూరు జిల్లా వాస్తవ్యులైన శ్రీ ఆనం రామనారాయణరెడ్డిగారు సభలో ప్రవేశపెట్టడం జరిగింది. నేడు క్రొత్తగా 13 జిల్లాల రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌కు శ్రీ యనమల రామకృష్ణుడు గారు రచించిన బడ్జెటు గురించి శాసనపరిషత్తులో మా నెల్లూరు జిల్లాకు చెందిన మంత్రిగారు శ్రీ పి. నారాయణ గారు బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగింది. నెల్లూరుకు అటువంటి మంచి అవకాశం కలిగిందని అధ్యక్షులవారి ద్వారా సభలోని సభ్యులందరికీ నేను తెలియజేస్తున్నాను.

విద్యారంగం కోసం తెలుగుదేశం ప్రభుత్వం చాలా మంచి నిధులను కేటాయించి విద్యారంగాన్ని ముందుకు తీసుకెళ్లాలనే ఆలోచనతో ఉండడాన్ని నేను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. ఎందుకంటే, విద్యారంగంలో ఇంకా వెనుకబడి ఉన్నాము, ఇంకా సాధించవలసింది చాలా ఉందనే ఆలోచనతో ముందుకు వెళ్తూ ఉన్నాము. మరీ ముఖ్యంగా, విభజన జరిగిన తర్వాత ఆంధ్రప్రాంతంలో ముఖ్యమైన కళాశాలల విషయంలో, పెద్దపెద్ద సంస్థల విషయంలో, ప్రయివేటు పరంగాగానీ హైదరాబాదు కంటే తక్కువ అవకాశాలు ఉన్నాయి కాబట్టి వాటిని పెంపొందించుకునేందుకు ఈ బడ్జెట్ అవసరానికి బాగా పనికివస్తుంది. అదేవిధంగా, కేంద్రం నుంచి ప్రత్యేక సంస్థలను ఆంధ్ర ప్రాంతానికి తీసుకురావలసిన అవసరముంది.

ఆనాడు శ్రీ చంద్రబాబునాయుడుగారు 23 జిల్లాలున్న ఉమ్మడి రాష్ట్రాన్ని పరిపాలించారు కాబట్టి 13 జిల్లాలను కలిగివున్న నేటి ఆంధ్రప్రదేశ్‌ను ఆయన చాలా సులువుగా పరిపాలించగలరన్న ప్రగాఢ విశ్వాసం నాకుంది. ఆయన ఐ.టి.రంగాన్ని ఎంతో అభివృద్ధి చేసి హైటెక్ ముఖ్యమంత్రిగా ఎంతో మంచిపేరు గడించారు. నేడున్న ఆంధ్రప్రదేశ్‌ను కూడా అదే విధంగా ముందుకు తీసుకువెళ్లగలరని కూడా నేను తెలియజేస్తున్నాను. 13 జిల్లాల్లోనూ ఏ ఒక జిల్లాను అయినా సరే, ఒక జిల్లాను మార్గదర్శకంగా ఎన్నుకుని, ప్రయివేటు వారు ఏ విధంగా అయితే విద్యను అందిస్తున్నారో ఆ విధంగానే ప్రభుత్వం వారు కూడా విద్యను ఎందుకు తీర్చిదిద్దకూడదనే ఆలోచనతో ఒక జిల్లాను తయారుచేసినట్లయితే ప్రజలు మనందరినీ విశ్వసిస్తారనే విషయాన్ని తమరిద్వారా సభకు తెలియజేస్తున్నాను.

వైద్యరంగం విషయంలో, నేడు కార్పోరేట్ ఆసుపత్రులన్నీ కూడా హైదరాబాదుకే పరిమితమైపోయాయి. మన ప్రాంతంలో మెడిసన్ కోర్సును చదువుకుని సర్జన్లుగా ఉద్యోగం చేయడానికి ఆస్కారం లేకుండా పోయింది. ఆ ప్రాంతం వారు స్థాపించిన అపోలో మరియు కేర్ లాంటి ఆసుపత్రుల్లో వారు పనిచేయవలసిన పరిస్థితి ఉంది. తన ప్రాంతంలో చదువుకున్న ఒక వ్యక్తి ఆ ప్రాంతంలో పనిచేసుకునే అవకాశం లేకుండా పోయింది. ఎందుకంటే, మౌలిక సదుపాయాలు లేవు. అందువల్ల, ప్రతి జిల్లాలో ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని తీసుకురావలసిన అవసరం ఉంది. అది ప్రభుత్వ పరంగా లేక ప్రభుత్వ మరియు ప్రయివేటు పార్టనర్‌షిప్ ద్వారా ప్రతి జిల్లాకు ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని స్థాపించవలసిందిగా తమరిద్వారా నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

వ్యవసాయం రంగం గురించి సభ్యురాలు శ్రీమతి నన్నపనేని రాజకుమారి మరియు సభ్యులు శ్రీ రుద్రరాజు పద్మరాజుగారు ఇంతకుముందే చాలా విషయాలు చెప్పారు. ఎన్నికలకు ముందు ఒకరిని మరొకరు ఓడించుకోవాలని అనుకోవడం రాజకీయపార్టీల్లో ప్రథమంగా ఉంటుంది. నేడు మనం ఏ పార్టీకి చెందినప్పటికీ, ప్రజల యొక్క యోగక్షేమాలను దృష్టిలో పెట్టుకుని వారికి కావలసింది ఏరకంగా చేయాలనే విషయంలో అందరూ కలిసి పనిచేద్దాం అనే విషయాన్ని సవివరంగా తమరిద్వారా నేను సభకు తెలియజేస్తున్నాను. చేయవలసింది ఇంకా చాలా ఉంది. నేడున్న పరిస్థితుల్లో ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారంటేనే నేను గొప్పగా భావిస్తున్నాను. నేడు ఎక్కువభాగం ఆదాయం హైదరాబాదు నుంచి వస్తే ఎక్కువ జనాభా ఉండే ఆంధ్రరాష్ట్రంలో ఏమీ చేయలేనటువంటి పరిస్థితిలో ఉండడం మనందరికీ తెలిసిందే. కానీ, రాజకీయంలో ఉన్నప్పుడు ఒక పార్టీని మరొకపార్టీ సద్విమర్శలు చేసుకుంటూ ముందుకు వెళ్లాలేగానీ, కేవలం పేర్లు పెట్టుకుని మాట్లాడే పరిస్థితికి రాకూడదని నేను తమరిద్వారా తెలియజేస్తున్నాను. వ్యవసాయరంగం విషయంలో ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడుగారు ఎన్నికలకు ముందు రుణమాఫీపై హామీ ఇవ్వడం జరిగింది. ఆయన హామీ ఇచ్చినా, రుణమాఫీ జరగదని అందరూ అనుకుంటున్నారు. రుణమాఫీ విషయంలో ఆయన ఇచ్చిన హామీని తప్పకుండా నిలబెట్టుకుంటారనే విశ్వాసం నాకుంది. ఎందుకంటే, ఆయన చాలా వ్యూహాత్మకంగా ముందుకు వెళుతున్నారు.

మ.1.00

శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ఎన్నికల ముందు వ్యవసాయ రంగానికి సబంధించి రుణ మాఫీకై హామీ ఇవ్వడం జరిగింది. హామీ ఇచ్చారు గాని, ఋుణ మాఫీ జరగకపోవచ్చని అందరూ అనుకుంటున్నారు. కానీ, నాకైతే వారు ఇచ్చిన హామీని తప్పకుండా నిలబెట్టుకుంటారనే విశ్వాసం ఉంది. ఎందుకంటే, ఆయన చాలా వ్యూహాత్మకంగా ముందుకు వెళుతున్నారు. రైతులకు, డ్వాక్రా మహిళలకు ఋుణ మాఫీ గాని చేస్తే ఆంధ్ర రాష్ట్రానికి పది సంవత్సరాలపాటు రావలసినటువంటి ప్రత్యేక హోదాని కేంద్ర ప్రభుత్వం ఎక్కడ దెబ్బకొడుతుందేమో అనే ఆలోచనతో వాటన్నింటిని రహస్యంగా ఉంచి మన బడ్జెట్‌లో పొందుపరచలేదేమో అనే ఆలోచన నాలో ఉంది. ప్రత్యేక హోదా వచ్చిన తరువాత ఆంధ్ర రాష్ట్రంలో వ్యవసాయానికి, డ్వాక్రా మహిళలకు సంబంధించిన ఋుణ మాఫీలు తప్పకుండా చేస్తారనే విశ్వాసం నాకు ఉంది. ఎందుకంటే నేను కూడా కాంగ్రెస్ పార్టీ తరపున నెల్లూరు జిల్లా నుండి ఎంపిగా పోటీ చేసినప్పుడు నాకు డిపాజిట్ కూడా రాలేదు. ఒక విధంగా చెప్పాలంటే ఆరోజే రాజీనామా చేయాల్సిన పరిస్థితి. కానీ, మనకు ప్రజలిచ్చిన ఆరు సంవత్సరాల అధికార కాలంలో జిల్లాకు సంబంధించి మనకు కావాల్సిన విషయాల్లో చేదోడు వాదోడుగా ఏమైనా చేయగలమేమో అనే ఆలోచనతో ఇంకా కొనసాగుతున్నాను. ఇకపోతే, శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు చేస్తున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమాల్లో నావంతు సహకారాన్ని పూర్తిగా అందిస్తామని తెలియజేస్తున్నాను. అదేవిధంగా ఎక్కడైనా తప్పులు జరిగినా కూడా ఎత్తి చూపించడానికి సందేహం ఉండదు.

రాష్ట్ర రాజధాని విషయానికి వస్తే, శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అన్నదమ్ములుగా విడిపోయామని చెప్పి పెద్దన్నయ్యేమో స్వంతింట్లో ఉండి రెండవ అన్నయ్యని రోడ్డుమీద నిలుచోబెట్టి పదిమందికి భోజనాలు ఏర్పాటు చేయండి, ఇరవై మందికి

కాఫీలు పెట్టండి అన్నట్టుగా ఉంది ఈరోజు మనందరి పరిస్థితి. ఇంకా ఇల్లు కట్టుకోలేదు ఎవరు వస్తారో, ఎవరు పోతారో పిల్లలకి ఏమి చేయాలో అనే ఆలోచనతో ముందుకెళ్లే పరిస్థితుల్లో ఉన్నారు. కాబట్టి, విమర్శించడానికి కూడా కొంత కాలం ఓపిక పట్టాలని మా సోదరులకు కూడా నేను తెలియజేస్తున్నాను. ఎందుకంటే వారిని ప్రజలు విశ్వసించి అధికారాన్ని ఇచ్చారు. అధికారంలో వారు ప్రజలకు ఏమి చేయబోతున్నారు, ఏమి చేస్తారనే ఆలోచనతో ప్రతిపక్ష హోదాలోని పార్టీ మరియు ఇతర పార్టీలు వారికి అవకాశాన్ని ఇవ్వాలని నేను కోరుతున్నాను. మనం ప్రతిపక్షంలో ఉన్నామని వారు చేసే ప్రతి పనిలో విమర్శనాస్త్రంతో వెళుతూ ప్రతి దాంట్లో ఇరుకున పెడితే అభివృద్ధి కుంటుపడుతుందనే విషయాన్ని మీద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

వ్యవసాయ రంగాన్ని తీసుకుంటే, మన రాష్ట్రం వ్యవసాయ రంగంలో ఎంతో పరిపుష్టి కలిగినటువంటి రాష్ట్రం. అలాగే రకరకాలైనటువంటి కూరగాయలు పండుతాయి. మన దగ్గర ఎక్స్‌పోర్ట్ అవకాశాలు చాలా ఉన్నాయి. మన దగ్గర ఒక ఎక్స్‌పోర్ట్, ఇంపోర్ట్ బోర్డు ఉన్నట్టుగా మనదగ్గర ఉన్నటువంటి వ్యవసాయదారులకు చాలామందికి తెలియదు. మన రాష్ట్రంలో ఉన్నటువంటి అధికారులతో దీనిమీద ప్రత్యేక శ్రద్ధతో వ్యవసాయదారులందరికీ అవగాహన కల్పించాలని తెలియజేస్తున్నాను.

ఈరోజు కోస్టల్ ప్రాంతాల అభివృద్ధికి దాదాపుగా మన బడ్జెట్‌లో రూ.14కోట్లు కేటాయించాలనే ఆలోచనలో ఉన్నారు. ఒకవేళ కోస్టల్ ప్రాంతమంతా పోర్టులతో అభివృద్ధి చెందితే తప్పకుండా మన రాష్ట్రం మరో సింగాపూర్ లాగానో, జపాన్ లాగానో తయారయ్యే దానికి అవకాశాలున్నాయి. గౌరవ సభ్యులు శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం గారు సింగపూర్ వద్దు, జపాన్ వద్దు, పట్టెడు అన్నం పెట్టండి చాలని మరియు బడ్జెట్ గురించి చాలా బాగా చెప్పారు. ఉదయం నిద్ర లేవగానే అంబాని అవ్వాలనే కళను కందాం, కష్టపడి పని చేస్తాం కానీ అంబానిలాగా సంపాదించలేదని రాత్రికి నిద్రపట్టదు. అలాగే రిక్షా వాడితో పోల్చుకొని వాడు రాత్రికి చాలా హాయిగా నిద్రపోతున్నాడు వాడిలాగా నిద్రపోదామని ఆలోచిస్తే అప్పుడు నిద్ర పడుతుంది. తెల్లారి లేస్తే పోటీ తత్వం, రాత్రికి రిక్షావాడితో పోల్చుకొని హాయిగా నిద్రపోవడం. అదేవిధంగా రాజధాని నిర్మాణ విషయంలో కూడా అందరికంటే అగ్రగామిగా ఉండాలనే ఆలోచనతో ముందుకు వెళదాం.

గత మూడు రోజుల క్రితం చూస్తే ఒక ప్రెస్‌మీట్‌లో ఈప్రాంతానికి సంబంధించిన ఒక ట్రస్టు ఛైర్మన్ మాట్లాడుతూ, We are not an Indians, భారత ప్రభుత్వం కబ్జా చేసి మమ్మల్ని కలుపుకున్నది కానీ, We are not Indians అని చెప్పి అనడం జరిగింది. అలాంటి దుష్టమైనటువంటి ఆలోచనలు ఉండేటప్పుడు ఈ ప్రాంతంలో ఉండేటువంటి సామాన్య ప్రజలకు ఎప్పుడూ న్యాయం జరగదు. ఒక టీ కొట్టు, చిన్న పరిశ్రమ పెట్టుకుంటే నీవు ఆంధ్ర వాడివి, మా ప్రాంతంలోని వారినే ఉద్యోగాల్లో పెట్టుకోవాలి తక్కువ ధరకి ఇవ్వాలని భయభ్రాంతులు చేస్తున్నారు. ఈ సభా పూర్వకంగా శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిని కోరేదేమంటే, అవసరమైతే తాటాకు గుడిసెలనైనా వేసుకొని మనం ఆంధ్రా ప్రాంతానికి పోదాం, మన ప్రాంతంలో ఉన్నటువంటి మౌలిక సదుపాయాలన్నింటిని వాడుకొని కావాలంటే రేకుల షెడ్స్ క్రింద కాపురాలు చేద్దాం. మన సభలు కూడా రేకుల షెడ్స్ క్రింద వేసుకుందాం. మన ప్రాంతం నుండి పరిపాలనా సౌలభ్యాన్ని మన ప్రజలకు అందజేద్దాం. అదేవిధంగా మన ప్రజలందరూ సుఖ-శాంతులతో ఉండే విధంగా ముందుకు తీసుకువెళ్దామని తెలియజేస్తూ, ఈ బడ్జెట్‌పై నాకు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చినందుకు మీకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ శెలవుతీసుకుంటున్నాను.

ఈ బడ్జెట్‌లో నాకు మాట్లాడడానికి అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

శ్రీ అంగర రామ మోహన్ (స్థానిక సంస్థలు, పశ్చిమ గోదావరి): రైతు ఋణ మాఫీ విషయంలో ఇచ్చిన మాట ప్రకారం 96% రైతులకు ఉపయోగపడేవిధంగా ఈ ప్రభుత్వం ఋణమాఫీచేయటానికి ముందుకురావటంపట్ల రైతులు చాలా సంతోషపడుతున్నారు. కాని ప్రతిపక్షంలో ఉన్న కొందరు ప్రభుత్వం ఋణమాఫీ ఏవిధంగా చేస్తుందంటూ ఎగతాళి చేస్తున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 80 రోజులు మాత్రమే అయినది, వారు అది గమనించటంలేదు. మావల్లే ఈ సమస్యలు వచ్చాయని శ్రీ రుద్రరాజు పద్మరాజుగారు చెప్పారు. నిజంగా రైతు ఋణమాఫీ పథకం పెట్టవలసివచ్చింది మీవల్లే అని చెబుతున్నాను. ఎందుకంటే గతంలో తుఫాన్‌లు వచ్చినప్పుడు నోటిఫై చేయకపోవటంవల్లే రిజర్వ్‌బ్యాంక్ ఈరోజు నిబంధనలుపెట్టి కొంత ఇబ్బందిపెడుతోందనేది వాస్తవం కాదా అధ్యక్షా? గతంలో కేంద్రప్రభుత్వం దేశం మొత్తంమీద రూ.52,000 కోట్లు ఋణమాఫీ చేస్తే ఈనాడు మన రాష్ట్రంలో రూ.45,000 కోట్లు ఋణమాఫీ చేస్తున్నాము. ఈ 13 జిల్లాలకు లెక్క కట్టినప్పుడు కేవలం రూ.5,000 కోట్లు. ఆనాడు కేంద్రం ఋణమాఫీ చేయగా అది రూ.1100 కోట్లు. ఆనాడు రాజశేఖరరెడ్డిగారి ఆధ్వర్యంలోని రాష్ట్రప్రభుత్వం ఋణమాఫీ చేసింది. అంటే కేవలం రూ.6,100 కోట్లు ఆనాడు ఋణమాఫీ చేయగా ఈనాడు ఇంత పెద్దయెత్తున, కేవలం ఋణమాఫీకే రాష్ట్రప్రభుత్వం తరపున రూ.38,000 కోట్లు కేటాయించిన ఘనత ఈ రాష్ట్రప్రభుత్వానికి దక్కింది.

మ 1.10

ఇటువంటి మంచి కార్యక్రమాలు చేపట్టినప్పుడు అభినందించటంపోయి కేవలం విమర్శించటం బాధ కలిగిస్తోంది అధ్యక్షా. ఇప్పటికైనా మేము చేసిన మంచి పనులకు మమ్మల్ని అభినందిచమనండి అధ్యక్షా. రైతు ఋణమాఫీ వద్దని ఏ రాజకీయపార్టీ కూడా అనకూడదు. ఆవిధంగా అనుకుంటే మంచిది కాదు. ఒకనాటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డిగారు రైతు ఋణమాఫీగురించి ఈ విధంగా అన్నారు, బ్యాంక్‌లలో అప్పులు పేరుకుపోతే ఋణమాఫీ చేయటంవల్ల పెద్ద ప్రయోజనం ఉండదు, దీనివల్ల 10% మాత్రమే గ్యాప్ పూరించగలమని వారు అన్నటువంటి విషయం మీ దృష్టికి తీసుకువస్తున్నాను అధ్యక్షా. ఆనాడు రైతు ఋణమాఫీగురించి కాంగ్రెస్ పార్టీవారికి ఎటువంటి అభిప్రాయం ఉన్నదో, ఈనాడు ఎటువంటి అభిప్రాయం ఉన్నదో తమరి ద్వారా తెలియచేస్తున్నాను.

బలహీనవర్గాలవారి సంక్షేమం కోసం రూ.11,000 కోట్లు కేటాయించటం చాలా మంచి విషయం. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా వీరికోసం చాలా ఫెడరేషన్స్ పెట్టారు. అవి నామమాత్రంగానే పనిచేశాయి. వాటికి నిధుల కేటాయింపు లేదు. కనీసం కూర్చోవటానికి కుర్చీలు కూడా లేవు. ఈనాడు ఇంత పెద్ద యెత్తున వీటికి నిధులు కేటాయించి వీటి సంక్షేమానికి పాటుపడటం చాలా గొప్ప విషయం. వెనుకబడిన వర్గాలపైన, ఎస్.సి.లపైన ఈ ప్రభుత్వానికి ప్రేమ ఉన్నది. పేదరిక నిర్మూలనలో భాగంగా నిరాదరణకు గురవుతున్న వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్స్ పెంచటం జరుగుతోంది. 75 లక్షల కుటుంబాలకు ఉపయోగపడేవిధంగా పెన్షన్స్ ఇస్తున్నాము. రూ.200 ఉన్న పెన్షన్‌ను రూ.1,000లకు పెంచటం, రూ.500 వికలాంగుల పెన్షన్‌ను

రూ.1,500కు పెంచటం, బడ్జెట్‌లో ఆ నిమిత్తం ఇంత పెద్దమొత్తాన్ని కేటాయించటం చాలా గొప్ప విషయమని నేను భావిస్తున్నాను. వై.ఎస్.ఆర్. పార్టీవారు ఒక మాట చెప్పారు. కేంద్రం నుండి రూ.28,000 కోట్లు వస్తాయని ఈ ప్రభుత్వం అంచనా వేసింది, గతంలో రూ.7,000కు మించి రాష్ట్రానికి రాలేదు, ఇదెట్లా సాధ్యమౌతుందని మాట్లాడారు. మోడీ, చంద్రబాబునాయుడుగారి జోడీ ఈ రైతులను తప్పనిసరిగా ఆదుకుంటుందని ప్రజలందరూ అనుకుంటున్నారు. అందుకే ఈనాడు ప్రజలు అధికారం ఇచ్చారు. ఈ రాష్ట్రానికి తప్పనిసరిగా పెద్ద యెత్తున నిధులు వచ్చే అవకాశం ఉన్నదని మేమందరం భావిస్తున్నాము. బాలసుబ్రమణ్యంగారు ఈ బడ్జెట్‌పై చాలా బాగా మాట్లాడారు, మంచి సలహాలు ఇచ్చారు. చంద్రబాబునాయుడు గారిపైన కొంతమంది వ్యక్తులకు కొన్ని నమ్మకాలు ఉంటాయని వారు స్పష్టంగా చెప్పారు. చంద్రబాబునాయుడుగారు అందరితో పనిచేయిస్తారు, కఠినంగా ఉంటారు, పారదర్శకంగా ఉంటారు, వేగంగా ఉంటారని చెప్పారు. కాని ఆయన ఒక అనుమానం కూడా వ్యక్తంచేశారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో కార్యకర్తలపట్ల గౌరవంగా ఉండండని చెప్పారనే, పొలిటికల్ గవర్నమెంట్ అనే అనుమానం కూడా వ్యక్తంచేశారు. వాస్తవం అధ్యక్షా, అనేక సందర్భాలలో ఇది పొలిటికల్ గవర్నమెంట్ అని చెబుతున్నారు అధ్యక్షా. ఎంతవరకు ఎంటర్‌ప్రైజింగ్‌గా ఉండాలో అంతవరకు ఉంటారు. అన్యాయం జరగకుండా చూసే బాధ్యత కూడా ఈ ప్రభుత్వానికి ఉన్నదని చెబుతున్నాము. ఇటీవల జరిగిన ఒక ఆంతరంగిక సమావేశంలో ఒక శాసనసభ్యుడు రెండు, మూడు సబ్జెక్ట్‌లపై మాట్లాడుతూ అవినీతి అధికారులను బదిలీచేయమని, అన్ని అధికారాలు తమకే కావాలని, చివరకు టీచర్స్ విషయంలో కూడా కౌన్సిలింగ్ ఎత్తివేయమని అడిగారు. మా అధ్యక్షులు ఒక్కటే చెప్పారు, "నీవెవరో తెలియదు, మీ ఫాదర్‌గాని, తాతగాని ఎమ్.ఎల్.ఎ. కాదు, అయినప్పటికీ ప్రజలు నిన్ను ఎమ్.ఎల్.ఎ.గా గెలిపించారు, అన్ని అధికారాలు నాకే కావాలి, అన్ని పనులు మనమే చేయాలంటే రాబోయే ఎలక్షన్స్ టైమ్‌కు నువ్వు మటాష్ అయిపోతావు" అని చెప్పారు. అంటే ఆయనకు ఎంతవరకు గౌరవం ఇవ్వాలి, ఎంతవరకు పొలిటికల్ గవర్నమెంట్ ఉండాలనే విషయంలో స్పష్టమైన అవగాహనతో ఉన్నారని చెప్పవచ్చును. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నప్పటికే వాటిని పరిష్కరించగల సుదీర్ఘమైన సామర్థ్యం వారికి ఉన్నది. సమస్యలు వచ్చినప్పుడు నేను భయపడను, ఆ సమస్యలను ఛాలెంజ్‌గా తీసుకుని పరిష్కారమార్గాలను వెతుకుతూ ముందుకెళ్తానని అనేక సందర్భాలలో వారు చెబుతుంటారు. ఈ బడ్జెట్‌ను అమలుచేసే విషయంలోగాని, ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే విషయంలోగాని వారు దృఢ సంకల్పంతో ఉన్నారని తెలియచేస్తున్నాను. అనేకసార్లు మేము దగ్గరుండి చూశాము. 30 సంవత్సరాలుగా వారి నాయకత్వంలో పనిచేస్తున్నాము. ఒక ప్రాంతీయపార్టీని నడిపిస్తూ, ఎన్ని ఒడిదుడుకులు వచ్చినప్పటికీ, కొందరు నాయకులు రాత్రికి రాత్రి వెళ్లిపోయినప్పటికీ, అనేక ఆర్థిక సమస్యలు వచ్చినప్పటికీ, కొన్ని జిల్లాల్లో విపరీతమైన సమస్యలు వచ్చినప్పటికీ, ఎక్కడా భయపడకుండా, సమర్థవంతంగా పార్టీని నడిపి ఈనాడు అధికారంలోకి తీసుకువచ్చారు. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా అన్ని హామీలను అమలుచేయటానికి వారు గట్టిగా కృషిచేస్తున్నారు. వారి కృషిని ఇప్పటికైనా ఇతర పార్టీలవారు అభినందించాలి. బాలసుబ్రమణ్యంగారు ఇచ్చిన సలహాలను తప్పనిసరిగా దృష్టిలో ఉంచుకుని ఈ ప్రభుత్వం ముందుకువెళుతుంది. 50% వైకల్యం ఉన్నవారి విషయంలో కొంత సడలింపు కావాలని గౌరవసభ్యులు చెప్పారు. దానికి మేము కూడా అంగీకరిస్తున్నాము అధ్యక్షా. తప్పనిసరిగా ప్రభుత్వం ఆ దిశలో ఆలోచించాలని మేము కూడా కోరుకుంటున్నాము. వికలాంగులు చాలా బాధపడుతున్నారు, 80% అంటే వారు చాలా బాధపడే అవకాశం ఉన్నది కాబట్టి దానిని 50% చేయాలని మేము కూడా కోరుకుంటున్నాము. ఈ బడ్జెట్‌పై నాకు మాట్లాడే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియచేస్తూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కంతేటి సత్యనారాయణ రాజు (నామినేటెడ్)ః ప్రధానంగా వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టినందుకు మా చిరకాల మిత్రులు పుల్లారావు గారిని అభినందిస్తూ వ్యవసాయం మీద కొంత సమయం మాట్లాడతాను. వ్యవసాయ భారతదేశమని రుగ్వేదంలో కూడా చెప్పడం జరిగింది. ఇప్పుడు రాను రాను వ్యవసాయానికి ప్రాధాన్యం చాలా తగ్గిపోతూ వచ్చింది. మొట్టమొదటి ప్రణాళికలో మనం చూసినట్లయితే అప్పుడు ప్రణాళికలోనే వ్యవసాయానికి 31 శాతం కేటాయించడం జరిగింది. ప్రస్తుతం 18 శాతం మాత్రమే ప్రణాళికలో పెట్టడం జరుగుతోంది. ఈ వర్క్ ఫోర్స్‌లో ఏదైతే ఉందో అందులో 50 శాతం రైతులు వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు. అలాగే వ్యవసాయం విషయంలో మనం చూసినట్లయితే ఎక్కడా ముందుకెళ్ళడం లేదు. ఉత్పత్తి కూడా చాలా తగ్గిపోతోంది. రైతులకు రుణమాఫీ బదులు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌చేస్తే బాగుంటుంది. రైతులకు ఎటువంటి సదుపాయాలూ లేవు. కింద చేనుకు నీళ్ళు వెళ్ళవు. రోడ్లు లేవు. ధాన్యం తెచ్చుకోవాలంటే బస్తాకి రు.25 ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి ఉంది. కొత్త వంగడాలు లేవు. ఈజిప్టులో 90 క్వింటాళ్ళు, చైనాలో 68 క్వింటాళ్ళు ఉత్పత్తి ఉండగా, మన దేశంలో యావరేజ్‌గా 30 క్వింటాళ్ళే ఉత్పత్తి జరుగుతోంది. కాబట్టి దీనిమీద దృష్టి సారించాల్సిన అవసరముంది. కొత్త వంగడాలు ఎన్ని వచ్చినా కూడా ఆ 30 బస్తాలు దాటి పోవడంలేదు. ఆ స్టేజ్‌కు మనం రీచ్ అయితే తప్పనిసరిగా రైతులకు ప్రోత్సాహంగా ఉండడమేగాక లాభసాటిగా ఉంటుంది. వ్యవసాయం మీద ఎవరూ ఇంతవరకూ బాగుపడలేదు. 40 సంవత్సరాలుగా నేను చూశాను. 40 సంవత్సరాల నుంచి అన్నీ అమ్ముకుంటూ వచ్చాము. ఎవ్వరూ కూడా ఈ రోజు వ్యవసాయం చేయడానికి అవకాశం లేదు. 1972 సంవత్సరంలో ల్యాండ్ సీలింగ్ 18 ఎకరాలు పెట్టారు. అప్పటినుండి రెండు జనరేషన్‌లు మారిపోయాయి. ప్రస్తుతం ఒక ఇంటికి నాలుగు ఎకరాలు ఉన్నవాళ్ళు చాలా తక్కువమంది ఉన్నారు. ఎవరూ వ్యవసాయం చేసే పరిస్థితి లేదు. పట్టణీకరణ పెరిగిపోతోంది. 65 నుండి 70 శాతం మంది వ్యవసాయం మీద ఆధారపడి గ్రామాలలో ఉంటున్నారు. కానీ పట్టణీకరణ పెరిగిపోయి కౌలుకిస్తున్నారు. ఆ కౌలు అనేది కాగితాలమీద ఉండదు. మీరు చేస్తున్న రుణమాఫీ కూడా భూస్వాములకు వస్తుందే తప్ప ఏ కౌలు రైతుకీ వచ్చే పరిస్థితి లేదు. మంత్రిగారు ఇందాక చెప్పారు. ఆ లెక్కలన్నీ వాస్తవం కూడా కాదు. కౌలు రాసుకోవడానికి ఎవరూ కూడా సిద్ధపడడంలేదు.

ఉ.1.20

కాబట్టి మీరు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేయాలి. ఇప్పుడు భూసార సంరక్షణ సర్వే చేయాలి. అలాగే పురుగు మందులు, ఫెర్టిలైజర్స్ ఇష్టం వచ్చినట్లు వాడేస్తున్నారు. ఒక ట్రాక్టర్ కొనాలంటే చిన్న రైతులు కొనలేరు, ఆ టైమ్‌కి ఎవరిదైనా తీసుకుని వాడుకుంటున్నారు. NREGP వల్ల ఎవ్వరూ కూలి పనికి కూడా రావడం లేదు. రైతులెవ్వరూ ఆనందంగా లేరు. ఎంత కష్టపడినప్పటికీ నష్టాలే తప్ప ఏమీ మిగలడం లేదు. అలాగే పోలవరం ప్రాజెక్టు గురించి నేను బాగా స్టడీ చేశాను. వాళ్లు బాగా చేస్తున్నారు, వారి తలంపుని నేను శంకించడం లేదు. కానీ గత పరిణామాలని చూస్తే 1981లో నేను మంత్రిగా, ముఖ్య మంత్రిగారు వెళ్లాము, శిలా ఫలకాలు పెట్టారు, తరువాత శ్రీ నందమూరి తారక రామారావు గారు పెట్టారు, తరువాత శ్రీ వై.ఎస్ రాజశేఖర్ గారు పెట్టారు. కానీ ఇది మాత్రం పూర్తి కావడం లేదు. పాలకపక్షం వారు ఇప్పుడైనా బాగా క్లోజ్‌గా మానిటర్ చేసి కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు తీసుకువచ్చి ఏదైనా చేయగలిగితే అంత ఉత్తమమైన ప్రాజెక్ట్ మనకు

ఎక్కడా లేదు.  పోలవరం ప్రాజెక్టు మనకు రావడాన్ని భగవంతుడు ఇచ్చిన వరంగా నేను భావిస్తున్నాను.

టూరిజంలో పంజాబ్, హర్యానా మరియు హిమాచల్ రాష్ట్రాల్లో చూసినట్లయితే, అక్కడి రాష్ట్రాల్లో రోడ్ల వెంబడి వెళుతూ వుంటే ఎక్కడనో ఒక దగ్గర చెరువులు గాని ఉంటే అక్కడ నాలుగు కుర్చీలు వేసి టూరిజాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నారు.  అలాంటివి మనకు ఎన్నో అనువైన ప్రదేశాలున్నప్పటికీ, టూరిజం అభివృద్ధి ఎక్కడా లేదు.  గౌరవనీయులైన శ్రీ ఆంజనేయ రెడ్డి  గారు ఉన్నప్పుడు టూరిజం పేరుమీద అతిథి గృహాలు నిర్మించారు గాని అవన్నీ ఇప్పుడు శిథిలావస్థలో ఉన్నాయి.  టూరిజాన్ని అభివృద్ధి చేయాలని రోజూ పత్రికల్లో చూస్తున్నాము.  కానీ, అభివృద్ధి అనేది ఇంతవరకు ఏమీ జరగలేదు.  దానిని దృష్టిలో పెట్టుకొని చేసినట్లయితే మనకు చాలా కాలువలు, సముద్రమట్టాలాంటి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి టూరిజాన్ని అభివృద్ధి చేయాలని కోరుతున్నాను.

ఇక్రిశాట్‌లో కూడా ఎన్నో మంచి విత్తనాలున్నాయి.  కానీ, మనం ఉపయోగించుకోవడం లేదు.  మనం ఎక్కువగా ట్రెడిషనల్ వరి వంగడాల మీద వెళుతుండడం వల్ల పెద్దగా ఈల్డ్ కూడా రావడం లేదు.  అందుకని ఇక్రిశాట్ వారి సహకారం తీసుకొని మనం ముందుకు పోయినట్లయితే మంచి పంటలు పండించడానికి అవకాశం ఉంది.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు ః ఇక్రిసాట్ తో మొన్ననే ఒప్పందం కూడా కుదుర్చుకున్నాం.

శ్రీ కంతేటి సత్యనారాయణ రాజుః  చాలా సంతోషమండి.  దాని క్రాప్ పెంచాలి.  చైనాలో అరవై క్వింటాలు వస్తూ ఉంటే, ఈజిప్టులో తొంభై క్వింటాలు వస్తూ ఉంటే మనం ముప్పై క్వింటాళ్లకే పరిమితమై పోతున్నాం.  50 శాతం వర్క్ ఫోర్స్ ఉంది.  65 నుండి 70 శాతం మంది రైతులు గ్రామాల్లో ఉన్నారు.  చేసుకోడానికి అవకాశాలున్నాయి.  తమిళనాడులో ల్యాండ్ సీలింగ్ కూడా తీసివేశారు.  ఒకవేళ మనదగ్గర కూడా ల్యాండ్ సీలింగ్ తీసేస్తే బాగుంటుందేమో ఆలోచించండి. కోఆపరేటీవ్స్ గాని ఫామ్ చేసుకొని రైతులు మంచిగా చేసుకోగలిగితే చాలా లాభాలున్నాయి.   డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారి సమయంలో కొంత చేస్తామని చెప్పారు గాని, మొత్తం మీద అది జరగలేదు.  అమెరికాలో నైతే చేయగలుగుతున్నారు.  మన దగ్గరైతే ఎవరైనా కబ్జా రైతు మాత్రమే పెద్ద ఎత్తున డబ్బు ఖర్చుపెట్టి చేయగలుగుతాడు తప్ప, వేరే ఎవరు చేయడం లేదు.  ఇప్పుడు కౌలు రైతులు గాని, ఇంకెవరైనా గాని ప్రతి రైతు ఎవరైనా అవసరం ఉన్నా లేకపోయినా బ్యాంకులో లోన్ తీసుకొంటున్నారు.  ఋణ మాఫీలు ఉంటాయని వారికి తెలుసు.  కౌలుకు వచ్చే రైతు మన దగ్గర డబ్బులు తీసుకొని వెళతాడు.  కానీ, పంట పండితే ఇస్తున్నారు, పండకపోతే లేదు.  ఒకప్పుడు నలభై బస్తాలు ఇచ్చేవారు.  కాని, ఇప్పుడు ముప్పై బస్తాలు కూడా ఇవ్వడానికి సిద్ధపడడం లేదు. కాబట్టి కౌలు రైతులు ఎప్పుడూ కూడా బాగుపడరు.  వారికి ఎప్పుడు ఉండే కష్టాలు అప్పుడు ఉంటాయి.  వారు ఏదో పచ్చిగడ్డి కోసం ఆశిస్తారు తప్ప, ఏమిలేదు.

పశ్చిమ గోదావరిలో కొల్లేరు సమస్య వచ్చింది.  1999లో తెలుగుదేశం ప్రభుత్వం పాలనలో ఉన్నప్పుడు వారు ఒక జీఓ తెచ్చారు.  Wildlife sanctuary చేయాలని డెబ్బై వేల ఎకరాల మీద ఒక జీఓ తీసుకువచ్చారు.  వారి సమయంలో ఏమి కాలేదు.  ఆ తరువాత డా.వై.ఎస్. రాజశేఖర రెడ్డి

గారు ముఖ్యమంత్రి అయిన తరువాత సుప్రీంకోర్టు డైరెక్షన్ అని చెప్పి, బాంబులు పెట్టి భయభ్రాంతులు చేసి మొత్తం కొట్టి వేశారు. డెబ్బైవేల ఎకరాల్లో ఒక ఎకరానికి నాలుగు టన్నులు తీస్తున్నారు రైతులు. సగటున తీస్తే ఎకరానికి నాలుగు లక్షల రూపాయల ఆదాయం వస్తుంది. ఆ పొలాలన్ని ఎటువంటివి అంటే, వ్యవసాయానికి అసలు పనికి రావు. ఎక్కడో దూరంగా ఉన్నటువంటి గ్రామస్తులు ఇక్కడ ఏదో నాలుగు ఎకరాలు కొనుక్కొని గట్లు వేసుకొని చక్కగా చేసుకుందామని అంటే, బాంబులు పెట్టి పగులగొట్టి దానికి పరిహారం ఇవ్వలేదు. పాకిస్తాన్, చైనావారిలాగా చూశారు. భయభ్రాంతులను చేశారు. కొద్ది రోజులైతే వారు అడుక్కుతిన్నారు. అలా కొట్టివేసిన వారికి పద్మశ్రీ ఇవ్వమని సిఫారసు చేశారు. గౌరవ ప్రధానమంత్రి, మోడీ గారు మరియు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు అనేక సందర్భాల్లో దీనిని 3 కాంటూరు చేయాలని చెప్పారు. ఆవిధంగా చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. అందులో 15వేల ఎకరాలు పట్టా పొలాలే. ఆ 15వేల ఎకరాల్లో పరిహారం ఇవ్వలేదు. అక్కడ wildlife sanctuary పెడితే, అగ్గిపెట్టె పట్టుకెళ్లకూడదు, ఇంజన్ ఆడించకూడదు. దూరదృష్టి లేకుండా ఇన్ని రెస్ట్రిక్షన్స్ తీసుకురావడం చాలా దురదృష్టం. అది పెట్టడం వల్ల సర్వనాశనం అయిపోయారు. ఒక ఎకరంలో నాలుగు టన్నులకు నాలుగు లక్షల ఆదాయం వస్తే ఎంతోమంది బ్రతుకుతారు. అటువంటిది తీసుకురావద్దని మన శాసనసభలో తీర్మానం కూడా చేసి కేంద్రానికి పంపించారు. వెంటనే ఇది టేకప్ చేసి 3వ కాంటూర్‌కు రిస్ట్రిక్ట్ చేసినట్లయితే, ఎంతో ప్రొడక్షన్ వస్తుంది, ఎందరికో లాభం జరుగుతుంది. ఫిషరీస్ డిపార్ట్‌మెంట్‌లో రీసెర్చ్ అనేది జరగడం లేదు. అవన్నీ ఎత్తేయండి. అన్నీ పాతవే ఉన్నాయి తప్ప, ఇంతవరకు కూడా ఒక కొత్త ఫిష్ అనేది రాలేదు. కేంద్ర ప్రభుత్వంలోని ఫిషరీష్ కమిటీలో నేను మెంబరుగా ఉన్నాను. అన్ని పాతవే ఉన్నాయి, కొత్తవి వంగడాలు ఏమీ రావడం లేదు. అలాగే ప్రాన్స్ విషయంలో కూడా కొత్తగా వనామి వచ్చి రైతులందరూ బాగుపడ్డారు. అంతకుముందు 85% మోర్టాలిటీ రేటు ఉండేది. ఇప్పుడు 15%కు వచ్చి రైతులు కొంత బాగుపడ్డారు. ఇప్పుడు ఒక ఎకరానికి 5 లక్షలనుండి 10 లక్షలు వస్తోంది. అసలు చెరువులో చేపలు వేసుకుంటామంటే వేసుకోవద్దు మా పర్మిషన్ కావాలంటారు. వారికి నిబంధనలు ఎందుకు పెడుతున్నారు? వారికి నిబంధనలు ఎందుకు? రాష్ట్రంలో కరువు వచ్చి బియ్యం ఏమైనా తక్కువ వచ్చాయా? అనుమతుల పేరు చెప్పి లంచాలు తీసుకుంటున్నారు. ఈరోజు రైతు అన్నవారు ఎవరూ అసెంబ్లీలో లేరు. ఎందుకంటే శాసనసభకు వెళ్లాలంటే పది కోట్లు పెట్టుకోవాలి, ఇరవై కోట్లు పెట్టుకోవాలి. ఎవరు పెట్టుకోగలరు?

మ.01.30

ఇవాళ అసెంబ్లీలో రైతనేవాడే లేడు. ఇవాళ పదేసి కోట్లు, ఇరవై కోట్లు అని చంద్రబాబు నాయుడు గారంటున్నారు. మీరంతా చాలా అదృష్టవంతులు. అసెంబ్లీలో ఒక్కొక్కరు ఇరవై కోట్లు ఖర్చుబెట్టుకుని వచ్చారు. మీరు చాలా అదృష్టవంతులని చాలా బాగా చెప్పాడు. ఇటువంటి మాఫియా తయారైపోయింది. ఇసుక మాఫియా, సారా మాఫియా, కాంట్రాక్టర్లు, మైన్స్, రియల్ ఎస్టేటర్లు ఇలా రాష్ట్రంలో దోపిడీ జరుగుతోంది. అసలు లోకాయుక్త కూడా కర్నాటక మాదిరిగా మీరిక్కడ ఎందుకు పెట్టరు? పెట్టండి. పొలిటికల్ విండికేషన్‌తో చేసినప్పుడు కూడా మేం బయటపడ్డాం. నీతి నిజాయితీకి..అధ్యక్షా, మీరూ, నేనూ అన్ని తరాల రాజకీయ నాయకుల్ని చూశాం. సంజీవరెడ్డి గార్ని, బ్రహ్మానంద రెడ్డి గార్ని చూశాము. రెండవ తరం చూశాం. ఆ తరంలో మనమూ ఉన్నాం. మూడవ తరం, నాలుగవ తరం కూడా చూస్తున్నాము.

శ్రీ కె.వి.సత్యనారాయణ రాజు ః ఇంకో తరం కూడా చూడాల్సి వస్తుంది.

శ్రీ కంతేటి సత్యనారాయణ రాజుః నాలుగు తరాల మనుషుల్ని మనం చూశాం అధ్యక్షా. మా టైం అయిపోయిన తరువాత మేమిద్దరం వెళ్లిపోతాం.

శ్రీమతి పి. శమంతకమణిః అధ్యక్షుల వారు కూడా చూస్తారు!

శ్రీ కంతేటి సత్యనారాయణ రాజుః అధ్యక్షుల వారికి మీ దయుంటే తప్పకుండా చూస్తారు. ఆయన అదృష్టవంతులు. ఎప్పుడూ ఆ కుర్చీలోనే కూర్చుంటారు. క్రిందకి దిగడం లేదు. మేమంతా 1972, 1974 నుండి ఈ హౌస్‌లో ఉన్నాము. రద్దయిన కౌన్సిల్‌ని మళ్లీ మేం పట్టుకొచ్చాము. ఏడేళ్లు పట్టింది. కౌన్సిల్ రాజు అని నాకు పేరు పెట్టారు గానీ, ఇక్కడకి రావడానికి మళ్లీ ఏడేళ్లు పట్టింది.

అధ్యక్షా, ఈము పక్షులకు సంబంధించి ఎంత పబ్లిసిటీ ఇచ్చారంటే .. రెక్కలు, ముక్కు, గోళ్లు, ఆయిల్, మటన్ మొదలైన వాటన్నింటి రూపేణా ఎంతో డబ్బు వస్తుందని చెప్పి, వెటర్నరీ యూనివర్సిటీ వాళ్లు, యానిమల్ హస్బెండరీ వాళ్లు ఎటువంటి జాగ్రత్తచర్యలు తీసుకోకుండా, వాటి మార్కెట్ తెలుసుకోకుండా రైతుల్ని ఎంకరేజ్ చేశారు. ఆ విధంగా రైతులు సుమారు రూ.50 కోట్లు నష్టపోయారు. ఇప్పుడు అడుక్కుతింటున్నారు. వారంతా బ్యాంకు రుణాలు తీసుకున్నారు. గవర్నమెంట్ తరఫు నుండి ఎలాంటి సాయం లేదు. వాళ్లెంతో ఫర్నిష్ చేశారు. డిపార్టుమెంటు వాళ్లు సర్టిఫికెట్లు ఇచ్చారు. వాళ్లు ఎంకరేజ్ చేసి, ఇదిగో మీరు చేయండి, చేయండని చెప్పారు. ఇంత చేసినా, వాటికి మార్కెట్ లేదు. Collateral security తీసుకున్నారు. బ్యాంకులు ఇన్‌సిస్ట్ చేయకపోయినా, సెక్యూరిటీస్ వాళ్ల దగ్గర ఉండిపోయాయి. కాబట్టి, దాని విషయంలో ప్రభుత్వం సాయం చేస్తే బాగుంటుంది.

శ్రీ పత్తిపాటి పుల్లారావుః ఏం చేస్తే బాగుంటుందో చెప్పండి.

శ్రీ కంతేటి సత్యనారాయణ రాజుః ఏం చేస్తే బాగుంటుందంటే, రుణమాఫీ వర్తింపు వీళ్లకూడా చేయండి. అంతకంటే ఏం చేస్తారు! అధ్యక్షా, మన రాష్ట్రంలో బకింగ్‌హామ్ కెనాల్ ఉంది. దీనికి 210 సంవత్సరాల చరిత్ర ఉంది. దాన్ని మా చిన్నప్పుడు చూశాం. దాని ద్వారా మన దగ్గర నుండి మద్రాసు వరకు ట్రాన్స్‌పోర్టేషన్ సులువుగా ఉండేది. దాన్ని పెద్ద లైనుగా మనం తీసుకున్నట్లయితే, ఎంతో టూరిజం డెవలప్ చేయడానికి అవకాశముంది. మద్రాసు వాళ్లు ఆల్‌రెడీ స్టార్ట్ చేశారు. వాస్తవానికి ఈ బకింగ్ హామ్ కెనాల్ మద్రాసు నుండే మొదలౌతుంది. కాకినాడ వరకు ఉంది. ఇది చాలా ఉత్తమమైన ప్రాజెక్టు. ఇది కోస్టల్ ఏరియాకు కేవలం కిలోమీటరు దూరంలోనే ఉంటుంది. సునామీల నుండి కూడా ప్రొటెక్టు చేసుకోవచ్చునని రికార్డులు చెబుతున్నాయి. మద్రాసు వాళ్లు ముందుకెళ్లారు కాబట్టి, వాళ్లని ఆదర్శంగా తీసుకుని కెనాల్ మనం స్టార్ట్ చేస్తే, టూరిజం అభివృద్ధి చెందుతుంది, ట్రాన్స్‌పోర్టేషన్‌కు కూడా అనుకూలంగా ఉంటుంది. తక్కువ ఖర్చులో మద్రాసుకు పోవడానికి అనేక అవకాశాలున్నాయి. కాబట్టి, దీన్ని వెంటనే టేకప్ చేయమని కోరుతున్నాను. మద్రాసుకు మీరు ఎవర్నైనా పంపించండి. మద్రాసు వాళ్లు టేకప్ చేశారు. ఆల్‌రెడీ

కొంత డబ్బు కూడా వాళ్లు దీనిపైన ఖర్చుపెట్టారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వాళ్లు కూడా నిధులిస్తున్నారు. కాబట్టి, మీరు టేకప్ చేసి, మళ్లీ బకింగ్ హామ్ కెనాల్‌ని పునరుద్ధరించాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

MR. CHAIRMAN: I request all the Members to join in the Lunch. I also invite the Print and Electronic Media people to join in the Lunch provided in the Dining Hall of Jubilee Hall.

Now, the House is adjourned for Lunch Break for One Hour. Again we will meet at 2-30 p.m.

(Then, the House, adjourned for Lunch Break at 1-35 p.m.)

మ.2.30–2.40

**AFTER LUNCH BREAK, THE HOUSE RE-ASSEMBLED AT 2.32 P.M.**
**(HON'BLE CHAIRMAN IN THE CHAIR)**

శ్రీ పీరుకట్ల విశ్వ ప్రసాదరావు (స్థానిక సంస్థలు, శ్రీకాకుళం) : అధ్యక్షా, 2014–15 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ మీద మాట్లాడేందుకు నాకు అవకాశం ఇచ్చినందుకు గౌరవ ఛైర్మన్ గారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

అధ్యక్షా, రాష్ట్రం విడిపోయిన తరువాత నవ్యాంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ సమగ్ర స్వరూపాన్ని పరిశీలించినట్లయితే అవసరమైన రంగాలకు కేటాయింపులను తగ్గించి అనవసరమైన రంగాలకు కేటాయింపులు పెరిగాయి. గౌరవ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు గారి చతురత, అంకెల గారడీ దీనిలో స్పష్టంగా కనపడుతోంది. 2014–15 సంవత్సరానికి రాబడి రూ.70,000 వస్తుందని అనుకుంటే అది రూ.80765కోట్లుగా అంచనా వేశారు. అలా రాబడి అంచనాలలో రూ.10వేల కోట్లు తేడా చూపారు. రాష్ట్ర ఆదాయనికి గల వనరులు, దానిపై వచ్చే ఆదాయాన్ని బడ్జెట్‌లో పొందుపరచలేదు. మీరు నెల రోజుల క్రిందట విడుదల చేసిన శ్వేత పత్రాలకు నేటి బడ్జెట్‌కు ఎక్కడా పొంతన కనపడడం లేదు. రాష్ట్రం ఉమ్మడిగా ఉన్నప్పుడు రూ.14212కోట్లు సంక్షేమ పథకాలకు కేటాయిస్తే ఇప్పుడు అవి రూ. 4149కోట్లకు తగ్గింది. అనగా సంక్షేమ రంగానికి ఈ బడ్జెట్‌లో కేటాయింపులు బాగా తగ్గాయి. ఎస్సీ, ఎస్టీ సబ్–ప్లాన్‌కు నిధులు కేటాయింపులు తగ్గించడం జరిగింది. బి.సీ సబ్–ప్లాన్ ప్రస్తావన లేకపోవడం వల్ల బి.సీ వర్గాలకు ఒక్కింత బాధను కలిగించింది. ఎన్నికల సమయంలో బడా హామీలు ఇచ్చారు. రైతు ఋణాలను పూర్తిగా మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. కాని ఈ ఋణాల మాఫీకి సంబంధించి బడ్జెట్‌లో చాలా తక్కువగా అంటే కేవలం రూ.5000కోట్లు మాత్రమే కేటాయించారు. దాదాపు 40 వేల కోట్లకు పైగా వ్యవసాయ ఋణాలను మాఫీ చేయవలసి ఉంటే రూ.5000కోట్లే కేటాయించడం చాలా శోచనీయం. డ్వాక్రా సంఘాల ఋణాల మాఫీకి అవసరమైన నిధుల కేటాయింపు జరగలేదు. ఈరోజు రైతులు చాలా ఆవేదనతో ఉన్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ మొదలైంది. నెల, రెండు నెలల్లో పంట వచ్చే టైంలో రైతులకు అవసరమైన పంట ఋణాలకు సంబంధించి రీ–షెడ్యూల్ జరగలేదు. రైతులు కొత్తగా లోన్లు కావాలంటే బ్యాంకులు ఇవ్వడం లేదు. దీని వల్ల రైతులు చాలా ఆందోళనలో ఉన్నారని తెలియజేస్తున్నాను. నీటి పారుదల రంగంలో ఉన్న ప్రాజెక్టుల పరిస్థితిని బట్టి, అవసరాన్ని బట్టి కేటాయింపులు చేయలేదు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి మడ్డువలస జలాశయం పథకం కాని, వంశధార ప్రాజెక్టుకు కేటాయింపులు ఆశాజనకంగా లేకపోవడం వల్ల ఈ సంవత్సరం కూడా రైతులు సాగునీటికి ఇబ్బందులు పడవలసి వస్తుందని మీ ద్వారా తెలియజేస్తున్నాను. 9 గంటలు నాణ్యమైన విద్యుత్తును నిరంతరాయంగా సరఫరా చేస్తామని చేసిన వాగ్దానం ఎప్పటి నుండి ఏ విధంగా ఇస్తారో బడ్జెట్‌లో వివరించలేదు. ఇక, గృహ నిర్మాణ రంగం విషయానికి వస్తే, గృహ నిర్మాణ సామాగ్రి, సిమెంట్ ధరలు రోజుకు, రోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో వాటి నియంత్రణకు ఏ విధమైన చర్యలు తీసుకుంటారో బడ్జెట్‌లో చెప్పలేదు.

డ్వాక్రా మహిళకు సంబంధించి రూ.1.00 లక్ష లోపు ఋణాలను మాఫీ చేస్తామని చెప్పిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవడానికి అవసరమైన కేటాయింపులు ఈ బడ్జెట్‌లో లేవు. సాధారణ మహిళలు, గృహిణులకు సంబంధించి ఈ బడ్జెట్‌లో ఎటువంటి ప్రస్తావన కనిపించలేదు. నిత్యావసర

వస్తువుల ధరలు రోజు, రోజుకు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో వాటి నియంత్రణకు మార్గాలను సూచిస్తే బాగుండేది. రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధుల ప్రస్తావన లేదు. అది ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉండడం ప్రజలలో అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సవరణ చేయాలి. అందుకు సంబంధించిన ప్రస్తావన ఈ బడ్జెట్‌లో ఎక్కడా పొందుపరచ లేదు. అలాగే, నష్టాల బారిన పడిన ఆర్టీసీని ఆదుకునేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదు.

ఇకపోతే, రహదార్లకు రూ.2612కోట్ల కేటాయింపులు జరిగాయి. పల్లెలలో ఉన్న మట్టి రోడ్లను తారు రోడ్లుగా మార్చడానికి కేటాయించిన రూ.37కోట్లు ఏ మూలకు చాలవు. రూ.37కోట్లతో పల్లెలలో ఉన్న మట్టి రోడ్లను తారురోడ్లుగా మార్చడానికి ఏ విధంగానూ సరిపోవు. జిల్లా రహదారులకు కేవలం రూ.178కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ కేటాయింపులు ఏ మూలకు చాలవని నిపుణులు చాలా మంది చెప్పడం జరిగింది.

గృహ నిర్మాణ రంగానికి రూ.808 కోట్లు కేటాయింపులు జరిగాయి. ఈ నిధులతో రాష్ట్రంలో ఎన్ని ఇళ్లను నిర్మిస్తారు, ఎంత మంది లబ్దిదారులకు ప్రయోజనం చేకూరుతుందని మనం ఆలోచించవలసి ఉంది. గత ప్రభుత్వం ఎవరు ఇల్లు కట్టుకున్నా నిధులు ఇచ్చే పరిస్థితిలో ఉంది. వాళ్లకు ప్రోత్సాహం ఇచ్చి అన్ని రకాలుగా సహాయం చేసేవాళ్లు. ఈరోజు ఇళ్లు కట్టుకోవాల్సిన లబ్దిదారులు చాలామంది ఉన్నా వారికి ఏ విధమైన నిర్మాణం జరుగుతుందో బడ్జెట్ అంచనాను బట్టి మనకు తెలుస్తోంది. ఈనాడు ప్రవేశపెట్టిన ఎన్.టి.ఆర్ సుజల స్రవంతిలో భాగంగా రెండు రూపాయలకే 20 లీటర్ల శుద్ధమైన త్రాగునీటిని ఇస్తామని వాగ్దానం చేశారు. కాని ఈ పథకాన్ని రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలో ఒకేసారి ప్రారంభిస్తే బాగుంటుంది. ఫ్లోరైడ్ అధికంగా ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలని మీ ద్వారా కోరుతున్నాను. అలాగే, గిరిజన ప్రాంతాలలో మంచినీరు లభించక ఇబ్బందులు పడే ప్రాంతాలు ఉన్నాయి. వాటికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సభ ద్వారా కోరుకుంటున్నాను. అలాగే, వర్షాభావం ఉన్న ప్రాంతాలలో నీటి ఇబ్బందులు ఇప్పటికే ఉన్నాయి. వాటిని కూడా గుర్తించి ప్రాధాన్యత ఇవ్వాలని సభ ద్వారా కోరుకుంటున్నాను.

ఇంటికి ఒక ఉద్యోగం, వికలాంగులకు పెన్షన్, నిరుద్యోగ భృతికి ఎటువంటి కేటాయింపులు లేవని తెలియజేస్తున్నాను.

ఆరోగ్య రంగం విషయానికి వస్తే, ప్రణాళిక కేటాయింపులలో రూ.3348కోట్లు , ప్రణాళికేతర కేటాయింపుల క్రింద రూ.10,041కోట్లు కేటాయించారు. గ్రామీణ ప్రాంతాలలో వైద్యశాలలు, మౌలిక వసతులు ఏర్పాటు చేసి, డాక్టర్ల సంఖ్యను పెంచి మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ఏర్పాటు జరగాలి. గత ఏడాది కేటాయింపుల కన్నా ఈ ఏడాది కేటాయింపులు చాలా వరకు తగ్గించడం జరిగింది. ఈనాడు ఐటిడిఏ పరిధిలో కాని, ట్రైబల్ ఏరియాలో వచ్చే విష జ్వరాలను నివారించడానికి అక్కడ కొన్ని పిహెచ్‌లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఏజెన్సీ ప్రాంతాలలో ఇప్పటికే విషజ్వరాల ప్రభావం విపరీతంగా ఉంది. వాటిని నివారించడానికి ఎక్కువ కేటాయింపులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సభ ద్వారా కోరుకుంటున్నాను. అన్ని ప్రభుత్వ పథకాలకు ఆధార్‌తో లింకప్ చేయడం మంచి కార్యక్రమమే. కాని, ముందుగా అందరికి ఆధార్ కార్డులు అందేటట్లుగా చర్యలు తీసుకోవాలని సభ ద్వారా కోరుతున్నాను. నవ్యాంధ్ర నిర్మాణానికి

అవసరమైన మౌలిక వసతుల కల్పన, రాజధాని నిర్మాణానికి కేంద్ర సహాయం గురించి ఈ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. అదే విధంగా, బడ్జెట్ ప్రతిపాదనలో సింహభాగంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దూషించడానికే అధిక ప్రాధాన్యతను ఇచ్చారు. టిడిపి హయాంలో రైతుల ఆత్మహత్యలు 310 ఉన్నట్లు ఆ తరువాత అవి 1943కు పెరిగినట్లు సెలవిచ్చారు. మరి ఆనాటి లెక్కలను బట్టి చూస్తే, 310 నుండి 74 వరకు తగ్గించిన ఘనత ఆనాడు కాంగ్రెస్ పార్టీదే. రైతులకిచ్చే అనేకమైన ప్రయోజనాల వల్ల మాత్రమే తగ్గించడం జరిగిందని సభకు తెలియజేస్తున్నాను. అధ్యక్షా, ఉత్తరాంధ్ర జిల్లాలలో అధిక శాతం కూలీలు ఇతర ప్రాంతాలకు వలస పోయి ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. వాటిని నివారించడానికి బడ్జెట్‌లో సూచనలను పొందుపరచలేదు. ఇది చాలా అవసరం. మొన్ననే చెన్నైలో కాని, ఇతర ప్రాంతాలలో కాని చూశాం. చాలామంది బ్రతుకుతెరవు కోసం వలసి పోయి ప్రాణాలను పోగొట్టుకుంటే వారి వంక చూసే పరిస్థితి లేదు కాబట్టి వారికి ఇక్కడే ఉపాధి కల్పిస్తే వారు మరొక ప్రాంతానికి వెళ్లకుండా స్థానికంగానే పనులు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది కాబట్టి వారికి ఏదైనా భృతి కల్పించాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

చివరిగా, బడ్జెట్ మొత్తం ఆత్మనింద పరస్తుతి అన్నట్లుగా ఉందని ఈరోజు ప్రజలు చర్చించుకోవడం జరుగుతుందని తెలియజేస్తూ , నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు గౌరవ ఛైర్మన్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ బి. చంగల్‌రాయుడు : అధ్యక్షా, మీరు బెల్లు కొట్టకుండానే మా సభ్యులు తమ ప్రసంగాన్ని ముగించారు.

శ్రీమతి పి. శమంతకమణి : అధ్యక్షా, బడ్జెట్ గురించి మాట్లాడేందుకు అవకాశం ఇచ్చినందుకు ప్రప్రథమంగా మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ప్రజలే దేవుళ్లు...

MR. CHAIRMAN: Mr. Ramachandraiah Garu two years back, I was attended the House of Commons meeting. హౌస్ ఆఫ్ కామన్స్‌లో నేను చూశాను. మొత్తం మాట్లాడే వాళ్ల లిస్ట్ ప్రిపేర్ చేసి ఎవరికి ఎంత టైం కేటాయించారో ముందుగా వ్రాసి పెడతారు. ఒక స్పీకర్ మాట్లాడం అయిపోగానే తరువాత స్పీకర్ వచ్చి మాట్లాడతారు. వారికి ఇచ్చిన టైంలో ఇంకా నాలుగైదు సెకన్లు ఉండగానే ఆ స్పీకర్ కూర్చుంటారు. వెంటనే తరువాత స్పీకర్ లేచి మాట్లాడతారు. బెల్లు కొట్టడం గాని, పిలవడం కాని అక్కడ ఉండదు.

శ్రీ సి. రామచంద్రయ్య : అధ్యక్షా, భారతదేశంలోని చట్ట సభలలో కెల్లా చాలా గౌరవంగా, మెచ్యూర్డ్‌గా డిస్కషన్ జరుగుతూ, ఓపెన్‌గా రియాక్ట్ అయినా మరల మేనేజ్ చేసుకుంటున్న well balanced House ఇది. నేను రాజ్యసభలో 11 సంవత్సరాలు ఉన్నాను. ఈ కౌన్సిల్‌కు హాజరు కాని వాళ్లు దురదృష్టవంతులు.

(హర్షధ్వానాలు)

నేను అనుభవంతో చెబుతున్నాను. మీకు మేము చాలా కృతజ్ఞతలు చెప్పుకోవాలి. మీరు కోపగించుకుంటారు. మరల వెంటనే ఐదు నిమిషాలలో మామూలు స్థితికి వారిని తీసుకువస్తారు. అలాగే మేము కోపంగా మాట్లాడతాము. వాళ్లు కూడా కోపంగా మాట్లాడతారు. మరల వెంటనే reconcile అయిపోతాము. ఏదైనా, సబ్జెక్ట్‌పైనా పోతాము కాబట్టి మిగతా రాష్ట్రాలలోని అప్పర్ హౌస్స్ కన్నా మన కౌన్సిల్‌లో చాలా మెచ్యూర్డ్‌గా మాట్లాడతారు. అది మీ మహత్యమే.

మిస్టర్ ఛైర్మన్ ః ఇది ఎవరి మహత్యం కాదు. స్థల మహత్యం. ఏదైనా ఇష్యూ వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా అక్కడ కాని, ఇక్కడ కాని మాటాడడమనేది that is matured House.

శ్రీ సి. రామచంద్రయ్య ః అధ్యక్షా, డివిజన్‌కు మించిన క్రిటికల్ టైం రాదు. ఆ టైంలోనే ఈ హౌస్ చాలా బ్యాలెన్స్‌డ్‌గా ఉంది. అల్లరి అయింది కూడా . కొందరు వెల్‌లోకి రావడం వంటివి జరిగాయి. అయినా, ఇక్కడ ఎంతో ఉన్నతంగా చర్చలు జరిగాయి.

మిస్టర్ ఛైర్మన్ ః రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా తీర్మానం చేసినప్పుడు కూడా డిస్కషన్ చేసి తీర్మానం చేశాం. సైలెంట్‌గా అందరు ఉన్నారు. మనం ఇచ్చిన వ్యూస్ రికార్డు అయింది. On that, we have submitted our views before the President as called by him. I was also allowed many times.

శ్రీ వాకాటి నారాయణ రెడ్డి ః అధ్యక్షా, చెప్పాలంటే ఈ యొక్క సమన్వయం వల్లనే డివిజన్ జరిగింది. ఆరోజున మైక్‌లను విరగగొట్టుకొని, కొట్టుకోవడం కాని చేసి ఉంటే అది ఢిల్లీలో రాష్ట్ర విభజన జరిగి ఉండేది కాదు. సమన్వయం వల్లనే విభజన జరిగిందని నేను అనుకుంటున్నాను. మరల ఈ గడ్డ మీదనే కూర్చుందామని అంటున్నారు. దయచేసి మనకు అటువైపు ఎక్కడ స్థలం ఇచ్చినా సరే అక్కడ గుడిసె వేసుకోనైనా కాపురం ఉందాం.

మిస్టర్ ఛైర్మన్ ః నారాయణ రెడ్డి గారు.. మీకు స్పీడ్ ఎక్కువ.

శ్రీ వాకాటి నారాయణ రెడ్డి ః అధ్యక్షా, కొత్త వాళ్లం కదా. ఇంకా దెబ్బలు తినలేదు.

మిస్టర్ ఛైర్మన్ ః నారాయణ రెడ్డి గారూ.. ఎప్పుడైనా ముందు ఫస్ట్ గేర్‌లో వెళ్లి, తరువాత థర్డ్ గేరులోకి మారాలి. ముందుగానే థర్డ్ గేరులో వెళ్లి దెబ్బలు తినవలసి వస్తుంది. అప్పుడు కష్టమవుతుంది.

మ. 2.50

శ్రీ సి. రామచంద్రయ్య ః ఈ రెండు రోజులు బడ్జెట్ మీద చాలా చక్కటి చర్చ జరిగింది. లోపాలను సభ్యులు తెలియచేశారు. ప్రభుత్వానికి కూడా ఇది ఉపయోగకరం.

మిస్టర్ ఛైర్మన్ ః ఈ విషయాన్ని మంత్రులు కూడా చెప్పారు.

శ్రీ సి.హెచ్. అయ్యన్నపాత్రుడు ః శాసనసభ అసలు జరగడం లేదు. ఈ సభలో చర్చలు బాగా జరుగుతున్నాయి. వచ్చేసారి అవకాశం వస్తే, మేము ఈ సభలో కూర్చోవాలనుకుంటున్నాము సార్.

శ్రీ బి. చెంగల్ రాయుడు ః వెల్‌కమ్ సార్. అయిదేళ్ల తరువాత రండి.

శ్రీమతి పమిడి శమంతకమణి ః అధ్యక్షా, భోజనం తరువాత కాసేపు నవ్వులు ఉంటేనే బాగుంటుంది.

మిస్టర్ ఛైర్మన్ ః మధ్యాహ్నం 1.30కు నీరసం అనుకున్నాను. ఇప్పుడు ఆయాసం అనుకుంటున్నాను.

శ్రీమతి పమిడి శమంతకమణి ః  ఆయాసం లేకుండా మీరు పాయసంలాంటి మాటలు మాట్లాడుతున్నారు.

శ్రీ రుద్రరాజు పద్మరాజు ః అందరిలో కవితాహృదయం ఉన్నది సార్.

శ్రీమతి పమిడి శమంతకమణి ః  మీ కవితలో ఉన్నంత ఆవేశం మాకు రాదు. అధ్యక్షా, ప్రజలే దేవుళ్లు, సమాజమే దేవాలయమని నమ్ముకున్న సిద్ధాంతాన్ని ప్రజల వద్దకు తీసుకువచ్చిన మహానుభావుడు, చిరస్మరణీయుడైన స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావుగారి మానసపుత్రికే ఈ తెలుగుదేశం పార్టీ. ఆయన ఏ ముహూర్తాన ఈ పార్టీని నెలకొల్పారో, ఆ సిద్ధాంతాలని నమ్మిన ప్రజలు ఆయనకు పట్టంకట్టారు. ఈ రోజున చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఒక ప్రాంతీయ పార్టీ 30 సంవత్సరాలపాటు నిలదొక్కుకుందంటే, అందుకు ఆయన చేపట్టిన రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం, బలహీన వర్గాలకు గృహనిర్మాణ పథకం చాలా వరకు ప్రజల వద్దకు వెళ్ళింది. గతంలో ఎక్కడా లేని విధంగా ఇటువంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలని ప్రజల వద్దకు తీసుకు వచ్చి, ప్రజాకర్షణ పొంది తన పార్టీని అనతికాలంలోనే అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత కేవలం, మన నందమూరి తారకరామారావుగారికే దక్కిందని నేను గర్వంగా చెపుతున్నాను. అదేవిధంగా, ఆయన చేపట్టిన సిద్ధాంతాన్ని, ఆయనను స్ఫూర్తిగా తీసుకున్న శ్రీ ఎన్.చంద్రబాబు నాయుడుగారు ప్రజల మధ్యకు వెళ్ళి తాను సుదీర్ఘ చరిత్ర కలిగినవాడైనా, ప్రజల మధ్యకు వెళ్ళి నిలబడాలన్న సిద్ధాంతంకలవాడు కాబట్టి, ఇంతవరకూ ప్రజా సమస్యలను ప్రజల మధ్యకు వెళ్ళి తెలుసుకున్నాడు. కాబట్టే, ఎన్నో సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఒక పార్టీని ప్రజలు దూరంగా పెట్టి, మళ్ళీ ఆయనను గెలిపించారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో రాష్ట్రం ముందుకు వెళ్ళాలన్నా, ఈ పరిస్థితులలో ప్రజలు అభివృద్ధి చెందాలన్నా అన్నింటికంటే ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలవారు అభివృద్ధిలోకి రావాలన్నా కేవలం శ్రీ ఎన్. చంద్రబాబునాయుడుగారే సమర్థనీయుడని ప్రజలు నమ్మారు. విభజన జరిగిన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్‌ను పాలించడమనే ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కినందుకు నేను ఆనందిస్తున్నాను. తెలుగుదేశం పార్టీని నమ్మి ఓట్లు వేసినందుకు ప్రజా దేవుళ్ళకు, ముఖ్యంగా అనంతపురం జిల్లావాసినైన నేను అనంతపురం జిల్లా ప్రజలు ఎం.ఎల్.ఏ.లను, ప్రజాప్రతినిధులను అత్యధిక సంఖ్యలో గెలిపించి, ప్రభుత్వాన్ని తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులకు అప్పచెప్పినందుకు అనంతపురం ప్రజా దేవుళ్ళకు, రాష్ట్ర ప్రజా దేవుళ్ళకు నేను తలవంచి నమస్కరిస్తున్నాను.

అధ్యక్షా, ఇక్కడ ఉన్నవారందరూ చాలా అనుభవజ్ఞులు. ఇక్కడ పెద్దవారు ఉన్నారు, అనుభవజ్ఞులు, చాలారంగాలలో ప్రావీణ్యులైనవారు కూడా ఉన్నారు. క్రొత్తగా ఏర్పడిన రాష్ట్ర పరిస్థితి ఎలా ఉందనేది మనందరికీ ఏం తెలియంది కాదు. భారతంలో ఒకసారి చూస్తే, ధర్మరాజు జూదంలో ఓడిపోయిన తరువాత పాండవులు వనవాసానికి వెడితే ఏ విధంగా కష్టాలు ఉంటాయో, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ పరిస్థితి ఆ విధంగా ఉంది. అధ్యక్షా, ఇక్కడ ఉన్నవారందరూ ఏదో ఒక రంగంలో నైపుణ్యం కలిగినవారే. ప్రస్తుతం మనకున్న ద్రవ్యలోటు ఏమిటి? మన నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రం

యొక్క ఆర్థిక పరిస్థితి ఏమిటి? తద్వారా ఈ ఆంధ్రప్రదేశ్ యొక్క నవనిర్మాణానికి ఏవిధంగా చేయాలనేది ఒక ఆలోచన, దానిని దృష్టిలో పెట్టుకుని ఈరోజున బడ్జెట్‌ను ఏర్పాటుచేశారనేది ఇక్కడ ఉన్న సభ్యులందరికీ తెలుసు. సాధారణంగా పిండి కొద్దీ రొట్టె అంటాము. ప్రస్తుత ద్రవ్యలోటును, మనకున్న ఆర్థిక పరిస్థితులను కూడా దృష్టిలో పెట్టుకుని పద్దులన్నింటినీ దృష్టిలో పెట్టుకుని సమన్వయం చేసి ఈ బడ్జెట్ రూపకల్పన జరిపి ప్రజల ముందు ఉంచినందుకు మా ఆర్థిక శాఖామంత్రి శ్రీ యనమల రామకృష్ణుడు గారికి, మన శాసన మండలిలో ప్రవేశపెట్టిన మంత్రివర్యులు శ్రీ నారాయణగారికి కూడా నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ప్రజలయొక్క సమస్యలు తెలుసుకుని నవనిర్మాణానికే కాదు, గతంలోనే 2020 విజన్ అని ప్రకటించి దూరదృష్టి కలిగిన నేత మన ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబునాయుడు గారు. తాను గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే గ్రామీణ ప్రాంతాల పరిస్థితులను తెలుసుకుని, గ్రామీణ యువతను ముందుకు తీసుకురావాలనే ఒక మంచి నిర్ణయంతో టెక్నాలజీని పెంచి, చాలామంది విద్యావంతులైన యువకులను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగానో, హార్డ్‌వేర్ ఇంజనీర్లుగానో తీసుకువచ్చి, గ్రామీణ ప్రాంతంలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ఒక సంపాదనను కల్పించారు. అటువంటి వ్యక్తి ప్రజల మధ్య ఉన్నారు కాబట్టే, ఏ పరిస్థితులు ఎదురైనా పాదయాత్ర ద్వారా ప్రజల వద్దకు వెళ్లి వారిలో నమ్మకాన్ని పెంచుకోగలిగారు. అందువలననే ఈనాడు తెలుగుదేశం పార్టీకి ప్రజలు పట్టంకట్టడం జరిగింది. గతంలోలాగా, ప్రజల యొక్క నమ్మకాన్ని పోగొట్టుకోకూడదనే విశ్వాసంతో ఆర్థిక పరంగా ఈ బడ్జెట్‌ను తయారుచేయడంలో ఏ మాత్రం వెనుకాడడం లేదు. ఈరోజు మనం గమనించినట్లయితే, నా వరకయితే, ఈ బడ్జెట్ ప్రజల కోసం, ప్రజల కొరకు, ప్రజాభీష్టానికి అనుకూలంగా రూపకల్పన చేసిందనేదానిలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ప్రతి పథకానికి కూడా మన దగ్గర ఉన్న సొమ్మును బట్టి మన ఆర్థిక పరిస్థితి ఇలా ఉంది, కాబట్టి, వ్యవసాయ రంగానికి, విద్యారంగానికి, సాంఘిక సంక్షేమానికి ఇంతింత ఇస్తున్నామని ప్రతి ఒక్క రంగానికి కూడా కేటాయించడం జరిగింది. ప్రజలలో ఉన్నవారిని, అనేక ఇతర రంగాలలో ఉన్నవారందరినీ కూడా దృష్టిలో ఉంచుకుని, ఇవన్నీ మీకోసం ఇంతింత ఖర్చుపెడుతున్నామని, ఆ యొక్క పద్దులలో చక్కగా చెప్పడం జరిగింది. అందులో ఏమి కంగారు పడడానికి లేకుండా, అన్నీ టేబుల్స్ వేసి, అన్ని వాక్యాలు వ్రాసి, ఇన్ని కోట్లు ఈ ఈ రంగాలకు ఖర్చు చేస్తున్నామని, ఈ విధంగా మన రాష్ట్రాన్ని ముందుకు తీసుకువద్దామనుకున్నామని చక్కగా చెప్పడం జరిగింది.

మ.03.00

అన్ని గణాంకాలను పట్టికలలో పొందుపరిచి, ఎటువంటి అస్పష్టతకు తావివ్వకుండా, ఈ రంగానికి ఇంత బడ్జెట్‌ను కేటాయిస్తున్నాము, ఈ రంగాన్ని ఈ విధంగా ముందుకు తీసుకువెళ్దామని అనుకుంటున్నట్లుగా బడ్జెట్‌లో చాలా చక్కగా చెప్పడం జరిగింది. మన రాష్ట్ర పరిస్థితి ఏవిధంగా ఉందనేది సభలో ఉన్న విద్యావంతులైన సోదరసభ్యులందరికీ కూడా తెలుసు కాబట్టే వారు చాలా మంచి సలహాలను కూడా ప్రభుత్వానికి ఇవ్వడం జరిగింది. అత్యధిక జనాభా వ్యవసాయంపై ఆధారపడే రాష్ట్రం మన రాష్ట్రం. గతంలో రైతులు పడిన కష్టాలను, వారు ఏ విధంగా మోసపోయారనే విషయాలను కూడా గుర్తుంచుకోవడం జరిగింది. వ్యవసాయం ఈ రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 17 శాతం ఉంది. అయినప్పటికీ, రైతులకు రూ. 1.50 లక్షల కోట్లు రుణమాఫీ చేయడానికి ఆయన కంకణం కట్టుకోవడం జరిగింది. అందువల్లనే రైతులకు రుణమాఫీ అనే దస్త్రంపై ఆయన తన తొలిసంతకం చేయడం జరిగింది. ఆయన ఏ విధంగా చేస్తే బాగుంటుందో సలహాలిస్తే బాగుంటుంది కానీ, గతంలో ఇంత బడ్జెట్ ఉంది, మీరు ఇంత బడ్జెట్టు మాత్రమే పెట్టారు, మాకు అనుమానంగా ఉందని గత చరిత్ర త్రవ్వుకుంటే చాలా కష్టం.

రైతులకు తొమ్మిది గంటలపాటు నిరాటంకంగా విద్యుత్‌ను సరఫరా చేయడం జరుగుతుందని వాగ్దానం చేయడం జరిగింది. తప్పకుండా ఇస్తారు. నిన్ననే సభ్యులు శ్రీ చెంగల్ రాయుడుగారు అన్నట్లు బిడ్డ పుట్టాలంటే కనీసం తొమ్మిది నెలలు ఆగాలి. రాష్ట్రంలో అభివృద్ధి చూపాలంటే కనీసం ఒక సంవత్సరంపాటు అయినా వేచిచూడాలి. నెలలు నిండక ముందే బిడ్డ పుడితే అంగవైకల్యం లేదా మానసిక వైకల్యంతో పుట్టే అవకాశముంది. కాబట్టి, ఒక సంవత్సర కాలంపాటు ఈ ప్రభుత్వానికి సమయం ఇచ్చిన తర్వాత శాసనపరిషత్ సభ్యులంతా ఒక సంవత్సరం తర్వాత మళ్లీ సమావేశం అవ్వవచ్చు. అప్పుడు, "సంవత్సరంపాటు మీకు సమయం ఇచ్చాము, మీరు ఈ విధంగా చేయలేదు, ప్రజలకు ఈ విధంగా చేయడంలో మీరు వైఫల్యం పొందారని" అనడంలో అర్థం ఉంటుంది. కాబట్టి, ఓర్పు అనేది అవసరం, సలహాలు ఇవ్వడం కూడా చాలా అవసరం. గతంలో శ్రీ చంద్రబాబునాయుడుగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కరవు జిల్లా అయిన మా అనంతపురం జిల్లాకు పంట నష్టపరిహారం ఇవ్వడం జరిగింది. ఒక స్పెషల్ ప్యాకేజితో పంట నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకున్న ఘనత కేవలం ఒక్క చంద్రబాబునాయుడు గారికే దక్కింది. ఆ రోజుల్లో శ్రీ వై.యస్.రాజశేఖరరెడ్డిగారు ప్రతిపక్షనాయకుడిగా ఉన్నప్పుడు శాసనసభలో మాట్లాడుతూ, "అనంతపురం జిల్లా ప్రక్కనే ఉన్న మా కడప జిల్లామీద కూడా దయతలచి ఈ స్పెషల్ ప్యాకేజి ఇవ్వండి" అని అన్నప్పుడు కడప జిల్లాకు కూడా ఆయన నష్టపరిహారం ఇవ్వడానికి ఒప్పుకున్నది వాస్తవం. వర్షపాతం తక్కువగా ఉన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ రంగానికి సభలో ఒక స్పెషల్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగింది. ఈనాటి ఉదయమే వ్యవసాయ శాఖా మంత్రి శ్రీ ప్రత్తిపాటి పుల్లారావుగారు మాట్లాడుతూ, "నేను నా చిన్ననాటి నుంచే వ్యవసాయం చేశాను" అని చెప్పడం జరిగింది. కాబట్టి అటువంటి మంత్రివర్యులను ఇచ్చిన శ్రీ చంద్రబాబునాయుడు గారు వ్యవసాయ రంగాన్ని ముందుకు తీసుకువెళ్తారనేదే నా నమ్మకం. వర్షపాతం తక్కువగా ఉంది కాబట్టే బడ్జెట్‌లో బిందుసేద్యానికి ప్రాముఖ్యతనివ్వడం జరిగింది. ఈనాడు 1000 అడుగుల లోతు బోర్లు త్రవ్వినా చుక్కనీరు రావడం లేదు. దానిని దృష్టిలో పెట్టుకుని బిందుసేద్యానికి అత్యధిక ప్రాధాన్యతను ఈ బడ్జెట్‌లో ఇవ్వడం జరిగింది. ఉద్యానవన శాఖను కూడా అభివృద్ధి చేయాలనేదే మా నాయకుడి యొక్క ఆలోచన. ఎందుకంటే, నీరు తక్కువగా ఉన్నచోట బిందుసేద్యం ద్వారా పండ్లతోటల పెంపకం మొదలుపెడితే నష్టపోయిన రైతులకు ప్రతిసారీ పంటనష్టం జరగకుండా పండ్లతోటల ద్వారా లబ్ది పొందాలనే ఉద్దేశ్యంతో చేయడం జరిగింది. అనంతపురం జిల్లాలో పండని పండ్లు లేవు. బిందుసేద్యం ద్వారా రకరకాల పండ్ల తోటలను మా రైతులు నేడు పండిస్తున్నారు. మనం గతంలో అనేక రైతుల ఆత్మహత్యలు చూడడం జరిగింది. రైతులు అప్పులలో కూరుకుపోయి గతంలో చేసుకున్న ఆత్మహత్యలు మళ్లీ జరగకూడదు, తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రజలంతా సుఖంగా ఉండాలి, రైతులు బాగుపడాలి, వారి కుటుంబాలు కూడా అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో ఉద్యానవన శాఖను కూడా ఈ ప్రభుత్వం ఎక్కువగా ప్రోత్సహించడం జరిగింది.

రాష్ట్రంలో అనేక తుఫానులు సంభవించాయి, మేము గతంలో ఆదుకున్నామని సభ్యులు శ్రీ రుద్రరాజు పద్మరాజుగారు చెప్పారు. నీలం, హెలెన్, లైలా, లెహర్ వంటి సినిమా యాక్టర్ల పేర్లను తుఫానులకు గతంలో పెట్టారు. రాష్ట్రంలో 2011 నుంచి 2013వ సంవత్సరం వరకూ మూడు సార్లు తుఫానులు సంభవించడం జరిగింది. ఆశ్చర్యం ఏమిటంటే, 2013 వ సంవత్సరంలో సంభవించిన తుఫానుకు మాత్రమే నష్ట పరిహారం ఇచ్చారు కానీ అంతకు ముందు సంభవించిన రెండు తుఫానుల వల్ల నష్టపోయిన వారికి నష్టపరిహారం ఇవ్వలేదు.

శ్రీ బి.చెంగల్ రాయుడు: అధ్యక్షా, పండ్ల తోటలు అనంతపురం జిల్లాలో అభివృద్ధి చెందడం వాస్తవం. అవి విదేశీ మారకద్రవ్యాన్ని సంపాదిస్తున్నాయి. ఎప్పటి నుంచి ఆ పండ్ల తోటల అభివృద్ధి ప్రారంభమయిందో గౌరవ సభ్యురాలి నోటి ద్వారా వినాలని ఉంది.

శ్రీమతి పమిడి శమంతకమణి: అధ్యక్షా, ఎప్పటి నుంచి అంటే నేను అప్పటి నుంచే రావలసి వస్తుంది. భర్త మోటారు వద్ద, భార్య స్టార్టర్ వద్ద, పిల్లవాడు కయ్యగా ఉన్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఏ ప్రభుత్వంలో ఏమి జరిగిందనేది మాట్లాడితే బాగుంటుంది. గతంలో ఉన్న పరిస్థితి గురించి మాట్లాడితే, అన్నదాతగా ఉన్న తూర్పుగోదావరి మరియు పశ్చిమగోదావరి జిల్లాల్లో ఒకప్పుడు క్రాప్ హాలిడే కూడా రావడం జరిగింది. క్రాప్ హాలిడే చరిత్రలో ఎప్పుడూ లేదు.

మ 3.10

రాబోయే అడ్డంకుల్లో దొర్లి బోర్లా పడకుండా, పరిగెత్తి పాలుత్రాగే కన్నా నిలబడి నీళ్ళు తాగడం మేలనే సామెతలాగా మా నాయకుడు ఈ ప్రభుత్వాన్ని ముందుకు తీసుకువెళ్ళడానికి ఆలోచన చెయ్యడం జరిగింది. అన్నిటికన్నా ముఖ్యంగా సాంఘిక సంక్షేమం. రాష్ట్ర జనాభాలో 84.45 లక్షల మంది ఎస్.సిలున్నారు. వీళ్ళను దృష్టిలో పెట్టుకుని అనేక సంక్షేమ కార్యక్రమాలను బడ్జెట్‌లో ఏర్పాటు చేయడం జరిగింది. షెడ్యూల్డు కులాల సాధికారత కానీ, షెడ్యూల్డు కులాల బాల బాలికల విద్యాభివృద్ధి కానీ, ఉప ప్రణాళిక అమలుపరచడంలోకానీ రు.2657 కోట్లు సాంఘిక సంక్షేమానికి ఏర్పాటు చెయ్యడం జరిగింది. ఒకప్పుడు ఎస్.సి, ఎస్.టి ఉప ప్రణాళిక పెడుతున్నామని రాష్ట్రమంతా పరిగెత్తి ప్రతీ జిల్లాలో కూడా పెద్ద పెద్ద షామియానాలు వేసి ఎస్.సిలనందర్నీ పిలుచుకొచ్చి తల నిమిరారు. మీకోసమే ప్రత్యేక బడ్జెట్ పెడుతున్నామనీ, మీ అభివృద్ధికి జలప్రభ, అమ్మహస్తం, బంగారు తల్లి పథకాలనీ ఇలా ఎన్నెన్నో ఎస్.సిలకు చెప్పడం జరిగింది. జలంలేని చోట ప్రభ ఎక్కడ నుండి తెస్తారు? అందుకే మా నాయకుడు దానిజోలికి వెళ్ళడంలేదు.

గతంలో మా మంత్రిగారు ఒక కార్యక్రమానికి ఎం.ఎల్.సిలను కూడా తీసుకెళ్ళారు. అప్పుడు ఒక యూనిట్‌ను పది ఎకరాలుగా విభజించారు. అక్కడకు వెళ్ళిన తరువాత చూస్తే నాలుగు యూనిట్లు అంటే నలభై ఎకరాలు ఐడెంటిఫై చేశారని తెలిపారు. నలభై ఎకరాలలో ఏమి చేశారని వాళ్ళనడిగితే 400 మామిడిచెట్లు నాటామని తెలిపారు. అయితే ఎన్ని బ్రతికాయని అడిగితే అన్నీ చనిపోయాయని చెప్పారు. ఎందుకు చనిపోయాయంటే, ఒకతను లేచి తాను నీళ్ళు సరఫరా చేసే కాంట్రాక్టర్‌ననీ, ఎస్.సిననీ తనకు నాలుగు దఫాలుగా డబ్బులు ఇవ్వడంలేదనీ, బీదవాడ్ని ఏ విధంగా నీళ్ళు సరఫరా చేస్తానని అన్నారు. ఆ విధంగా కూడా మా నాయకుడు ఆలోచన చేయడంలేదు. ఏదైనా కానీ కాంక్రీటుగా చేసే విధానమేదో చెప్పింది చేయడానికే మా నాయకుడు ముందుకొస్తాడు.

గతంలో బంగారు తల్లి అనే పథకం పెట్టారు. ఆ పథకాన్ని అందుకోవాలంటే ఎక్కడో మారుమూల గ్రామంలోని మహిళ వీళ్ళిచ్చే రెండువేల రూపాయలకి ప్రభుత్వ ఆసుపత్రికే రావాలి, ఆడపిల్లనే కని రిజిష్టర్ చేస్తేనే బంగారుతల్లి. లేకపోతే ఆమె బంగారుతల్లి కాదు. అటువంటి పథకాలు మా నాయకుడు పెట్టడంలేదు.

అలాగే ఆ రోజుల్లోనే మళ్ళీ బడికి పోదాం రండి అనే కాన్సెప్ట్‌ను తీసుకువచ్చిందెవరు? మా నాయకుడే. జన్మభూమి కార్యక్రమానికి వెళ్ళినప్పుడు అక్కడ పశువుల మందను కాసే పిల్లల్ని చూసి తల్లిదండ్రులను పిలిచి వారిముందే పిల్లల్ని "మీరు చదువుతారా" అనిఅడిగారు. చదువుతాం సార్, మా అమ్మ పశువులు కాయడానికి పంపిస్తోంది అని అన్నారు. ఆ సమయంలోనే డ్రాప్ అవుట్ పిల్లలందరికీ కూడా బ్రిడ్జి స్కూలు కట్టించారు. ఆ రోజుల్లో కూడా ఇటువంటి మంచి పథకాలను ప్రజల మధ్యకి తీసుకువచ్చిన ఘనత చంద్రబాబునాయుడుగారిదే. అందువల్లే మొన్న కూడా అనంతపూర్ జిల్లాలో బడి పిలుస్తోంది రా అనే కార్యక్రమం పెట్టినప్పుడు ఎంతమంది పిల్లలో వచ్చారు. మళ్ళీ మాకు చదువొస్తుంది, మా నాయకుడు మమ్మల్ని దగ్గరకు తీసుకుంటాడని వాళ్ళకి కూడా తెలిసిపోయింది. ఆ రకంగా ఆలోచన చేయడం జరిగింది.

గృహనిర్మాణ పథకం కానీ, పౌరసరఫరాలో కానీ, పర్యాటక సాంస్కృతిక రంగంలో కానీ, ముఖ్యంగా వికాలంగులు, వృద్ధుల సంక్షేమ కార్యక్రమంలో కానీ ముందున్నాము. ఒక ఆరుమంది పిల్లల్ని తల్లీ తండ్రీ పెంచగలరు. కానీ ఆ ఆరుమంది పిల్లలు కూడా ఆ తల్లీ తండ్రులను సాకే పరిస్థితిలో ఈ జనరేషన్ లేదు. వారిని దృష్టిలో పెట్టుకుని అక్టోబర్ 2వ తేదీ నుండి రు.1000 పెన్షన్ ఇస్తానని, వికలాంగులకు రు.1500 ఇస్తామని చాటిచెప్పిన ఘనత చంద్రబాబునాయుడు గారిదే.

శ్రీ సి.రామచంద్రయ్య : బడ్జెట్‌లో పెట్టలేదు.

శ్రీమతి పమిడి శమంతకమణి : అక్టోబర్ 2వ తేదీ నుండి ఇస్తాము. ఈ బడ్జెట్ ద్వారానే కాదు పూర్వాపరంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పరచడానికి ముందుంటాము. గత ప్రభుత్వం డ్వాక్రా గ్రూపులను లక్షాధికారులను చేస్తామంటే ఆ మహిళలంతా మోసపోవడం జరిగింది. నేను పల్లెలకి వెళ్ళి అక్కడి వారినడిగితే తాము భర్తతో, కొడుకుతో కొట్లాడి పొదుపుచేసుకున్న డబ్బునే తిరిగి పావలా వడ్డీకిస్తున్నారు ఎంతమోసమో చూడండి అన్నారు. మా నాయకుడు అలాంటి మోసపూరితమైన పథకాలు పెట్టడంలేదు. ఏ ప్రాణబిక్ష పెట్టి ఆనాడు డ్వాక్రా గ్రూపులు తీసుకొచ్చారో, ఆ డ్వాక్రా గ్రూపు మహిళలతో క్లింటన్‌గారిలాంటి ప్రపంచాధినేతలతో మాట్లాడించారు. అటువంటి మోసపూరిత పథకాలేవీ పెట్టకుండా ఉన్న డబ్బునే సర్ది, ఉన్న డబ్బునే మీ ముందుంచి, ఉన్న డబ్బుతోనే పథకాలు ఏ విధంగా ఉపయోగపడతాయో తెలియజేసి అన్ని రంగాలను ఏకగ్రీవంగా అభివృద్ధిపరచడానికి, అన్ని రంగాల ప్రజలయొక్క అభిమానాన్ని చూరగొనడానికి మా నాయకుడు ముందుంటాడని, ఆ నాయకుని వెంట ప్రభుత్వం నడుస్తుందనీ ఇక్కడున్న వారందరూ కూడా మంచి సలహాలిచ్చి మా నాయకుడ్ని ముందుకు ప్రోత్సహించాలని కోరుతూ ఈ అవకాశాన్నిచ్చిన మీకు నా ధన్యవాదాలు.

శ్రీ సి.రామచంద్రయ్య : చాలా బాగా చెప్పారమ్మా. నవలోకాన్ని సృష్టించారప్పుడు. కానీ ప్రజలంతగా తృప్తిపడితే 2004 సంవత్సరంలో ఎందుకు ఓడగొట్టారు ఆయన్ని.

శ్రీమతి పమిడి శమంతకమణి : ఉచిత విద్యుత్తు అని మోసం చేశారు కదా.

శ్రీ బి. చంగల్‌రాయుడు : 2009 సంవత్సరంలో ఒక్క ప్రామిస్ కూడా చెయ్యకుండా 9 గంటల కరెంటు, 5 కేజీల బియ్యమని చెప్పి మేము ఎలక్షన్ మేనిఫెస్టోలో పెట్టి వెళ్ళాము. జనం నీరాజనం పలికారు. మీరు ఈరోజు 226 ప్రామిస్‌లు హిందూపురం నుండి వైజాగ్ దాకా చెప్పి రు.2 లక్షల 25000 కోట్లతో ప్రామిస్ చేస్తే అధికారంలోకి వచ్చారా?

మ.3.20

శ్రీ ఐలాపురం వెంకయ్య (స్థానిక సంస్థలు, కృష్ణా): అధ్యక్షా, గౌరవ, రాష్ట్ర ఆర్థిక మంత్రి శ్రీ యనమల రామకృష్ణుడు గారు ప్రవేశ పెట్టిన 2014-2015 బడ్జెట్‌పై నా అభిప్రాయాలను తెలిపేందుకు అనుమతించినందుకు ముందుగా మీకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ఈ బడ్జెట్‌లో బలహీన వర్గాల సంక్షేమానికి రూ.3,130 కోట్ల రూపాయలు కేటాయించినందుకు రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, అలాగే ఆర్థిక మంత్రి శ్రీ యనమల రామకృష్ణుడు గారికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తున్నాను. అయితే అధ్యక్షా, ఇటీవల కాలంలో అనేక కులాలను, బలహీన వర్గాల జాబితాలో చేర్చిన విషయం మీకు తెలియంది కాదు. అందువల్ల ఈ కేటాయింపులు సరిపోవని నా అభిప్రాయం. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని బలహీన వర్గాల సంక్షేమానికి కనీసం మరో వెయ్యి కోట్ల రూపాయలు అదనంగా చేర్చాలని ఈ సభా ముఖంగా మీ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఆర్థిక మంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాను.

అధ్యక్షా, రాష్ట్రంలో బలహీన వర్గాలకు చెందిన కులాల వారు మాత్రమే కాక ఇంకా పలు చేతి వృత్తులను కొనసాగిస్తున్నారు. కులవృత్తులు క్రమంగా క్షీణించి పోతున్నాయి. కొంతమంది ఇంకా అనాదిగా వస్తున్న ఆయా వృత్తులపైనే ఆధారపడి జీవిస్తున్న విషయం తమకు తెలియంది కాదు. ఉదాహరణకు చాకలి, రజక, నాయిబ్రాహ్మణ, శాలవాహన, యాదవ, విశ్వబ్రాహ్మణ,మంగలి, కుమ్మరి వంటి కులాల ప్రజలు ఆయా వృత్తుల పైనే ఆధారపడి చాలీచాలని ఆదాయంతో జీవనం కొనసాగిస్తున్నారు. విద్య, వైద్యం వంటి అవసరాల కోసం అప్పులు చేస్తున్నారు. ఇటువంటి వారిని ఆదుకోవలసిన అవసరం ఉందని ఈ సభా ముఖంగా మీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియచేస్తున్నాను. ఆయా కుటుంబాలకు, ఆర్థికంగా చేయూత ఇవ్వవలసిన అవసరం ఉంది. అలాగే ఆయా కుటుంబాల్లో పిల్లల విద్యను ప్రోత్సహించవలసిన అవసరాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాను. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 692 బాలుర వసతి గృహాలు 201బాలికల వసతి గృహాల సంఖ్యను పెంచవలసినదిగా, వసతి గృహాలను ప్రజలకు అందుబాటులో ఏర్పాటు చేయవలసిందిగా మనవి చేస్తున్నాను.

కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారిని ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన ఫైనాన్స్ కార్పోరేషన్లను మరింత బలపర్చవలసిన అవసరం ఉంది. ఆధునిక, సాంకేతిక పరిజానాన్ని ఆయా వృత్తుల అభివృద్ధికి అందించాల్సిన అవసరం ఉంది. అలాగే కుండలు, ఇటుకలు, వంటి ఇతర మట్టి పాత్రల తయారికి అవసరమైన మట్టి సేకరణ పెద్ద సమస్యగా మారినది. ప్రతి జిల్లాలోను, మట్టి సేకరణకు అనువైన భూమిని కేటాయించవలసినదిగా, రాష్ట్ర ప్రభుత్వానికి మీద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను. అలాగే సేకరించిన మట్టిని తయారైన మట్టి పాత్రలను వరదలు వర్షాల నుండి కాపాడేందుకు గొడౌన్ సదుపాయాలు ప్రతి జిల్లాలోను కల్పించాలని కోరుతున్నాను. ఇందుకోసం రాష్ట్ర బడ్జెట్లో ప్రత్యేక కేటాయింపులు చేయాలని గౌరవ ముఖ్యమంత్రిని గౌరవ ఆర్థిక మంత్రిని కోరుతున్నాను .

కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో ప్రభుత్వంపై, ప్రజలు అనేక ఆశలు పెట్టుకున్నారు. వారి ఆశలకు అనుగుణంగా, తొలిబడ్జెటు ఉండాలని, భావిస్తున్నాను . అందువల్ల ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని బడ్జెటులో తగిన కేటాయింపులు చేయాలని, మీ ద్వారా, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఈ విషయాలను సభ ద్వారా ప్రభుత్వ దృష్టికి తెచ్చేందుకు అవకాశం ఇచ్చిన సభాధ్యక్షులకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

( శ్రీమతి పమిడి శమంతక మణి గారు అధ్యక్ష స్థానం వహించారు )

డా. బచల పుల్లయ్యః అధ్యక్షా, 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టినటువంటి బడ్జెట్‌లో చర్చకు అవకాశం ఇచ్చినటువంటి మీకు ముందుగా ధన్యవాదాలు తెలియజేసుకుంటూ, ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయినాక ప్రవేశపెట్టినటువంటి మొట్టమొదటి బడ్జెట్. రాజకీయ అనుభవం, పరిపాలన దక్షత కలిగినటువంటి ఆర్థిక శాఖ మంత్రిగారు బడ్జెట్ ప్రవేశపెట్టడం జరిగింది. ఏవిధంగా బడ్జెట్ ఉంటే బాగుంటుందనే ఆలోచనతో, ఈనాడు ఉన్నటువంటి పరిస్థితులకు అనుగుణంగా బడ్జెట్ తయారు చేయడం అనేడిది చాలా సంతోషకరమైన విషయం. ఈ పరిస్థితులకు ముందు, 23 జిల్లాలు ఉన్నటువంటి పరిస్థితులను, అప్పుడు ఉన్నటువంటి ఆర్థిక పరిస్థితులను ఒకసారి మనం గమనించినట్లయితే, రాయలసీమ ప్రాంతంలో వచ్చినటువంటి మొత్తం ఆదాయం రూ.18,215కోట్ల ఆదాయం ఉంటే, ఖర్చు 25,220కోట్లుగా ఉండింది. లోటు బడ్జెట్ రూ.7, 500కోట్లు ఉంది. కోస్తాంధ్రకు సంబంధించి వచ్చేటువంటి మొత్తం ఆదాయం రూ.47,935కోట్లుగా ఉండగా, అయ్యేటువంటి ఖర్చు రూ.47,253కోట్లుగా ఉంది. మిగులు మాత్రం కోస్తాంధ్ర నుండి రూ. 684కోట్లు ఉండింది. అదే తెలంగాణ ప్రాంతాన్ని గమనించినట్లయితే, రూ.41,391కోట్లు ఆదాయం అయితే, అయ్యేటువంటి ఖర్చు రూ.49,798కోట్లు ఉండింది. అక్కడ కూడా వ్యయం ఎక్కువగా ఉంది, ఆదాయం తక్కువగా ఉంది. రూ.8,407కోట్లు మైనస్‌లో ఉంది. ఒక్క హైదరాబాద్ ప్రాంతాన్ని గమనించినట్లయితే రూ.20,022కోట్లు ఆదాయం వస్తే, ఖర్చు రూ.7,168కోట్లు ఖర్చు ఉండేది. మిగులు రూ.12,854కోట్లు ఉండేది. ఇటువంటి పరిస్థితుల్లో అప్పట్లో మనకు ఆదాయం ఉండేది. హైదరాబాద్ ప్రాంతాన్ని గమనించినట్లయితే, ఏమీ లేదని బాధపడాల్సిన అవసరం లేదు, వనరులు చాలా ఉన్నాయని చాలామంది పెద్దలు చెప్పారు. ఏ ప్రాంతానకి సంబంధించిన ముఖ్యమంత్రులు వచ్చినప్పటికీ రాష్ట్ర రాజధాని బాగుండాలనే అభిప్రాయంతో బ్రహ్మాండంగా అభివృద్ధి చేసినటువంటి మాట వాస్తవం. మా ప్రాంతంలో ఒక సామెత ఉంది. "ఎన్ని పుంగనూర్లు అయితే ఒక బెంగుళూరు" అవుతుందనే సామెత ఉండేది. అటువంటి సామెత ప్రకారంగా ఇటువంటి రాజధానిని నిర్మాణం చేయాలంటే ఎంత కష్టపడాలి, ఎన్ని నిధులు కావాలి, ఎన్ని సమీకరణాలు చేయాల్సిన అవసరముందనే ఆలోచన చేయాలని కోరుతున్నాను. ఇటువంటి పరిస్థితుల్లో మనకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఎవరైతే బాగుంటుంది. ఎవరైతే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారనే అభిప్రాయంతో ప్రజలు ఇచ్చినటువంటి తీర్పు ఫలితంగా శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రి కావడం అనేడిది రాష్ట్ర ప్రజలు చేసుకున్నటువంటి అదృష్టంగా నేను భావిస్తున్నాను. భారతదేశ పటంలో రాజధాని లేని రాష్ట్రం ఏదైనా ఉందనంటే, ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒకటనే చెబుతున్నాను. అందుకని రాజధాని నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అటువంటి పరిస్థితుల్లో గుంటూరు-విజయవాడ మధ్యలో ఉన్నటువంటి నడిరోడ్డుమీద ఉన్నటువంటి మైదానంలో

ప్రమాణ స్వీకారం చేయాల్సిన పరిస్థితి, దుర్గతి పట్టింది ఈరాష్ట్ర ముఖ్యమంత్రికి అని నేను తెలియజేస్తున్నాను. అక్కడి జరిగినటువంటి నిర్ణయాల్లో, ఉద్యోగులకు సంబంధించి ఉద్యోగ విరమణ వయస్సును 58 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలకు పెంచడం అనేడిది నిజంగా మా ఉపాధ్యాయులకు అయితేనేమి, మొత్తం ఉద్యోగ వ్యవస్థకు కూడా చాలా గర్వకారణమని, చాలా సంతోకరమైన విషయమని తెలియజేస్తున్నాను.

మీద్వారా ప్రభుత్వానికి చిన్న సూచన చేసేది ఏమంటే, రాష్ట్ర ప్రభుత్వం ఏదైతే ఈవిధమైన నిర్ణయం తీసుకోవడం అనేడిది చాలా హర్షించదగ్గ విషయం. ఇందులో చిన్న లొసుగు ఏమనంటే, మాయొక్క అభిప్రాయాన్ని మీద్వారా ప్రభుత్వానికి తెలియజేసేది ఏమంటే ఎవరైతే ప్రభుత్వం నుండి వేతనాలు తీసుకుంటున్నారో వాళ్లందరికి కూడా 58 నుండి 60 సంవత్సరాలు చేయాలని కూడా చిన్న సూచన చేస్తున్నాను. ఇదే హౌస్‌లో మన ముఖ్యమంత్రి గారు మరియు ఇతర మంత్రులు చెప్పడం జరిగింది.

మ.03.30

ఎయిడెడ్ వ్యవస్థలో ఉన్నటువంటి ఉపాధ్యాయులకు గానీ, అధ్యాపకులకు గానీ, స్కూళ్లల్లో పనిచేసే ఉపాధ్యాయులకు గానీ, జూనియర్ కళాశాలల్లో పని చేసే అధ్యాపకులకు గానీ, డిగ్రీ కళాశాలల్లో పని చేసే అధ్యాపకులకు గానీ, తప్పకుండా వాళ్లక్కూడా 58 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలకు పదవీ విరమణ వయోపరిమితిని పెంచుతామని వాగ్దానం చేసిన సందర్భాన్ని మీ ద్వారా ప్రభుత్వానికి గుర్తు చేస్తున్నాను. నేను కోరేదేమంటే – ఆ రకంగా ముఖ్యమంత్రి గారు సభలో స్టేట్‌మెంట్ ఇచ్చి, దాదాపు రెండు నెలల కాలం గడుస్తోంది. జూన్‌లో కొంతమంది ఉపాధ్యాయులు రిటైరయ్యారు. ఆగష్టులో కూడా మరి కొంతమంది రిటైర్ కాబోతున్నారు. వాళ్ల పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా ఉంది. దయచేసి, ఇప్పటికైనా కూడా జీఓ రూపంలో దాన్ని బయటకు తీసుకురావాలని మీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

అదేవిధంగా ఆ రోజు తీసుకున్నటువంటి నిర్ణయాల్లో ఎన్టీఆర్ సుజల స్రవంతి స్కీం క్రింద ఇరవై లీటర్ల వాటర్ క్యాన్ కేవలం రెండు రూపాయలకే అందిస్తామని చెప్పడం చాలా హర్షించదగ్గ విషయం. ఈనాడు మన 13 జిల్లాల్లో పని చేస్తున్న స్కూళ్లలో నీటి కొరత చాలా ఎక్కువగా ఉంది. దయచేసి, నేను ప్రభుత్వాన్ని కోరేదేమంటే – ఏదైతే ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందుబాటులో ఉండాలనే ఆలోచనతో ఈ స్కీంని అమల్లోకి తెస్తున్నారో, దాన్ని అన్ని స్కూళ్లలో కూడా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అధ్యక్షా, ఒక్కటి మాత్రం వాస్తవం. ఏవిధంగానంటే ప్రభుత్వం మారిపోయింది. పరిపాలన బాగుండాలనే అభిప్రాయంలో భాగంగానే కొంత మార్పులు జరిగిన మాట వాస్తమని మీ ద్వారా తెలియజేస్తున్నాను. మరి ఒక్కసారి మనం వన్ బై వన్ డిపార్టుమెంటు వైజ్ పోయినట్లయితే, వ్యవసాయానికి సంబంధించిన అంశాలను మనం గమనించినట్లయితే, ఈనాడు అత్యధిక శాతం మంది రాష్ట్ర ప్రజానీకం వ్యవసాయం మీదనే ఆధారపడి ఉన్నారనేటటువంటి మాట వాస్తవమే అయినప్పటికీ కూడా, వ్యవసాయదారుడు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నటువంటి మాట కూడా అక్షర సత్యం. మరి సంభవిస్తున్నటువంటి ప్రకృతి వైపరీత్యాలు గానీ, ఖర్చులు పెరిగిపోవడం వల్ల

గానీ, వ్యవసాయం ద్వారా వచ్చే పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల కూడా వ్యవసాయదారుల్లో నిరుత్సాహం ఏర్పడింది. అటువంటి వ్యవసాయదారులకు ఒక ఊరట కలిగించాలి. అటువంటి వారికి మంచి ఫలితాలను తీసుకురావాలన్న ఒక అభిప్రాయంతో రాష్ట్ర ప్రభుత్వం రుణ మాఫీ పథకాన్ని ప్రవేశపెట్టడమనేది చాలా సంతోషించదగ్గ విషయమని మీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, మరి సాంఘిక సంక్షేమానికి సంబంధించి తీసుకున్నట్లయితే, మన 13 జిల్లాల్లో ఉన్న షెడ్యూలు కులాల జనాభాను గమనించినట్లయితే, 84.45 లక్షల మంది ఉండటం జరుగుతోంది. రాష్ట్ర జనాభాలో ఇది 17.1 శాతం. అటువంటి జనాభా కోసం గురుకుల విద్యాలయాలు 177 ఉంటే, అందులో చదివే విద్యార్థుల సంఖ్య 1,24,000. మరి దీనికి గాను 2014–2015 బడ్జెట్ అంచనాల్లో రూ.2,657 కోట్లు కేటాయించడమన్నది నిజంగా సంతోషించదగ్గ విషయం.

అదే విధంగా గిరిజన సంక్షేమంకు సంబంధించి చూస్తే, వీరి సంఖ్య 26.31 లక్షలు కాగా, రాష్ట్ర జనాభాలో వీరి శాతం 5.33 శాతంగా ఉంది. అటువంటి ప్రజల కోసం, వారిలో చైతన్యం తీసుకురావాలనే ఉద్దేశంతో, వారి అభివృద్ధి కోసమని రూ.1,150 కోట్లు బడ్జెట్ కేటాయింపులు చేయడం చాలా సంతోషించదగ్గ విషయం.

అదే విధంగా బీసీల కోసం ఎంతో కేటాయింపులు చేయాల్సిన అవసరం ఉంది. బీసీ కులాల వారు కూడా రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతంగా ఉన్న విషయాన్ని ఈనాడు మనం గమనించాలి. మరి బీసీ విద్యార్థుల కోసం ఇప్పటికే రాష్ట్రంలో 692 బాయ్స్ హాస్టల్స్ ఉన్నాయి. అదే విధంగా 201 గర్ల్స్ హాస్టల్స్ ఉన్నాయి. ప్రతి నియోజకవర్గంలో కూడా ఒక బాయ్స్ హాస్టల్‌ని ఏర్పాటు చేస్తామని మొన్నటి మ్యానిఫెస్టోలో చెప్పారు. ఒక గర్ల్స్ హాస్టల్ కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. అది వాస్తవ రూపంలోకి వచ్చినట్లయితే బాగుంటుంది. ఎంత వీలైతే అంత త్వరగా ఆ హాస్టళ్లను తీసుకురావాలని మీ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

అధ్యక్షా, ఈ సందర్భంగా ఇంకో ముఖ్య విషయాన్ని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకురాదల్చుకున్నాను. ఇంతకుముందు ఏవిధంగా ఎస్సీ, ఎస్టీ ప్రజానీకం కోసం సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి, వారి అభివృద్ధిని కాంక్షించడం కోసం ఏర్పాటు చేశారో, అదే తరహాలో బీసీ జనాభా కోసం, వెనుకబడిన తరగతుల వారికోసం ఒక సబ్‌ప్లాన్ తీసుకురావాలనే విజ్ఞప్తిని మీ ద్వారా ప్రభుత్వానికి తెలియ జేస్తున్నాను. అది మేము ఆశిస్తున్నాము. ఒక బీసీ ఎంప్లాయిగా కనీసం తదుపరి బడ్జెట్లోనైనా సరే తప్పనిసరిగా బీసీలకు ప్రత్యేకంగా సబ్‌ప్లాన్ తీసుకు వస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నాను.

అదేవిధంగా మైనారిటీల కోసం బడ్జెట్‌లో రూ.371 కోట్లు కేటాయించారు. నేను కోరేదేమంటే – ఎక్కడైతే మైనారిటీలు కాన్‌సెన్‌ట్రేట్ అయివున్నారో, ఎక్కడైతే మైనారిటీల జనాభా ఎక్కువగా ఉంటుందో, ఆ ప్రాంతంలో స్కూళ్లను, జూనియర్ కళాశాలలను, డిగ్రీ కళాశాలలను అవసరాన్ని బట్టి ఏర్పాటు చేయాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అధ్యక్షా, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖకు సంబంధించి మనం చూసినట్లయితే, రూ.1,049 కోట్లు బడ్జెట్ కేటాయింపులు చేయడమన్నది సంతోషించదగ్గ విషయమే అయినప్పటికీ కూడా, అంగన్‌వాడీ కేంద్రాలు మన ఆంధ్ర రాష్ట్రంలో 41,982 ఉన్నాయి. మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 6,625 ఉన్నాయి. ఇందులో ఒక్కసారి మనం పరిశీలిస్తే, అంగన్‌వాడీ వ్యవస్థలో పనిచేసే ఒక టీచర్‌కిచ్చే వేతనం రూ.4000 గా ఉంది. అది కూడా వేతనం కాదు. గౌరవ వేతనమో, గౌరవ భృతో అంటున్నారు. కాబట్టి, ఆ విధానానికి స్వస్త పలికి, ఆ పదాన్ని తీసివేసి, వాళ్లక్కూడా జీతమిచ్చే ప్రక్రియను పెడితే బాగుంటుందని మీ ద్వారా తెలియజేస్తున్నాను. ఇంతకు ముందు గవర్నర్ పరిపాలన ఉన్నప్పుడు అంగన్‌వాడీ వర్కర్లందరూ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసినటువంటి సందర్భాన్ని కూడా మీకు గుర్తు చేస్తున్నాను. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి ఉపాధి పనికి అంటే మన ప్రాంతాల్లో మట్టి పనికి అనంటారు. ఈ ఉపాధి పనికి వచ్చే కూలీలకిచ్చే వేతనాల కంటే, ఈ అంగన్‌వాడీ టీచర్లకిచ్చే వేతనాలు తక్కువగా ఉన్నాయనేటటువంటి విషయాన్ని మీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను. కాబట్టి, వాళ్ల యొక్క కృషికి, పనికి అనుకూలంగా వారి జీతాలను పెంచాలని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, వికలాంగుల విషయానికి వచ్చినట్లయితే వారి సంక్షేమం కోసం రూ.65 కోట్లు బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. ఎవరైతే వికలాంగులున్నారో, వారికి ప్రభుత్వం తరఫున మేమున్నామనే భరోసా, హామీనివ్వాల్సిన బాధ్యత ఉంది. అందులో భాగంగా ఇళ్లు లేని వాళ్లకు ఇళ్లు కల్పించాల్సిన అవసరముంది, స్థలం కూడా చూపించాల్సిన అవసరముందని మీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

ఛైర్‌పర్సన్ః పుల్లయ్య గారూ, తొందరగా ముగించండి.

డా. బచల పుల్లయ్యః వీలైనంత తొందరగా ముగిస్తానమ్మా.

శ్రీ బి. చెంగల్ రాయుడుః అమ్మా.. మీరు అక్కడ (సభ్యుల స్థానంలో) కూర్చున్నప్పుడు అడిగినట్టుగా అడుగుతున్నారు. అక్కడుంటే ఒక తీరు, ఇక్కడుంటే ఒక తీరా!

ఛైర్‌పర్సన్ః ఇంకా మాట్లాడాల్సిన వాళ్లు పది మంది ఉన్నారండీ..

డా. బచల పుల్లయ్యః అమ్మా.. ప్రొద్దుటూరులో వికలాంగుల కోసమని దాదాపుగా 7, 8 నెలల పాటు ఉద్యమం చేస్తే, అక్కడ ఇళ్ల పట్టాలు మాత్రమే ఇచ్చారు గానీ, స్థలాలు చూపించలేదు. నేను మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరేది గానీ, మంత్రులను కోరేదేమంటే ఇప్పటికైనా వాళ్లకు ఇచ్చిన పట్టాలకు సంబంధించిన స్థలాలు ఎక్కడున్నాయో చూపించి, వాళ్ల అభివృద్ధికి చేయూతనివ్వాలని మీ ద్వారా కోరుతున్నాను. అదేవిధంగా తమిళనాడులో వికలాంగులు పెళ్లిళ్లు చేసుకుంటే, వారికి ఆర్థిక సహాయం చేసే స్కీమ్స్ కూడా అమలులో ఉన్నాయి. కాబట్టి, మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరేదేమంటే అటువంటి ఆలోచనల్లో భాగంగా ఇక్కడ కూడా వికలాంగులు పెళ్లిళ్లు చేసుకున్నట్లయితే, తప్పనిసరిగా ఆర్థిక సహాయం చేయాలని మీ ద్వారా కోరుతున్నాను. అదేవిధంగా గృహ నిర్మాణం విషయానికొస్తే, ఈనాటికి రూ.65.35 లక్షల గృహాల నిర్మాణం జరిగింది. అదేవిధంగా కన్‌స్ట్రక్షన్‌లో ఉన్న గృహాలను తీసుకున్నట్లయితే, 4.93 లక్షల గృహాలు కన్‌స్ట్రక్షన్‌లో ఉన్నాయి. అధ్యక్షా, ఈ

విషయాల మీద ఒక సన్నివేశాన్ని మీ దృష్టికి తీసుకురావాల్సిన అవసరముందని నేను భావిసున్నాను. ఇటువంటి గృహాలు ఏర్పాటు చేయడంలోని ముఖ్యోద్దేశమేమంటే ఎవ్వరికైతే గృహాలు లేకుండా ఉంటాయో, ఎవరైతే పూరి గుడిసెలో ఉంటారో ఆ గుడిసెను తీసివేసి, ఇళ్లు కట్టించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. అయితే, చాలా ప్రాంతాల్లో ఇవి అన్యాక్రాంతమైపోయాయి. నిజంగా ఎవరికైతే అర్హత ఉందో, వారికి గృహాలు రాకుండా, అనర్హులైన వారికి వస్తున్న సందర్భాన్ని మీకు తెలియజేస్తున్నాను.

ఈ అంశం మీదనే కడప జిల్లాలోని ప్రొద్దుటూరు ప్రాంతంలో అమృతానగర్ అని ఉంది. అక్కడ గృహ నిర్మాణ శాఖ క్రింద అనేక ఇళ్లు కట్టించి ఇచ్చారు గానీ, అక్కడ అనేక రకాలైన అవకతవకలు జరిగాయి. వాటి మీద గవర్నమెంట్ ఒక విచారణ సంఘాన్ని ఏర్పాటు చేసింది. దాదాపుగా రెండు, మూడు సంవత్సరాలు విచారణ చేసి, ఆ సంఘం ఒక రిపోర్టును తయారు చేసింది. దాన్ని బయటపెట్టి, నిజంగా ఎవరికైతే న్యాయం జరగాలో, వారికే ఇళ్లను కేటాయించాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఛైర్‌పర్సన్ః ఇంకా పది మంది సభ్యులున్నారు. త్వరగా ముగించండి.

డా. బచల పుల్లయ్యః త్వరగా ముగిస్తానమ్మా.. అదే విధంగా ఈ గ్రామీణాభివృద్ధికి సంబంధించి ఉపాధి కూలీని రూ.149 నుండి రూ.169 వరకు పెంచడమనేది నిజంగా చాలా సంతోషించదగ్గ విషయం. అయితే, స్టేట్ గవర్నమెంట్ బాధ్యత ఏమంటే..

ఛైర్‌పర్సన్ ః అది కూడా మాదే కదా!

డా.బచల పుల్లయ్యః అమ్మా .. మీరు ఆ స్థానంలో (అధికారపక్ష స్థానాల్లో) కూర్చుని చెబితే బాగుంటుంది. అక్కడ (అధ్యక్ష స్థానంలో) కూర్చుని చెబితే బాగుండదు.

శ్రీ బి.చెంగల్ రాయుడుః ఒక్క నిమిషం.. ఇంతకుముందు ఎన్‌ఆర్‌ఇజిఎస్ సెపరేట్ అక్కౌంట్ ఉండేది. ఇప్పుడు మన ట్రెజరీలో పడిన దానివల్ల బూస్టప్ అయ్యింది. మనం 10 శాతం కడుతున్నాము. 10 పర్సంట్‌కు బడ్జెట్ చూపించలేదు. గ్రాంట్-ఇన్-ఎయిడ్ కూడా .....

డా.బచల పుల్లయ్యః అమ్మా .. ఇందులో నేను చాలా చోట్ల మా ఊర్లో కూడా గమనించాను. ఉపాధి పని అనే ఒక స్కీమున్నా కూడా అది సక్రమంగా అమలు జరుగుతోందా అనేటటువంటి దాంట్లో వాస్తవం లేదనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. అంటే ఎనిమిది గంటల వరకు పనికిపోయి, పది, పదిన్నరకు వెనక్కు వచ్చిన సందర్భం మేం చాలాసార్లు గమనించాం. ఇందులో ప్రభుత్వం చొరవ చూపి చేసిన మంచి పని, గట్టిపని ఏమిటంటే దీన్ని వ్యవసాయానికి లింకప్ చేయడం. వ్యవసాయానికి ఎప్పుడైతే లింకప్ చేసినారో.. ప్రపోజల్ ఉంది.

శ్రీ సిహెచ్. అయ్యన్నపాత్రుడుః ఒక్క నిమిషం క్లారిఫై చేస్తాను. అధ్యక్షా, ఉపాధి హామీ పథకం సెంట్రల్ గవర్నమెంట్ స్పాన్సర్డ్ స్కీము. ఇది ఒక విధంగా చూస్తే మంచి స్కీము. పేద వాళ్లకు ఉపకరించే స్కీము. ప్రారంభంలో కొన్ని అవకతవకలు జరిగినా, ఇప్పుడంతా ఆన్‌లైన్ సిస్టం వచ్చేసింది. పేమెంట్స్ కూడా ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. కొన్ని చోట్ల మాత్రం అవకతవకలు

జరిగాయి. గాల్లో ఉంది. అయితే, దీన్ని వ్యవసాయంతో కూడా అనుసంధానం చేయాలన్నది మా అందరి ఆలోచన. కేంద్రం అనుమతి కోసం రాయడం జరిగింది. అయితే, హార్టీకల్చర్ వరకు దీన్ని ఇంప్లిమెంట్ చేస్తున్నాము. అదే పద్ధతుల్లో వ్యవసాయానికి కూడా అనుసంధానం చేయాలన్నది మా ఆలోచన. దానికి కేంద్ర ప్రభుత్వం కూడా అనుకూలంగా ఉంది. నిన్ననే నేను ఢిల్లీ వెళ్లాను. ప్రధానమంత్రి గారు కూడా దీనికి అనుకూలంగా ఉన్నట్టు తెలిసింది. తప్పనిసరిగా అది జరిగితే రైతాంగానికి కూడా కొంత ఊరట కలుగుతుంది.

డా. బచల పుల్లయ్యః అధ్యక్షా, మీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేసేదేమంటే – డబ్బిచ్చిన తరువాత వ్యవసాయ కూలీలతో పని చేయించుకోవాల్సిన బాధ్యత తప్పనిసరిగా ఎవరో ఒకరు తీసుకోవాలి. అందులో వ్యవసాయదారుడికి లింకప్ చేసినట్లయితే, డబ్బు చెల్లించేది ప్రభుత్వమే అయినా వ్యవసాయదారుడు తప్పనిసరిగా ఈ పని చేయాలి, ఈ టైంలో నా దగ్గరుండాలనే అభిప్రాయంతో ముందుకుపోతారు కాబట్టి, పని జరిగేందుకు అవకాశముంటుంది. తరువాత విద్యకు సంబంధించి మాట్లాడుకున్నట్లయితే, ప్రైమరీ విద్యకు రూ.12,595 కోట్లు, ఇంటర్మీడియట్ విద్యకు సంబంధించి..

శ్రీ పి.జె. చంద్రశేఖర్ రావుః కూలీల గురించి రూల్స్ ఏమన్నా ఫ్రేం చేశారా మీరు? ప్రభుత్వం ఏమన్నా చేసిందా? వ్యవసాయ కూలీలేమన్నా తేలిగ్గా దొరికారా మీకు?

డా. బచల పుల్లయ్యః రూల్స్ ఫ్రేం చేయాల్సిన బాధ్యత నాది కాదు. అది వాళ్ల (ప్రభుత్వం) చేయాల్సింది.

శ్రీ యండవల్లి శ్రీనివాసులు రెడ్డిః మాటి మాటికీ వ్యవసాయ కూలీలెందుకు సార్?

డా. బచల పుల్లయ్యః సరే, తరువాత మాట్లాడుకుందాం. ఇంటర్మీడియట్ విద్యకు సంబంధించి రూ.812 కోట్లు, హయ్యర్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి రూ.2,275 కోట్లు కేటాయించడము, వెరసి మొత్తం రూ.15,682 కోట్లు కేటాయించడమన్నది చాలా సంతోషదాయకమైన విషయం. నేను మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరేదేమంటే ఏదో ఒకటి గద్దించడం, పని జరుగుతుందిలే అన్న అభిప్రాయంతో కాకుండా, విద్యావ్యవస్థలో ఉన్న సమస్యల్ని కూడా గుర్తించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

మ. 3.45

విద్యావ్యవస్థలో ఉన్నటువంటి సమస్యలను గమనించినట్లైతే అనేక పాఠశాలల్లో మౌలిక వసతులు సక్రమంగా లేవు. స్వీపర్లు లేరు. అటెండర్లు, వాచ్‌మెన్లు లేరు, టాయిలెట్స్ లేవు, మంచినీటి వసతి కూడా సరిగ్గా లేదు. గతంలో బడులు, గుడులంటే చాలామంది దానాలిచ్చేవారు. ఇప్పుడున్న పరిస్థితులలో ఉన్నటువంటి స్థలాలను కబ్జా చేసేవారు ఎక్కువగా ఉన్నారు. ఈ మధ్యకాలంలో కడప జిల్లాలో గోపవరం మండలంలో పూసలవాడ అనే హరిజన వాడలో ఉన్న జడ్.పి.హెచ్. పాఠశాలకు రెండెకరాల 92 సెంట్లు ప్రభుత్వం కేటాయిస్తే, కబ్జాదారులు దానిని ఆక్రమించారు. అదేవిధంగా మోడల్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఇంతవరకు సర్వీసు రూల్సును ఫ్రేమ్ చేయలేదు. పిల్లలకు టీచర్లు లేక చాలా ఇబ్బంది పడుతున్నారు. గురుకుల

పాఠశాలల్లో పనిచేసే కాంట్రాక్టు టీచర్లు, లెక్చరర్లకు ఒక లైనప్ తీసుకురావాలి. ఇప్పటికే తెలంగాణా ప్రభుత్వం ఈ విషయమై ఒక అభిప్రాయానికి వచ్చి ఆర్డర్స్ కూడా ఇచ్చింది. అదే పద్ధతిలో ఇక్కడున్నవాళ్లకు ఆర్డర్స్ ఇస్తే బాగుంటుందని తెలియచేస్తున్నాను. విద్యావ్యవస్థలో ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలను బ్రతికించవలసిన అవసరం ఉన్నది. యూనివర్శిటీలలో ఉపాధ్యాయుల నియామకాలను త్వరగా పూర్తిచేయాలని కోరుతున్నాను.

ఉద్యోగస్తులకు, ఉపాధ్యాయులకు మంచి పి.ఆర్.సి ఇస్తామని గతంలో ముఖ్యమంత్రిగారు చెప్పారు. అయితే, ఈ బడ్జెట్‌లో ఆ ప్రతిపాదన లేదనేది మా అభిప్రాయం. దీనిని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి త్వరగా మంచి పి.ఆర్.సిని ఇవ్వాలని కోరుతున్నాము. విద్యుత్తు విషయానికి వస్తే – ఈ బడ్జెట్‌లో రూ.7,164కోట్లను కేటాయించారు. గతంలో కంటే ఇప్పుడు మార్పు వచ్చింది, ఇంకా మార్పు రావాలని కోరుతున్నాము. అక్టోబరు నుండి రోజుకు 24 గంటలు కరెంటు ఇస్తామని చెప్పడం చాలా హర్షించతగ్గ విషయమని మనవిచేస్తున్నాను. మా కడప జిల్లాకు సంబంధించి బ్రాహ్మణి స్టీల్స్‌కు సంబంధించి 2007లో ఒక అభిప్రాయానికి రావడం జరిగింది. దాదాపు ఇరవైవేల కోట్ల రూపాయలతో ఆ ప్రాజెక్టును తీసుకువచ్చి 14,700 ఎకరాలను కేటాయించడం జరిగింది. అయితే, రాజకీయ కారణాలవల్ల, అనేక ఇబ్బందులవల్ల ఆ స్కీము మరుగున పడిపోయింది. అందుకు రాష్ట్రప్రభుత్వంగానీ, కేంద్రప్రభుత్వం గానీ ఆ స్కీమును తీసుకువచ్చినట్లయితే డైరెక్ట్‌గా పదివేలమందికి, ఇన్‌డైరెక్ట్‌గా లక్షమందికి ఉపాధి కల్పిస్తారని తెలియచేస్తున్నాను. దేశంలో రాబోయే కాలంలో అత్యంత అభివృద్ధిచెందిన రాష్ట్రాలుగా మూడు రాష్ట్రాలు వస్తాయి, అందులో ఆంధ్రప్రదేశ్ కూడా ఒకటి అని ఈ ప్రభుత్వం చెప్పడం ఎంతో హర్షించదగ్గ విషయం. ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు, ఓపికతో విన్న గౌరవసభ్యులందరికీ ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

శ్రీ కె.యస్. లక్ష్మణరావు : అధ్యక్షా, నవ్యాంధ్రప్రదేశ్ తొలి బడ్జెట్ సందర్భంగా ప్రసంగించే అవకాశం ఇచ్చిందుకు ధన్యవాదాలు. ప్రముఖ చరిత్రకారుడు శ్రీ ఇ.హెచ్. కార్ “What is History” అనే పుస్తకం వ్రాశారు. దానిని హైదరాబాదు బుక్ ట్రస్ట్ వాళ్లు తెలుగులో పబ్లిష్ చేశారు. అందులో ఆయన గతానికి వర్తమానానికి మధ్య జరిగే అంతులేని సంభాషణే చరిత్ర అని చెప్పారు. ఒక వ్యక్తిగానీ, ఒక జాతి గానీ, ఒక రాష్ట్రం గానీ, లేదా ఒక దేశం గానీ గతాన్ని అధ్యయనం చేసి వర్తమానానికి అన్వయించుకుని భవిష్యత్తును నిర్మించుకోవాలనే అర్థం అందులో కనబడుతుంది. బడ్జెట్ ప్రసంగం చూస్తే 5వ పేరా మొత్తం 1996, 2004 మధ్య ఈ రాష్ట్రం సాధించిన విజయగాథలు, వీరగాథల ప్రస్తావన కనిపిస్తున్నది. కానీ, అదే 2004లో తెలుగుదేశం పార్టీ ఓడిపోవడం జరిగింది. ప్రభుత్వానికి నేను చేసే విజ్ఞప్తి ఏమిటంటే ఆ రోజు చంద్రబాబునాయుడు గారు హైటెక్ సి.ఎమ్.గా పిలిపించుకున్నారు. మాదాపూర్ హైటెక్ సిటీని అభివృద్ధి చేసి ఉండవచ్చు, కొన్ని లక్షలమందికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పించి ఉండవచ్చు కానీ, ఎప్పుడైనా సమాజంలో ప్రజలందరి ముఖ్యమంత్రి అనిపించుకున్నప్పుడు మాత్రమే ఆ ప్రభుత్వం విజయవంతమవుతుందనేది నా అభిప్రాయం. ఈ సారి ప్రజలు చంద్రబాబునాయుడుగారిని గెలిపించారు. 13 జిల్లాను సమగ్రాభివృద్ధి చేస్తారనే నమ్మకంతో ఆయనను గెలిపించారు. అయితే, గతంలోలాగా హైటెక్ సిఎమ్ అనిపించుకోకుండా సమగ్ర అభివృద్ధి చేసి ప్రజల ముఖ్యమంత్రి అనిపించుకోవాలని కోరుతున్నాను. నాలుగంశాలు ఈ సభ దృష్టికి తీసుకురాదల్చుకున్నాను. మొదటగా – ఈ రాష్ట్రం విడిపోయిన తరువాత పునర్నిర్మాణం జరగాలి, రాజధాని నిర్మాణం జరగాలి, 11 జాతీయస్థాయి విద్యాసంస్థలు స్థాపించాలని, ఐటి పార్కులు నిర్మించాలని

పునర్నిర్మాణ చట్టంలో పెట్టారు. వీటి నిర్మాణంతో పాటు సామాజిక న్యాయంతో కూడిన అభివృద్ధి, వికేంద్రీకరణతో కూడిన అభివృద్ధి జరగాలని నేను కోరుతున్నాను. గత రెండు నెలలుగా పరిశీలిస్తే మంత్రులంతా రాజధాని గురించి తలోమాట చెబుతున్నారు. ఒకాయన ఐఐటి ఒకచోట పెడతామంటే మరొకరు ఇంకొకచోట పెడతామంటున్నారు. అలా కాకుండా, చంద్రబాబునాయుడుగారి నాయకత్వంలో వీటన్నింటి విషయమై సమగ్ర వ్యూహం ప్రకారం చేయాలని కోరుతున్నాను. ఐటి హబ్‌లు, సోలార్ పవర్ ప్రాజెక్టులు ఎక్కడ పెట్టాలనే సమగ్ర పథకాన్ని ఆయన ప్రకటించాలని కోరుతున్నాను. ఈ రాష్ట్రం ఇప్పటికే విడిపోయింది, మరోసారి అలా జరగకూడదంటే 13 జిల్లాలపట్ల ఒక వికేంద్రీకరణతో కూడిన అభివృద్ధి వ్యూహాన్ని ఏర్పాటుచేయాలి.

రెండవ అంశం – పారిశ్రామికాభివృద్ధికి సంబంధించి గత 50, 60 ఏళ్లల్లో మనం చూస్తే శ్రీకాకుళం నుండి చిత్తూరు దాకా విశాఖపట్టణం మినహాయిస్తే ఎక్కడా భారీ పరిశ్రమల స్థాపన జరగలేదు. 15, 20వేలమంది కార్మికులు పనిచేసే భారీ పరిశ్రమ విశాఖపట్టణం మినహా 13 జిల్లాలలో ఎక్కడా లేదు. మన ప్రపంచ చరిత్ర , దేశ చరిత్రను చూస్తే పారిశ్రామికాభివృద్ధి జరిగిన చోటే విస్తరణ, అర్బనైజేషన్ జరిగిందని చెప్పవచ్చు. BHPV, BHEL, Steel Plant వంటి వాటి నిర్మాణం విశాఖపట్టణం మినహా మరెక్కడా జరగలేదు. ముఖ్యంగా వ్యవసాయాధారిత పరిశ్రమలను నెలకొల్పాలి. రెండు కేంద్రప్రభుత్వ సహాయంతో భారీ పరిశ్రమలు పెట్టినప్పుడు మాత్రమే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నేను విశ్వసిస్తున్నాను. అమెరికా, బ్రిటన్ చరిత్ర చూస్తే కూడా మనకు ఇదే అవగతమవుతుంది. బ్రిటన్‌లో కూడా పారిశ్రామిక విప్లవం జరిగిన తరువాత పరిశ్రమలు పెట్టిన తరువాతనే ఆ దేశం ప్రపంచపటంలో ఎన్నో దేశాలను జయించినట్లు మనం చూస్తున్నాము. అందుకని, కేంద్రప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి ప్రభుత్వ రంగ భారీ పరిశ్రమలను పెట్టినట్లైతే, దాని చుట్టూ ప్రైవేటు రంగ పరిశ్రమలు రావడానికి అవకాశమేర్పడుతుంది. ఇందుకు ప్రభుత్వం పూనుకోవాలని ఈ సందర్భంగా కోరుతున్నాను.

మూడవ అంశం వ్యవసాయానికి సంబంధించినది. మా జిల్లాలకు చెందిన మంత్రివర్యులు శ్రీ పి. పుల్లారావుగారు వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్‌ను ప్రతిపాదించారు. వ్యవసాయ బడ్జెట్‌ను పెట్టిన వారికి, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. 1997నుండి ఈరోజు దాకా చూస్తే కొన్ని లక్షలమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఏ ప్రభుత్వం ఉన్నా రైతుల ఆత్మహత్యలు జరిగాయి. అందుకు కారణాలేమిటి, నివారణ చర్యలేమిటి అనేదానిపై ఎటువంటి చర్చా జరగలేదు. కేంద్రప్రభుత్వం శ్రీ ఎమ్.ఎస్. స్వామినాథన్ కమిటీని వేసింది. రైతుల ఆత్మహత్యలను నివారించేందుకు కమిటీ అనేక సిఫారసులను చేసింది. 2004వ సంవత్సరంలో డా. వై.యస్. రాజశేఖరరెడ్డి గారు ప్రొ.జయతీఘోష్ ఆధ్వర్యంలో మరో కమిటీని వేశారు. ఆవిడ జెఎన్‌టియులో ఆర్థశాస్త్ర విభాగంలో పెద్ద ప్రొఫెసర్. ఆవిడ 23 జిల్లాలు తిరిగి అనేక ప్రతిపాదనలను స్వీకరించారు. రైతు సంక్షేమం కోసం ఆవిడ మార్కెటింగ్ సదుపాయం, గిట్టుబాటు ధర వంటి వాటిపై అనేక ప్రతిపాదనలు, సిఫార్సులు చేశారు. కానీ, ఆయా కమిటీల సిఫార్సులను ఈ వ్యవసాయ బడ్జెట్‌లో మంత్రిగారు చేర్చలేదు. వాటిల్లో కొన్నింటినైనా ఈ బడ్జెట్‌లో చేర్చాలని నేను కోరుతున్నాను. రుణమాఫీకి సంబంధించి జిల్లాలలో 65నుండి 70 శాతం ఉన్నకౌలు రైతులకు రుణమాఫీ జరగాలి. కౌలు రైతులు చాలామంది ప్రైవేటు వడ్డీ వ్యాపారులనుండి రుణం తెచ్చుకుంటున్నారు. ఆ విషయమై కూడా ఆలోచించాల్సిన అవసరం ఉన్నది. కౌలు రైతుల సమస్య వారి సమస్య కాదు. అది ఒక ఆర్థిక, సామాజిక ప్రక్రియ. గుంటూరు జిల్లాలో చాలా గ్రామాలలో వ్యవసాయ కులాలకు చెందిన

కమ్మ, రెడ్డి, కాపు వంటి వారు చాలామంది వ్యాపారాల నిమిత్తం, వాళ్ల పిల్లల చదువు నిమిత్తం గుంటూరు, విజయవాడ హైదరాబాదు, అమెరికా వంటి ప్రాంతాలకు వెళ్లి పోయారు. వాళ్ల పొలాలను కౌలుకు చేస్తున్న వారందరూ కూడా వెనకబడిన తరగతులకు చెందినవారే. కాబట్టి కౌలురైతుల సమస్య కేవలం వారి సమస్య కాదు ఆర్థిక, సామాజిక ప్రాసెస్‌కు సంబంధించిన సమస్య. అందుకని వారిపై ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని కోరుతున్నాను.

నాలుగవ అంశం – విద్యారంగానికి సంబంధించి బడ్జెట్‌లో ఎక్కువ మొత్తం కేటాయించారని చాలామంది మిత్రులు, పాత్రికేయులు చెప్పారు. వాస్తవమది. పాఠశాల విద్యకు రూ.12,595 కోట్లు, ఇంటర్మీడియట్ విద్యకు రూ. 812కోట్లు, ఉన్నత విద్యకు రూ.2,272కోట్లు కేటాయించారు. అంకెలు చూస్తే చాలా పెద్ద మొత్తం. విద్యారంగం పై ప్రభుత్వం యొక్క డైరెక్షన్ ఏమిటి? పాలసీ ఏమిటి? ప్రభుత్వ విధానపర అంశాలేమిటి అనేది తెలియాల్సిన అవసరం ఉన్నది. బడ్జెట్ ముందే శ్వేతపత్రం విడుదల చేసింది. మానవ వనరులకు సంబంధించి విద్యాశాఖామంత్రిగారు శ్వేతపత్రం విడుదల చేశారు. పాఠశాలవిద్యలో అనేక సమస్యలను పేర్కొన్నారు. కానీ, అందుకు సంబంధించిన డైరెక్షన్ ఏమిటి? గత రెండు దశాబ్దాలుగా ముఖ్యంగా ఆర్థిక సంస్కరణలు వచ్చిన 1990 సంవత్సరంనుండి విద్యారంగం మీద కొన్ని వేల కోట్లు ఖర్చుపెట్టాము.

మ.4.00 – 4.15

నూతనంగా ఉన్నత విద్యకోసం "రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్" 'రూసా' అనే పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టడం జరిగింది. కొన్ని వేల కోట్ల రూపాయలు విద్యారంగంపై ఖర్చుచేయడం జరుగుతోంది. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో రెండు దశాబ్దాలుగా కొన్ని వేల కోట్లు ఖర్చు చేసిన తర్వాత ఫలితం ఏమిటంటే, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు 58 శాతం ఉంటే, ప్రయివేటు పాఠశాలల్లో 42 శాతం మంది ఉన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలోకూడా ఇటువంటి పరిస్థితి లేదు. కేరళలో ప్రభుత్వ పాఠశాలలు 80 శాతం ఉంటే, ప్రయివేటు పాఠశాలలు 20 శాతం ఉన్నాయి. తమిళనాడులో 78 శాతం మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఉంటే, ప్రయివేటు పాఠశాలల్లో 22 శాతం మంది విద్యార్థులు చదువుతున్నారు. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో 58 శాతం మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఉంటే, ప్రయివేటు మరియు కార్పోరేట్ పాఠశాలల్లో 42 శాతం మంది విద్యార్థులు చదువుతున్నారు. కావున విద్యకు సంబంధించి ప్రభుత్వం యొక్క విధానం ఏమిటి? కార్పోరేట్ పాఠశాలలను, ప్రయివేటు పాఠశాలలను ప్రోత్సహించడమేనా? ఆ విధానంలో మార్పు రాకుండా మనం ఎన్నివేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా పెద్దగా ఉపయోగం ఉండదనేది నా ఉద్దేశ్యం.

విద్యకు సంబంధించి మరో ముఖ్యమైన అంశాన్ని ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు, శ్వేతపత్రంలో కూడా ప్రస్తావించడం జరిగింది. 2011, జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో అక్షరాస్యత సగటు 74 శాతం. కానీ, 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్‌లో అది 67 శాతం మాత్రమే. 13 జిల్లాల్లోని ఏడు జిల్లాల్లో 67 శాతం కంటే తక్కువగా ఉంది. మొత్తం 600 మండలాల్లో 350 మండలాల్లో అక్షరాస్యత కేవలం 60 శాతం మాత్రమే ఉంది. ఇది చాలా విచిత్రమైన విషయం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విద్యారంగంలో చాలా అభివృద్ధి చెందింది, IIT మరియు NIT సంస్థలలో మనరాష్ట్ర విద్యార్థులు ఎక్కువ సీట్లు సాధించడం జరుగుతుందని మనం గొప్పగా

చెప్పుకుంటున్నాము. కానీ, క్షేత్రస్థాయిలో ప్రజలయొక్క సాధికారత, ప్రభుత్వం అమలుచేసే అనేక పథకాల ఫలితాలు ప్రజలు పొందాలంటే ప్రజలంతా అక్షరాస్యులు అయినపుడు మాత్రమే సాధ్యపడుతుంది. ప్రజలంతా సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని శ్రీ చంద్రబాబునాయుడు గారు కూడా చెప్పడం ఇటీవలే నేను కూడా రెండు సమావేశాల్లో విన్నాను. 90 శాతం అక్షరాస్యతను సాధించాలని కూడా వారు పేర్కొనడం జరిగింది.

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి మరొక విచిత్రకరమైన అంశం, 1వ తరగతిలో 100 మంది పిల్లలు చేరితే, 10వ తరగతికి వచ్చేసరికి 26మంది చదువును మధ్యలోనే ఆపివేస్తున్నారు. 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన పిల్లల్లో సుమారు 60 శాతం మంది పిల్లలు 10వ తరగతిలోపుగానే చదువును మధ్యలోనే ఆపివేస్తున్నారు. షెడ్యూల్డు కులాలకు చెందిన పిల్లల్లో డ్రాపవుట్స్ 34 శాతం, కర్నూలు జిల్లాలో డ్రాపవుట్ రేటు 45 శాతం, ప్రకాశం జిల్లాలో 38 శాతం స్కూల్ డ్రాపవుట్ రేటు ఉంది. 1.4.2010వ తేదీన జాతీయ విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చింది. ఆ చట్టం ముఖ్య లక్ష్యం 6 నుండి 14 సంవత్సరాలలోపు పిల్లలంతా బడిలోపల ఉండాలి. నేడు మనం అనేక కార్యక్రమాలను కూడా చేస్తున్నాము. గతంలో 'బడిబాట' వంటి కార్యక్రమం కూడా చేయడం జరిగింది. ఇప్పుడు, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు 'బడి పిలుస్తోంది' అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమాలు ప్రచారానికి పనికివస్తున్నాయి. కానీ, క్షేత్రస్థాయిలో ఏ విధంగా జరగాలి అనేది చూడాలి. అందువల్ల, ప్రభుత్వానికి నా విజ్ఞప్తి ఏమిటంటే, 67 శాతం ఉన్న అక్షరాస్యతను పెంచాలంటే కేవలం ప్రచారం మరియు ప్రకటనల వల్ల మాత్రమే సాధ్యమయ్యేది కాదు. 1990వ దశకంలో 'సంపూర్ణ అక్షరాస్యత' అనే కార్యక్రమాన్ని పెద్దఎత్తున ప్రారంభించి నెల్లూరు మరియు అనేక జిల్లాల్లో చేయడం జరిగింది. దానివల్ల కొన్ని ఫలితాలు వచ్చాయి. అదే విధంగా, అక్షరాస్యతను పెంచడానికి ఒక ప్రత్యేకమైన యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాలి. జాతీయ విద్యా హక్కు చట్టాన్ని అభివృద్ధి చేయడానికి ఒక ప్రత్యేకమైన యంత్రాంగాన్ని కూడా అభివృద్ధి చేయాలి. ఆ చట్టాన్ని అమలుచేసే బాధ్యతను సర్వ శిక్షా అభియాన్‌కు అప్పజెప్పారు. 'సర్వ శిక్షా అభియాన్' అనేది ఒక ప్రభుత్వ శాఖ కాదు. అది కేవలం ఒక పథకం మాత్రమే. ఆ చట్టాన్ని పాఠశాల విద్యాశాఖకు అప్పజెప్పి ప్రత్యేకంగా దానిని అభివృద్ధి చేయవలసిన అవసరముందని కూడా నేను తమరిద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తున్నాను.

13 జిల్లాల ఆంధ్రప్రదేశ్‌లో నేడు ప్రభుత్వం స్థాపించినటువంటి 20 విశ్వవిద్యాలయాలు, 5 డీమ్డ్ విశ్వవిద్యాలయాలున్నాయి. ఆంధ్రా విశ్వవిద్యాలయం, నాగార్జున విశ్వవిద్యాలయం, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వరా విశ్వవిద్యాలయం మొదలైనవి సుమారు 40 సంవత్సరాల క్రితం స్థాపించబడ్డాయి. గతంలో ప్రభుత్వం జిల్లాకు ఒక విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలనే ఉద్దేశ్యంతో నన్నయ విశ్వవిద్యాలయం, వేమన విశ్వవిద్యాలయం, శాతవాహన విశ్వవిద్యాలయం లాంటి విశ్వవిద్యాలయాలను ఏర్పాటుచేయడం జరిగింది. ఈ విశ్వవిద్యాలయాల్లో ఇంకా మౌలికవసతులను ఏర్పాటుచేయలేదు. అయితే విచిత్రం ఏమిటంటే, రాష్ట్రంలో ఇన్ని సమస్యలుండి, రాష్ట్రంలో ఇప్పటికే 20 విశ్వవిద్యాలయాలు ఉండి, జాతీయ స్థాయిలో 11 విద్యాసంస్థలు మన రాష్ట్రానికి రాబోతుండగా, ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో విదేశీ మరియు ప్రయివేటు విశ్వవిద్యాలయాలను పెట్టబోతోందనే ప్రకటన ఈ మధ్యనే పేపర్‌లో వచ్చింది. దీనిని మేము ఖండిస్తున్నాము. ఇప్పటికే ఆరు రాష్ట్రాలలో 85 ప్రయివేటు విశ్వవిద్యాలయాలను నెలకొల్పారు. ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రంలో 100 ప్రయివేటు విశ్వవిద్యాలయాలు పెట్టారు. అవన్నీ వ్యాపారసంస్థలుగా

మారిపోయి మూతపడ్డాయి. మనం ఇప్పటికే జిల్లాకు ఒక విశ్వవిద్యాలయాన్ని స్థాపించడం జరిగింది. అందువల్ల ప్రయివేటు విశ్వవిద్యాలయాలు అనే ఆలోచనను ప్రభుత్వం మానివేసి ఉన్న విశ్వవిద్యాలయాలను పటిష్టం చేసే విధివిధానాలను రూపొందించాలని నేను తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

నేడు ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ యంత్రాంగం పూర్తిగా లోపించింది. ఒక ప్రాంతంలో 600 మండలాల్లో సుమారు 510 మండలాల్లో మండల విద్యాధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కేవలం 90 మండలాల్లో మాత్రమే ఆ అధికారులున్నారు. డి.ఇ.ఒ. మరియు ఎమ్.ఇ.ఒ. పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. అందువల్ల, ప్రభుత్వం చొరవ తీసుకుని విద్యాశాఖలో ఖాళీగా ఉన్న ఈ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలని నేను తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఇంతకుముందు సభ్యులు డా. బచల పుల్లయ్య గారు మాట్లాడుతూ, మన ప్రాంతంలో 140 ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. విశాఖపట్నంలో ఎ.వి.ఎన్.కళాశాల, కావలిలో జవహర్ భారతి లాంటి గొప్ప కళాశాలల్లో గత 15 సంవత్సరాలుగా ఆ పోస్టులను భర్తీచేయకపోవడం వల్ల ఆ కళాశాలలన్నీ క్షీణించే దశలో ఉన్నాయి. సుమారు 5 వేల లెక్చరర్ పోస్టులు ఈ కళాశాలల్లో ఖాళీగా ఉన్నాయి. ఎయిడెడ్ పాఠశాలల్లో సుమారు 9 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఖాళీ పోస్టులను భర్తీచేయడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని తమరిద్వారా ప్రభుత్వాన్ని నేను కోరుతున్నాను.

13 జిల్లాల ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు మొత్తం 6,500 వరకూ ఉన్నాయి. ఈ 6,500 ఉన్నతపాఠశాలల్లో కంప్యూటర్లు, టెలివిజన్లు మరియు ఇతర సామాగ్రి ఉంది. కానీ, ఆ పాఠశాలల్లో వాచ్‌మన్‌గానీ, అటెండర్ పోస్టులుగానీ లేనటువంటి పరిస్థితి ఉంది. ఆ పాఠశాలలు పంచాయితీరాజ్ శాఖ క్రిందకు వస్తాయి కాబట్టి పంచాయితీరాజ్ శాఖ ద్వారా ఆ పోస్టులను భర్తీ చేయడానికి తగిన చర్యలు తీసుకోవలసిందిగా తమరిద్వారా నేను కోరుతున్నాను.

మొత్తంమీద ప్రభుత్వ విద్యారంగం మనుగడ సాగించాలంటే కార్పోరేట్ మరియు ప్రయివేటు విద్యాసంస్థలను నియంత్రించాలి, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులను కల్పించాలి. ఈ దిశగా ప్రభుత్వం విధానపరంగా ఒక నిర్ణయం తీసుకోవాలని తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుకుంటూ, నాకు మాట్లాడడానికి ఈ అవకాశం ఇచ్చిన తమరికి నా ధన్యవాదాలను తెలియజేసుకుంటూ శెలవుతీసుకుంటున్నాను.

శ్రీ డి.వి.సూర్యనారాయణ రాజు (స్థానిక సంస్థలు, విశాఖపట్టణం): అధ్యక్షా, 2014-15 సంవత్సరం బడ్జెట్‌పై మాట్లాడడానికి నాకు అవకాశం ఇచ్చినందుకు తమరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అదే విధంగా, బడ్జెట్‌ను ప్రవేశపెట్టినటువంటి శ్రీ యనమల రామకృష్ణుడు గారికి, వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు గారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విభజన జరిగిన తర్వాత మొట్టమొదటగా ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇది. మనం ఇక్కడ ఒక విషయాన్ని గమనించుకోవాలి. ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన సందర్భంలో ఆనాడు అధికారంలో ఉన్న ప్రభుత్వం విద్యాసంస్థలు, రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు మొదలైన

వాటి కోసం ఎన్నో వాగ్ధానాలను చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని భర్తీ చేయడం కోసం అనేక ప్రతిపాదనలను విభజన చట్టంలో పొందుపర్చడం జరిగింది. ఈనాడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం, కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం మిత్రపక్షాలు కాబట్టి చట్టంలో పెట్టిన అన్ని ప్రతిపాదనలను కేంద్రం ద్వారా తెచ్చుకునే శక్తిసామర్థ్యాలు నేడు అధికారంలో ఉన్న ప్రభుత్వానికి ఉన్నాయని నేను భావిస్తున్నాను.

మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్‌లో ప్రధానంగా కొన్ని అంశాలను నేను ప్రస్తావించదలచుకున్నాను. ఎన్నికలకు ముందు ప్రజలకు కొన్ని హామీలివ్వడం వల్ల ప్రజలు ఆ హామీలను నమ్మడం ద్వారా అధికారంలోకి వచ్చిన ఈ రాష్ట్రప్రభుత్వం ఏవైతే వాగ్దానాలిచ్చారో వాటన్నింటినీ కూడా రాబోయే 5 సంవత్సరాల కాలంలో పూర్తి చేయవలసిన బాధ్యత వారిపై ఉందని నేను తమరిద్వారా మనవిచేస్తున్నాను. ఎందుకంటే, వ్యవసాయ రంగానికి కూడా రూ. 13 వేల కోట్లతో ప్రత్యేక బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టడం జరిగింది. వ్యవసాయ రంగం చాలా కష్టకాలంలో ఉంది, గత 10 సంవత్సరాలూ అధికారంలో ఉన్న ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేసిందనే విషయంలో నిజం లేదని నేను మనవిచేయదలచుకున్నాను. ఎందుకంటే, 2004వ సంవత్సరానికి ముందున్న పరిస్థితుల్లో శ్రీ వై.యస్.రాజశేఖరరెడ్డిగారి ప్రభుత్వంలో చాలా మార్పులను తీసుకురావడం జరిగింది. ఇన్‌పుట్ సబ్సిడీని పెంచడం, వరదలు, తుఫానులు సంభవించినపుడు ఇచ్చిన నష్టపరిహారం, పావలా వడ్డీకి ఇచ్చిన రుణం, అదే విధంగా వడ్డీ లేని రుణాలు, ఇరిగేషన్‌కు కావలసిన సదుపాయాలను సమకూర్చుకుంటూ, జలయజ్ఞం కార్యక్రమం ద్వారా లక్షల ఎకరాలను సాగులోకి తీసుకువచ్చిన ఘనత గత ప్రభుత్వానికి దక్కుతుంది. అంతకంటే మేము బాగా చేస్తామని చెబితే మేము చాలా సంతోషిస్తాము. దానికి మాకు ఎటువంటి అభ్యంతరం లేదు.

రుణమాఫీ ప్రధానమైన అంశం. ఎన్నికల సమయంలో రైతురుణాలన్నింటినీ మేము మాఫీ చేస్తామని చెప్పారు. ఆ తరువాత, ప్రమాణస్వీకార కార్యక్రమంలో రూ. 1.50 లక్షల కోట్లు మాఫీ చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది, ఎన్ని లక్షల రూపాయలైనా ఫర్వాలేదని చెప్పారు. చాలా సంతోషం. మీరు చెప్పిన మాటకే కట్టుబడి ఉండండి. కానీ, మీరు ఎంత సమయాన్ని తీసుకుంటారు? ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కేవలం 80 రోజులు మాత్రమే అయింది. ఈ 80 రోజుల్లోనే చేయగలమా అని నేడు చాలామంది సభ్యులు మాట్లాడారు. దానితో మేము కూడా ఏకీభవిస్తున్నాము. మీకు ఎంత సమయం కావాలంటే అంత సమయాన్ని తీసుకుని ఆ సమయాన్ని స్పెసిఫిక్‌గా ఈ సభద్వారా ప్రజలకు తెలియజేయాలనేది నా కోరిక. ఎందుకంటే, ఈ బడ్జెట్‌లో రూ. 5 వేలకోట్లు తీసుకువచ్చారు. మొత్తం రుణమాఫీ రూ.35 వేల కోట్లు నుంచి రూ. 40 వేల కోట్లు వరకూ ఉంటుందని మీరు అంచనా వేసుకుంటున్నారు. చాలా సంతోషం. మీరు బడ్జెట్ కేటాయించిన ప్రకారం చూస్తే రుణమాఫీ కోసం సుమారు 7 సంవత్సరాల సమయం పడుతుంది. రైతులు కష్టకాలంలో ఉండడం వాస్తవం. రైతులకు మీరిచ్చే చేయూతకు మేము ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. మీకు ఎంత సమయం కావాలో అంత సమయాన్ని తీసుకుని రైతులకున్న రుణాల మాఫీ చేస్తామనే మీ హామీని నిలబెట్టుకోవాలని మేము కూడా కోరుకుంటున్నాము.

ఒక్క విషయం, మీరు ఎన్నో శ్వేతపత్రాలను విడుదల చేశారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జరిగిన నష్టాన్ని, అలాగే దీనిపై కూడా ఇన్ని సంవత్సరాలలో మేము రైతుల రుణమాఫీ చేస్తాము, ఈ విధంగా రైతుల కష్టాల్లో పాలుపంచుకుంటామని ఒక white paperను ప్రచురించండి. ఆ విధంగా చేస్తే 5 సంవత్సరాలు కాదు, 10 సంవత్సరాలపాటు ఈ రాష్ట్రాన్ని పరిపాలించడానికి మీకు రైతులు చేయూతనిస్తారని నేను ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను.

సా. 4.15

ఎందుకంటే ఆల్‌రెడీ జీ.ఓ నెంబర్ 174ను ఈ ప్రభుత్వం పబ్లిష్ చేయడం జరిగింది. దాంట్లో కొన్ని అంశాలను నేను ప్రస్తావించదలచుకున్నాను. అనుభవజ్ఞులు, పెద్దలు వ్యవసాయ శాఖ మంత్రిగారు ఇక్కడున్నారు. ఈ జీ.ఓలో ఒక చిన్న గందరగోళం ఉందని తమరిద్వారా మంత్రిగారికి తెలియజేస్తున్నాను. ఎప్పుడైతే వడ్డీలేని రుణం ప్రవేశపెట్టామో, ఆ వడ్డీలేని రుణం ప్రవేశపెట్టినప్పుడు ఒక సంవత్సరంలోపు అసలు చెల్లిస్తే వడ్డీ చెల్లించాల్సినటువంటి అవసరం లేదని గత ప్రభుత్వం హామీ ఇవ్వడం జరిగింది. 31.12.2013 వరకు ఉన్నటువంటి రుణాల మాఫీ జరుగుతుందని జీ.ఓలో తెలిపారు. 2013 సంవత్సరం జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలలో ఉన్నటువంటి రుణాన్ని తిరగి 2014 జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలలోపు చెల్లిస్తారో వాళ్ళకి రుణాలు వర్తించవనేటటువంటి ఒక సర్క్యులర్‌ను మా కేంద్ర సహకార బ్యాంకు సొసైటీలకు పంపించడం జరిగింది. ఇందులో నేను పరిశీలిస్తే రమారమి మా జిల్లాలో రు.22 కోట్ల సహకార రుణాలు రైతులకు అందకుండా పోయే పరిస్థితి కనిపిస్తోంది. తరువాత ఒక రైతుకి ఒక సర్వే నెంబరు 302, 402 సర్వే నెంబర్లతోటి 25 ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయ భూమి ఉన్నప్పుడు, ఆ వ్యవసాయ భూమి ఉన్న కుటుంబమంటే భార్య, మైనరు పిల్లలు అనేటటువంటి క్లారిఫికేషన్ ఇచ్చారు సంతోషం. పెళ్ళైన పిల్లలకి ఇదే సర్వేనెంబరుతోటే పాసుపుస్తకాలుంటాయి. అయినా ఒక సర్వే నెంబరుతో తీసుకున్న రుణం ఎన్ని పాసు పుస్తకాలలో ఉన్నా ఒక్క రు.1.50 లక్షల రుణమే మాఫీ అవుతుందనే సంగతి ఈ కేంద్ర సహకార బ్యాంకు సర్క్యులర్‌లో ఇమిడి ఉంది. దానికి కూడా ఒక క్లారిఫికేషన్ కావాలని తమర్ని కోరుతున్నాను.

అలాగే రైతు సంక్షేమం కోసం చాలా బాగా పనిచేస్తాం, రైతు కష్టాల్లో ఉన్నాడు. రైతు కష్టాల్ని మనం చూడాలి. రైతు కష్టాలలో ఉండడానికి ప్రధాన కారణం వ్యవసాయ పెట్టుబడులు పెరిగిపోయాయి. వ్యవసాయం చెయ్యాలనే రైతులు పెట్టుబడులు తట్టుకోలేకపోవడం, ప్రకృతి సహకరించకపోవడం జరుగుతోంది. మనకి శాస్త్రజ్ఞులు ఎంతమంది ఉన్నప్పటికీ ప్రకృతి కూడా మనకు అనుకూలిస్తేనే వ్యవసాయం బాగుంటుందనేది అందరికీ తెలిసినదే.

మా జిల్లాకు సంబంధించి చెరుకుపంట మీద ఆధారపడే రైతులు ఎక్కువగా ఉన్నారు. రాష్ట్రం మొత్తంమీద 11 కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీస్ ఉంటే అందులో మూడేమో డిసెంట్‌లో ఉండగా మిగిలిన ఎనిమిది షుగర్ ఫ్యాక్టరీస్ పనిచేస్తున్నాయి. మా జిల్లాలోనే నాలుగు కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీస్ ఉన్నాయి. 13 లక్షల టన్నుల చెరుకును మేము పండించడం జరుగుతుంది. అందులో 11 లక్షల టన్నుల చెరుకు ఒక్క విశాఖపట్నం జిల్లాలోనే పండించడం జరుగుతుంది. చెరుకుపంట లాభదాయకంగా లేకపోవడంతో ఆ రైతులు కష్టకాలంలో ఉన్నారు.

దానినెలాగైనా మనం అభివృద్ధి చెయ్యాలి. చెరుకుమీద రైతులకి ఆసక్తి పెరగాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వంలో 2011-12 సీజన్‌కు రు.200 ప్రోత్సాహంగా ఇచ్చిందన్న సంగతి గుర్తుంచుకోవాలి. తరువాత 2012-13 సంవత్సరంలో ఆఖర్లో కూడా మళ్ళీ రు.200 లను ఈ చెరుకు రైతులకు ప్రోత్సాహకంగా ఇవ్వడానికి ప్రభుత్వం ఉత్తర్వులివ్వడం జరిగింది. అయితే 13 లక్షల టన్నులకి రు.26, రు.27 కోట్లు అవసరమైతే అప్పటి ప్రభుత్వం రు.10 కోట్లను రిలీజ్ చేసింది. రైతు సంక్షేమం కోసం పాటుపడే ఈ ప్రభుత్వాలు ఈ రు.10 కోట్ల జీ.ఓ కూడా ఇచ్చారు. ఏ ఫ్యాక్టరీకి ఎంతివ్వాలి అనే వివరాలతోపాటు, మొదటి టన్నుకు రు.80, తరువాత టన్నుకు రు.120 చొప్పున ప్రతీ టన్నుకు ఇవ్వడానికి నిర్ణయించుకున్నారు. అయితే అది అమలుకాలేదు. మా జిల్లాలోనే 9 లక్షల టన్నుల చెరుకుంటే ఈ జీ.ఓను అమలుచేయలేదు. వ్యవసాయశాఖ మంత్రిగారికి నేను తమద్వారా మనవి చేసేదేమిటంటే చెరుకు రైతులు చాలా ఇబ్బందుల్లో ఉన్నారు కాబట్టి మీరు దయ ఉంచి రు.13 వేల కోట్లను బడ్జెట్‌లో పెట్టారు. గత ప్రభుత్వమే రు.10,61,00,31,000 రిలీజ్ చేసింది. ఆరోజు రు.80 చొప్పున ఏ ఫ్యాక్టరీకి ఎంత అనే వివరాలతో జీ.ఓ నెం.85ను కూడా రిలీజ్ చేశారు. దానిని కూడా అమలు చేయలేదు. కొత్తగా మీరు రు.16 కోట్లు ఇస్తే ప్రతీ ఫ్యాక్టరీకి రు.200, ప్రతీ టన్నుకు కూడా ఇస్తే రైతులందరూ కూడా మిమ్మల్ని మరిచిపోకుండా ఉంటారని నేను మనవి చేస్తున్నాను. వ్యవసాయాన్ని మంచి మార్గంలో నడిపించి, రైతు క్షేమంగా ఉంటాడో ఆ దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్న సంగతి అందరికీ తెలిసిందే.

ఇక డ్వాక్రా సంఘాలు చాలా చక్కగా నడిచేవి. 98 శాతం వారి బాకీలను బ్యాంకులకు చెల్లించి పరపతిని పెంచుకునే సమయంలో ఈ డ్వాక్రా రుణాలను రద్దు చేస్తామని చెప్పారు. దానికి కూడా దగ్గరదగ్గర రు.7000 కోట్ల రూపాయలుంటుందని అంచనా వేస్తున్నారు. అయితే అది రివాల్వింగ్ ఫండ్ కింద ఇస్తారా? లేకపోతే రుణమాఫీ కింద ఇస్తారో తెలియనటువంటి పరిస్థితుల్లో డ్వాక్రా సంఘాలున్నాయి. కాబట్టి దానిమీద కూడా ఒక మంచి పత్రాన్ని రిలీజ్ చేయాలి. ఎంత సమయం తీసుకున్నా తప్పులేదు. ఎందుకంటే చాలా ఇబ్బందుల్లోనూ కొత్తగా ఏర్పడిన రాష్ట్రం. అయినా ఈ రాష్ట్ర భవిష్యత్తును మార్చే మంచి ముఖ్యమంత్రిగారున్నటువంటి రాష్ట్రం. ఈ రాష్ట్రంలో తప్పకుండా డ్వాక్రా మహిళల మీద కూడా శ్రద్ధతీసుకుని చేయాలని నేను కోరుకుంటున్నాను.

ఇక పెన్షన్‌ల విషయానికి వస్తే రు.75 నుంచి రు.200 చేస్తేనే అప్పుడు మేము చాలా ఎక్కువగా సంబరపడ్డాము. ఇవాళ రు.200 నుండి రు.1000 చేస్తే ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ కూడా మేము వారికి అభినందనలు తెలియజేయడానికి సిద్ధంగా ఉన్నాము. కానీ ఇందులో చిన్న ఇబ్బంది ఉంది. మీరు దీనిమీద బడ్జెట్‌లో ఎంత ప్రతిపాదించారో చూడండి. మార్చి వరకూ ఆ డబ్బులు సరిపోవు. మహిళలు, వృద్ధులు, వికలాంగులు ఉన్నారు. మార్చి వరకూ ఈ డబ్బులు సరిపోవాలంటే దగ్గర దగ్గర ఏడెనిమిది వేల కోట్ల రూపాయలు దీనికి కావలసి ఉంది. మీరు ఒక రు.1200 కోట్లు దానిమీద పెట్టినట్లుంది. అందులో రు.250 కోట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఎయిడ్ ఉంది. అందులో రు.350 కోట్లు ఇప్పటికే ఖర్చయిపోయింది. ఇంక ఉన్నది రు.650 కోట్లు మాత్రమే. కానీ రు.4000 కోట్లు ఇంకా కావలసి ఉంది. దానిని ఇవ్వకపోతే మీరు పెట్టినటువంటి రు.1000 పెన్షన్‌లో రు.75 కూడా ఇచ్చే స్థితిలో ఉండదని తమరికి మనవి చేసుకుంటున్నాను.

ఇంక బెల్ట్ షాపులు రద్దు చేస్తున్నామని చాలా గొప్పగా చెప్పారు. చాలా సంతోషం. మద్యపాన నిషేధాన్నే పూర్తిగా రూపుమాపితే చాలా సంతోషించే వ్యక్తుల్లో మొదటి వ్యక్తిని నేను. బెల్ట్ షాపులు రద్దుచేసి మూడు మాసాలైంది. మే, జూన్, జులై, ఆగస్టు కూడా వచ్చేసింది. అయితే కిందటి సంవత్సరం బెల్టు షాపులున్నప్పుడు ఎంత వినియోగించారో దానికన్నా 5 శాతం ఈ మూడు మాసాల్లోనే జరిగిందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని మనవి చేస్తున్నాను.

ఛైర్‌పర్సన్ : ముగించడానికి ప్రయత్నించండి.

శ్రీ డి.వి.సూర్యనారాయణ రాజు : ఎన్.టి.ఆర్ సుజల స్రవంతి పథకమన్నారు ప్రతి గ్రామంలోనూ కూడా రు.2 కే 20 లీటర్ల మంచినీళ్ళు ఇస్తామంటున్నారు చాలా సంతోషం. మంచి ప్రోగ్రాం తీసుకొచ్చారు. దానిని వెంటనే మీరు అమలుచేయాలని కోరుకుంటున్నాను.

మా చెరుకు రైతులకిచ్చేటటువంటి జీ.ఓ కాపీని కూడా తమరి ద్వారా మంత్రిగారికి పంపుతున్నాను. వెంటనే తమరు దానిని ఇప్పిస్తే మీ ద్వారానే మా చెరుకు రైతులకు బట్వాడాచేసే ప్రోగ్రాం కూడా తీసుకువస్తామని అధ్యక్షుల వారికి మనవి చేస్తున్నాను. ఈ అన్ని విషయాలను మనం జ్ఞప్తికి చేసుకుని మన రాష్ట్ర నిర్మాణం కోసం, రాష్ట్ర భవిష్యత్తు కోసం ఒక మంచి ప్రభుత్వాన్ని ఇవాళ ఎన్నుకున్నామని ప్రజలు సంతోష పడుతున్నారు కాబట్టి, ఆ సంతోషాన్ని వమ్ము చేయకుండా కష్టపడి పనిచేయండి. మంచి పనులన్నింటికీ అన్ని పరిస్థితులలోనూ కూడా మీకు మేము చేయూతగా ఉంటామనీ, మంచి పనులన్నింటికీ కూడా పూర్తి సహాయ సహకారాలనిస్తామనీ హామీ ఇస్తూ నేను విరమించుకుంటున్నాను.

(ట్రెజరీ బెంచెస్ నుండి హర్షధ్వానాలు)

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు : అధ్యక్షా, బెల్టు షాపుల గురించి గౌరవ సభ్యులు చెప్పారు. ఈరోజు రాష్ట్రంలో ఎక్కడ బెల్టు షాపులున్నా కూడా వెంటనే వారి లైసెన్సును రద్దు చేస్తున్నాము. అలాగే అక్కడున్న అధికారులను కూడా సస్పెండ్ చేస్తున్నాము. చాలా పద్ధతిగా చేస్తున్నాము. 5 శాతం వినియోగం పెరిగిందంటున్నారు. తప్పకుండా తగ్గిపోతుంది. ఎప్పుడైతే లభ్యత తగ్గిపోతుందో ఆటోమేటిగ్గా వినియోగం కూడా తగ్గిపోతుంది. రాబోయే రెండు, మూడు నెలల కాలంలో తప్పకుండా ఆ శాతం తగ్గిపోతుందనే విషయంలో ఎటువంటి అనుమానం లేదు. అదే విధంగా అక్టోబర్ 2 నుండి పెన్షన్లు అమలుచేయబోతున్నాము. ఇందులో ఎటువంటి సందేహం లేదు. ఎక్కడా కూడా సందేహం అక్కర్లేదు. చాలా స్పష్టంగా ఉంది ప్రభుత్వం. చెరుకు రైతులకి సంబంధించిన విషయంలో ఫైనాన్షియల్ కమిట్‌మెంట్ ఉంది కాబట్టి ఆ విషయాన్ని ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువెళ్తాము.

శ్రీ పి.జె.చంద్రశేఖర రావు : సెప్టెంబర్ నెలకు సంబంధించిన పెన్షన్ అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి రోజు ఇస్తారా? లేకపోతే అక్టోబర్ నెల పెన్షన్ నవంబర్ నెల 1వ తేదీ రాష్ట్ర అవతరణ రోజు ఇస్తారా?

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు : అక్టోబర్ 2వ తేదీ నుండి ఈ పథకం అమలుచేయడం జరుగుతుంది. అక్టోబర్‌లో ఏదైతే మనం పెన్షన్ ఇవ్వబోతున్నామో, అక్టోబర్‌లో ఏదైతే డ్యూ ఉంటుందో అప్పట్నించి రు.1000 మొదలవుతుంది.

శ్రీ బి.చెంగల్‌రాయుడు : అందరూ సద్బ్రాహ్మణులే. అక్కడ పెట్టిన రొయ్యలబుట్ట ఏమైందన్నారు? మద్యం వినియోగం 5 శాతం పెరిగిందని మంత్రిగారు చెప్పారు. దాని గురించి ఏమైనా చెప్పగలరు.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు : వినియోగం పెరిగేటటువంటి అవకాశమైతే చాలా తక్కువగా ఉంది. ఎందుకంటే బెల్టు షాపులు పూర్తిగా తీసేశాము. జిల్లాలోనూ, రాష్ట్రవ్యాప్తంగానూ టోల్ ఫ్రీ నెంబర్ కూడా పెట్టాము. జిల్లాలలో ఎక్కడ సమావేశాలు పెట్టినా అక్కడంతా చెప్తున్నాము. క్కడా లోపాలు లేకుండా చూస్తున్నాము. ఒకవేళ ఎక్కడైనా ఉందంటే అది అనధికారికంగా నడవాల్సిందే తప్ప ప్రభుత్వానికి తెలిసి మాత్రం బెల్టు షాపులు లేదు. వినియోగం 5 శాతమంటున్నారు, ఆ పోర్టుఫోలియో నాది కాదు కాబట్టి దానినొకసారి చెక్ చేయాల్సిన అవసరముంది. నాకు తెలిసి అలా ఉండే అవకాశంలేదు. కానీ పరిశీలిస్తాము.

**సా. 4.30**

శ్రీ ఆర్. రెడ్డపరెడ్డి (నామినేటెడ్): వార్షిక బడ్జెట్‌పైన మాట్లాడటానికి అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. అందరూ మాట్లాడిన తరువాత చివరలో మాకు అవకాశం వచ్చింది. వేసిన రికార్డే మరలా వేయకుండా కొన్ని సూచనలతో నేను ముగిస్తాను. రాష్ట్ర విభజన తరువాత ఓటర్లు రెండు ప్రధాన పార్టీలమధ్య విడిపోయారు. ఒకటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, రెండు టిడిపి పార్టీ. ఈ రెండు పార్టీలలో ఏదో ఒకటి అధికారంలోకి వస్తుందని ముందే నిర్ణయమైనది. ఈ రెండు పార్టీలు ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చాయి. ఎవరైతే బాగా హామీలు ఇచ్చారో వారిని గెలిపించటం జరిగింది. ఈ హామీలను అమలుచేసే బాధ్యత అంతా తెలుగుదేశం పార్టీపైనే ఉన్నది. అవసరం లేకపోయినా, ప్రజలనుండి డిమాండ్ లేకపోయినా ఆరోజు ఉన్న కాంపిటేషన్‌వల్ల హామీలు ఇవ్వటం జరిగింది. ఋణమాఫీకి ఇన్ని వేలకోట్లు కమిట్‌కావటం It is not at all proper for any political party or any political leader, because the thousands of crores that is committed for writing off the loans of farmers or women groups belongs to the entire society. It belongs to the people who do not own any land. It belongs to the thousands of people who toil day and night as labourers, who have migrated to other States because they could not have any house or land in Andhra Pradesh. But, for our winning elections, for vote bank politics we have made such promises and now the parties cannot say that the State is divided, therefore, the financial position is bad. Both YSR Congress Party and Telugu Desam Party knew that the financial position will be very bad after the division. Despite that they wanted power. So, therefore, they made all these promises. Now it is for the Ruling Party to give a time table chart saying that ఎప్పుడు ఇంప్లిమెంట్ చేస్తారు, ఎంత ఖర్చు, ఎక్కడనుండి తెస్తారు, what is the time frame? ప్రజలకు ఒనగూరే మేలుకంటే హామీలే ఎక్కువగా ఇచ్చారు. రైతులకు ప్రధానంగా కావలసినది లోన్ల రైటాఫ్ కాదు, నేను నిజమైన రైతుగురించి చెబుతున్నాను. వ్యవసాయభూమి ఉన్న ప్రతిఒక్కరూ నిజమైన రైతు కాదు. వంద వ్యాపారాలు చేస్తుంటారు, వారికి వ్యవసాయభూమి ఉంటుంది, వారు కూడా లోను తీసుకుంటారు, వారికి కూడా we write off the loan belonging to the poor and landless people. ఈ పథకంద్వారా

పేదల డబ్బులన్నీ అటువంటివారికి ఇస్తున్నాము. That is what my feeling is. కాబట్టి ఒక టైమ్‌టేబుల్ ఇవ్వండి. ఇందాక లక్ష్మణరావుగారు చెప్పినట్లు ఎవరైతే కష్టపడి వ్యవసాయం చేస్తున్నారో వారు రైతుగాని ఓనర్ రైతు కాదు. అటువంటివారికి మేలుచేయాలంటే సాగునీరు ఇవ్వండి, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సకాలంలో ఋణాలు, ఇన్సూరెన్స్ ఇవ్వండి. ఇన్సూరెన్స్ ఇప్పుడు బాగా బలపడుతోంది. అనంతపూర్ జిల్లాలో ఇన్సూరెన్స్ ఒక దారికి వచ్చిందని మా రైతుమిత్రులు చెబుతున్నారు. ఆ పథకాలను బలపరచాలి. ఎవరైతే రైతులు ఇబ్బందుల్లో ఉన్నారో వారి రెస్క్యూకి వెళ్లాలి, జనరలైజ్డ్‌గా మాఫీ చేయటం సరికాదు. పి.వి. నరసింహారావుగారు 1991లో మహిళాసంఘాలను స్టార్ట్ చేశారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధి చేసింది. తరువాత కాంగ్రెస్ కూడా కొనసాగించింది. మహిళాసంఘాలు చక్కగా పనిచేస్తున్నాయి. పావలావడ్డీ అన్నారు, ఋణమాఫీ అన్నారు. అదే గొప్ప, ఎందుకంటే మనందరం ఇచ్చిన డబ్బుతో వారు ఋణమాఫీ చేస్తున్నారు. వారికి ఋణాలే తీసేస్తామంటే, ఏమౌతోందంటే బ్యాంకులకు, రైతులకు, ఈ సంఘాలకు ఉండే సంబంధాలన్నీ ఒక క్రైసిస్‌లోకి వచ్చాయి. బ్యాంకులు ప్రజలవద్దకు వెళ్లే టైమ్‌లో మనం ఇటువంటి నిర్ణయాలు తీసుకున్నాము. ఫలితంగా ఇప్పుడు మరలా రైతులు ప్రైవేటురంగానికి వెళుతున్నారు. మొన్ననే మా బంధువు ఒకాయన రూ.80 లక్షలతో వ్యవసాయభూమి కొన్నారు. ఆ రైతు రిజిస్ట్రేషన్ ముందు రోజు రిజిస్ట్రేషన్‌కు రానన్నాడు, కారణం ఏమంటే ఆ భూమిపై రూ.83 వేలు అప్పు ఉందట. ప్రభుత్వం ఋణమాఫీ చేసింది, ఆ డబ్బు కూడా మా బంధువే కట్టాలని అన్నాడు. ఆ రూ.83 వేలు కూడా కట్టాడు. రూ.80 లక్షలు ఆ రైతు తీసుకున్నాడు. అతనికి ఎన్నో వ్యాపారాలు ఉన్నాయి. అతను కోరుకున్న రూ.83 వేలు ఎవరి సొమ్ము? ఇది ప్రజాసొమ్ము. ఆ డబ్బు తీసుకోకూడదు, మనమే కట్టుకుందామనే మనస్తత్వం అతనికి లేదు. గవర్నమెంట్ ఏదైనా ఇస్తుంటే దానిని ఎంతవరకైతే అంతవరకు లాక్కుందామనే మనస్తత్వంతో లబ్దిదారులు ఉన్నారు. ఎన్నివేల కోట్లు అయినా రూలింగ్ పార్టీకి తప్పదు. అది మంచి పథకమో, కాదో ప్రక్కనపెడితే అమలుపరచక రూలింగ్‌పార్టీకి తప్పదు. ఒక టైమ్‌టేబుల్ ఇచ్చి ఒక డెసిషన్ చెప్పాలి. బ్యాంకులనుండి ఫర్‌దర్ లోన్స్ రావు. మూడు లేక అయిదు రూపాయల వడ్డీకి మరలా ప్రైవేట్ రంగానికి వెళతారు. ఒకప్పుడు మైక్రో ఫైనాన్స్‌లు పనిచేసేవి. ఇవి హై రేటాఫ్ ఇంట్రెస్ట్. 24% వడ్డీ ఇందులో వసూలుచేస్తారు. మైక్రోఫైనాన్స్ ఋణాలు కూడా కట్టవద్దని చెప్పారు. తమిళనాడులో ఇవి బాగా పనిచేస్తున్నాయి. మా ప్రాంతంలోని పుంగనూరు, పలమనేరులలో మైక్రో ఫైనాన్స్ సంస్థలు లేవు. వారికి కూడా కట్టొద్దంటే వారు ఇవ్వలేరు కదా? ఇప్పుడు అక్కడ ఉన్న పరిస్థితి ఏమంటే లక్ష రూపాయలు తీసుకుంటే వారానికి రెండు వేలు వడ్డీ కట్టాలి. చిన్నచిన్న వ్యాపారాలు చేసేవారు, ఆవుల వ్యాపారాలు చేసేవారు, తోపుడుబండ్లవారు తీసుకుంటున్నారు. లక్ష రూపాయలకు నాలుగు వారాలకు ఎనిమిది వేల వడ్డీ కడుతున్నారు. కొన్ని సంస్థలను దెబ్బతీసే విధంగా మనం హామీలు ఇచ్చాము, అన్ని పార్టీలు ఇచ్చాయి. భవిష్యత్తులో ఇటువంటి హామీలు లేకుండా చూసుకోవలసిన బాధ్యత రాజకీయపార్టీలపైన ఉన్నది. we have to think of long term, not short term or next election. ఈ హామీలు సరిగా అమలుచేయలేకపోతే ఏ పార్టీ మేనిఫెస్టోను ప్రజలు నమ్మరు.

రాజధాని విషయం చాలా సున్నితమైన విషయం. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఢిల్లీలో నాయకులు చేసిన దేశద్రోహ చర్య ఏదైనా ఉందంటే అది ఈ ఆంధ్రరాష్ట్ర విభజనే. ఆంధ్రరాష్ట్ర విభజనద్వారా దేశంలోని అన్ని రాష్ట్రాల విభజనకు బీజాలు వేశారు. దేశం సమగ్రంగా ఉండాలి, చిన్నచిన్న ముక్కలుగా ఉంటే దేశానికి ప్రమాదమని భావించి ఆనాడు సర్దార్ వల్లభాయ్ పటేల్

చిన్నచిన్నవిగా ఉన్న princely states అన్నింటినీ ఎంతో కష్టపడి ఇండియన్ యూనియన్‌లో కలిపారు. ఢిల్లీలో నాయకుల అవగాహనరాహిత్యంవల్ల, వారి తెలివితక్కువతనంవల్ల ఈ రాష్ట్రం నాశనం అయిపోయింది, దేశ నాశనానికి కూడా పునాదులు వేశారు. ఎంతో బాధాకరమైన విషయం. ఇటువంటి చర్య మరల ఏ రాష్ట్రంలో కూడా జరగకూడదు. తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమలనే మూడు ప్రాంతాలు కలిసి ఆంధ్రప్రదేశ్‌గా ఉండేది. ఇప్పుడు తెలంగాణ విడిపోయింది. రేపు రాయలసీమలో కూడా ఎవరో తయారవుతారు. త్వరగా ముఖ్యమంత్రి అయిపోవచ్చని తయారవుతారు. ఒక కుటుంబం రాజకీయంగా ఏవిధంగా తెలంగాణ సంపాదించిందో మనం కూడా అదేవిధంగా సంపాదించవచ్చని తయారవుతారు. రీజనలిజమ్‌పైన ఎమోషన్స్‌ను పెంచటం చాలా ఈజీ. ఇప్పుడు క్యాపిటల్ అనేది ఒక ప్రధాన అంశంగా తయారవుతున్నది. అందుకనే నేను ఎ.పి. రీఆర్గనైజేషన్ యాక్ట్ సందర్భంగా కూడా చెప్పాను. ఫ్యూచర్‌లో ఆంధ్రప్రదేశ్ రాజధానిని నిర్ణయించేప్పుడు, నా దృష్టిలో అయితే రెండు ప్రాంతాల మధ్య అయితే బాగుంటుందని చెప్పాను. సమదూరం లేకపోయినా ఎమోషనల్ ఫీలింగ్స్‌ను ఎక్స్‌ప్లాయిట్ చేయకుండా ఉండటానికి అవకాశం ఉంటుంది. ఆవిధంగా నిర్ణయం తీసుకుంటే రాయలసీమ, కోస్టల్ ఆంధ్ర మధ్య రాజధానివస్తే బాగుంటుంది, సమగ్రంగా ఉంటుంది, ఎవరూ ఎక్స్‌ప్లాయిట్ చేయటానికి అవకాశం లేకుండా ఉంటుందనేది నా భావన. ఎందుకంటే మనం శాశ్వతం కాదు, మన పవర్ శాశ్వతం కాదు. అయిదేళ్ల కాలం పెద్ద కాలం కాదు, గడచిపోతుంది. మిగిలిన రాష్ట్రాల మాదిరిగా మన రాష్ట్రం కూడా సమగ్రంగా ఉండాలి.

చాలా ఉద్యమాల ఫలితంగా కేంద్రం లోక్‌పాల్ బిల్లు పాస్ చేసింది. లోకాయుక్త పెట్టాలని రాష్ట్రాలకు కూడా సలహా ఇచ్చింది. Anti-corruption bureau also comes under the new Lokayuktha. ఇటువంటి ఇండిపెండెంట్ సంస్థ రావటంవలన చీఫ్ మినిస్టర్ బర్డెన్ కూడా తగ్గిపోతుంది. చంగల్‌రాయుడు, సతీష్‌రెడ్డిలు మార్నింగ్ రోడ్ల విషయంలో ఒక క్వశ్చన్ వేశారు. ఇటువంటి ఇండిపెండెంట్ బాడీస్ ఉన్నప్పుడు వాటివద్దకు వెళ్లి ఎవరైనతే అవినీతికి పాల్పడుతున్నారో, అధికారం దుర్వినియోగం చేస్తున్నారో వారిపై కంప్లైంట్ చేస్తే అవి ప్రభుత్వానికి సంబంధం లేకుండా ఇన్వెస్టిగేషన్‌చేసి దోషులను శిక్షించటానికి వీలుకలుగుతుంది. మార్నింగ్ రాజుగారు మాట్లాడుతూ గుర్తుచేశారు. కర్ణాటకలో ఇండిపెండెంట్ లోకాయుక్త ఉండటంవల్ల ముఖ్యమంత్రి పదవి కూడా పోగొట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా మీరు త్వరగా లోకాయుక్త బిల్లు తీసుకురండి, ఆ కీర్తి మీ ప్రభుత్వానికి తెచ్చుకోండి, మేము కూడా సంతోషిస్తాము. ఈనాడు ఒక ఎ.సి.బి. ఎస్.ఐ.నో, ఒక తహసిల్దార్‌నో, ఒక ఆర్డీఓనో ట్రాప్‌చేస్తే వెంటనే ఒక ఐదుమంది ఎమ్.ఎల్ .ఎ.లను తీసుకుని ఆ కేసును డ్రాప్ చేయించుకోవటానికి విశ్వప్రయత్నాలు చేస్తారు. గత ప్రభుత్వంలో నావద్దకు కూడా ఎంతోమంది ట్రాప్ అయినవారు వచ్చారు. సర్, మీకు ఎలక్షన్స్‌లో ఖర్చవుతుంది, మేము పది లక్షలు ఇస్తాము, ముఖ్యమంత్రివద్ద సంతకం పెట్టిస్తే మిగతాదంతా మేము చూసుకుంటామని వచ్చారు. నేను ఎటువంటి వాడినో తెలిసి కూడా నావద్దకు వచ్చారు. కాబట్టి ఇప్పుడు ఉన్న చట్టంకంటే మెరుగైనదైన లోకాయుక్త చట్టాన్ని మీరు తీసుకువస్తారని నేను ఆశిస్తున్నాను.

నా పదేళ్ల రాజకీయ జీవితంలో 30, 40 మంది ఎస్.ఐ.లను చూశాను. నీతి, నిజాయితీగా ఉన్న ఇద్దరే నాకు కనపడ్డారు. వారిద్దరూ ఏ స్టేషన్‌లో పనిచేస్తుంటే there is no belt shop in that area. వారిద్దరూ ఉన్నంత కాలం రాజకీయ నాయకుడు చెప్పినప్పటికీ బెల్ట్ షాప్స్ పెట్టుకోవటానికి

ఎవ్వరూ ధైర్యం చేయలేదు. ఆవిధమైన విలువలు మీరు అధికారులలో తెప్పించండి, అభినందించండి. మాజీ పోలీసు అధికారిగా ఉన్నాను కాబట్టి ప్రొబెషనరీ ఎస్.ఐ.లను మా ఏరియాలో వేయమని చెబుతుంటాను. క్రొత్త ప్రొబెషనరీ ఎస్.ఐ. మొన్న ఒకతను వచ్చాడు. ఒక రైతు బంగారం బ్యాంక్‌లోపెట్టి నాలుగు లక్షల రూపాయలు అప్పు తీసుకున్నాడు. ఆ బ్యాంక్‌వారు అప్రైజర్‌కు ఇస్తే, ఆ బంగారం నాణ్యమైన బంగారం కాదని అతను అన్నాడు. బ్యాంక్ ఆఫీసర్ ఆ రైతును పిలిపించి నువ్వు నాణ్యమైన బంగారం ఇవ్వలేదు కాబట్టి మా ఋణాలు కట్టేయమని అన్నాడు. అతను వెంటనే నాలుగు లక్షలు కట్టి బంగారం తీసుకున్నాడు. ఈ ఇన్ఫర్మేషన్ తెలుసుకున్న ఈ ప్రొబేషనరీ ఎస్.ఐ. నీపైన చీటింగ్ కేసుపెడతానని నాలుగు లక్షలు తీసుకున్నాడు. నేను వెంటనే డి.ఎస్.పి.కి చెప్పి రెండు గంటలలో ఆ డబ్బు రిటన్ చేయకపోతే డి.జి.పి.కి చెప్పి ఎస్.ఐ. ప్రొబేషన్ టెర్మినేట్ చేయిస్తానని, డి.ఎస్.పి.ని సస్పెండ్ చేయిస్తానని చెప్పటంవల్ల వెంటనే ఆ రైతుకు నాలుగు లక్షల రూపాయల డబ్బు ఇచ్చేశారు. ప్రొబేషనరీ ఎస్.ఐ.లు కూడా ఈవిధంగా చేస్తున్నారు. There is something wrong in the police training. హోంమినిస్టర్ హౌస్‌లో లేరు. ఇంకా 30 సంవత్సరాల సర్వీస్ ఉన్న ఒక ప్రొబేషనరీ ఎస్.ఐ. ట్రైనింగ్ వచ్చినప్పుడే ఈవిధంగా నాలుగు లక్షల రూపాయలు తీసుకుంటూ అవినీతికి పాల్పడుతుంటే ఎట్లా? రెవెన్యూ ఆఫీస్‌లలో పరిస్థితి ఏవిధంగా ఉందంటే మొన్న ఒక విడో ఎమ్.ఆర్.ఓ. ఆఫీస్‌వద్దకు వెళ్లి హౌస్ సైట్ ఇచ్చారు, మా హౌస్ సైట్ చూపించమంటే విఆర్వో ప్రక్కకు పిలిచి అయిదువేల రూపాయలు ఇస్తే సైట్ చూపిస్తానని అంటున్నారు. ఒక విఆర్వోని ఎ.సి.బి. ట్రాప్ చేయించాను. ఎంతమందిని ట్రాప్ చేయించగలను సర్? వీడిని ట్రాప్ చేయించటానికి కూడా I am making plan. వారికి ఆ అయిదువేలు ఇచ్చే స్తోమత ఉందా, లేదా అనేది కూడా ఆలోచించకుండా విఆర్వోలు మానవత్వం కూడా లేకుండా ఈవిధంగా లంచాలు తీసుకుంటున్నారు. Everybody is of the opinion that the new government should perform well. ఈరోజు మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, ఆర్ అండ్ బి, పంచాయితీరాజ్ మొదలగు డిపార్ట్‌మెంట్‌లలో కమిషన్ 12 శాతానికి తక్కువ లేదు. లక్ష రూపాయల చిన్న వర్క్‌చేస్తే అతను జె.ఇ., డి.ఇ.నుండి ట్రెజరివరకు రూ.12,000కు తక్కువకాకుండా ఖర్చుచేయాలి. దీనిని ఏవిధంగా అరికడతారో ఆలోచించాలి. టెక్నాలజీతో సబ్‌స్టిట్యూట్ చేస్తారా లేక ఏవిధంగా చేస్తారో చూడండి. అసలు ఈ బిల్లులు ట్రెజరీకి పోకుండా చూడండి. ట్రెజరీలో 1% ఏమిటి సర్? ట్రెజరీలో చెక్ ఇవ్వటానికి 1% ఇవ్వాలి. They are small people. డబ్బు వడ్డీకి తీసుకువచ్చి పనులుచేసే ఈ చిన్నవారివద్ద ఈవిధంగా 12% ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్స్ దోపిడీ చేస్తున్నాయి.

సా.04.45

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఆన్‌లైన్ టెక్నాలజీని ప్రవేశపెట్టి మీరు రిజిస్ట్రేషన్లకు అనుమతిస్తే, ఎంతో ఉపయోగపడుతుంది. ఇవన్నీ చేస్తే మీకు క్రెడిట్ వచ్చేందుకు ఎంతో ఆస్కారముంది. దాన్ని ఏ విధంగా మీరు ఉపయోగించుకుంటారనేది మీ విజ్ఞతపైనే ఆధారపడి ఉంది. రెండవదేమంటే – నేను చిత్తూరు జిల్లా పశ్చిమ ప్రాంతం వాణ్ణి.

శ్రీ పత్తిపాటి పుల్లారావుః అధ్యక్షా.. మా సతీష్ కుమార్ రెడ్డి గారే చెబుతున్నారు. నేనే 1 పర్సంట్ కమీషన్ ఇచ్చి తెచ్చుకుంటున్నాను అంటున్నాడు. అంటే మీరు వాస్తవాలు మాట్లాడుతున్నారు. మనందరం కలిసి కృషి చేస్తేనే గానీ దీన్ని అరికట్టలేము. ఈ అవినీతిని మాపాలంటే, ఒక్కసారిగా మొత్తం తుడిచిపెట్టలేము గానీ, కనీసం కొంతవరకన్నా రెడ్యూస్ చేయగలుగుతాము. సమయానుకూలంగా మొత్తం కంట్రోల్ చేసేందుకు అవకాశముంటుంది.

శ్రీ ఆర్. రెడ్డప రెడ్డిః సార్, నేను పర్టిక్యులర్ పార్టీ గురించో, పర్టిక్యులర్ ఇండివిడ్యువల్ గురించో చెప్పడం లేదు. వ్యవస్థే అలా ఉంది. కాబట్టి, గవర్నమెంట్ వైపు నుండి కొద్దిగా టెక్నాలజీని ఇప్పించండి. ఇప్పుడు మీ–సేవా అని ఉంది. దాన్ని బలపరచండి. మీరొక కాన్ఫరెన్స్ పెట్టండి. ఆఫీసర్లకు మానవత్వం పాటించమని చెప్పండి. టైం లేదు గానీ, there are so many instances where inhuman things are going on. If the Chairman permits a little more time, చిన్న సంఘటన చెబుతాను. ఒక చిన్న రైతుకు ఎకరంన్నర పొలం ఉంది. రోడ్డు పక్కన రీ బోర్ చేసుకుంటున్నాడు. మా దగ్గర సబ్ కలెక్టర్ ఒకతను ఐఏఎస్ ఆఫీసర్ ఉన్నాడు. ఆ రైతు రోడ్డు పక్కన రీబోర్ చేసుకోవడం గమనించి, అతను పర్మిషన్ తీసుకున్నాడా లేదా అనేది కనుక్కోమని తహసీల్దారుకు ఫోన్ చేసి, బోర్‌ని సీజ్ చేశారు. లక్ష రూపాయలు పెనాల్టీ క్రింద కట్టమన్నాడు. అతను నలభై వేల రూపాయలు అప్పు తెచ్చుకుని రీబోర్ చేసుకుంటున్నాడు. అప్పటి తహసీల్దారు అనంతపురం నుండి ఎలక్షన్ డ్యూటీ మీద వచ్చాడు. నేను సబ్ కలెక్టర్‌కి ఫోన్ చేసి చెప్పాను. He is directly recruited IAS Officer. I introduced myself to him saying "I am also a former IPS Officer. I am telling that he is a very poor farmer. No money. Please drop that complaint, అతను రీబోర్ చేసుకుంటున్నాడు, ఏం కంప్లెయింట్ లేదు' అనంటే, దానికి సబ్ కలెక్టర్ అతన్ని పంపించండి సార్, నేను చూస్తానని చెప్పాడు. అతను వెళ్లి కలిస్తే, మీరు అప్పీల్ పెట్టుకోండని చెప్పాడు. I thought he is a directly recruited officer. తప్పకుండా వింటాడు. హ్యూమన్ టచ్ ఉంటుందని అతను ఎక్స్‌పెక్ట్ చేశాడు. సిన్సియర్‌గా ఉంటాడు కాబట్టి he can take any decision అనుకున్నాను. కానీ, ఆ విధంగా చెప్పి పంపించేశాడు. కాబట్టి, కాన్ఫరెన్స్‌ల్లో మీ దగ్గరకు వచ్చినప్పుడన్నా అధికారులకు చెప్పండి. Don't go by purely Law. Go by some human touch in respect of poor people.

పడమట ప్రాంతం విషయానికి వస్తే, మాది సముద్ర మట్టానికి 2000 అడుగుల ఎత్తులో ఉంటుంది. టమోటా, మల్బరీ, పొటాటో, గ్రౌండ్ నట్ విషయానికి వస్తే రెయిన్ ఫెడ్ క్రాప్. డ్రిప్ ఇరిగేషన్‌తో చేసేది. ఈ మధ్య కాలంలో బోర్‌వెల్స్ చూస్తే, గ్రౌండ్ వాటర్ లెవల్ పడిపోవడం వల్ల దాదాపు 1000 అడుగుల లోతుకు వెళితే గానీ నీరు పడడం లేదు. 100 బోర్‌వెల్స్‌లో 50 బోర్‌వెల్స్ ఫెయిల్ అవుతున్నాయి. కొత్తగా మీరు రెండు బోర్‌వెల్స్ వేస్తే,్ఛ ఛౌట్ఛ జీట 100% టఝ్ఛ్టా జ్ఛజీజా. కాబట్టి, రైతులు ఈ బోర్‌వెల్స్ వల్ల ఎంత ఇబ్బందులు పడుతున్నారో చూడండి. హంద్రీనీవా కాలువ ఉంది. కండలేరు జలాశయం నీళ్లున్నాయి. వేరే ప్రభుత్వాలు ప్రారంభించినా కూడా ఆ రెండింటి ద్వారా నీరు తెస్తే తప్ప, వేరే మార్గం ఏమీ లేదు. ఎందుకంటే, గతంలో చెరువులు ప్రతి సంవత్సరం సంపూర్ణంగా నిండేవి. ఇప్పుడు పది సంవత్సరాలైంది. చెరువులు నిండలేదు. ఇప్పుడు చిన్న చిన్న రైతులు మా ఊళ్లో కూడా నన్ను ఎక్కడన్నా బెంగుళూరులో వాచ్‌మెన్‌గా పెట్టు అని అంటున్నారు. తెలిసిన మిత్రులు ఎవరన్నా ఫ్లాట్‌లు కడుతూ ఉంటే, 20 ఏళ్ల పాటు రైతుగా పని చేసిన వ్యక్తిని వాచ్‌మెన్‌గా పెట్టిస్తున్నాను. కాబట్టి, మా ప్రాంతంలో గ్రౌండ్ వాటర్ లెవల్ చాలా తక్కువగా ఉంది. ఈ హంద్రీనీవా, కండలేరు రెండు ప్రాజెక్టులకు సంబంధించి కొద్దిగా ఫండ్స్ ఇప్పిస్తే ప్రజలు మిమ్మల్ని గుర్తు పెట్టుకుంటారని తెలియజేస్తూ, ఈ అవకాశమిచ్చినందుకు సభాధ్యక్షులకు ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ ఛైర్మన్ః రెడ్డప రెడ్డి గారూ, మీరు మాట్లాడుతూ, ఏదైతే రాష్ట్ర విభజన జరిగిందో, పార్లమెంటులో చట్టం పాస్ చేశారో, దానికి సంబంధించి దేశ ద్రోహమనే మాట వాడారు. నేను నా చాంబర్లో ఉండగా విన్నాను. మీరు ఆ మాట వాడారు.

శ్రీ ఆర్.రెడ్డప రెడ్డిః అంత బాధగా ఉంది సార్.

మిస్టర్ ఛైర్మన్ః ఏది ఏమైనా ఆ పదాన్ని వాడకూడదు. పార్లమెంటులో చట్టం చేశారు.

SRI. R. REDDAPA REDDY: For your sake I can withdraw that. But, it is definitely, I may not use that word, they have threatened the integrity of the country.

MR. CHAIRMAN: You can express your pain, anguish and everything, but you cannot use those words as it was done by the Act of Parliament.

SRI.R. REDDAPA REDDY: Sir, I withdraw those words because of your objection, not because I want to withdraw. Thank you.

మిస్టర్ ఛైర్మన్ః అంగూరి లక్ష్మీ శివకుమారి, ఎవరైతే ఆబ్సెంట్ అవుతారో, నేను వాళ్లను పిలవను. శ్రీమతి పి.శమంతకమణి ఆవిడిప్పుడే బయటకు వెళ్లారు, వచ్చి మాట్లాడతారు. Satyanarayana Raju garu, please take the mike and speak.

శ్రీ కె.వి.వి. సత్యనారాయణ రాజుః గౌరవ అధ్యక్షా, 2014-2015 సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టిన బడ్జెట్ మీద మాట్లాడేందుకు నాకు అవకాశం కల్పించినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ, రాష్ట్ర విభజన నేపథ్యంలో ఉన్నటువంటి సామాజిక, ఆర్థిక, రాజకీయం పరిస్థితుల నేపథ్యంలో ఒక ఆర్థిక శాస్త్రవేత్త, అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు, అలాగే ఆర్థిక శాస్త్రంలో ఎంతో ఓర్పు, నేర్పు ఉన్నటువంటి, ప్రావీణ్యం గలిగిన ఆర్థిక శాఖామాత్యులు శ్రీ యనమల రామకృష్ణుడు గారు, 20 వ తేదీన ప్రవేశ పెట్టిన బడ్జెటు, అలాగే ఒక వ్యవసాయ వేత్త, అగ్రికల్చర్ మినిస్టర్ అయినటువంటి శ్రీ పత్తిపాటి పుల్లారావు గారు కూడా 22 వ తారీకున ప్రత్యేకంగా వ్యవసాయ బడ్జెట్‌ని ప్రవేశపెట్టినటువంటి నేపథ్యంలో మొట్టమొదటగా వారిని అభినందిస్తున్నాను. విభజన అయినప్పటికీ కూడా ఈ రాష్ట్రం ఒక మంచి లక్ష్యంతో ఆశయాలతో ముందుకు పోవాలనేటటువంటి ఉద్దేశంతో ప్రవేశపెట్టినటువంటి రూ.1,11,824 కోట్ల రూపాయలతో ప్రవేశపెట్టిన బడ్జెటు ఇది. అలాగే రాష్ట్ర ప్రజానీకం కూడా విభజన అయిపోయిన తరువాత కూడా, ఎవరైతే ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి, నిర్మాణం చేసి వచ్చే తరాల వారికి మార్గదర్శనం చేస్తారనే ఉద్దేశంతో ఇక్కడ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి గారి ఆధ్వర్యంలో తెలుగుదేశం ప్రభుత్వానికి, అలాగే జాతీయ స్థాయిలో శతాబ్దాల తరువాత ఒక గొప్ప నాయకుడు, విజన్ ఉన్నటువంటి ప్రైమినిస్టర్ శ్రీ నరేంద్ర మోడీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీకి పట్టం కట్టి లక్ష్యాలు ఏదైతే నిర్దేశించుకోవాలో, అందరికీ సమానత్వం నేపథ్యంలో కేటాయింపులు చేశారని మీ ద్వారా తెలియజేస్తున్నాను. అదేవిధంగా విభజన నేపథ్యంలో చాలా దారుణం జరిగింది. మనమందరం కూడా ఒక భవిష్యత్తుని ఆశావాద దృక్పథంతో చూస్తున్నాము.

శ్రీ సి. రామచంద్రయ్యః అధ్యక్షా, సత్యనారాయణ రాజు గారి సీటు అదేనా? ఎందుకంటే, నేను రాజు గారికి వ్యతిరేకంగా మాట్లాడటం లేదు. We have to maintain that. Atleast while they are speaking, they should speak from their allotted seats. రాజుగారికి అభ్యంతరం పెట్టడం కాదు. ఇంతకుముందు కూడా శర్మ గారు ఒక అబ్జెక్షన్ పెట్టారు.

శ్రీ కె.వి.వి.సత్యనారాయణ రాజుః ఆ కేసు వేరే.

శ్రీ సి. రామచంద్రయ్యః కేసు ఏదైనా కూడా... మేము అబ్జెక్ట్ చేసేది కాదు. In what way you are benefited by violating the Rules?

SRI. K.V.V. SATYANARAYANA RAJU: Nothing… Nothing…

SRI.C. RAMACHANDRAIAH: Then better to stick to the Rule.

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడుః సార్, మేం ఆల్‌రెడీ సీట్లు మార్చమని ఛైర్మన్ గారికి లెటర్ పెట్టుకున్నాము.

శ్రీ కె.వి.వి.సత్యనారాయణ రాజుః ఇచ్చాం సార్. రెండు, మూడు రోజుల్లో మారుస్తారండీ..

మిస్టర్ ఛైర్మన్ః ఒక్కటీ.. వారు చెప్పేదేమిటంటే, at least when you take the mike and speak, you should speak from the allotted seat. మామూలుగా కూర్చోవచ్చు. You can assist anybody. You can talk to anybody. సీఎం గారు కూర్చున్నప్పుడు, ఆయన దగ్గర కూర్చుని మాట్లాడతారు. Seat is allotted. అయితే, మాట్లాడటానికి వెళతారు. అది షార్ట్ టైం. When you want to speak, you have speak from the seat allotted to you.

SRI K.V.V.SATYANARAYANA RAJU: O.K. Sir. From the next time onwards, I will strictly follow the Rule.

శ్రీ పి.జె. చంద్రశేఖర్ రావుః అధ్యక్షా, అది రూల్ బుక్‌లో ఉన్న అంశం. రూల్ బుక్‌లో మాట్లాడేటప్పుడు సభ్యులు తప్పనిసరిగా వారి స్థానం నుండే మాట్లాడాలని ఉంది.

శ్రీ బి. చెంగల్ రాయుడుః ఛైర్మన్ గారు చెప్పింది కూడా అదే కదా? కొత్తగా ఏముంది?

మిస్టర్ ఛైర్మన్ః నేను చెప్పింది కూడా అదే. He is only supporting my contention.

శ్రీ సి. రామచంద్రయ్యః మీరు ఈ విధంగా పర్మిట్ చేస్తే, ఎవరు ఎక్కడి నుంచైనా మాట్లాడతారు. దానికి మనమందరం ఒప్పుకుంటే. That is O.K. Let's change the Rules. నాకు రాజు గారు మాట్లాడుతుంటే, ఒక్క అభ్యంతరమేమీ లేదు. ఆయన మీ సీట్లో కూర్చుని మాట్లాడినా నాకు అభ్యంతరమేమీ లేదు. మీరు పర్మిట్ చేస్తే..

శ్రీ కె.వి.వి.సత్యనారాయణ రాజు ః అక్కడ కూర్చుని మాట్లాడటమేమీ ఉండదు..

మిస్టర్ ఛైర్మన్ః వారి ఉద్దేశమేమంటే, 'మొదట్లోనే చెప్పుంటే నేను వెళ్లేవాడిని కాదు. I am not thorough with the Rule.' అని. That's why he is asking my permission.

శ్రీ సి.రామచంద్రయ్యః సార్, అప్పటికీ విజిలెంట్‌గా ఉన్నాము. మీరు చెప్పిన తరువాతైనా మేం విజిలెంట్‌గా ఉన్నాం.

MR.CHAIRMAN: This time you can continue. From the next time onwards, you should speak from the allotted Chair only.

శ్రీ సి.రామచంద్రయ్యః సార్, భవిష్యత్తులో కొంచెం మీకే ఇబ్బందిగా ఉంటుంది. అందుకే చెప్పాను.

MR.CHAIRMAN: I know that.

SRI. K.V.V.SATYANARAYANA RAJU: From the next time, I will correct myself.

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డిః కాదు సార్. ఇందులో నియమాల్ని అతిక్రమించాల్సిన అవసరమేముంది. సిస్టాన్ని పాటిస్తే సరిపోతుంది. పెద్దలే ఇలా చేస్తే ఎలా?

మిస్టర్ ఛైర్మన్ః రైట్.. రైట్.. ముందే చెప్పాను కదా?

శ్రీ కె.వి.వి.సత్యనారాయణ రాజుః అధ్యక్షా, విభజన నేపథ్యంలో 9, 10 షెడ్యూళ్లలో 11 జాతీయ స్థాయి విద్యా సంస్థలు ఎయిమ్స్, ఐఐటి, ట్రిబుల్ ఐటీ, ఐఐఎస్, ఐఐఎం, ఎన్ఐటిలను పెట్టిన సందర్భంలో అది కూడా 54 జాతీయ స్థాయి రీసెర్చ్ ఇన్స్టిట్యూట్స్ గానీ, డిఫెన్స్ ఇన్స్టిట్యూట్స్ గానీ లేకుండా చేసిన విషయాన్ని మీ ద్వారా గుర్తు చేస్తున్నాను. ఈ రాష్ట్రంలో ప్రభుత్వం రాకముందే ఒక 8 డిపార్టుమెంట్లకు సంబంధించిన హ్యూమన్ రిసోర్సెస్ గానివ్వండి, ఇండస్ట్రీలు, ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఇరిగేషన్, అగ్రికల్చర్, పవర్ అండ్ ఎలక్ట్రిసిటీ, ఫైనాన్షియల్ రిసోర్సెస్ అండ్ మొబిలైజేషన్ ఆఫ్ మెయిన్టెనెన్స్ అండ్ స్కిల్ డెవలప్మెంట్ వీటన్నింటికీ కూడా శ్వేతపత్రాలు విడుదల చేసిన విషయాన్ని మీ ద్వారా జ్ఞాపకం చేస్తున్నాను. జూన్, 8 వ తేదీన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ఒక బ్రాడర్ అవుట్ లుక్తో, ఇంటెన్షన్తో కొన్ని సంతకాలు చేశారు. రైతులకు, డ్వాక్రా మహిళలకు, చేనేత కార్మికులకు, ఎస్సీ, ఎస్టీలకు దాదాపు రూ.54,000 కోట్ల వరకు రుణ మాఫీ చేసిన విషయాన్ని, అలాగే వృద్ధులు, వితంతువులకు సంబంధించి రూ.200గా వున్న పెన్షన్ని, ఒక్కసారిగా ఐదు రెట్లకు పెంచి రూ.1000 పెన్షన్ ఇవ్వడమనేది ఒక గొప్ప అంశంగా నేను అభివర్ణిస్తున్నాను.

అలాగే, వికలాంగులకు సంబంధించిన పెన్షన్ని రూ.1000 నుండి రూ.1500 వరకు పెంచారు. 79 శాతం వైకల్యం ఉన్నవారికి రూ.1000, 80 అంతకన్నా ఎక్కువ శాతం వైకల్యం ఉన్న వారికి రూ.1500 వరకు పెన్షన్ని పెంచడం ఒక గొప్ప అంశంగా భావిస్తున్నాను. ఇది వారందరికీ ఎకనామిక్ సపోర్టుగా ఉంటుందని మనవి చేస్తున్నాను.

అలాగే, కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) విషయానికి వస్తే, రాష్ట్రంలో రిలయన్స్, గెయిల్, జిఎంఆర్ వంటి చాలా సంస్థలు ఉన్నాయి. ముఖ్యంగా మా తూర్పు గోదావరి జిల్లాలో సిఎస్ఆర్ క్రింద ఈ సంస్థలు పూర్తిగా ఖర్చుపెట్టడం లేదండీ. దేశంలో ఎక్కడైనా పెద్ద పెద్ద సంస్థలు సిఎస్ఆర్ క్రింద నిధులు ఖర్చుపెట్టే పరిస్థితి ఉంది. అలాగే, ఎక్కడైతే వాళ్లు ప్రొడక్షన్ తీసుకుంటున్నారో, ఎక్కడైతే సహజ వనరులు తీసుకుంటున్నారో అక్కడే వాళ్లు ఈ సిఎస్ఆర్ క్రింద నిధులు ఖర్చుపెట్టేలా ప్రభుత్వం ప్రయత్నం చేయాలి.

అలాగే, డ్రింకింగ్ వాటర్‌కు సంబంధించి ఎన్టీఆర్ సుజల స్రవంతి స్కీం క్రింద 20 లీటర్ల సురక్షిత నీటిని రెండు రూపాయలకే గ్రామాల్లో అందించాలని నిర్ణయించడం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజానీకానికి మంచి ఆరోగ్యాన్నివ్వడానికి తీసుకున్నటువంటి చర్యగా నేను అభివర్ణిస్తున్నాను. అలాగే, బెల్టుషాపులు ఎక్కడున్నా కూడా కాల్ సెంటర్‌కు ఒక్క ఫోన్ చేస్తే ప్రభుత్వం దాని మీద చర్యలు తీసుకునే విధంగా మన ఎక్సైజ్ మినిస్టర్ గారు ఎనౌన్స్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా జ్ఞాపకం చేస్తున్నాను.

అలాగే, ఉద్యోగుల పదవీ విరమణకు సంబంధించి ప్రస్తుతమున్న 58 సంవత్సరాల వయోపరిమితిని 60 సంవత్సరాలకు పెంచడమన్నది చాలా చారిత్రాత్మకమైన నిర్ణయం. ఈ విషయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీలైన బాలసుబ్రహ్మణ్యం గారు, పుల్లయ్య గారు, శ్రీనివాసులు నాయుడు గారు కూడా చెప్పారు. ఎయిడెడ్ ఎంప్లాయీస్‌కు కూడా ఈ ప్రయోజనాన్ని కల్పించి, ఖచ్చితంగా 60 సంవత్సరాలకు వారి పదవీ విరమణ వయోపరిమితిని పెంచడానికి గౌరవ మంత్రి గారు ప్రయత్నం చేశారు. ముఖ్యమంత్రి గారు కూడా చెప్పారు. క్యాబినెట్లో కూడా అప్రూవ్ చేసిన విషయాన్ని తెలియజేస్తూ, రాత్రి కూడా ఆర్థిక మంత్రిగారితో కూర్చుంటే, వారిక్కూడా 60 సంవత్సరాలకు పెంచుతామని, ఎట్టి పరిస్థితుల్లోనే ఈ నెలాఖరులోపే నిర్ణయం చేస్తామని చెప్పినందుకు కృతజ్ఞతలు. ఎట్టి పరిస్థితుల్లోనూ తొందరగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాను.

సా.5.00

అధ్యక్షా, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు, ఫీజు రీ-ఇంబర్స్‌మెంట్‌కు సంబంధించి ఈరోజు విద్యార్థిని, విద్యార్థుల మీద ఖర్చు పెడుతున్నది ఒక సహాయం చేస్తున్నట్లుగా కాకుండా భవిష్యత్తులో ఈ మానవ వనరులను పూర్తిగా సద్వినియోగించుకోవడానికి, ఇది భవిష్యత్తు తరాలకు ఉపయోగపడుతుంది కాబట్టి దానిని ఎట్టి పరిస్థితులలోను నిర్వీర్యం చేయకూడదని కోరుతున్నాను. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీలైతే రూ.2.00లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్నవారికి, ఇతర కులాల వారైతే రూ.1.00లక్ష రూపాయలు వార్షిక ఆదాయం ఉన్న వారికే ఈ ఫీజు రీ-ఇంబర్స్‌మెంట్ పథకం వర్తిస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రీ-ఇంబర్స్‌మెంట్ చేస్తున్నందున కనీసం ఆ పరిమితిని రూ.3లక్షలకు పెంచాలని, ఇతర కులాల వారికైతే కనీసం రూ.2 లక్షలకు పెంచి ఫీజు రీ-ఇంబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

విజన్ 2020 అని అంటున్నారు. 2022 నాటికి భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అవుతుంది కాబట్టి ఆ నేపథ్యంలో GSDPకి 2029వ సంవత్సరం వరకు , అలాగే GSDP తోపాటు ఈ ఇండెక్స్‌కు పారామీటర్స్ క్రింద హెల్త్ ఇండెక్స్ కూడా తీసుకురావాలని ముఖ్యమంత్రి గారు టిడిఎల్పి సమావేశాలలో కూడా చెప్పడం జరిగింది. అలాగే, వచ్చే మూడు పంచవర్ష ప్రణాళికలలో 15 సంవత్సరాల పాటు అంటే 2029వ సంవత్సరం వరకు ప్రతి సంవత్సరం వచ్చే గ్రాస్ ఇండెక్స్‌తోపాటు హెల్త్ ఇండెక్స్‌ను కూడా తయారు చేయాలని చెప్పడమనేది వారి దార్శినికతకు నిదర్శనమని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, సన్‌రైజ్ స్టేట్ క్రింద ఆంధ్రప్రదేశ్‌ను మిషన్ బేస్డ్ డెవలప్‌మెంట్ అనే దానిని చేయడానికి అభివృద్ధి అనే దానిని ఒక ప్రాతిపదికగా తీసుకోవాలని కోరుతున్నాను. కనీసం లెవల్ ప్లేయింగ్ గ్రౌండ్ లేదని చాలామంది సభ్యులు సమావేశాలు మొదలైనప్పటి నుండి చెబుతున్నారు. అధ్యక్షా, మేము కష్టాల నుండి వచ్చిన వాళ్లం. వ్యవసాయ కుటుంబాల నుండి వచ్చిన వాళ్లం కాబట్టి మాకు కష్టం అంటే ఏమిటో తెలుసు. కష్టాన్ని ఎలా అధిగమించాలో తెలుసు. Crisis management గురించి బాగా తెలుసు. I am always a positive thinking person. India is a land of opportunities. More especially, Andhra Pradesh is a land of opportunities having 1975 kilometers of coastal line. ఇప్పుడున్న 14 పోర్టులతోపాటు ఇంకా 11 పోర్టులను నిర్మిద్దామనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉందని తెలియజేస్తున్నాను. గత నెలలో కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కారీ దగ్గర సమావేశం జరిగినప్పుడు ముఖ్యమంత్రి గారు, ఆర్థిక శాఖ మంత్రి గారితో పాటు నేను కూడా వెళ్లడం జరిగింది. ఇప్పుడు surface transport కంటే పోర్టులు, ఏయిర్‌పోర్టులు కావాలి. సింగపూర్, కెనడా , ఆస్ట్రేలియా వంటి అభివృద్ధి చెందిన దేశాలను దేనిని తీసుకున్నా అవి అభివృద్ధి చెందడానికి కారణం ఒక పోర్ట్, ఎయిర్‌పోర్ట్. 16 లైన్ల నుండి 32 లైన్ల బ్రాడ్ లైన్ల రహదారులు కావాలి. అలాగే, మొన్న ముఖ్యమంత్రి గారు నితిన్ గడ్కారీ గారిని కలసినప్పుడు Mr. Naidugi you can have 200 to 300 kilometers line I will give you across the table అని కూడా చెప్పడం జరిగింది. అప్పుడు చంద్రబాబునాయుడు గారు నో అని అంటూ, విజయవాడ నుండి ఎన్.హెచ్ మార్గం 6 లైన్లగా మార్చడానికి టెండర్లు కాల్ ఫర్ చేస్తున్నారు కాబట్టి దానిని కనీసం 12 నుండి 14 లైన్ల రహదారిగా మార్చడానికి re-think చేయమని చెప్పడం జరిగింది. దీనిని నేషనల్ హై–వేకు డైరెక్ట్‌గా లింక్ చేయడం, జిల్లా కేంద్రాలకు మధ్యలో కనీసం నాలుగు లైన్ల రహదారిని నిర్మించాలని కేంద్ర మంత్రి గారితో చెప్పడం జరిగింది. అలాగే, sea- coastకు కోస్టల్ లైనును ఒక దానిని ప్రతిపాదించడం జరిగింది. PCBIR గురించి ఇప్పటికే రెండు, మూడు రెవ్యూ మీటింగులను పెట్టడం జరిగింది. PCBIR కోసం దాదాపు 90 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది. విశాఖపట్టణం జిల్లా లోని గంగవరం పోర్టు నుండి కాకినాడ పోర్టు వరకు మధ్యలో దాదాపు 1.24లక్షల ఎకరాల ప్రభుత్వ భూములు కాని, ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరించిన భూములు కాని ఉన్నాయి. ఇంకొక 24, 25 వేల ఎకరాల భూములున్నాయి. ఈరోజున GMR వాళ్లు క్యాప్టివ్ పోర్టును అంటే ఆపరేషన్ కోసం కాకినాడలో పెట్టుకుంటున్నారు. కాకినాడ పోర్టుకు విపరీతమైన గిరాకి ఉంది. మనకున్నటువంటి మైనింగ్ సంపదను, గ్రానైట్‌ను కూడా ఇతర దేశాలకు కాకినాడ పోర్టు ద్వారానే ఎగుమతి చేయబడుతోంది. వీటి ద్వారానే మేజర్‌గా ఆదాయం వస్తుందని గుర్తు చేస్తున్నాను. అక్కడ అవకాశాలున్నాయి కాబట్టి గ్యాస్ గ్రిడ్స్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. తూర్పు గోదావరి జిల్లాలో అపారమైన గ్యాస్ నిల్వలు ఉన్నందున LNG, ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కంపెనీల ఆపరేషన్లన్నీ జరుగుతున్నాయి. దాదాపు 30 శాతం గ్యాస్ అక్కడి నుండే వస్తుంది. అక్కడ గ్యాస్ నిక్షేపాలున్నాయి కాబట్టి రిలయన్స్ వాళ్ల డి6 బ్లాక్, ఓఎన్‌జిసి, గెయిల్, కెయిన్ ఎనర్జీ వంటి సంస్థలన్నీ తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. అలాగే, ఫ్లోటింగ్ టెర్మినల్ ఎల్ఎన్‌జి (లిక్విఫైడ్ నాచురల్ గ్యాస్ టెర్నినల్‌ను)ని కాకినాడలో మరొకటి విశాఖపట్టణం గంగవరం పోర్టు వద్ద ఏర్పాటు చేయడానికి తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత మంజూరు చేయడం జరిగిందని తెలియజేస్తున్నాను.

ఇక విద్యా రంగానికి వస్తే, స్కిల్డ్ డెవలప్‌మెంట్ గురించి, స్కిల్డ్ అప్‌డేషన్ కోసం నాలెడ్జ్ హబ్ క్రింద రాష్ట్రాన్ని తయారు చేయడం కోసం ప్రయత్నం జరుగుతోంది. కొత్త రాష్ట్రంలో మనందరమూ

ఉండవలసిన వాళ్లమే కాబట్టి ప్రతిపక్షాల వాళ్లు కూడా పాజిటివ్‌గా ఆలోచించాల్సిన అవసరం ఉందని మనవి చేస్తున్నాను. సభ్యులందరూ కూడా రాష్ట్రాభివృద్ధి కోసం మంచి, మంచి సూచనలు చేస్తున్నారు. This is a great platform. ఈ అప్పర్ హౌస్ నుండి మనకు ఎన్నో tremendous opportunities ఉన్నాయి. We can tap so many ideas Sir.

కాకినాడలో ఎలక్ట్రానిక్ హబ్‌ను తయారు చేయడం కోసం అక్కడ హార్డ్‌వేర్ పార్కును మంజూరు చేయడం జరిగింది. ఈరోజు హైదరాబాద్ నేషన్ సెంటర్‌గా ఉండడానికి గల కారణం ఆరోజు చంద్రబాబునాయుడు గారు ఐటి రంగంలో చేసిన అభివృద్ధే. ఐటి, ఐటియస్‌గాని , ఫార్మా గాని, బల్క్‌డ్రగ్ గాని, టూరిజం గాని, ఇంకా ఎన్నో రంగాలలో ఎన్నెన్నో అవకాశాలు ఉన్నాయి. అలాగే, హెవీ ఇంజనీరింగ్, మెషనీరిస్, ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రికల్చర్‌లో అవకాశాలు ఉన్నట్లే హార్టికల్చర్, సెరీ కల్చర్, ఫ్లోరీ కల్చర్, ఆక్వా కల్చర్, ఫిష్ కల్చర్, డైరీ, అలైడ్ బిజినెసెస్ మరియు రక, రకాల ఉత్పత్తులకు రాష్ట్రం ఒక మంచి హబ్ క్రింద తయారవుతుందని తెలియజేస్తున్నాను.

అలాగే, చదువుకున్న యువతీ, యువకులకు ఉపాధిని కల్పించడానికి ఇండస్ట్రీ, ఇనిస్టిట్యూషనల్ ఇంటరాక్షన్‌ను ఆ రోజున ప్రవేశపెట్టారు. అది కంటిన్యూ అవుతుంది. దానిని ఇంకా అభివృద్ధి చేయాలని కోరడం జరిగింది. ఇంజనీరింగ్ కాని, పాలిటెక్నిక్ గాని, ఐటిఐ, ఫార్మశీ కాని ఏ రంగంలో చదువుకుంటున్నా వారందరిని పూర్తిగా మార్కెట్‌కు సరిపోయేటట్లుగా, పరిశ్రమకు సరిపోయేటట్లుగా వారిలో నైపుణ్యతను పెంపొందించుకునే విధంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేయాలి. అలాగే, ఇది పోటీ ప్రపంచం. చదువుకున్న వారిలో స్కిల్స్ లోపించడం వల్ల దాదాపు 18 శాతం మాత్రమే ఇండస్ట్రీకి అర్హులు అవుతున్నారని, మిగతా వారిలో కూడా స్కిల్స్ పెంపొందించాల్సిన అవసరం ఉందని చెప్పడంతో దాని వైపు కూడా ప్రభుత్వం పూర్తిగా ఆలోచించడం చాలా ముదాహవమైన విషయం.

హెల్త్ కేర్‌కు సంబంధించి బడ్జెట్‌లో చాలా కేటాయింపులు చేశారు. అలాగే, ప్రైమరీ ఎడ్యుకేషన్, ఉన్నత విద్యకు, యూనివర్శిటీ విద్యకు సంబంధించి దాదాపు రూ.12,000కోట్లు కేటాయించడం జరిగిందని తెలియజేస్తున్నాను. పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్న వైయస్ఆర్ హార్టికల్చర్ యూనివర్శిటీకి బడ్జెట్‌లో మంచి కేటాయింపులు చేశారు. రాష్ట్రంలో ప్రైమరీ ఎడ్యుకేషన్ నుంచి వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, పర్యావరణం మొదలైన వాటి కోసం 7 మిషన్లను ఏర్పాటు చేయడం ఎంతో ఆనందించదగిన విషయం. అర్బన్ డెవలప్ మిషన్‌లో విశాఖపట్టణం, విజయవాడ, తిరుపతి పట్టణాలను మూడు మెగా సిటీలుగా అభివృద్ధి చేయడం, 10 స్మార్ట్ సిటీలను కొత్తగా రాష్ట్రంలో ఏర్పాటు చేయడం గురించి కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు గారు ప్రకటించిన నేపథ్యాన్ని గుర్తు చేస్తున్నాను. ఇక్కడున్నటువంటి అర్బన్ ఇన్‌ఫ్రాస్టక్చర్‌ను వాడుకోవాలని కోరుతున్నాను. ఇంతకుముందు మాట్లాడిన గౌరవ సభ్యులు కూడా అర్బనైజేషన్ పెరుగుతున్న నేపథ్యంలో వ్యవసాయరంగం మీద 60 శాతం నుండి 70 శాతం మంది ఆధారపడుతున్న నేపథ్యంలో, వారికి కూడా సరైన వసతి సౌకర్యాలను, హెల్త్ కేర్‌కు సంబంధించి త్రాగు నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. ఇక్కడున్నటువంటి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సంబంధించి కాని, వాటర్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి కాని, ట్రాన్స్‌పోర్టేషన్, ఇండస్ట్రీకి సంబంధించి ఎస్ఈజడ్‌లను ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. ఎస్ఈజడ్‌లు వస్తే అనేక పరిశ్రమలు వచ్చి కొన్ని వేల, లక్షల మంది ఉద్యోగవకాశాలు రావడానికి అవకాశం ఉంటుంది. ఐటిఐఆర్‌లుగా విశాఖపట్టణం, కాకినాడ, తిరుపతి వంటి రెండవ తరగతి సిటీలను చేయడం

మంచి ప్రక్రియ అని చెబుతున్నాను. అలాగే, పిసిపిఐఆర్ (పెట్రో కెమికల్స్ అండ్ పెట్రో ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్) కాకినాడ నుండి గంగవరం పోర్టుకు మధ్యలో ఉన్న ప్రాంతాలలో పరిశ్రమలను స్థాపించడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు. రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీని, ఉత్తరాంధ్ర మూడు జిల్లాలకు అదనపు నిధులను విడుదల చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి గారు నిన్న ఢిల్లీ వెళ్లినప్పుడు ప్రధాన మంత్రిని కోరడం జరిగిందని తెలిసింది. రాష్ట్రం అభివృద్ధి చెందడానికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగం, నిర్మాణ రంగం అభివృద్ధి ఎంతో అవసరం. నిర్మాణ రంగానికి అవసరమైన స్టీల్, సిమెంట్ ధరలు పెరిగిన మాట వాస్తవమే. వాటి ధరలను తగ్గించడానికి ప్రయత్నం చేయాలని కోరుతున్నాను.

ఏయిర్‌పోర్టుల విషయానికి వస్తే – రాజమండ్రిలో రెండు దశాబ్దాల క్రితం ఎయిర్‌పోర్టు ఉండేది. తరువాత ఏప్రిల్1, 2005న రాజశేఖర రెడ్డి గారు మరల ఓపెన్ చేశారు. ఎందుకు చెబుతున్నానంటే.. ఈరోజున చెన్నై, బెంగుళూరుకు ప్రతిరోజు మూడు, నాలుగు విమానాలు ఇక్కడ నుండి తిరుగుతున్నాయి. రేపు 1 వ తేదీ నుంచి ఖాళీలు లేకుండా ఆపరేట్ చేయడానికి ప్రయత్నం జరుగుతోంది. తాడేపల్లిగూడెంలో అన్–ఆపరేషనల్ ఏయిర్‌పోర్టు ఉంది. దానిని కూడా పని చేయించడానికి పిపిపి పద్ధతిలో టెండర్స్‌ను పిలుస్తున్నారు. ఇక్కడ ఎకో టూరిజం కాని, వాటర్ టూరిజం కాని, టెంపుల్ టూరిజంను కాని అభివృద్ధి చేయవచ్చని తెలియచేస్తున్నాను. టెంపుల్ టూరిజంలో ట్రైబల్ ఏరియాలో ఎన్నో అవకాశాలు ఉన్నాయి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ మందికి ఉపాధి కల్పించవచ్చు. రూ.10 లక్షల పెట్టుబడితో దాదాపు 70, 80 మందికి ఉద్యోగవకాశాలు వస్తాయని గుర్తు చేస్తున్నాను.

అధ్యక్షా, పోలవరం విషయానికి వస్తే.. దాని గురించి ఒకసారి మనవి చేస్తాను. ఇది చాలా ముఖ్యమైన అంశం. దీనిని రాష్ట్ర పునర్విభజన బిల్లులో పెట్టడమనేది ఎంత అన్యాయం అంటే ఎప్పుడో మంజూరైన దానిని ఇక్కడున్నటువంటి (తెలంగాణలో ఉన్నటువంటి) కొంతమంది కొంతమంది దుష్ట శక్తులు పోలవరాన్ని ఆపుచేయించి, రాష్ట్రాన్ని విడగొడేటప్పుడు ఇచ్చుకోవచ్చని చెప్పి కావాలని అపుచేయించారు. పోలవరాన్ని మనకేదే ఇచ్చేస్తున్నట్లు చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తున్నాను. నేను ఆ విషయాలను చాలా దగ్గరగా ఆ ప్రభుత్వంలో చూశాను కాబట్టి చెబుతున్నాను. అప్పుడు దాని గురించి నేను కొంతమందికి చెప్పినా నాకు ఇప్పించే సామర్థ్యం లేక విని పూరుకోవడం జరిగింది. కొంతమంది డిస్కస్ చేసుకోవడం తప్పించి ఏమీ చేయలేకపోయారు. It is a great platform for me to share some of my ideas and experiences here. పోలవరంకు సంబంధించి వాటర్ గ్రిడ్ పెట్టుకుంటే అటు కృష్ణా మిగులు జలాలను టెయిల్ ఎండ్ అయిన శ్రీకాకుళం జిల్లా వరకు, అలాగే, ప్రక్క రాష్ట్రాలకు కూడా కొన్ని టిఎంసీల నీటిని ఇచ్చేటటువంటి అవకాశం కలుగుతుంది. అలాగే, ఫైబర్ ఆప్టికల్ డిజిటల్ ఇండియా క్రింద ప్రధానమంత్రి మోడీ గారు రూ.116350కోట్లతో ఒక పథకాన్ని అనౌన్స్ చేశారు. రాబోయే ఐదు సంవత్సరాలలో దీని వల్ల రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలియజేస్తున్నాను. కిలో బైట్స్ నుండి మెగా బైట్స్‌కు, మెగా బైట్స్ నుండి టెరా బైట్స్‌కు వెళ్లడమంటే దేశం కూడా ఎంతో వేగంగా ముందుకు వెళుతుందని అర్థం. అటువంటి నేపథ్యంలో ఫైబర్ ఆప్టికల్ గ్రిడ్ ఇవ్వడానికి, గ్యాస్‌ను మెయిన్ గ్రిడ్‌కు కనెక్టివిటీ కోసం కాల్‌ఫర్ చేశారు. అలాగే, రోడ్స్ గ్రిడ్, వాటర్ గ్రిడ్ ఇవన్నీ వచ్చిన తరువాత ఉద్యోగవకాశాలు పెరుగుతాయని తెలియజేస్తున్నాను. ఇప్పుడున్నవంటి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి మనందరమూ ప్రయత్నం చేయాలని కోరుతున్నాను.

సా.5.15

విద్యారంగానికి సంబంధించిన ఒకటి రెండు అంశాలు చెప్పి ముగిస్తాను అధ్యక్షా. జీ.వో. నెం. 11 మరియు 12, భాషా పండితులకు సంబంధించిన అప్‌గ్రేడేషన్ ఫైల్ చాలా లేటయింది. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి గారి సంతకం అయినప్పటికీ, రెండు రోజులు, వారం రోజులని కాలయాపన చేశారు. టీచర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారు. దానిని వెంటనే పరిష్కరించాలని కోరుతున్నాను. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పదవీవిరమణ పెంపు 58నుండి 60 సంవత్సరాలకు పెంచే విషయం త్వరగా చేయాలని కోరుతున్నాను. మున్సిపల్ టీచర్లకు సర్వీసు రూల్సు, కామన్ సర్వీసు రూల్సు కూడా చేయించాలని తెలుపుతూ నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎమ్. సుధాకర బాబుః అధ్యక్షా, 2014 బడ్జెట్‌పై మాట్లాడేందుకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు. ఈ రోజు ఈ బడ్జెట్ అందరికీ అనుకూలంగా చాలా చక్కగా రూపొందించిబడింది. ఈరోజు ముందుగానే డ్వాక్రా మహిళలకు సంబంధించి మాట్లాడతాను. గతంలో వీరి గురించి చాలామంది గౌరవ సభ్యులు మాట్లాడారు. డ్వాక్రా మహిళలను కేవలం ఉత్పాదక రంగంలోనే కాకుండా, వడ్డీలకు ఇచ్చే రంగంగా మార్చుకోవడం జరుగుతుందని అన్నారు. దయచేసి, ఇది నేను రాజకీయంగా చెప్పే మాట, విమర్శ కాదు, సద్విమర్శ. ముఖ్యమంత్రులు వచ్చినా, మంత్రులు వచ్చినా, ప్రధానమంత్రులు వచ్చినా డ్వాక్రా గ్రూపు మహిళలను బస్సుల్లో తీసుకువచ్చి సమావేశాలలో కూర్చోపెట్టడం, మా సమావేశంలో జనాలు వచ్చారని చెప్పుకోవడం ఈ ప్రభుత్వాలు చేస్తున్న పనే ఇది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమైనా, తెలుగుదేశం ప్రభుత్వమైనా ఏ ప్రభుత్వమైనా కూడా ఎటువంటి సమావేశాలలోనూ డ్వాక్రా మహిళలను, పొదుపు లక్ష్మి మహిళలను పిలువవద్దని కోరుతున్నాను. వారికి సంబంధించిన సమావేశాలలో మాత్రమే వారిని పిలిచి, వారికి సలహాలు ఇస్తే బావుంటుంది కానీ, వారందరినీ గుంపుగా పిలుచుకువచ్చి సమావేశంలో కూర్చోపెట్టడం, వారికి ఛార్జీలు ఇచ్చి, భోజనాలు పెట్టించడం, తిరిగి వారిని బస్సుల్లో ఎక్కించి ఇళ్ళకు పంపించడం అంత సమంజసం అనిపించుకొదని నా అభిప్రాయం. ఈ రాజకీయ సమావేశాల కోసం వారందరూ మొత్తం కుటుంబాలనే వదిలిపెట్టి రావలసి వస్తోంది. దయచేసి అటువంటిది ఇకముందు జరగకుండా ఈ ప్రభుత్వం చేస్తే బావుంటుందని తమ ద్వారా కోరుతున్నాను. ఈ విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. వారందరూ కొన్ని లక్షల మందిలో ఉన్నారు కనుక వారిని ఉత్పాదక రంగంలోకి మరలించినట్లయితే వారి కుటుంబాలు బాగుపడతాయని, తద్వారా మన రాష్ట్రం బాగుపడుతుందని తమ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

ఎయిడెడ్ పాఠశాలలకు సంబంధించి సభలో చాలామంది గౌరవసభ్యులు, పెద్దలు మాట్లాడారు. దాదాపు వంద సంవత్సరాల క్రితం నుంచి కుల, మతాలకు అతీతంగా అందరూ దాదాపు ఈ ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుకున్న వారే. మా వయస్సు వారు అంతా ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలల్లోనే చదువుకున్నారు. ప్రస్తుతం వాటినన్నింటినీ కూడా నిర్వీర్యం చేసేశారు. ప్రస్తుతం ఉన్న కళాశాలల్లో ఒకరు, ఇద్దరు లెక్చరర్లు మాత్రమే మిగిలారు. వారిద్వారా విద్యార్థులకు పాఠాలు నేర్చుకోవాలి. ఆ కళాశాలల్లో చేరే విద్యార్థులు అంతా పేదవారే, వారికి చదువులు రావడం లేదు. ఎందుకంటే, ముప్పై, నలభై మంది ఉంటే, వారికి సరిపడా లెక్చరర్లను

ఎక్కడ నుంచి తీసుకువస్తారు.  కనీసం ఔట్‌సోర్సింగ్‌లోనైనా లెక్చరర్లను ఏర్పాటు చేసుకుంటే బావుంటుందని చూస్తుంటే, అందుకు ప్రభుత్వం ఒప్పుకోవడం లేదు.  మిగలా కళాశాలల్లో ఔట్‌సోర్సింగ్‌లో లెక్చరర్లను ఇస్తున్నారు కానీ, ఎయిడెడ్ పాఠశాలల్లో మాత్రం ఇవ్వడం లేదు. ఎయిడెడ్ పాఠశాలలను, కళాశాలలను కాపాడి మంచి విద్యను అందించే ఏర్పాట్లు చేయాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.  ఎందుకంటే, ప్రైవేటు కళాశాలల్లో 50, 60 వేల నుంచి లక్ష రూపాయల వరకూ ఉంటున్న ఫీజులు  కట్టలేకపోతున్నారు కావున, ఈ కళాశాలల్లో అయితే, తల్లిదండ్రులు నామినల్ ఫీజులు కట్టుకుని, పిల్లలను చదివిస్తారు.  ఆవిధంగా ప్రభుత్వం చేయాలని కోరుతున్నాను.  అదేవిధంగా మా మిత్రులు శ్రీ వెంకట సతీష్ కుమార్ సింగారెడ్డి గారు ఇక్కడే దాదాపు 25 సంవత్సరాలు ఉండమన్నారు.  వారికి ఇంత ధైర్యం ఉన్నందుకు చాలా సంతోషం. మంచి పనులు చేస్తే ఎవరైనా ఉంటారు. గతంలో విజన్ 2020 అని చెప్పి ఎక్కడకు వెళ్లారో మనకు తెలుసు. ఈరోజు  ప్రతి ఒక్క టిడిపి మంత్రి మైక్ పట్టుకుని గత పదేళ్లలో రాష్ట్రం అధోగతి పాలైంది, జలయజ్ఞం ధనయజ్ఞం అని అంటున్నారు. శ్వేతపత్రం విడుదల చేస్తూ కూడా అదేమాట అన్నారు. వారు ఆ మాటలు చెప్పి వారు ప్రచురించిన బడ్జెట్ పుస్తకంలోనే కొన్ని నిజాలు చెప్పారు. జలయజ్ఞం జరిగింది కానీ, ధన యజ్ఞం జరగలేదు అధ్యక్షా. 20లక్షల ఎకరాలకు నీళ్లిస్తే అది జలయజ్ఞమే అవుతుంది. ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదని ముఖ్యమంత్రిస్థాయిలో ఉన్న వ్యక్తి చెబితే ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇచ్చినట్లు అవుతుంది. 20 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చారని చెప్పి ప్రభుత్వం విడుదల చేసిన పుస్తకంలో ప్రింట్ చేయబడి ఉంటే,  నోటితో మాత్రం ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదని చెబుతున్నారు. జరిగేదానిని చెప్పండి గానీ అబద్ధాలు చెప్పవద్దని కోరుతున్నాను.

గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చిన్నపిల్లలకు, పేదవాళ్లకు అపోలో, కేర్ వంటి  కార్పొరేట్ ఆసుపత్రులలో ఖరీదైన  వైద్యం చేయించారా అని నేను అడుగుతున్నాను. అది చేయించింది కాంగ్రెస్ ప్రభుత్వమే. కొన్ని వేలమంది చిన్నపిల్లలకు గుండె ఆపరేషన్లు చేశాము కొన్ని లక్షలమంది పేదవారికి కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్యం చేయించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే. గతంలో డా. వై.యస్. రాజశేఖర రెడ్డి గారు కూడా 5 సంతకాలు పెట్టారు. పావలా వడ్డీ, ఉచిత విద్యుత్తు, విద్యుత్తు బకాయిల రద్దు, పెన్షన్ల పెంపుదల, 2రూ.లకే కేజి బియ్యం  అన్నీ అమలు చేశారు. అందుకు పోటీగా ఈనాడు తెలుగుదేశం ప్రభుత్వం కూడా 5 సంతకాలు పెట్టింది. అన్నింటిల్లో ఖర్చు లేని ఉద్యోగుల పదవీ విరమణ 58నుండి 60 సంవత్సరాలకు పెంచడం. ఉద్యోగులకు మాత్రం ఇచ్చింది అమలు చేశారు, మిగతాది ఏది ఇంతవరకూ అమలు చేయలేదు.

శ్రీ సిద్ధా రాఘవరావు :  మా ప్రభుత్వం వచ్చి ఇంకా 2 నెలలు కాలేదు. ఒక్కొక్కదానిని అమలు చేసుకుంటూ వస్తున్నాము. దానికి కూడా ఇంత విమర్శిస్తే ఎలా? ఇప్పటికి 75 రోజులే అయింది. రాష్ట్ర పరిస్థితి ఏమిటో అందరికీ తెలుసు. అన్ని విధాలా మేము ఇచ్చిన మాట తప్పకుండా ఉండాలని ప్రయత్నం చేస్తున్నాము.

శ్రీ ఎమ్. సుధాకరబాబు : నేనదేమంటే,  పుస్తకంలో ప్రింట్ చేసిన విషయాలే ప్రజల దగ్గర చెప్పవచ్చు కదా! శ్వేత పత్రం విడుదల చేసిన రోజు మైక్ పట్టుకుని ఒక్క ఎకరాకు నీళ్లివ్వలేదని చెప్పడం ఎందుకనేది మా బాధ.  సంక్షేమ హాస్టళ్లకు నేను మొదటినుండి వ్యతిరేకిని. వాళ్ల పరిస్థితి చాలా దారుణంగా ఉంటుంది. గతంలో డా. వై.యస్. రాజశేఖర రెడ్డి గారికి, కిరణ్‌కుమార్ రెడ్డి గారికి చెప్పాము కానీ, జరగలేదు. ఇప్పుడన్నీ గురుకుల పాఠశాలలు చేస్తామని అన్నారు. అందుకు

చాలా సంతోషం. అందులో భాగంగా ఒక సూచన. ఎస్సీ, ఎస్టీ, బిసి అని సెపరేట్ చేసి ఒక్కొక్కళ్ల పేరుమీద ఒక్కో హాస్టల్ పెట్టకుండా అన్ని కులాల పిల్లలకు కలిపి హాస్టల్ పెడితే బాగుంటుందని నా అభిప్రాయం. అందరూ కలిసిపోవాలనే ఆలోచన వాళ్లకు ఉంటుంది.

శ్రీ వెంకట సతీష్‌కుమార్ రెడ్డి సింగారెడ్డి : మీరే కదా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అని విడగొట్టారు.

శ్రీ ఎమ్. సుధాకరబాబు : భారతదేశంలోనే మొట్టమొదటిసారి ఈ సబ్‌ప్లాన్ పెట్టిన మమ్మల్నే విమర్శిస్తే ఎలా సార్ ? దానికి చట్టబద్ధత కల్పించాము కాబట్టే ఈనాడు ఎస్సీ, ఎస్టీలకు 1100కోట్లు, రూ.2600కోట్లు కేటాయించారు. లేకపోతే ఏదో మాయ చేసేవారు. సుమారు 13 శాతం ఉన్న మైనారిటీలకు రూ.370కోట్లు ఇచ్చారు. వాళ్లు ఏం పాపం చేశారని నేను అడుగుతున్నారు.

సా.5.30 – 5.45

మైనారిటీలు జనాభాలో సుమారు 13 శాతం మంది ఉన్నారు. గతంలో ఇదే తెలుగుదేశం పార్టీ రూ. 10 వేల కోట్లుతో బి.సి. సబ్‌ప్లాన్ కావాలని పోరాడారు. ఇదే సభలో రికార్డు పరంగా కూడా ఉంది. 50 శాతం కలిగిన జనాభాకు కేవలం రూ. 3 వేల కోట్లు కేటాయించారు. ఇదీ వీరు చేస్తున్న అభివృద్ధి. కాబట్టి ఇవన్నీ మాటలు చెప్పడానికి ఎంతో బాగుంటుంది. కానీ, ఆచరణలో లేవు.

శ్రీ పమిడి శమంతకమణి: అధ్యక్షా, ఎస్.సి., ఎస్.టి. సబ్‌ప్లాన్‌కు నేను వ్యతిరేకిని కాను. కానీ, ఎస్.సి., ఎస్.టి. సబ్‌ప్లాన్ నిధులను ఒకచోట మూటకట్టి ఈ మొత్తం మీదే అని అనలేదు. విద్యారంగానికి కొంత, సంక్షేమానికి కొంత, అన్ని రకాలుగా ఎస్.సి.లకు సంబంధించి శాఖలవారీగా ఇంత మొత్తం అని ఇచ్చారు తప్ప నిధులన్నీ మీరే అనుభవించండని ఎస్.సి. సబ్‌ప్లాన్‌లో ఎక్కడా లేదు. సెజ్‌లకోసం ఎస్.సి.ల అసైన్డ్ భూమిని గతంలో తీసుకున్నారో లేదో చెప్పమనండి.

శ్రీ సి.రామచంద్రయ్య: మొట్టమొదటది ఏమంటే, జనాభా ప్రాతిపదికన వారికి బడ్జెట్‌ను కేటాయించారు. రెండవది, వారి నిధులను గతంలో ప్రభుత్వాలు డైవర్ట్ చేసి ఖర్చు చేయడం జరిగింది. ప్రస్తుతం ఆ నిధులను డైవర్టు చేయడానికి వీలు లేకుండా సబ్‌ప్లాన్ రూపంలో ఒక చట్టాన్ని తీసుకురావడం జరిగింది.

శ్రీ వెంకట సతీష్ కుమార్ రెడ్డి సింగారెడ్డి: (మైకు లేకుండా) అధ్యక్షా, ఎస్.సి., ఎస్.టి. సబ్‌ప్లాన్‌ను ప్రవేశపెట్టామని నేడు వారు గొప్పలు చెబుతున్నారు. అదే సబ్‌ప్లాన్ నిధుల నుంచి ఔటర్ రింగురోడ్డుకు నిధులను మళ్లించింది ఎవరు?

శ్రీ ఎం.సుధాకర్ బాబు: అధ్యక్షా, ఎస్.సి., ఎస్.టి. సబ్‌ప్లాన్ చట్టం కాకముందు రూ. 8 వేల కోట్లు శ్రీ చంద్రబాబునాయుడు గారు మళ్లిస్తే, రూ. 20 వేల కోట్లు శ్రీ రాజశేఖరరెడ్డిగారు మళ్లించడం జరిగింది. ఎస్.సి.ల నిధులను మళ్లించడంలో ఇద్దరూ దోషులే.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి: అధ్యక్షా, ఆయనను నేను ఒక్కటే అడుగుతున్నాను. సబ్‌ప్లాన్ గురించి వారు నిజాయితీగా పనిచేసినట్లయితే, వారిని ప్రజలు నమ్మినట్లయితే వారు ఎందుకు గెలవలేదని నేను అడుగుతున్నాను. ఒక్క సీటు కూడా ఎందుకు గెలవలేదో చెప్పమనండి?

శ్రీ సి.రామచంద్రయ్య: (మైకు లేకుండా) అధ్యక్షా, వారు ఆ విధంగా మాట్లాడితే కష్టం. సభ్యురాలు శ్రీమతి శమంతకమణిగారు ఆయన ఒక నవలోకాన్ని సృష్టించారని చెప్పారు. మరి 2004వ సంవత్సరంలో ప్రజలు ఆయనను ఎందుకు ఓడించారు? మేము ఓట్లకోసం భారతీయ జనతా పార్టీతో కలవలేదు. ఆ విధంగా వారు మాట్లాడకూడదు.

శ్రీ ఎం.సుధాకర్‌బాబు: అధ్యక్షా, ఎస్.సి.లకు కేంద్రప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను గతంలో అధికారంలో ఉన్న ముఖ్యమంత్రులు వాడుకున్నారని వారి పేర్లను కూడా చెప్పాము. ఎందుకంటే, ఆ ధైర్యం మాకుంది. ఏమి చేసినా వారి నాయకుల పేర్లు వారు చెప్పలేరు. ఎందుకంటే చెబితే వారు కట్. మమ్మల్ని ఎవరూ కట్ చేయలేరు. ఎందుకంటే, కాంగ్రెస్ వాళ్లు అంటే సర్వస్వతంత్రులు. ఎన్నికల సమయంలో సారథ్యం వహించవలసిన మా ముఖ్యమంత్రి అస్త్ర సన్యాసం చేసి వెళ్లిపోయాడు. తిరిగి తిరిగి బాణాలను తీసుకుని మామీదే కొట్టాడు. ఆ విధంగా కొన్ని పొరపాట్లు జరిగినందువల్ల మేము ఓడిపోవడం జరిగింది. మతతత్వ వాదులతోనో లేక పిచ్చివారితోనే ఓట్లకోసం మేము కలవలేదు. మేము ప్రజాస్వామ్యాన్ని కోరుకునేవాళ్లం, ఈరాష్ట్రం బాగుండాలని కోరుకునేవాళ్లం.

ప్రజా సంక్షేమం కోసం చేయవలసింది చేయకుండా, బి.సి.లు, మైనారిటీలతో ఓట్లు వేయించుకుని వారిని వదలిపెట్టేయడం జరిగింది. ఎస్.సి.లకోసం గతసారి మిగులు నిధులను, ఈ సారి కేటాయించిన నిధులను కలిపి ఖర్చుచేయాలి. ఆ తరువాత వాటి గురించి నేను మాట్లాడతాను.

నేడు రూ. 2 లకు 20 లీటర్ల నీరు అని 'ఎన్.టి.ఆర్. సుజల స్రవంతి' అని నామకరణం చేసి ఒక పథకం పెట్టారు. ఇది వారికి తెలియదేమో! కర్నూలులో గత నాలుగైదు సంవత్సరాల నుంచి ఒక ప్రయివేటు సంస్థ వారు రూ. 2 లకు 20 లీటర్ల మినరల్ వాటర్‌ను అందిస్తున్నారు. కర్నాటకలో మేము అక్కడకు వెళ్లినపుడు కూడా చూశాము. ATW (Any Time Water) అని కర్నాటకలో కూడా ఆ పథకం ఉంది. రూ. 1 లు బాక్సులో వేస్తే 10 లీటర్ల నీరు వస్తుంది. దయచేసి ఈ పథకాన్ని ఎవరికో అప్పజెప్పి ప్రభుత్వ సొమ్మును వృథా చేయవద్దండి. అది ప్రజలందరికీ మంచినీరందించే మంచి పథకం కాబట్టి స్థానిక సంస్థలైన మునిసిపాలిటీలకు, పంచాయితీలకు అప్పజెప్పి ఆ నీటిని రూ. 2 లకు ప్రజలకు ఇప్పించండి. ఆ పేరు చెప్పి ప్రయివేటు సంస్థలకు కోట్లరూపాయలను ఇచ్చి ప్రభుత్వ సొమ్మును వృథా చేయవద్దని ప్రభుత్వానికి తమరిద్వారా తెలియజేస్తున్నాను. అవసరమైతే, గత నాలుగైదు సంవత్సరాల నుంచి కర్నూలులో అమలులో ఉన్న మంచినీటి పథకాన్ని పరిశీలించమనండి.

రాజధాని విషయానికి వస్తే, మనం ఔనన్నా, కాదన్నా ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ అనే మూడు ప్రాంతాలున్నాయి. నేను రెండు నెలల క్రితమే గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడు గారికి ఒక లెటర్‌ను వ్రాయడం జరిగింది. "ఇప్పటికే ప్రజలు ఉద్యమాలు చేసి చాలా అలసిపోయారు, చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు, భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు

ఉత్పన్నం కాకుడా మూడు ప్రాంతాలను సమపాళ్లలో అభివృద్ధి చేసి సమన్యాయం చేయాలి, మీ వాళ్లు, కార్పోరేట్ మనుషులందరూ రాజధాని నగరం విజయవాడ, గుంటూరు అని ఈ మూడు ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టవద్దని, ఈ మూడు ప్రాంతాల నాయకులను కూర్చోబెట్టుకుని ఒక అవగాహనకు వచ్చి, ఈ ప్రాంతంలో ఈ సంస్థ, ఆ ప్రాంతంలో ఆ సంస్థ, ఈ ప్రాంతంలో అయితే రాజధాని బాగుంటుందని మూడు ప్రాంతాల నాయకులతో మాట్లాడి ఒప్పించండి" అని నేను గౌరవ ముఖ్యమంత్రిగారికి ఆ లెటర్‌లో వ్రాయడం జరిగింది. ఇప్పుడేమో లక్ష ఎకరాలు కావాలని మనం కేంద్రప్రభుత్వాన్ని కోరాము, అటవీ ప్రాంతాన్ని డిక్లేర్ చేయమని చెప్పాము, కానీ మన మునిసిపల్ శాఖా మంత్రిగారు 12,500 ఎకరాలు గుంటూరులో ఉంటే చాలు, అక్కడ మేము రాజధానిని నిర్మిస్తామని చెబుతున్నారు. రెవెన్యూ శాఖ మంత్రిగారు మాట్లాడుతూ, "అక్కడ ప్రభుత్వ భూమి 400 ఎకరాల స్థలం కూడా లేదు. 30 వేల ఎకరాలకు పైగా కర్నూలులోనే ఉంది, రాష్ట్రంలో ఎక్కడా కూడా 5 వేల ఎకరాలకు మించి ప్రభుత్వ భూములు లేవని" ఆయన చెప్పడం జరిగింది. గతంలో విశాలాంధ్ర కోసం మేము కర్నూలును ఇవ్వడం జరిగింది. రాయలసీమలో ఇప్పటికీ రాళ్లు, రప్పల మధ్య జీవనం కొనసాగుతోంది. ఎక్కడైనా సరే రాజధానిని వెనుకబడిన ప్రాంతంలో పెడితే అసమానతలు రావు.

గుంటూరులో ప్రమాణ స్వీకారం చేశారని చెప్పి, కర్నూలులో ఆగస్టు 15 వ తేదీన జెండావందనం కార్యక్రమం చేశారు. అంతకంటే ముందు మా ప్రాంతంలో హైకోర్టు వస్తున్నట్లు చెప్పారు. కరెక్టుగా నాలుగు రోజుల సమయం తర్వాత ఎక్కడ రాజధాని ఉంటే అక్కడే అని మరొక స్టేట్‌మెంటు వచ్చింది. మెడికల్ ఇనిస్టిట్యూట్ కోసం 125 ఎకరాల భూమి కావాలని అన్నారు. కలెక్టరుగారు ఇప్పటికే ఆభూమిని తీసిపెట్టామని చెప్పారు. కాదు కాదు, దానిని విజయవాడలో పెడుతున్నామని చెప్పారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం కర్నూలుకు అని చెప్పి సుమారు వంద ఎకరాల భూమి కావాలని చెప్పారు. జాయింట్ కలెక్టరుగారు మేము ఆ భూమిని తీసి పెట్టామని స్టేట్‌మెంట్ ఇచ్చారు. కాదు, కాదు దానిని గుంటూరులో పెట్టుకుంటున్నామని అన్నారు. రాజధాని రాకముందే ఇన్ని విభేదాలు చూపిస్తే ఎలా కలసి ఉండగలం? ఆగస్టు 15 వ తేదీన కర్నూలులో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (NIT) పెడుతున్నామని చెప్పారు. ముఖ్యమంత్రిగారు స్వయంగా ఆగస్టు 15 వ తేదీన 20 టి.ఎమ్.సి.ల నీటితో ఒక ప్రాజెక్టును, స్మార్ట్‌సిటీని కర్నూలులో పెడుతున్నామని చెప్పారు. ఆ తర్వాత ఎక్కడా కూడా కర్నూలు పేరే లేదు. కనీసం వాటి గురించి బడ్జెట్‌లో పెట్టాలో, లేదో మేధావులు చెప్పాలి. నేను తెలియక వాటి గురించి బడ్జెట్‌లో పెట్టాలని అడుగుతున్నాను. గ్రేహౌండ్స్ కోసం రూ. 630 కోట్లు అని చెప్పారు. కానీ, సుమారు రూ. 400 కోట్లు అని చూపించారు. దయచేసి ఈ అసమానతలను రాబోయే తరం వారికైనా లేకుండా చేయాలని తమరి ద్వారా నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

గతంలో ఐదారు నెలలకు ఒకసారి పెన్షన్లు ఇచ్చే అలవాటు ఉండేది. ఎందుకంటే, ఒక మీటింగు పెట్టి ఎక్కువ మొత్తాన్ని ఐదారు నెలలకు ఇవ్వవచ్చని ఆ విధంగా చేసేవారు. ప్రస్తుతం ఆ పెన్షన్ రూ. 1000 లు మరియు రూ. 1500 లు అయినందువల్ల జిల్లాకు ఇన్ని పెన్షన్లు కట్ చేయాలని ఈ ప్రభుత్వం వారు పెట్టుకున్నారు. ఉదాహరణకు, కర్నూలుకు సుమారు 19 వేల పెన్షన్లు కట్ అయ్యాయని అనధికారికంగా నాకు తెలిసింది. అంటే, ప్రతి జిల్లాకు కొన్ని వేల పెన్షన్లు కట్‌చేస్తే డబ్బు సర్దుబాటు అవుతుందనేది వారి ఉద్దేశ్యం. దయచేసి అటువంటి ఆలోచన ఉంటే మానుకోవలసిందిగా తమరిద్వారా ప్రభుత్వాన్ని నేను కోరుతున్నాను. వితంతువులు, వికలాంగులు,

వృద్ధుల ఉసురు తగిలితే ఎవరూ కోలుకోలేరు. ఎందుకంటే, నా వద్దకు ఒక వితంతువు వచ్చి, "అన్నా, నాకు మొన్నటివరకూ గత మూడు సంవత్సరాల పాటు పెన్షన్ ఇచ్చారు, ఇప్పుడు అక్కడకు వెళితే నాకు పెన్షన్ లేదని చెబుతున్నారని" ఆమె నాతో చెప్పింది. నేను సంబంధిత కమీషనరును అడిగితే, ఆమె స్మార్ట్‌కార్డు తీసుకురావాలని చెబుతున్నారు. ఆధార్ కార్డు కావాలని కొంతమంది చెబుతారు, కొత్తగా స్మార్ట్ కార్డును తీసుకురమ్మంటున్నారు. కర్నూలులో ప్రయోగాత్మకంగా స్మార్ట్ కార్డులు తయారుచేశారు. ఈ విధంగా వారిని కొన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దయచేసి వారి జోలికి పోవద్దని తమరిద్వారా ప్రభుత్వానికి నేను విజ్ఞప్తిచేస్తున్నాను.

సా.5.45

మిస్టర్ ఛైర్మన్ : పూర్తి చేయండి.

శ్రీ ఎం.సుధాకర్ బాబు : ఇంతవరకూ ఈ రాష్ట్రంలో కానీ, దేశంలో కానీ ఏ ముఖ్యమంత్రీ కూడా మీరు చూస్తూ ఊరుకోండి, మా వాళ్ళ జోలికి వెళ్ళద్దని కలెక్టర్లకు చెప్పిన ఘనత లేదు. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రికే ఆ ఘనత ఉంది.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : మీరు చూశారా?

శ్రీ ఎం.సుధాకర్ బాబు : నేను రికార్డెడ్‌గా పేపరిస్తాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : ఏమని ఇస్తారు?

శ్రీ ఎం.సుధాకర్ బాబు : మీరు చూస్తూ ఊరుకోండి. మా వాళ్ళకి కొన్ని ఇబ్బందులొస్తాయి అని సాక్షాత్తు ముఖ్యమంత్రే చెప్తే ప్రజాస్వామ్యంలో ఏ విధంగా నడుస్తుంది మీరే చెప్పండి.

(అంతరాయం)

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : చంద్రబాబునాయుడుగారు ఎప్పుడూ కూడా అలాంటి స్టేట్‌మెంట్ ఇచ్చే మనిషి కానే కారు. అధికారులకి పూర్తి స్వేచ్ఛనిచ్చారు. మీరు సభని తప్పుదారి పట్టిస్తున్నారు. రికార్డుల్లోకి వెళ్ళిపోతుంది.

(అంతరాయం)

శ్రీ ఎం.సుధాకర్ బాబు : నేను ఎప్పుడూ తప్పుమాట మాట్లడను. ఈ మాటకానీ నిరూపించకపోతే ఉరేసుకుంటాను నేను. మీరు సిద్ధమా?

(అంతరాయం)

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : ఎట్లాసార్, ఇన్ని అబద్దాలు మాట్లాడుతూ ఉంటే.

(అంతరాయం)

మిస్టర్ ఛైర్మన్ : ప్లీస్ ప్రొసీడ్.

(అంతరాయం)

శ్రీ ఎం.సుధాకర్ బాబు : కాంగ్రెస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి వై.యస్ రాజశేఖర్ రెడ్డిగారు తన హయాములో తవ్వకాలు చేస్తే గిరిజనులకు ఇబ్బంది ఎదురవుతుంది కనుక తవ్వకాలు చేయకండని చెప్పారు. అప్పుడు మాతోపాటు ప్లకార్డులు పట్టుకుని వీళ్ళంతా కూడా చాలా చేశారు. మీరు ఒరిస్సాకి వెళ్లారు కానీ వైజాగ్ అరకు వ్యాలీ కనబడలేదా అని రాహుల్‌గాంధీ గారిని మీ నాయకుడు తిట్టారు. ఈరోజు ఆయనే అనకాపల్లికి వచ్చిన తరువాత బాక్సైట్‌ను తవ్వండి అన్నారు. ఏం న్యాయం సార్ ఇది? దయచేసి బాక్సైట్ తవ్వే సాహసం చేయవద్దని చంద్రబాబునాయుడు గారికి చేతులెత్తి మొక్కుతున్నాను. ఎందుకంటే బాక్సైట్ తవ్వడమంటూ మొదలుపెడితే చాలా ప్రమాదాలు జరిగి, గిరిజనుల జీవితాలు నాశనమవడమేగాక అక్రమార్కులు ఎక్కువవుతారు. కోట్ల రూపాయల సంపాదనని దోచుకోవడానికి వెళతారు. అది వద్దని మాత్రం చెప్తున్నాను.

(అంతరాయం)

శ్రీ పమిడి శమంతకమణి : మీరు దోచుకుని దాచుకున్నారు కదా?

శ్రీ ఎం.సుధాకర్ బాబు : మేము వద్దన్నాము కదా. మీకు నిజాయితీ ఉంటే చంద్రబాబునాయుడుగారిని వద్దని చెప్పండి. అదే విధంగా డ్వాక్రా మహిళలకు ఇసుకని ఇవ్వద్దని చెప్తున్నాము. ఆర్.డి.ఓలను, యం.ఆర్.ఓలనే జీపులతో, ట్రాక్టర్లతో రాళ్ళెక్కించి కొడుతున్నారు. పాపం ఈ మహిళలేం చేస్తారు? ఆ ఇసుక మాఫియాను ఎదుర్కోలేము.

(అంతరాయం)

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : ఇప్పుడు ఒప్పుకుంది ఏమిటి సార్ ఆయన? ఆ గవర్నమెంట్ వాళ్ళనే తన్నాము, వాళ్ళనే కొట్టాము, బెదిరించామని చెప్తున్నారు కదా? ఎంతమందిని మర్డర్ చేశారో, ఎంతమందిని బెదిరించారో? ఇసుక మాఫియా ఏ విధంగా విలయ తాండవం చేస్తోందో ఒప్పుకున్నారు ఆయనే. అదొక్కటి చాలు సార్.

(అంతరాయం)

శ్రీ సి.రామచంద్రయ్య : సార్, వాళ్ళు కానీ, మేము కానీ ఒకరు మాట్లాడేటప్పుడు ఇంకొకరు మాట్లాడడానికి మీరు అలౌ చేయకూడదు. కంటిన్యూగా ఇలా మాట్లాడితే ఎలా సార్?

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : సార్, మరీ ఇంత అవాస్తవాలు మాట్లాడితే ఎలా? ఒకళ్ళేమో పిచ్చోళ్ళంటారు.

(అంతరాయం)

శ్రీ సి.రామచంద్రయ్య : మీ మంత్రులు లేరా? మీ మంత్రులు జవాబుచెప్పలేరా? మీరు ప్రతిదానికీ జవాబులు చెప్పాలా? ఏమిటిది?

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : మంత్రులు చెప్పడమేంటి?

శ్రీ సి.రామచంద్రయ్య : ఆయన బడ్జెట్ మీద మాట్లాడుతున్నారు. ఆర్థికమంత్రి రిప్లై ఇస్తారు.

(అంతరాయం)

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : మీరు పార్లమెంట్‌లో చేశారు. మీ మంత్రి గురించి మాట్లాడితే మీరు చూస్తూ ఊరుకున్నారా?

(అంతరాయం)

శ్రీ సి.రామచంద్రయ్య : సార్, ఇలా మాట్లాడితే కష్టము.  I am very sorry.

(అంతరాయం)

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : తప్పుంటే అడగకూడదా?

(అంతరాయం)

మిస్టర్ ఛైర్మన్ : ఆయన చెప్పారు, మీరు కాదన్నారు ఇంకేంటి? అది కూడా రికార్డులో వచ్చింది.

(అంతరాయం)

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : సార్, మీరు మైకు ఇవ్వలేదు. చెప్పండి సార్ మైకు ఇచ్చారా?

(అంతరాయం)

మిస్టర్ ఛైర్మన్ : సుధాకర్‌గారూ, పూర్తి చెయ్యండి.

శ్రీ ఎం.సుధాకర్ బాబు : ముఖ్యమంత్రిలాంటి వ్యక్తి, అంత అనుభవమున్న వ్యక్తి కలెక్టర్ల సమావేశంలో ఈ మాట అన్నాడని నిరూపించకపోతే నేను ఉరేసుకుంటాను.

(అంతరాయం)

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : (వెల్‌వద్ద నిలబడి) సార్, మీరింతవరకూ మాకు మైకు ఇవ్వలేదు. ఆయనకి మైకు ఇస్తున్నారు. ఆయన మాట్లాడింది రికార్డుల్లోకి వెళ్తాయి. ఏమిటి సార్ ఇది?

(అంతరాయం)

(గౌరవ సభ్యులు సర్వశ్రీ సి.రామచంద్రయ్య, బి.చెంగల్‌రాయుడు, రుద్రరాజు పద్మరాజు తమ తమ స్థానాల్లో లేచి నిలబడ్డారు).

SRI RUDRA RAJU PADMA RAJU: Sir, it is very unfortunate.

శ్రీ సి.రామచంద్రయ్య : సార్, ఈ హౌస్‌ను ఎవరు రెగ్యులేట్ చేస్తున్నారు?

(అంతరాయం)

(గౌరవ సభ్యులు శ్రీమతి నన్నపనేని రాజకుమారి, శ్రీమతి పమిడి శమంతకమణి తమ తమ స్థానాల్లో లేచి నిలబడ్డారు)

మిస్టర్ ఛైర్మన్ : రాఘవరావుగారు మాట్లాడతారు కూర్చోండి.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : సార్, ఒక్కసారైనా మైకు ఇచ్చారా ఇక్కడ.

(అంతరాయం)

SRI RUDRA RAJU PADMA RAU: Questioning the Chairman is not correct.

శ్రీ సిద్ధా రాఘవరావు : రెండు నిమిషాలు ఇస్తే మాట్లాడతారు.

శ్రీ సి.రామచంద్రయ్య : మంత్రిగారూ ఏమిటిది? మీరు లేని సాంప్రదాయాలను క్రియేట్ చేస్తున్నారే. He is on the legs and speaking on the budget.

(అంతరాయం)

శ్రీ సిద్ధా రాఘవరావు : ఆయన అవాస్తవాలు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగారిని తిడుతూంటే మాట్లాడకుండా ఎలా ఉంటారు? సార్, మీరు రెండు నిమిషాలు మైకు ఇవ్వండి. వాళ్ళని కూర్చోమనండి.

(అంతరాయం)

శ్రీ సి.రామచంద్రయ్య : ఎందుకు సార్ మమ్మల్ని కూర్చోబెట్టడం. మమ్మల్ని బయటికి పొమ్మని వాళ్ళనే మాట్లాడుకోమనండి. హౌస్‌లో ఎంత చెడు వాతావరణముంది.

(అంతరాయం)

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : కచ్చితంగా చెడు సాంప్రదాయమే ఉంది నిజమే. ఇంత మంది సభ్యులు మాట్లాడుతున్నా మేం రాలేదే.

(అంతరాయం)

శ్రీ సి.రామచంద్రయ్య : మీరు నోట్ చేసుకోండి. తరువాత సమయం అడిగి మాట్లాడండి.

(అంతరాయం)

శ్రీమతి నన్నపనేని రాజకుమారి : సార్, నిన్న కానీ, ఇవాళ కానీ ఇంతమంది సభ్యులు మాట్లాడారు. ఎక్కడైనా ఎవర్నైనా అన్నామా? ఇక్కడేగాక బయటికెళ్ళి కూడా మెచ్చుకున్నాము. ఆ విధంగా పిచ్చోళ్ళనీ, ముఖ్యమంత్రిగారిని గురించి ఏదేదో మాట్లాడడం మంచిది కాదు.

మిస్టర్ ఛైర్మన్ : పిచ్చోళ్ళని ఎవరూ మాట్లాడలేదమ్మా. అదే పనిగా ఎందుకు మెన్షన్ చేస్తున్నావు. ఆయన పేరు పెట్టి ఎవర్నీ అనలేదు.

శ్రీ ఎం.సుధాకర్ బాబు : నేను పేరు పెట్టి ఎవర్నీ పిచ్చోళ్ళని అనలేదు.

మిస్టర్ ఛైర్మన్ : సుధాకర్‌బాబూ, ఇలా అయితే మైక్ కట్‌చేస్తాను త్వరగా ముగించండి.

శ్రీ ఎం.సుధాకర్ బాబు : సార్, బెల్టుషాపులు తీసేశామన్నందుకు అభినందిస్తున్నాను. రోడ్లమీద త్రాగే మద్యం షాపుల్ని నియంత్రించవలసిందిగా మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అలాటి రోడ్లమీద మగవాళ్ళు వెళ్ళడానికే ఇబ్బందిగా ఉంటే ఇంక ఆడవాళ్ళు ఎలా వెళతారు? నేను ఇటీవల కేరళకి వెళితే అక్కడ ఏ మద్యం దుకాణమూ రోడ్ల మీద లేదు. మా స్నేహితులు మద్యం కోసం వెళ్ళి, అంతటి మురికిగా ఉన్న ప్రాంతాలకు వెళ్ళి తెచ్చుకోవడం మాకు చేతకాదు కాబట్టి ఈ రోజునుండి కేరళ వదిలిపెట్టే వరకూ మద్యం సేవించమన్నారు. దయచేసి ఇక్కడ కూడా మెయిన్ రోడ్ల మీద పెట్టకుండా ఎక్కడో దూరంగా ఉన్నటువంటి ప్రాంతాల్లో పెడితే కొంత జనాభా అక్కడికెళ్ళడం తగ్గి మద్యం సేవించడం మానేస్తారు.

పార్టీలకతీతంగా నవ్యాంధ్రప్రదేశ్‌ను నిర్మించుకుందాము. తెలుగుబిడ్డగా పుట్టిన తరువాత మన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించుకోవడం మన ధర్మం. దానిలో ఎలాంటి వ్యత్యాసాలూ ఉండదు. అదే పథంలో అందరి సహకారం తీసుకుని మనం బాగుపడాలంటే, మన యువతకి ఉపాధి దొరకాలంటే ప్రతీ జిల్లాలో ప్రభుత్వరంగ సంస్థల్ని ఏర్పాటు చేయించి ఉపాధి చూపిస్తే మన రాష్ట్రం బాగా అభివృద్ధి

చెందుతుంది. మా రాయలసీమలో ఇనుప ఖనిజముంది. అక్కడ స్టీల్ ఫ్యాక్టరీ, సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టవచ్చు. ఆ విధంగా చేసినందువల్ల ఉపాధి దొరుకడమేగాక మా ప్రాంతంలో ఫ్యాక్షనిజం కూడా తగ్గుతుంది.

గృహ నిర్మాణం గురించి చూస్తే ఇన్ని ప్రభుత్వాలు వచ్చినా వాళ్ళందరూ కూడా మేము రు.50 లక్షలతో, కోటి రూపాలయలో కట్టించామని అంటున్నారు. కానీ మళ్ళీ బేలన్స్ ఉంటోంది. 1978 సంవత్సరం నుంచి ఎంత మంది ముఖ్యమంత్రులు మారినా అవి అలాగే ఉంటున్నాయి. ఆ ఇళ్ళను తీసుకున్నవాళ్ళు అమ్ముకుంటూ మళ్ళీ ఇళ్ళ కోసం వస్తున్నారు. వీళ్ళు తీసుకున్నట్లుగా బయోమెట్రిక్ విధానం పెట్టాలి. ఆధార్ కార్డులైనా, ఓటరు కార్డులైనా రెండు చోట్లా ఇస్తారు. ఎందుకండీ దొంగ ఓట్లకి ఈ రాజకీయ పార్టీలకు అవకాశమిస్తున్నారని ఒకసారి నేను భన్వర్‌లాల్‌గారిని అడిగితే ఒక వ్యక్తికి ఒక్క ఓటరుకార్డే తప్ప అదనంగా కార్డు ఉండదన్నారు. నాకు మూడు ప్రాంతాలలో కార్డుంది తీసెయ్యమన్నా తీసెయ్యడంలేదు. ఈ రాష్ట్రంలో కానీ, దేశంలో కానీ ఎవరు బొటనవేలు ముద్ర ఇస్తారో వాళ్ళే ఓటు వినియోగించుకున్నారనే విధానం ఉండాలి. అలాగే హౌసింగ్‌కు, రేషన్ కార్డులకు, పెన్షన్‌లకు ఇలా అన్నిటికీ కూడా ఒకటే విధానం, ఒకటే కార్డును ప్రవేశపెట్టి చేస్తే అక్రమాలన్నింటినీ అరికట్టవచ్చు. ఒకసారి ఆధార్ అని, ఒకసారి స్మార్ట్ కార్డు అని ఇలా లక్షల వేల కోట్ల రూపాయలను ఖర్చు పెడుతున్నారు. దయచేసి ఆ విధానాన్ని మార్చేసి ఇప్పటినుంచైనా కొత్త ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రవేశ పెడితే బాగుంటుందని నా ఉద్దేశం. అలాగే ఎన్ని ఇబ్బందులున్నా ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను కూడా కంటిన్యూ చేసి ముందుకు సాగాలని నేను కోరుతున్నాను.

సా.06.00

నేను ఒక్క మాట చెప్పి ముగిస్తాను,ఈ రోజు సభ జరుపుకున్నాం, మన రాఘవరావు గారు కాబట్టి కూర్చున్నారు, కానీ మన రాజకుమారిగారికి పూనకం వచ్చేసింది సార్, మంత్రులెవ్వరూ కూర్చోవడం లేదని.

MR. CHAIRMAN: Mr. Sudhakar Babu, you are wasting the valuable time.

శ్రీ ఎమ్.సుధాకర్‌బాబుః వారందరూ ఉన్నందుకు ధన్యవాదాలు తెలుపుతున్నాను సార్.

శ్రీమతి నన్నపనేని రాజకుమారిః నేను మీతో ఏకీభవిస్తాను. ఉదయం మంత్రులందరూ కూర్చోవాలని అడిగాను, మీతో పాటు నేను కూడా డిమాండ్ చేస్తున్నా, ఖచ్చితంగా కనీసం ఆరుగురు మంత్రులైనా ఇక్కడ కూర్చోవాలి.

మిస్టర్ ఛైర్మన్ః రాజకుమారిగారు, మీతో కష్టం, ఎప్పుడు సమర్థిస్తారో, ఎప్పుడు వ్యతిరేకిస్తారో చెప్పడం కష్టం.

శ్రీ ఎమ్. సుధాకర్‌బాబుః ఏదిఏమైనప్పటికీ, బడ్జెట్‌లో ఉన్న ఈ అసమానతలను తొలగించి, నవ్యాంధ్రప్రదేశ్‌కు ముందడుగు వేస్తే మా కాంగ్రెస్‌పార్టీ తరపున సంపూర్ణంగా పాలకపక్షానికి సహకరించి ఈ రాష్ట్రాభివృద్ధికి మా వంతు సాయం అందిస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తూ, ఈ అవకాశం కల్పించినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

MR. CHAIRMAN: It is very difficult to control them. Mr. Sidda Raghava Rao, any way it is a very good debate took place. Tomorrow, we will start short discussion. I think tomorrow the Finance Minister will come and give his reply. In the meanwhile, we can take up short discussion.

Now, the House is adjourned to meet again tomorrow at 10-00 a.m. i.e. on Wednesday, the 27th August, 2014.

(Then, the House adjourned at 6-03 p.m. to meet again at 10-00 a.m i.e. on Wednesday, the 27th August, 2014.)

* * *